కంచి పరమాచార్య

శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర స్వామి వారి

గణపతి

(అమృతవాణి-పంచమ భాగము)



గణపతి
అమృతవాణి-పంచమ భాగము

కంచి పరమాచార్య
శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి వారి
అమృతవాణి పంచమ భాగము

గణపతి

అనువక్త:

దేవరకొండ శేషగిరిరావు

ప్రకాశకులు

మహా విద్యాపీఠం

హైదరాబాద్

కంచి మహాస్వామి అమృతవాణి పంచమ భాగము

అనువక్త : దేవరకొండ శేషగిరిరావు

ప్రథమ ముద్రణ : అక్టోబర్ 2012

ప్రకాశకులు : మహావిద్యా పీఠం,
ఎయిర్‌ఫోర్స్ అకాడమీ రోడ్, దుండిగల్,
హైదరాబాద్-500 043, సెల్: 98854 44428

వెల : రూ. 125/-

ప్రతులకు : అన్ని ముఖ్యమైన పుస్తక విక్రయ కేంద్రాలు

టైటిల్ డిజైన్ : కె. రామకృష్ణ

ప్రింటింగ్ :కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, విద్యానగర్, హైదరాబాద్

అనుగ్రహం

కంచి మహాస్వామి వారి తమిళ ఉపన్యాసాలను 2006లో కంచి మహాస్వామి పీఠారోహణ శతాబ్ది మహోత్సవ ట్రస్టువారు 'వాయిస్ ఆఫ్ గాడ్' పేరుతో ఏడు సంపుటాలలో ఆరువేలపైబడి పుటలతో ఆంగ్లంలోకి అనువదింపజేసి ప్రచురించారు.

చాలా సంవత్సరాల వెనుక సాధన గ్రంథ మండలి, తెనాలివారు 'జగద్గురు బోధల' పేరిట పది సంపుటాలను తెలుగులో ప్రచురించారు.

తెలుగులో ఇంతవరకు రానివాటిని, అసమగ్రమైన వాటిని సమగ్రంగా అందించడమే లక్ష్యంగా అనువాదానికి పూనుకొన్నాను.

మీ ముందున్న పుస్తకంలో గణపతి – హనుమ – భక్తి అనే విషయాలుంటాయి.

'జగద్గురు బోధలలో' గణపతి గురించి రెండు వ్యాసాలున్నాయి. భక్తి గురించి పది పుటలవరకూ మాత్రమే ఉంది. ఇక హనుమ గురించి లేదు. అందువల్ల సమగ్రంగా ఆ మూడింటినీ అందిస్తున్నాను.

ఇంతకుముందు నా ఇతర రచనలతోబాటు స్వామివారి 1. అద్వైతసాధన 2. గురు సంప్రదాయం అమృతవాణి పేరుతో 3.అద్వైతం 4. నమోనమః 5. షట్పదీస్తోత్రం – ఉపవేదములు 6. సనాతన ధర్మంలో సంఘసేవతో బాటు దీనినీ ప్రచురించుటకు ముందుకు వచ్చిన సనాతన ధర్మాభిమానులైన శ్రీ వావిలాల ఉమాపతి C.A. గారికి అంజలి ఘటించడం కంటే నేనేమి చేయగలను? స్వామివారి అమృతవాక్కులను సేవించుకొనే మహాభాగ్యాన్ని కల్గించిన శ్రీ ఉమాపతిగారికి హృదయపూర్వక అభినందనలు.

నడిచే దేవునకు నతులతో

-దేవరకొండ శేషగిరిరావు

Tel : 044-27222115 E-mail : skmkanci@md3.vsnl.net.in
Fax: 044-27224305, 37290060

Sri Chandramouleeswaraya Namaha:
Sri Sankara Bhaghavadpadacharya Paramparagatha Moolamnaya Sarvagnapeeta:

His Holiness Sri Kanchi Kamakoti Peetadhipathi
JAGADGURU SRI SANKARACHARYA SWAMIGAL
Srimatam Samsthanam
No. 1, Salai Street, KANCHIPURAM - 631 502

ఆశీర్వచనము

5-9-2012

బహు ప్రాచీనమైన పంచాయతన పూజలో గాణాపత్యము ఒకటి. భగవత్పాదులవారు ఈ పంచాయతనమునకు అగ్నిహోత్రానుష్ఠాన ప్రతీకమైన సుబ్రహ్మణ్యుని చేర్చి షణ్మతములుగా బహుళ ప్రచారం చేశారు. భారతదేశంలో అన్ని ప్రాంతాలలోనూ ఏ దేవతను ఆరాధించాలన్నా మొట్టమొదటిగా గణపతిని ఆరాధించడం ఆచారం. గణపతికి చేసే ప్రత్యేక పూజ ముందు కూడా పసుపుతో గణపతిని చేసి పూజ చేస్తాము. గణపతికి ప్రత్యేకమైన గుళ్ళు ప్రసిద్ధమైనవి. మహారాష్ట్రలో ఎక్కువ ఉన్నాయి. అయితే తమిళనాడులో ప్రతి వీధిలోనూ గణపతి దర్శనమిస్తాడు. గణపతి రూపాన్ని దర్శించిన మాత్రం చేతనే మనస్సులో అందరికీ ఒక అనిర్వచనీయమైన ఆనందం కలుగుతుంది.

తమిళ భాషలో దైవత్తిన్ కురల్ పేర మొదటి ప్రచురించబడి ఇంగ్లీషులో ఏడు సంపుటాలుగా వెలువరించబడిన మా గురుదేవుల ఉపన్యాసములలో అంబిక తరువాత ఎక్కువ పుటలు కేటాయించబడినది గణపతి పైననే. ఆ ప్రవచనములు చదువుతుంటే స్వామివారికి వినాయకునిపై గల విపరీతమైన మక్కువ కన్పిస్తుంది. అనేక పురాణాల నుండి గ్రహించిన కథల ద్వారా వారు

గణపతి తత్త్వమును, మహత్త్వమును తమకు మాత్రమే సాధ్యమైన రీతిలో హృద్యంగా వివరించారు. పురాణాలలో శ్లోకములలో ఆరంభించి తమకు అత్యంత గౌరవ భాజనులైన అప్పయ దీక్షితులవారి, వారి వంశానికే చెందిన మన్నారుగుడి పెరియవా (రాజుశాస్త్రి) మొదలైన వారు గణపతిపై వ్రాసిన శ్లోకములనుటంకించి విఘ్నేశ వైభవమును ఆవిష్కరించారు.

భజన సంప్రదాయంలో గణపతితో ఆరంభించి ఆంజనేయస్వామితో ముగించడం ఆచారం. అదేవిధంగా దైవత్తిన్ కురల్ సంకలనం చేసిన శ్రీరాం గణపతి ప్రతి సంపుటము ముందు గణపతిపైన ప్రసంగములతో మొదలు పెట్టి హనుమంతునిపై గల ప్రసంగంతో ముగించారు. ప్రస్తుత గ్రంథములో ఈ ఏడు సంపుటములలోని గణపతి, మారుతీలపై చేయబడిన ప్రసంగములు ఒకచోట చేర్చి ఆంధ్రీకరించి ప్రకటించబడినవి.

ఆదికవి నన్నయ్య అవతరించిన గోదావరీ తీర ప్రాంతమునకు చెందినవారయి, ఆ ప్రాంతపు సరళమైన తేట తెనుగును గుత్తకు పుచ్చుకొని సంస్కృతాంధ్ర పండితులు శ్రీ దేవరకొండ శేషగిరిరావుగారు ఈ సంకలనమునకు అనువాదకులు. వయోవృద్ధులయి, శరీర దార్ఢ్యత అంతగా లేనప్పటికీ కేవలము స్వామివారిపై గల భక్తి మాత్రమే బలముగా స్వామివారి ప్రసంగములనేక సంపుటములుగా ఆంధ్రీకరిస్తున్నారు.

దీని ప్రచురణ బాధ్యత శ్రీమఠమునకు అత్యంత ఆప్త శిష్యులయిన శ్రీ మహావిద్యాపీఠము, హైదరాబాదు వారు స్వీకరించారు.

తెలుగువారికి మహోపకరమయిన ఈ కార్యమును విజయవంతంగా నిర్వహించిన అనువక్తలకు, ప్రచురణ కర్తలకు, అస్మదారాధ్య దైవతములయిన మహా త్రిపుర సుందర చంద్రమౌళీశ్వరుల అనుగ్రహమున సకల శ్రేయస్సు కలుగుగాకయని నారాయణ స్మరణ పూర్వకముగా ఆశీర్వదించుచున్నాము.

ఇతి నారాయణ స్మృతిః

విషయ సూచిక

గణపతి

భక్తి

హనుమ

గణపతి

తమిళనాడులో ఎక్కడ చూచినా వినాయకుడి గుడి కన్పిస్తుంది. స్వామిని పిళ్లైయార్ అని తమిళులు పిలుస్తారు. పెద్ద పెద్ద గుళ్ళు, గోపురాలు లేక పోయినా ఏ రావిచెట్టు క్రిందో మనకు స్వామి సాక్షాత్కరిస్తాడు. చాలాచోట్ల పందిళ్ళు కూడా ఉండవు. స్వామికి ఆకాశమే పందిరి. ఇంచుమించు ప్రతి గ్రామంలోనూ, అంతే కాదు, ప్రతి వీథిలోనూ అడుగడుగునా తమిళనాడులో స్వామి సాక్షాత్కరిస్తాడు. సంఖ్యలో ఇతని తరువాతనే మిగతా దేవతల విగ్రహాలు. ఇతడు పార్వతీ పరమేశ్వరుల ప్రథమ సంతానం. తమిళంలో కొడుకుని పిళ్ళై అని అంటారు. గౌరవంతో బహువచనం ప్రయోగించినపుడు పిళ్ళైయార్ అంటారు.

వినాయకుని తమ్ముడే కదా కుమారస్వామి! కాని పిళ్ళైయార్ అన్నట్లుగా గౌరవ సూచకంగా బహువచనం వాడి కుమారర్ అని పిలువరు. కుమారన్ అనే పిలుస్తారు. ఇతని కంటే పెద్దవాడు కనుక వినాయకుని పిళ్ళైయార్ అంటారు.

ఇట్లా జగత్పితరులైన పార్వతీ పరమేశ్వరులకు మొదట పుట్టినవాడై, దేవుడై నుతింపబడ్డాడు. కనుక ప్రతి దానికి ఇతడు మొదలైనాడు. ప్రపంచం జీవులు అన్నీ ప్రణవం నుండి వచ్చాయి కదా! అట్టి ప్రణవానికి కనబడే రూపమే మన స్వామి. అతని ఏనుగు తల, వంకర తిరిగిన తుండం చూస్తూ ఉంటే ప్రణవాకారంగానే కన్పిస్తాడు.

ఇట్లా మొదటి పిల్లవాడై, పిల్లవానిగా కనబడే వాడై, ప్రణవాకారుడై, భక్తుల నుద్ధరించుటలోనూ మొదటివాడై వెలుగొందుచున్నాడు. అవ్వైయార్ అనే తమిళ కవయిత్రి ఇతని భక్తురాలు. ఇతణ్ణి ప్రణవాకారంగా రెండు కనుబొమల మధ్య ధ్యానిస్తూ ఉండేది. వినాయకర్ అవగళ్ అని ఆమె వ్రాసిన

గ్రంథంలో యోగశాస్త్ర సారాన్ని వివరించింది. దీనిని పారాయణ చేస్తే జ్ఞానం పట్టుబడుతుంది. ఈమె గురించి ఒక కథ చెబుతారు. సుందరమూర్తి స్వామి, చేరుమాన్ పెరుమాళ్ నాయనార్ అనే భక్తులు కైలాసానికి ప్రయాణమయ్యారు. నీవూ వస్తావా అని ఈమెనడిగారు. ఆ సమయంలో వినాయకుణ్ణి పూజిస్తూ ఉండేది. మీతో ప్రయాణం చేయడానికి నేను తొందరపడడం లేదు, వినాయకుణ్ణి పూజించడమే నాకు కైలాస యాత్రతో సమానమని ఆమె అనగా వారు ప్రయాణం సాగించారు. ఈమె భక్తికి మెచ్చుకొని వినాయకుడు తన తుండంతో ఒక్క ఉదుటున కైలాసానికి చేర్చాడు. అవ్వైయార్ తరువాతనే వారిద్దరూ కైలాసానికి చేరుకున్నారు. ఇట్టి విచిత్ర సంఘటనను అరుణగిరినాథుడు తన తిరుప్పుగళ్‌లో పళనిక్షేత్రాన్ని పేర్కొంటూ చేరరాజులు కొంగునాడు ప్రాంతాన్ని పరిపాలించేవారనే సందర్భంలో ఈ కథను పేర్కొన్నాడు.

ఇట్లా భక్త సులభుడు మన స్వామి.

ఆధ్యాత్మిక సత్యాల ప్రతిరూపం

వినాయకునకు సంబంధించిన ప్రతి చిన్న విషయం, ఎన్నో ఆధ్యాత్మిక సత్యాలను వెల్లడిస్తుంది.

వినాయకునకు ముందు ఎందుకు కొబ్బరి కాయలు కొడతాం? దీనికొక కథ యుంది. ఒకనాడు నీ తలని బలీయవలసిందిగా తండ్రియైన పరమేశ్వరునే అడిగాడట. దానికి బదులుగా మూడు కన్నులున్న కొబ్బరికాయను శంకరుడు సృష్టించాడట. శంకరునకూ మూడు కన్నులే కదా! అతని తలకు బదులుగా ఇట్లా కొబ్బరికాయలను కొడతాం.

దానిని నేలమీద కొడితే ముక్క చెక్కలౌతుంది కదా! అయితే ఆ ముక్కల్ని ముఖ్యంగా ఎవరేరుకుంటారు? 1941లో జరిగిన ఒక సంఘటన గుర్తుకు

వస్తోంది. నాగపట్టణంలో చాతుర్మస్య దీక్షలో అప్పుడున్నాను. కొబ్బరికాయలను కొడుతూ ఉండడం, పిల్లలు మూగడాన్ని చూసాను. జనులు కిటకిటలాడుతున్నారు. చోటు లేదు, పొంది పొందని పిల్లల్ని పెద్దలు తరుముతున్నారు. ఒక పిల్లవాడు ముందుకు వచ్చి కాయను కొట్టిన తరువాత ఈ ముక్కల్ని ఏరుకోవద్దని అనడానికి నీవెవరని గద్దించాడు. అతని ధోరణి చూసి అతడన్నది సబబే అనిపించింది.

కాయ బ్రద్దలైతే దానిలోంచి అమృతం వంటి నీరు వస్తుంది. ఇట్లా బ్రద్దలు కొట్టడం మన అహంకారాన్ని బ్రద్దలు కొట్టినట్లనిపిస్తుంది. ఇక స్వామి తల, ఏనుగు తల. అతడు స్థూలకాయుడు కూడా. పుష్టిగా ఉంటాడు. పిల్లలు బాగా తిని బొద్దుగా ఉంటే చూడడానికి ముచ్చటగా ఉంటారు కదా! అతని చేతిలో మోదకం ఉంటుంది. కడుపునిండా తినండని, తన మాదిరిగా పుష్టిగా ఉండండని సూచిస్తోంది ఆ ఆకారం.

గణపతి ఎంత స్థూలకాయుడో అతని వాహనం, ఎలుక అంత చిన్నగా ఉంటుంది. మిగతా దేవతలకు ఏ ఎద్దో, సింహమో, గుఱ్ఱమో, పక్షియో వాహనంగా ఉంటుంది. వాహనాన్ని బట్టి దేవతల గొప్పదనం ఆధారపడుతుందా? దేవతను మోసే భాగ్యం వాహనానికే కనుక అంత స్థూలకాయుడూ ఎలుక వాహనంపై దానికి భారం అనిపించకుండా తేలికగా ఉంటాడు. భక్తుల హృదయాలలో తేలికగా అధివసించడా?

ప్రతి జంతువుకీ ఒక్కొక్క శరీరావయవంపై మక్కువ కల్గియుంటుంది. చమరీ మృగానికి తన తోకపై; నెమలికి తన పింఛంపై మక్కువ. మరి ఏనుగునకు దేనిపై మోజు? అది దంతాలను పరిశుభ్రంగా, తెల్లగా ఉంచుకొంటుంది. ఇక ఏనుగు తల ఉన్న గణపతి ఏం చేసాడు? అట్టి ప్రియమైన ఒక దంతాన్ని పెరికి ధర్మాన్ని ప్రవచించే భారతాన్ని వ్రాయడానికి ఉపయోగించాడు. అందం, గర్వ సూచకమైన దంతాన్ని ధర్మన్యాయాలను

ప్రవచించే భారతాన్ని లిఖించడానికి త్యాగం చేసినట్లే కదా! గజాననుకు వ్రాయటానికి సాధనాలు కావాలా? దేనినైనా ఉపయోగించవచ్చు కదా! ప్రియమైన దంతాన్నే వాడడాన్ని గుర్తించండి. ఒక సందర్భంలో దంతంతోనే ఒక అసురుణ్ణి సంహరించాడు. అప్పుడది ఆయుధం. భారతం వ్రాసేటపుడది ఒక కలం.

చంద్రుణ్ణి, సముద్రాన్ని, ఏనుగును ఎంత సేపు చూసినా ఇంకా చూడాలనే అనిపిస్తుంది. భక్తులకు ఆనందాన్ని కల్గించడం కోసం ఏనుగు తలతో సాక్షాత్కరించాడు. ఇది అందంలో దాగిన సత్యం. దీనిని ఆస్వాదించడంలో మనకు తృప్తి ఉండదని సూచిస్తుంది. ఆయన ఆనందంనుండే ప్రభవించాడు. ఎప్పుడు? భండాసురుడు విఘ్న యంత్రాన్ని ప్రయోగించి అమ్మవారి సైన్యాన్ని అడ్డుకొనగా శంకరుడు అమ్మవారిని సంతోషంతో చూసాడు. అప్పుడు పుట్టిన వాడు స్వామి. ఇతడు విఘ్న యంత్రాన్ని ఛేదించి తల్లికి సంతోషాన్ని కల్గించాడు. విశ్వ సృష్టికి కారణభూతుడయ్యాడు అని ఒక కథ.

ఏ దేవతను కొలిచినా ముందుగా వినాయకుని ఆశీర్వచనాన్ని, అనుగ్రహాన్ని కోరుకుంటాం కదా. ఇతడే ప్రథమ దేవుడని, ఇతణ్ణి పూజించాలని అనేవారిని గాణపత్యులని అంటారు.

గణేశుని ఎదురుగా చెవులను పట్టుకొని గుంజిళ్ళు తీస్తూ ఉంటారు. దానికొక చమత్కారమైన కథ ఉంది. మన స్వామి, విష్ణువు యొక్క మేనల్లుడు. ఒకమాటు కైలాసానికి విష్ణువు వచ్చినప్పుడు అతని చేతిలో నున్న చక్రాన్ని మ్రింగివేసాడట. ఎట్లా తిరిగి పొందాలని ఆలోచించాడు విష్ణువు. వినాయకుణ్ణి నవ్వించడం కోసం రెండు చెవులూ పట్టుకొని, గుంజిళ్ళు తీసాడట. ఇది చూసి పకపకా నవ్వాడు గణపతి. చక్రం నోట్లోంచి ఊడి పడింది.

ఇట్లా చేతులతో చెవులు మూసుకొనడాన్ని తమిళంలో తూప్పుకరణం అంటారు. సంస్కృతంలో దోర్భిఃకరణ పదానికి వికృతి. అంటే రెండు చేతులతో చెవులను పట్టుకొనుట.

విఘ్నాలు లేకుండా ఉండడానికి అట్టి వినాయకుణ్ణి కొలిచి సకల శ్రేయస్సులను పొందుదాం.

ఒక ముసలి స్త్రీ - ఒక పిల్లవాడు

ఒక ముసలి స్త్రీ ఉండేది. సాధారణంగా ముసలివాళ్ళు కాళ్ళు చాపుకొని ఒక మూల కూర్చొని ఉంటారు కదా! కాని ఈమె అట్లా కాదు. తమిళనాడు అంతా ఊరూరా తిరిగేది. వీథి వీథి తిరిగేది. ఎంతో ఉత్సాహంతో ఉల్లాసంతో ఊరంతా కలియతిరిగేది. ఆమె కథను చివర చెప్పుకొందాం.

ఒక చిన్న పిల్లవాడున్నాడు. ఆరోగ్యకరంగా చూడముచ్చటగా ఉండేవాడు. పిల్లలు ఆడుతూ పాడుతూ ఒకచోట కూర్చోకుండా అల్లరి చేస్తూ ఉంటారు కదా! కాని ఈ పిల్లవాడు వాళ్ళకు విరుద్ధంగా ఒకమూల కూర్చొని ఉండేవాడు. కూర్చున్నచోటునుండి అణుమాత్రం కదిలేవాడు కాదు.

వింత ముసలి స్త్రీ, వింత పిల్లవాడు. ముసలి స్త్రీ పిల్లవాళ్ళలా, పిల్లవాడు ముసలివాళ్ళలా ఉండడం వింతయే కదా!

విసుగూ విరామం లేకుండా ముసలి స్త్రీ తిరగడానికి బలాన్ని ఈ పిల్లవాడిచ్చాడు. ఎవడా పిల్లవాడు?

అతడే మన గణపయ్య. అట్లా కదలని వానిని కల్లు పిళ్ళైయార్ అని తమిళంలో అంటారు. అంటే కదలని వినాయకుడన్నమాట.

అతనికే గణేశుడని, గణపతియనే పేర్లున్నాయి. శివుని గణాలకు అధిపతి కనుక ఆ పదాలు వచ్చాయి. ఇతని కంటె మరొక అధిపతి లేదు, నాయకుడు

లేదు కనుక ఇతడు గణపతి, గణేశుడు, వినాయకుడయ్యాడు. విగత నాయకుడు వినాయకుడు. సంస్కృతంలో 'వి' అనే ఉపసర్గకు రెండర్థాలున్నాయి. విశేషమని, విగతమని అర్థాలు. విగత నాయకుడూ, విశేష నాయకుడూ అతడే.

అన్ని విఘ్నాలను పోగొడతాడు కనుక విఘ్న నాయకుడు. చేసే పనులలో విఘ్నాలుండకూడదని విఘ్నేశుని ముందుగా పూజిస్తాం. మొదట పూజ ఇతనికే.

గజముఖుడని, గజరాజనే నామాలు ఏనుగు ముఖం కలవాడగుటచేత వచ్చాయి.

ఏనుగునకు చాలా బలం. అంత మాత్రంచే ఒక్క జంతువునూ బాధ పెట్టదు. బర్మా, కేరళ ప్రాంతాలలో పెద్ద పెద్ద దుంగల్ని మోస్తుంది. అట్లాగే వినాయకుడూ బలవంతుడే. ఇతడూ హాని చేయడు, మంచినే చేస్తాడు. అది బాగా తెలివైన జంతువు. దాని స్మరణ శక్తి కూడా గొప్పదే. అట్లాగే వినాయకుడుకి కూడా.

ఏనుగు ఏ పని చేసినా అందంతో తొణికిసలాడుతూ ఉంది. దాని నడకే అందంగా ఉంటుంది. అది తినే పద్ధతి, చెవుల నాడించడం, తుండాన్ని మధ్య మధ్యలో ఎత్తడం, – ఇట్లా ఏది చూసినా ముచ్చటగా ఉంటుంది. శాంతమైన ముఖం. చిన్న ఏనుగులైనా చూడ ముచ్చటగా ఉంటాయి. మళ్ళీ మళ్ళీ చూడాలనిపించే జంతువు ఏనుగు.

అట్లాగే చిన్న పిల్లవాళ్ళీ తఱుచు చూస్తూ ఉంటాం. ఎన్నిసార్లు చూసినా తృప్తి ఉండదు కదా! అట్లాగే ఏనుగుల లక్షణాలు, పిల్లవాని లక్షణాలు కలబోసిన మూర్తి మన స్వామి. పిల్లవాని అమాయక ప్రవృత్తి, మంచి మనస్సు, ఏనుగుకున్న బలం, బుద్ధి, అందం అన్నీ కలబోసిన మూర్తి మన స్వామి.

కంఠం దిగువున నరరూపం. పైన జంతురూపం. అట్టివాడు దేవతలందరికంటె ముందుగా పూజలందుకుంటున్నాడు.

ఈ నర జంతు రూపంలోనూ, విరుద్ధ రూపాలలోనూ అందం దాగియుంది. మంచి చెడులు కలబోసిన మూర్తి. విరుద్ధ గుణాలు సంగమించిన మూర్తి. ఒక చేత్తో మోదకం, మరొక చేతిలో విరిగిన దంతం. ఒక చేతిలో పూర్ణ స్వరూపమైన మోదకం ఒక చేతిలో అపూర్ణమైన దంతం. ఉండ్రాళ్ళని మోదకాలని అంటారు. అంటే సంతోషాన్ని కలిగించేవి.

మరొక భేదం ఉంది. ఇతడు పిల్లవాడు, ఆపైన బ్రహ్మచారి. ఏనుగుగా కనబడి, వల్లిని బెదిరించి సోదరుడైన సుబ్రహ్మణ్య స్వామితో వివాహమయ్యేటట్లు చేసాడు కూడా. వివాహం కానివారు, వినాయకుణ్ణి సేవించడమూ ఉంది. ఏమిటి దీనర్థం? అతడు వివాహం చేసుకోకపోయినా, చేసుకోవడం ఇష్టం లేకపోయినా ఇతరులకు వివాహం చేసే లక్షణముంది. ఇది దయను సూచిస్తోంది. అంటే మనలను ఉద్ధరిస్తున్నాడు. అతడు కదలకుండా మెదలకుండా ఉండి భక్తులను ఎత్తుపై కూర్చొండబెడుతున్నాడు. అంటే ఉద్ధరిస్తున్నాడు. లోగడ చెప్పిన అవ్వైయార్‌ని తాను కూర్చుండి తన తుండంతో ఆమెను కైలాసానికి చేర్చాడు కదా!

ఇట్లా భావించిన కొద్దీ క్రొత్త క్రొత్త ఊహలు మన మదిలో మెదులుతాయి. గణపతి మనం ఊహించని దానికంటె అపారమైన దయను వర్షిస్తాడు.

పిల్లల్ని దేవుణ్ణి ఒక విధంగా చూస్తాం. పిల్లలో దేవుడున్నాడని అంటారు. పిల్లలు నలుమూలలా తిరుగుతారు. కానీ ఈ పిల్లవాడు తిరగకుండానే ముందుచెప్పిన అవ్వను ఉద్ధరించాడు. అవ్వైయార్ కదలలేని ముసలి వయస్సులో తమిళనాడంతా తిరిగి ధర్మప్రచారం చేసింది.

తమిళనాడు గొప్పదనం

తమిళనాడుకి అపారమైన సేవ చేసింది అవ్వైయార్. ఈ నాటికీ సదాచారం, భక్తి ఈ ప్రాంతంలో ఉన్నాయంటే అది అంతా ఆమె పెట్టిన భిక్షయే.

సదాచారం, భక్తి అనేవి చిన్ననాటినుండీ అలవడాలి. అవి భావి జీవితాన్ని సన్మార్గంలో నడిపిస్తాయి. ఎందరో కవులున్నా వారందరూ పెద్దలను దృష్టిలో పెట్టుకొని కావ్యాలు వ్రాసారు. వారి కవితాశక్తికి ఏమాత్రం తీసిపోకుండా, యోగశాస్త్ర నిపుణురాలైన జ్ఞానియై యుండి చిన్నపిల్లల బాగుకోసం కవితలల్లింది. ఆమె పాటలు పిల్లలను మంచి పౌరులుగా తీర్చి దిద్దాయి.

ఒక అవ్వ తన మనుమలనెట్లా తీర్చి దిద్దుతుందో అవ్వైయార్ కూడా జగత్కుటుంబాన్ని అట్లా సాకింది.

అపారమైన ప్రేమవల్ల వ్రాయడంచే తరాలు గడిచినా చెక్కు చెదరకుండా, మానవుల మనస్సులలో ఆమె వ్రాసిన 'ఆతిచూడి' ప్రాథమిక బాలశిక్షయైంది.

ముందు పూజ చేసేది వినాయకునికే. మొదట చదువవలసిందీ ఆ పుస్తకాన్నే.

వేయి సంవత్సరాలనుండి ఆ పాటలు ఈ నాటికీ వినబడుతున్నాయంటే ఆమె చూపిన ప్రేమ, దయలే కారణం. సత్యాన్ని సూటిగా, నాటుకొనే రీతిలో చెప్పి పాడింది. తమిళనాడులో ప్రసిద్ధి పొందిన కంబడు, పుగళేంది, ఇళాంగో రచనలు చదువని వారుండవచ్చు గాని అవ్వైయార్ వ్రాసిన పాట రానివారుండరు.

ఆ మాటలలో శక్తి ఎట్లా వచ్చింది? మాటలలోనే కాదు, దేహంలోనూ ఆమెకు బలం ఉంది. గ్రామగ్రామాన పిల్లల్ని ప్రోగుచేసి పాటలచే వారిని ఉత్తేజితుల్ని చేసిన దొడ్డ తల్లి. ఎన్నివేలమందిని, లక్షలమందిని కలుసుకుందో! ఈ శక్తి అంతా ఎక్కణ్ణుంచి వచ్చిందనుకొంటున్నారు? అంతా వినాయకుని నుండే సుమా!

ఆ పిల్ల దేవుణ్ణి కొలిచి పిన్నతనంలోనే ముసలిదైపోయింది. ఎందుకారూపం వచ్చింది? ఆమె పడుచుగా ఉన్నా, నడి వయస్సులో ఉన్నా

ఎవర్నో ఒకర్ని వివాహమాడవలసి వస్తుంది కదా! సాధారణ కుటుంబ జీవనం ఆమె భక్తికి ఆటంకమై పోయేది. అందువల్ల ముసలితనాన్ని ఏరికోరి వరించింది.

మన గణపతేమో సుబ్రహ్మణ్యునకు వివాహం చేయించి అవ్వైయార్‌ని ముసలి దానిని చేసి పెళ్ళి లేకుండా చేసాడు. ఎవరేది అడిగితే దానినే ఇస్తాడు. ఆయన పిల్లలకు ఇష్టమైన దైవం కూడా. అందువల్ల ఆమె రచనల వల్ల పిల్లలు బాగు పడాలని ఆమెకు ముసలి దనాన్ని ప్రసాదించాడు. పెళ్ళైతే ఒక కుటుంబానికే పరిమితమై ఉండేది. ఇప్పుడేమో తమిళనాడుకు, అంతేకాకుండా తరతరాలకు తల్లియై విలసిల్లింది.

నిరంతరం వినాయక స్మరణ, పిల్లలకు హితబోధ – ఈ రెండే ఆమె ప్రవృత్తిలో కన్పిస్తాయి.

ఆమె తమిళనాడంతా తిరిగితే, నేనేమో దేశమంతా తిరిగాను. ఎక్కడ చూసినా తమిళనాడులోనున్న వినాయకభక్తి ఎక్కడా కనబడలేదు. వినాయకభక్తి తీవ్రత ఇక్కడ మెండుగా ఉంది.

పెద్ద పెద్ద ఆలయాలు, గోపురాలు తనకు కట్టబెట్టాలని గణపతి భావించడు. ఒక చిన్న సన్నిధి చాలు. పూరిపాక వేసినా, లేదా చిన్న ఆచ్ఛాదన కల్పించినా అదే పదివేలుగా భావిస్తాడు. అదీ లేదనుకోండి, ఏ చెట్టు నీడనో ఉంటాడు. భక్తులనాదరించి ఎక్కడ చూసినా సంతోషకరమూర్తిగా సాక్షాత్కరిస్తాడు.

దీనికంతటికీ అవ్వైయార్ కారణం. ఆమె ఎక్కడికి వెళ్ళినా అక్కడ వినాయకుని గుడి వెలియవలసిందే. తమిళనాడు ప్రత్యేకతలను గురించి చాలామంది పరిశోధకులు ఏవేవో వ్రాస్తారు. నా దృష్టిలో దీనినే ప్రత్యేకతగా భావిస్తున్నా.

అతడు సమస్త జగత్తునకు చెందినవాడు

సాదాసీదా జనులందరికీ అందుబాటులో ఉంటాడు గణపయ్య. పసుపుతోనో, మట్టితోనో, గోమయంతోనో అతని విగ్రహాన్ని చేసి పూజించవచ్చు. మట్టి ప్రతిమ రూపంలో, శిలా రూపంలో సాధారణంగా సాక్షాత్కరిస్తాడు.

మిగతా దేవతలకు బోలెడంత తతంగం ఉంది. ప్రాణ ప్రతిష్ఠలు మొదలైన హడావిడి యుంది. కాని గణపయ్యకై అంత శ్రమ పడనవసరం లేదు.

మిగతా దేవతలను పూజించాలంటే ఫలానా కాలంలో, స్నానం చేసి, పూజా సామాగ్రితో బయలు దేరాలి. వెళ్ళినా తిన్నగా మూర్తి దగ్గరకు వెళ్ళలేం. దూరంగా ఉండే దర్శనం చేసుకోవాలి. ఇవేమీ అక్కరలేదు మన స్వామికి. దేశంతో కాని, కాలంతో కాని నిమిత్తం లేకుండా చేయెత్తి మ్రొక్కితే చాలు, పలుకుతాడు. విగ్రహం కనిపిస్తే చాలు, అప్రయత్నంగా చేతులెత్తి మ్రొక్కుతాం. చేతులతో చెవులను తాకిస్తాం. గుంజీళ్ళు తీస్తాం. పని ముగించుకుని కదిలి పోతాం. చిత్తానికి శాంతి సమకూరుతుంది.

అతని ఆలయం ఒక గదిలో ఉంటుంది. కాబట్టి ఎవరైనా సమీపించవచ్చు. దేవాలయ ప్రవేశం అంటూ చట్టాలవసరం లేదు కూడా. మిగతా దేవతల మందిరాలకు ప్రహరీ గోడలని, అంతరాళ మంటపమని, ముఖమంటపమని, గర్భగుడియని ఏవేవో భేదాలుంటాయి. ఇవేమీ లేవు మన స్వామికి.

యోగశాస్త్రం ఉంది కదా. అది నరాలపై ప్రభావాన్ని చూపుతుంది. నరాలను శుద్ధి చేసే ప్రక్రియ నందిస్తుంది. ప్రాణాయామం ఎట్లా చేయాలో, ఎట్లా మన శరీరాన్ని వంచి ఆసనాలెట్లా వేయాలో చెప్పి నాడీ శుద్ధిని నేర్పుతుంది. ఆ శ్రమ లేకుండా అప్రయత్నంగా స్వామికి నమస్కరించేటపుడు చేతులు ఫాలభాగాన్ని తాకుట, చేతులు చెవులను స్పృశించుట, గుంజీళ్ళు

తీయుట మొదలగు వాటివల్ల నరాలలో ఒక చైతన్యం కలిగి మనలో అనుకూల భావాలేర్పడతాయి. మనకు శ్రద్ధా విశ్వాసాలుంటే మనమీ మార్పులను గమనించవచ్చు కూడా.

అవ్వైయార్ పిల్లలకై పాటలు వ్రాసినా కొన్ని పాటలు యోగ రహస్యాలతో ఉంటాయి. పెద్దలే అర్థం చేసుకోలేని రీతిలో గూఢార్థాలతో ఉంటాయి. తమిళంలో వాటిని వినాయకర్ అవగళ్ అంటారు. సూక్ష్మంగా అవగళ్ స్తోత్రమంటారు.

ఆమె వ్రాసిన స్తోత్రం చదివితే ఆమె, వినాయకుడూ ఇద్దరూ గుర్తుకు వస్తారు. ఈ స్తోత్రాన్ని గుడికి వెళ్ళి చదవండి.

అందరూ స్వామికి చెందినవారే. అందరికీ ఆయన చెందినవాడే. శాస్త్రాలు చదువని సామాన్యునకూ అందుబాటులో ఉంటాడు. మిగతా ఆలయాలలో ప్రసాదాన్ని పంచిపెట్టేటపుడు ముందుగా పెద్దలకు ఇస్తూ ఉంటారు. కాని స్వామి ముందు కొట్టిన కొబ్బరి ముక్కలు పిల్లలకూ, బీదలకే. అర్థమయినా కాకపోయినా ఆమె స్తోత్రాలను చదవండి

(అని తమిళనాడు భక్తులకు హితబోధ చేసారు స్వామి. తెలుగులోని పాటల్ని పద్యాల్ని మనం చదవవచ్చు).

ఒక అందమైన పెట్టె దొరికిందనుకుందాం. అందులో ఎన్నో రత్నాలున్నాయి. దానిని తెరవడానికి మనదగ్గర తాళం చెవులు లేవనుకుందాం. చెవులు లేవని పెట్టెను పారవేస్తామా? తీరా తాళం చెవులు దొరికిన తరువాత బాధపడమా? అట్లాగే ఆమె వ్రాసిన పాట అట్టిది. అందర్థము తెలియకపోయినా భద్రపరుచుకోవాలి. అనగా కంఠస్థం చేయాలి. యోగ రహస్యాలున్న పాటలు అర్థం కాకపోయినా భక్తితో పాడితే ఆ స్వామియే ఏ నాటికో తెలియపరుస్తాడు.

అందరికీ ఇష్టుడని అన్నాను కదా, శివునకు సంబంధించిన ఈశ్వర లింగం, అమ్మవారు, సుబ్రహ్మణ్యస్వామి, విష్ణ్వాలయంలో ఉండవు. కాని వినాయక ప్రతిమలు మాత్రం ఉంటాయి. ఆయన శివ కుటుంబానికి చెందినవాడైనా! గమనించారా! అతణ్ణి తమిళంలో తుంబిక్కై ఆళ్వార్ అని అంటారు. కనుక అతణ్ణి అందరూ ఆదరిస్తారని తేలింది కదా!

అందువల్లనే జైన బౌద్ధ ఆలయాల్లోనూ అతణ్ణి కొలుస్తారు. ఈశ్వర లింగం తమిళనాడులో మాదిరిగా ఊరూర, వీథివీథినా మిగతా ప్రాంతాలలో ఎక్కువగా కనబడకపోయినా ఈ విశాల భారతదేశంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలలో ఈయన మూర్తులుంటాయి. ఒక భక్తుడు నా దగ్గరకు వచ్చి భక్త్యావేశంతో గణపయ్య కన్యాకుమారిలో ఉన్నాడు, హిమాలయంలోనూ ఉన్నాడని అన్నాడు.

మన దేశంలోనే కాదు, జపాన్, మెక్సికో, ఇంకా ఎన్నో దేశాలలో ప్రత్యక్షమౌతాడు. ప్రపంచంలో చాలాదేశాలలో ఎక్కడో ఒకచోట సాక్షాత్కరిస్తూనే ఉంటాడు.

జగత్తునకంతటికీ చెందిన ఈ దేవునికి ధనవంతులు వివిధ నైవేద్యాలనర్పించి పిల్లలకు పంచి పెట్టండి. పిల్లలు పుష్టిగా, బొద్దుగా ఉండాలి కాబట్టి ప్రతి శుక్రవారం, స్వామి ముందు కొబ్బరికాయలను కొట్టండి. పిల్లలు వాటిని ఏరుకుంటూ ఉంటే వారి ఆనందాన్ని గమనించండి. ఇట్లా ఉంటే అందరిపై స్వామి అనుగ్రహం చూపిస్తాడు.

వయసు మీరిన కొద్దీ ఏవో బాధలు, సమస్యలుంటాయి. అతణ్ణి కొలిస్తే అన్నిటినుండీ విముక్తులమౌతాం. అతని మాదిరిగా నవ్వు ముఖంతో ఉంటాం. అతని పేర్లు సుముఖుడని, ప్రసన్న వదనుడని ఉన్నాయి కదా. మనం నిజమైన భక్తిని చూపించగలిగితే మనకూ ఆ ప్రసన్నముఖత్వం వచ్చి తీరుతుంది.

అందరూ ఆలయాలకు వెళ్ళడం, కొబ్బరి కాయలను కొట్టడం, స్తోత్రాలను చదవటం మొదలు పెడితే ఇంకా గణేశ ఆలయాలను కట్టవలసి వస్తుంది.

కొందరు క్రొత్తగా వినాయకాలయాలను కడుతున్నారని హడావిడి చేస్తారు. ఒక్కొక్కప్పుడు క్రొత్త విగ్రహాన్ని కట్టడానికి బదులు ఎక్కడిదో దొంగిలించుకొని వచ్చి కట్టారనేమాట వినిపిస్తూ ఉంటుంది. అసలు దొంగతనమే కూడదు కదా! అందులో దేవతా విగ్రహాన్నా? ఆ మాట ఎందుకు వచ్చింది? దొంగిలిస్తారని, అంటే అక్కడి ప్రజలింకా అప్రమత్తులై ఉంటారు కదా. ప్రజలలో అట్టి జాగరూకత ఉండాలనే హితబోధ.

వినాయకుని గుర్తు

తమిళులు వ్రాయడానికి మొదలు పెట్టినపుడు వినాయకుని గుర్తు ఉంచుతారు. ఏదో గ్రంథ రచనకే కాదు, చిన్న ఉత్తరం ముక్క వ్రాయాలన్నా ఈ గుర్తు నుంచుతారు *(తెలుగువారు శ్రీరామ అని వ్రాసినట్లుగా)* అంతేకాదు, ఏ పని మొదలు పెట్టినా వినాయకుణ్ణి అందరూ స్మరిస్తారు. విఘ్నాలు లేకుండా ఉండడం కోసం.

ఈ పై గుర్తు ఎట్లా ఉంటుంది? అర్ధ చంద్రాకారంగా. అంటే దానర్థం, మన వ్రాతసున్నాతో ముగియకూడదనే.

ఓంకారం వ్రాస్తే నాగరిలిపిలో 'ఓ' తరువాత అర్ధ చంద్రాకారం గుర్తు ఉంటుంది కదా. తమిళంలోనైనా గ్రంథ లిపిలో వ్రాసినా అంతే. అసలు ప్రణవమే వినాయకుని నుండి వచ్చింది కదా!

'ఓం' దేవ నాగరిలిపిలో 'ఉ' వ్రాసిన తరువాత వక్రంగా ఒక గీత గీసి దానిపై అర్ధచంద్రాకారం ఉంటుంది. ఏనుగు తుండమూ వక్రంగానే ఉంటుంది. అందువల్ల అతడు వక్రతుండుడు. వంకరను సూచించడాన్ని పూర్తి చేస్తే నిండు సున్నగా కన్పిస్తుంది. అంటే ఈ ప్రపంచము, మిగతా లోకాలు, నక్షత్రాలు, మొత్తం బ్రహ్మాండం అంతా గుండ్రంగానే ఉంటుంది. అండం అనగా గ్రుడ్డు, గుండ్రంగానే ఉంటుంది. అంటే బ్రహ్మాండమూ గ్రుడ్డే.

పూర్ణ స్వరూపుడూ ఆయనే, శూన్య స్వరూపుడూ ఆయనే. ఈ సున్న ఉన్నది, లేని దానిని పరమాత్మ స్వరూపమనే సూచిస్తుంది. వినాయకునికి తీపి పదార్థముతో ఉండే ఉండ్రం గుండ్రంగానే ఉంటుంది. దానిని పూర్ణమంటాం. అట్టి పూర్ణ స్వరూపుని అర్ధచంద్రాకారునిగా సూచిస్తాం. ఇదే అన్నిటిని పూర్ణంగా చేస్తుంది.

ఇతని గుర్తు వంకరగా ఉండి తిన్ననైన గీతతో (–) ముగుస్తుంది. పూర్ణత్వమైనా శూన్యత్వమైనా వక్రంగానే ఉంటూ అతడు తిన్నగా నున్నాడని ఆ గీత సూచిస్తుంది. వక్రానికి విరుద్ధం ఆర్జవం. అనగా ఋజుత్వం. నిర్గుణము, సగుణత్వము నిర్గుణ బ్రహ్మ తత్త్వాన్నే సూచిస్తాయి.

ఇక 'ఉ' అనే అక్షరం, ప్రణవంలోని మధ్యాక్షరం. అ+ఉ+మ లతో ఓంకారం. 'అ' సృష్టిని, 'ఉ' – రక్షణను; 'మ' సంహారాన్ని, అంటే వరుసగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను సూచిస్తాయి. ఈ ముగ్గురూ ఒక పరాశక్తి నుండే వచ్చినవారు. ఆమె ప్రణవ స్వరూపిణి. ప్రణవాన్ని దేవీ ప్రణవమని అనరు. ఉమయే దేవీ ప్రణవం. అ,ఉ,మ,లే ఉమ (ఉ+మ+అ). ఓంలో మొదటి అక్షరం 'అ'. అమ్మవారి ప్రణవం ఉతో ఆరంభమవడం వల్ల దయతో కూడిన పోషణత్వాన్ని సూచిస్తుంది. కనుక 'ఉమ' అనే మాటయే దేవీ ప్రణవం.

ఓంకారంలో 'ఉ' గుండె వంటిది. అదే ఉమా ప్రణవంలో మొదటి అక్షరం. అ,మ, లేకుండా 'ఉ' కలిగిన వినాయకుని గుర్తు ఏమని సూచిస్తుంది? అతడు తల్లి వంటి వాడే కాదు, ఒక మెట్టు ఎక్కువని సూచిస్తుంది. ఎట్లా? సృష్టిని సూచించే 'అ', సంహారాన్ని సూచించే 'మ'తో కూడినది ఆమె. కాని వినాయకుని గుర్తు 'ఉ'తోనే ఉంటుంది. అంటే ఇతని పని కేవలం రక్షణయే. కరుణామూర్తి కనుక 'ఉ'తోనే ఉంటాడు. ప్రణవంలో 'ఉ' విష్ణువును సూచిస్తోంది. ఉమ కూడా విష్ణురూపిణియే. ఆమెకు నారాయణ సహోదరి,

విష్ణుమాయా విలాసిని, నారాయణి అని ఇతర నామాలు. అందరికీ వచ్చిన శుక్లాంబర ధరం విష్ణుం శ్లోకంలో ఉన్న విష్ణువు సర్వవ్యాపి. ఈ 'ఛ' శివశక్తులను విష్ణువును కలిపి సూచిస్తోంది. అనగా శైవ వైష్ణవ మతాలకు సంగమమిక్కడ.

వినాయకుని గుర్తు ౹౼. అనగా వంకరగా ఉండి చివర తిన్ననైన గీతతో ఉంటుంది. చక్రంలా ఒకటి తిరుగుతూ ఉంటే ఒక ఇరుసుండాలి కదా! అది తిన్నగా ఉంటుంది కదా! విష్ణువు యొక్క చక్రం గీసినప్పుడు క్రింద ఒక వ్రేలుతో దానిని పట్టినట్లుంటుంది. ఆ వ్రేలే ఇక్కడ ఇరుసు. గుండ్రంగా ఉండే ప్రపంచ భువనాలను త్రిప్పే ఇరుసు తిన్నగానే ఉండాలి. అది కంటికి కనబడకపోయినా ఒక తిన్ననైనది త్రిప్పుతూ ఉంటుంది. అదే శక్తి రూపంలో ఉంటుంది. దానికి గుర్తుగా వినాయకుని గుర్తు. అనగా వంకర, దాని చివర తిన్ననైన గీత.

నేను చదివినదో విన్నదో గాని శక్తి యొక్క ఆగమనం వినాయకుని గుర్తులానే ఉంటుందిట. వినాయకుని తుండం, భ్రమణానికి గుర్తు. గీత దాని నుండి ఉదయించిన శక్తికి గుర్తు. ఈ రెంటినీ నాద బిందువులుగా శివశక్తి సమ్మేళనంగా భావిద్దాం.

పూర్ణత్వాన్ని సూచించాలంటే ఒక చుక్కతో ఆరంభమై మరల చుక్క దగ్గరకు వచ్చినపుడే. అది బ్రహ్మమును సూచిస్తుంది. వినాయకుని గుర్తు సున్నాను గీయటోయి అర్ధచంద్రాకారంగా ఉంచుతూ దాని చివర తిన్ననైన గీత నుంచుతాం. ఇది ఏమని సూచిస్తుంది? బ్రహ్మమొక్కటేయైనా అందులోనుండి అనేక బ్రహ్మాండాలు వచ్చాయని అవీ బ్రహ్మమే అని పూర్ణములే అని సూచిస్తుంది. అనగా బ్రహ్మమూ, ప్రపంచమూ పూర్ణములే. పూర్ణమైన బ్రహ్మము నుండి పూర్ణమైన ప్రపంచం వచ్చిందని ఉపనిషత్తు చెప్పింది కదా? వినాయకుని గుర్తు వంకరగా నుండి గీతతో ఉంటుంది కనుక ఆ వంకర, బ్రహ్మ పూర్ణత్వాన్ని, ఆ గీత, ప్రపంచ పూర్ణత్వాన్ని సూచిస్తుంది.

నేను వంకర, తిన్నని గీత అని పేర్కొన్నాను. ఈ రెండూ స్వామి దంతాన్ని సూచిస్తాయి. ఆయన ఏకదంతుడు. అవ్వైయార్, ఈ పిల్లల దేవుణ్ణి పూజించి, ముసలితనాన్ని వయస్సులోనే పొంది, ఈ ఏక దంతుడు ప్రారబ్ధ కర్మను పోగొడతాడని చెప్పింది.

వ్రాతకు, వినాయకునకు గల సంబంధం

వెనుక ఇతని గుర్తును గురించి చెప్పుకున్నాం. పాత తాళపత్ర ప్రతులను చూస్తే మొట్టమొదట శ్రీ మహా గణాధిపతయే నమః అని ఉంటుంది.

అయితే ఒక సందేహం. వాగ్దేవియైన సరస్వతిని ప్రార్థించకుండా ఈయనను ముందుగా స్తుతించడమేమిటి ? ఇక గణపతి యనే పదమే ఉంటుంది కాని, ఇతని పేర్లైన వినాయక, విఘ్నేశ్వర, వక్రతుండ, హేరంబ అనే పదాలే లేవు. ఈ విషయమై విద్వాంసులతో చర్చించాను. గణమనే మాట, భాషకూ చెందుతుంది. వ్యాకరణ శాస్త్రంలో అన్ని అక్షరాలకు సంబంధించిన నియమాలుంటాయి. గణాధిపతి, అన్ని గణాలకు, అవి ఏ బాపతైనా అధిపతియే. ఆయన పరమేశ్వరుని భూత గణాలకు అధిపతియే. అట్లాగే పదాలనే గణాలకూ ఇతడు అధిపతియే. అందువల్లనే మిగిలిన పదాలను వాడకుండా గణాధిపతయే నమః అని గ్రంథం ప్రారంభానికి ముందుగా వ్రాస్తారు.

ప్రణవాకారంలో ఉంటాడు కదా! ప్రణవమే అన్ని నాదాలకూ మూలం కనుక, అన్ని పదాలకూ ఇతడధిపతి కనుక ఆ పదాన్నే వాడాలి.

మరొక కారణం. ఆయనే గొప్ప వ్రాతగాడు. ఏది ప్రపంచంలో పెద్ద పుస్తకమని అడిగితే చటుక్కున, మహాభారతమని అంటాం. ఎవరైనా సాగదీస్తూ మాట్లాడితే నీ చేటభారతం నా దగ్గర వినిపించకు అని అంటాం. భారతం

లక్ష శ్లోకాలతో ఉంటుంది, పంచమ వేదం అని అంటారు కూడా. మిగిలిన నాలుగు వేదాలూ ఒకరు చెప్పగా ఒకరు పల్కుతూ ఉంటారు. కానీ భారతం లిఖిత ప్రతియే. వ్యాసుడు చెబుతూ ఉంటే, గణపతి మేరు శిఖరంపై కూర్చొని వ్రాసాడని కథ. (ఇట్లా స్వామివారు ప్రసంగిస్తూ ఉండగా ఒకాయన లేచి వ్రాతగాడని అంటే అసలు రచయిత కదా అని ప్రశ్నించాడు). అసలు రచయిత వ్యాసుడే. విని వ్రాసిన వ్రాయసగాడు మాత్రమే గణపతి. అనగా Copyist. ఆంగ్లంలో Writer అనే పదానికి రెండర్థాలూ ఉన్నాయి. రచయిత, వ్రాయసగాడని, అందువల్ల వ్రాసేవాడు గణపతియంటే తప్పులేదు.

ఇతడసలు రచయిత కాకపోయినా వ్రాయసగానికీ గౌరవం ఇచ్చి కొలుస్తున్నాం. బాగా చదువుకొన్నవాళ్ళే వ్రాయసగాండ్రు కావాలనే నియమమూ లేదు. అందంగా వ్రాయడమే వృత్తిగా కలవారుండేవారు. వారినే Calligraphist అనేవారు. ఆనాటి విద్యార్థులెంత చదివినా వ్రాసేవారు కాదు. విని కంఠస్థం చేసేవారు. అట్టి వ్రాయసగాండ్రూ తమ నాయకుడు గణపతియని, ఆ గణపతియే మొదటి వ్రాయసగాడని మన్నించేవారు.

దంతాన్ని విరిచి కలంగా వాడాడు గణపతి. దంతం అంటే ఏనుగునకు మోజు కదా! అందువల్లనే బ్రతికినా చచ్చినా ఏనుగు వేయి వరహాలనే మాట వచ్చింది. ధర్మ ప్రబోధకమైన భారతాన్ని వ్రాయడానికి అట్టి దంతాన్నే విరిచి అనగా త్యాగం చేసి పూనుకున్నాడు. దేవగణాలకు పతి, పార్వతీ పరమేశ్వర తనయుడు, ప్రణవ స్వరూపుడైనవాడే తనను తాను తగ్గించుకొని వ్రాయసగాడయ్యాడు. చూసారా అతని త్యాగాన్ని?

మాణిక్య వాచకులు పాడుతూ ఉంటే నటరాజే వ్రాసేడని కథ. కృష్ణుడే జయదేవుని గీతగోవిందంలో ఒక వాక్యాన్ని వ్రాసేడని కథ. గణపతి, విసుగు చెందకుండా ఏకబిగిన లక్ష శ్లోకలూ వ్రాసాడు.

అందుకే 'మహా గణాధిపతయే నమః' అని ముందుగా వ్రాస్తాం. గబగబా వ్రాస్తూ ఉంటే అతని వేగాన్ని తట్టుకోలేక మధ్యమధ్యలో కొన్ని వ్యాస ఘట్టాలను పెట్టాడు వ్యాసుడు. వాటిని అర్థం చేసుకుంటూ వ్రాయాలనే నియమం కూడా పెట్టాడు.

గణపతి ముందు రెండు కణతలను తాడిస్తాం. గౌరవాన్ని చూపిస్తాం. వ్యాసుడే గణపతిని అప్పుడప్పుడు తలపట్టు కొనేటట్లు చేసాడు. తమిళ భాషలో వ్యాస ఘట్టాలను భారతగుట్టు అని అంటారు. గుట్టు అనగా రహస్యం. గుట్టు వీడిందంటే రహస్యం తెలిసిపోయిందని అర్థం.

అతడు జ్ఞాన స్వరూపుడు కనుక క్లిష్టమైన శ్లోకాలను అర్థం చేసుకొని వ్రాసేడు. అట్లాగే క్లిష్టమైన సమస్యలు వీడిపోవాలని అతణ్ణి స్మరిస్తాం. మన వ్రాత కూడా నిరాటంకంగా సాగిపోవాలని ప్రదక్షిణం చేద్దాం.

వలంపురి వినాయకుడు

చేతులను, కణతల దగ్గరకు చేర్చుట, చేతులతో చెవులను పట్టుకొనుట, దూర్వలతో పూజించుట, ఉండ్రాళ్ళను నివేదించుట, మొదలైనవి గణపతి పూజలో ముఖ్యమైనది. చుట్టూ ప్రదక్షిణమూ ముఖ్యమే. మూడుసార్లు ప్రదక్షిణం చేయాలి. కొందరు 21 సార్లు లేదా 108 సార్లు ప్రదక్షిణం చేస్తారు. అతడు పార్వతీ పరమేశ్వరుల చుట్టూ ప్రదక్షిణం చేసి మొత్తం భూప్రదక్షిణం చేసిన ఫలాన్ని పొందినట్లే మనము కూడా అతనికి ప్రదక్షిణం చేస్తే అట్టి ఫలాన్ని పొందగలం. అతని ఉదరమే బ్రహ్మాండ గోళంలా కన్పిస్తుంది. శారీరక మానసిక బలాలను, చుట్టూ ప్రదక్షిణం చేయడం వల్ల పొందవచ్చు.

వినాయకుని విగ్రహాలలో చాలా భేదాలున్నాయి. సాధారణంగా తుండం యొక్క క్రిందిభాగాన్ని ఎడమవైపునకు త్రిప్పినట్లుంటాయి. ఎక్కడో గాని

కుడివైపునకు త్రిప్పినట్లుండదు. అట్టి విశేష విగ్రహాన్ని వలంపురి వినాయకుడని తమిళులుంటారు. కుడివైపు తిరిగినట్లున్న శంఖానికి అధిక ప్రాధాన్యమిస్తాం. అదే వలంపురిశంఖం. దానినే దక్షిణావర్త శంఖమంటారు. అట్టి శంఖము, అట్టి మూర్తికి ప్రత్యేక శక్తులున్నాయని అంటారు. తుండం అట్లా ఉండి కుడివైపునకు సాచియున్న రూపం ఓంకారంలా తమిళ లిపిలో ఉంటుంది. అతని కుడివైపు నోటినుండి చెక్కిలి వరకు, తలవరకు, మరల తుండము యొక్క క్రిందవరకు ఒక గీతగీస్తే ఓంకారంలా ఉంటుంది.

ఈ వలంపురి క్షేత్రాలలో ప్రసిద్ధమైనది కుంభకోణం దగ్గర తిరువలం చూళిలో ఉంది. అతని గొప్పదనాన్ని ఇంకా వివరిస్తాను. మహారాష్ట్రలోనూ గణపతి పూజ విస్తారంగా జరుగుతుంది. ముందుగా వినాయకుణ్ణి చివరగా ఆంజనేయుణ్ణి కొలవడం అక్కడ విస్తారంగా ఉంటుంది. ప్రజలలో జాతీయ భావాన్ని పెంపొందించడానికి వినాయక ఉత్సవాలను తిలక్ గారు ప్రోత్సహించారు. పూజానంతరం భారీగా నిమజ్జనోత్సవం జరుగుతూ ఉంటుంది. ఇట్లా లక్షలాదిమందిలో దైవభక్తిని పరోక్షంగా దేశభక్తిని కలిగించారు. అది మత సంబంధమైనది కనుక తెల్లదొరలు కలుగజేసుకోలేదు. ఈ ఉత్సవాలలో నాయకులు వచ్చి దేశభక్తిని నూరిపోసే వారు. ఉత్తేజితుల్ని చేసేవారు. ఈనాటికీ ముంబైలో గణపతి ఆరాధన చెప్పుకోదగినదే. చాలామంది గణపతులను వివిధ రూపాలలో అర్చిస్తూ ఉంటారు.

గాణపత్యాన్ని అవలంబించినవారు గణపతి భక్తులు. వీరికి గణపతియే ఆరాధ్య దైవం. నదిలో ఆరు స్నాన ఘట్టాలున్నట్లు మన మతంలోనూ ఆరు సంప్రదాయాలున్నాయి. కౌమారం – కుమారస్వామికి; శాక్తం – శాక్తేయులకు; వైష్ణవం – వైష్ణవులకు; శైవం–శివునకు సంబంధించినది. ఈ ఆరింటిని ఉద్ధరించి శంకరులు షణ్మతస్థాపనా చార్యులైనారు.

మహారాష్ట్రలో గాణపత్యం ప్రబలంగా ఉండడం వల్ల ఎనిమిది ప్రముఖ గణపతులకు ఎనిమిది దివ్య క్షేత్రాలు వెలిసాయి. వీరిని అష్టవినాయకు లంటారు. ఇందు మయూరేశ్వరుడని ఒక వినాయకుని పేరు. అతని క్షేత్రం మోరేగావ్‌గా ప్రసిద్ధం. మయూర గ్రామమే అట్లా మార్పు చెందింది. ఆ నగరం చుట్టూ గణపతికి పరివార దేవతలుంటారు.

మయూరం, తమిళంలో మొయిల్‌గా ఉత్తర దేశ భాషలలో మోర్‌గా మారింది. సుబ్రహ్మణ్యుని తలిచినపుడు అతని వాహనం నెమలి గుర్తుకు వస్తుంది. పురాణాలు, తంత్ర గ్రంథాలబట్టి వినాయకునకు మూషికం వాహనమైనా ఇక్కడ మాత్రం గణపతికి నెమలియే వాహనం. అతడు మయూరేశ్వరునిగా ప్రసిద్ధి.

మహారాష్ట్రలోని మోరేగావ్‌లోని, తమిళనాడులోని తిరువలంచుళి క్షేత్ర పురాణాలను బట్టి స్వామికి చాలా మహిమ ఉన్నట్లు స్పష్టమౌతుంది. ఆ ప్రదేశానికే దక్షణావర్తమని పేరు. దక్షిణ అంటే కుడి; ఆవర్తం అంటే వంపు కదా. అట్లా స్వామి రాజధాని దక్షిణావర్తం.

దక్షిణ దేశంలో ఈ స్వామి సన్నిధి తిరువలంచుళిలోని శివాలయంలో ఉంటుంది. జ్ఞాన సంబంధులు, అప్పర్ ఇందలి ఈశ్వరుణ్ణి పాటలతో కీర్తించారు. కాని ఆ క్షేత్రం యొక్క కీర్తి వినాయకునకే చెందుతుంది. ఆ మంటపంలోని శిల్ప సంపద అత్యద్భుతంగా ఉంటుంది. పాలరాతి నగిషీలు ఇందు చెప్పుకోదగినవి.

పూర్వకాలంలో ఆలయాలను చెక్కిన శిల్పులు, ఐదింటిని మినహా ఏవైనా చెక్కగలమని అనేవారట. ఈ ఐదింటిని శిల్పంలో చూపించడం తమకు అలవి కాని పని యని అనేవారట. అవుదయార్ కోవెలలోని వంపు తిరిగిన ప్రాకార శీర్ష శృంగము; గడారం కొండాన్‌లోని ప్రాకారపు గోడ; తంజావూరు

శిఖరం; తిరువిళిమలైలో నున్న మంటపం; అనే నాల్గింటితోబాటు తిరువళంచుళిలోని పాలరాతి అల్లికల తడకలు కూడా చేర్చారు. వీటిని మరల నిర్మించడం సాధ్యం కాదని అనేవారట.

ఈ తిరువళంచుళిలోని 16 రంధ్రాలు శిల్ప కళశోభితంగా తొలచబడ్డాయి. 16 గణపతులున్నట్లే 16 రంధ్రాలుండడం విశేషం. 16 సంఖ్య పూర్ణత్వాన్ని సూచిస్తుంది. షోడశకలాపూర్ణుడని అంటాం కదా.

దేవేంద్రుడు, ఇక్కడి వినాయకుని పూజించాడని ఐతిహ్యం. క్షీరసాగరంలోని అమృతంలా, పాలమీగడతో చేసినట్లుగా ఇక్కడ స్వామి తెల్లగా ఉంటాడు. కనుక శ్వేత వినాయకుడని పేరు. ఈశ్వరాలయంలో ఇతడు శివునితో బాటు ఒక సన్నిధిలో ఉన్నా ఇతనికే బ్రహ్మోత్సవాలు జరుగుతాయి గాని శివునకు కాదు.

ఈ గ్రామం ప్రత్యేకత ఇంకా ఉంది. శ్వేత వినాయకుని తుండం, కుడివైపునకు తిరిగినట్లుండగా కావేరీ నది కూడా ఇక్కడే కుడివైపుకి తిరిగి ప్రవహిస్తోంది.

ఈ కావేరికి, వినాయకునకు దగ్గర సంబంధం ఉంది. సహ్య పర్వతంపై కొడగులో అగస్త్యుడు కావేరీ జలాన్ని కమండులువులో బంధించాడట. ఇక్కడి వినాయకుడు, కాకిగా మారి కమండులువును ఒరుగునట్లుగా చేసాడట. అందలి నీటిని జగత్కల్యాణం కోసం ప్రవహింప చేసాడట. అట్లా తమిళనాడుకి కావేరీ జలాన్ని పంచిపెట్టిన మూర్తిని మనసార భజిద్దాం.

కావేరీ నది, కర్ణాటకను దాటి తమిళనాడులో ప్రవహించింది. కుంభకోణానికి చేరి ఒక బిలంలో అంతర్ధానమైంది. హేరండర్ అనే ముని తనంతట తాను త్యాగం చేయగా ఆ బిలం నుండి కావేరి వచ్చి ఈ స్వామి క్షేత్రాన్ని కుడివైపుగా చుట్టి ప్రవహించింది.

తల కావేరిలో నల్లగా కాకిరూపం ఎత్తిన వినాయకుడు ఇక్కడ తెల్లగా ఉంటాడు. ఇతణ్ణి ప్రణవ స్వరూప వక్రతుండుడని కీర్తిస్తారు. కావేరి కూడా కుడివైపు ప్రవహించడం విశేషం.

తుండం కుడివైపునున్న మూర్తినే ప్రణవ స్వరూపునిగా భావించడంతో బాటు ఎడమవైపు తిరిగియున్నా ప్రణవ రూపునిగానే భజిద్దాం.

పెద్దింటి పిల్లవాడు

భాగ్యవంతుల పిల్లలను కొందరు లాలిస్తూ ఉంటారు. అట్టివారి పట్ల ప్రేమ చూపిస్తే ఆ పిల్లవాని భాగ్యవంతులైన తల్లిదండ్రులు తమ పనులను చేసి పెడతారనే ఆశతో దగ్గరకు తీసుకొంటారు. ఎవరి పిల్లలంటే వారికి ముద్దు. కాకిపిల్ల కాకికి ముద్దనే సామెత యుంది కదా.

ప్రపంచంలో రకరకాల భాగ్యవంతులున్నారు. అందరిలోనూ భాగ్యవంతులెవరయ్యా అంటే వినాయకుని తల్లిదండ్రులైన పార్వతీ పరమేశ్వరులే.

అమ్మవారిని, అయ్యవారిని పూజించడం అంత సులభం కాదు. అనేక నియమాలున్నాయి. కాని వారి తనయుణ్ణి పూజిస్తే వారింకా సంతోషిస్తారు. ఇక మన స్వామిని సులభంగా చేరవచ్చు. చిన్న వస్తువులిచ్చినా పిల్లలు సంతోషిస్తారు. అట్లాగే వినాయకుడికి దూర్వలర్పించినా సంతోషిస్తాడు. ఉండ్రాళ్ళు నైవేద్యంగా పెట్టినా సంతోషిస్తాడు. లేదా ఒక కొబ్బరి కాయను కొట్టినా చాలు, ఏ క్రియా కలాపం లేకపోయినా.

పిల్లవాని గొప్పదనాన్ని చెప్పినప్పుడు ఇతని తండ్రి, తాతలను ప్రస్తావిస్తాం. దానిని ప్రవర అని అంటారు. ప్రవరలో ముత్తాత పేరు కూడా రావాలి. కాని ఈ చెప్పబోవు శ్లోకం, తాతతోనే ముగుస్తుంది.

శ్లో॥ మాతా మహ మహాశైలం మహస్తతోఽపితామహం

కారణం జగతాం వందే కంఠాదుపరివారణం

విష్ణు సహస్ర నామాలకు పూర్వభాగంలో వ్యాసుని ముత్తాతయైన వసిష్ఠుని దగ్గరనుండి మొదలై వ్యాసుని కొడుకైన శుకుని వరకూ ఉంటుంది. శుకుడు, బ్రహ్మచారి కనుక అతని సంతాన ప్రసక్తి ఉండదు. అక్కడినుండి శిష్యపరంపర మొదలౌతుంది. గౌడపాద – గోవింద భగవత్పాద – ఆది శంకరులని ఇట్లా గురువందనం ఉంటుంది.

విఘ్నేశ్వరుని గురించి చెబుతూ ఉండగా ఇట్టి గురుపరంపర గురించి చెప్పడమొక అదృష్టంగా భావిస్తున్నాను. ఈ విఘ్నేశ్వరుడూ వ్యాసునితో సంబంధం ఉన్నవాడే. విఘ్నేశ్వరుని పెక్కు రూపాలలో వ్యాస గణపతి యొకటి. కనుక వ్యాసుణ్ణి స్మరిస్తున్నాం. మనం ముందుగా గురువందనం చేయాలి కదా!

వినాయకునికి సంబంధించిన ప్రవర చెప్పేటపుడు అతని మాతా మహునితో ఆరంభమైంది. సాధారణంగా ప్రవర, ముత్తాతతో మొదలౌతుంది. తర్పణం ఇచ్చినపుడు మాత్రమే మాతామహస్మరణ చేస్తాం. మాతామహుడు, తల్లియొక్క తాత; తల్లి యొక్క ముత్తాతలను స్మరిస్తాం. వారికి తర్పణాలిస్తాం. అయితే మన వినాయకునకు తాత లేడు. తండ్రి శివుడే ఉన్నాడు. శివునకు తండ్రి లేడు కదా! శివుడు స్వయంభువు. ఇక తల్లికీ కారణం లేదు. ఆమెయే అన్నిటికీ కారణమాయె. కాని కొన్ని సందర్భాలలో కొన్ని అవతారాలను ఎత్తవలసి వస్తుంది. అందువల్ల వినాయకుని మాతామహుణ్ణి పేర్కొనవలసి వచ్చింది.

అందువల్ల మాతామహ మహాశైలం అంటే (అమ్మవాళ్ళ నాన్న) హిమాలయమే, హిమవంతుడే.

అమ్మవారు ఆదికారణి, అఖిలాండ జనని. ఆమె దాక్షాయణి అనగా దక్షుని కూతురు. పార్వతి హిమవంతుని కూతురు; మీనాక్షి – మలయధ్వజుని కూతురు; కాత్యాయని = కత్యాయనుని కూతురు అయింది.

పరమేశ్వరుణ్ణి ఎప్పుడు పేర్కొన్నామో వెంటనే పార్వతిని కూడా పేర్కొన్నట్లే. ఆమె పార్వతి అవతారంలోనే హిమవంతుని కూతురై, తపస్సు చేసి కామారియైన శివుణ్ణి పెండ్లాడింది. అతణ్ణి గృహస్థును చేసింది. ఇట్లా పార్వతి యొక్క గొప్పదనాన్ని వివరిస్తూ మాతామహ మహాశైలంతో ఆరంభింపబడింది.

అయితే మాతామహునితో ఎందుకు మొదలైంది? పితామహుని పేర్కొనాలి కదా? మహస్తతః అపితామహం అని తరువాత ఉంది. అతడు జ్యోతి స్వరూపుడగుటచే అపితామహం= తండ్రి తరపున తాత లేనివాడయ్యాడు. అనగా శివునకు తండ్రి లేడు కదా!

ఈ శ్లోకం తల్లి తండ్రియైన, గొప్ప పర్వతమైన హిమవంతుని గొప్పదనాన్ని పేర్కొని అట్టి వాని మనుమడు వినాయకుడని, ఇతని తండ్రికి తండ్రి లేడని పేర్కొంది. ఇతని తండ్రి స్వయంభువు. అనగా తనంతట తాను వెలిసినవాడు.

ఇట్లా శ్లోక ప్రథమ పాదం ఉండగా రెండవ పాదంలో ఇతని గొప్పదనం వర్ణింపబడింది. అతడు నిజంగా తల్లిదండ్రులకు పుట్టినవాడని అనుకుంటారేమో! అతడే పరబ్రహ్మ స్వరూపుడని చెప్పింది. అనగా పుట్టుక లేనివాడయ్యాడు. కారణం జగతాం అనగా జగత్కారణుడు. అట్టివాడు శివశక్తి తనయునిగా ఆవిర్భవించాడు. వానికి నమస్కారమని, కారణం 'జగతాం వందే'.

ఇట్లా జగత్కారణత్వం, పిల్లవానిగా కనబడుట ఉన్నా, మానవాకారం ధరించకుండా కంఠంపై నుండి గజాకారంతో, దాని దిగువనుండి మానవాకారంతో కన్పిస్తున్నాడు. 'కంఠాదుపరివారణం'.

ఇక మేనమామ గొప్పదనం:

మరొక శ్లోకంలో మేనమామ వల్ల కీర్తిని గడించాడు.

శ్రీకాంతో మాతులో యస్య, జననీ సర్వ మంగలా

జనకః శంకరో దేవః, తం వందే కుంజరాననం

మొదటి శ్లోకం మాతా మహునితో ఆరంభమైంది. సాధారణంగా పితామహునితో ఆరంభం కావలసి యున్నా, దానికి సమాధానం ఉంది. తల్లిదండ్రులను పేర్కొనవలసి వచ్చినపుడు ముందు తల్లిని, తరువాత తండ్రిని పేర్కొనాలి. ముందు వేదమంత్రంలో మాతృదేవోభవ అని ఉంటుంది. తరువాత పితృదేవోభవ యని. అవ్వైయార్ కూడా మొదటి స్థానాన్ని తల్లికే ఇచ్చింది. ఇద్దరు తాతలను పేర్కొనవలసి వచ్చినపుడు తల్లి తండ్రిని పేర్కొనడం సబబు.

కాని ఈ శ్లోకం తల్లిదండ్రుల కంటె ముందుగా మేనమామను పేర్కొంది.

లక్ష్మికి భర్తయైన మహావిష్ణువు మేనమామగా గలవాడు వినాయకుడని తేలింది. శ్లోకం, శ్రీతో మొదలు పెట్టడం సబబే కదా! శ్రీయనగా మహాలక్ష్మి జగత్తునకు శ్రీ మహావిష్ణువు, సిరిసంపదలిచ్చే మహాలక్ష్మి ఉండవలసిందే. ఇట్టి దంపతులతో మన వినాయకునకు బంధుత్వం గొప్పదే కదా.

ఇక సుబ్రహ్మణ్యునకు, అతని మేనమామకు దగ్గర సంబంధం ఉంది. కుమారస్వామిని తమిళంలో మురుగన్ అని అంటారు. మురుగన్‌ని చెప్పినపుడు మాల్ మరుగన్‌తోనే ఉంటుంది. మరుగన్ అనే పదం మరుమగన్ (అల్లుడు) నుండి వచ్చింది. మరుమగన్ అనగా మేనల్లుడు. దక్షిణ దేశంలో మేనమామ కూతుర్ని వివాహం చేసుకోవడం ఆచారం కనుక మరుమాన్ అనే పదం అల్లుణ్ణి సూచిస్తుంది.

విష్ణువు - అమ్మవారు

అమ్మవారి సోదరుడే మహావిష్ణువు. ఆమెకు నారాయణ సహోదరి అని ఒక నామం. అమ్మవారు దాక్షాయణిగా, పార్వతిగా, మీనాక్షిగా అవతరించినపుడు విష్ణువు సోదరునిగా అవతార మెత్తలేదు. ఒక్క కృష్ణావతారంలోనే అన్న చెల్లెలుగా కనబడ్డారు. స్వామి దేవకీ వసుదేవుల

బిడ్డగా నుండగా నందగోపుడు యశోదల యొక్క తనయగా అమ్మవారవతరించింది. కృష్ణుడవతరించినపుడు జగత్తంతా అంధకారంతో ఉండగా వాసుదేవుడు కృష్ణుణ్ణి నందుని ఇంటికి తీసుకొని వెళ్ళడం, యశోద ప్రక్కలో నున్న అమ్మవారిని తీసుకొని తిరిగి రావడం తెలిసిందే కదా.

వాసుదేవుని కూతురుగా కంసుడు ఆమెను భావించి సంహరించడానికి పూనుకొనగా ఆమె ఆకాశంలో ఎగిరి నిజరూపాన్ని ధరించి నిన్ను చంపబోయేవాడున్నాడని అంతర్ధానమైంది.

ఈ ఘట్టానికి ముందు కూడా నారాయణుడు, పరాశక్తి, అన్న చెల్లెలు గానే కీర్తింపబడ్డారు. వీరిద్దరికీ తల్లిదండ్రులు లేరు. వారు పరబ్రహ్మ స్వరూపులే. సృష్టి సంహారం జరిగి శివుడు శాంతమూర్తిగా ఉన్నప్రుడు వీరిద్దరు మాయాశక్తితో జగత్తును పాలిస్తారు.

నిజంగా ఈ ఆకారాలు రెండు కావు, మూడు కావు, ఒక్కటే. ఒక సత్త (ఉనికి) ఆనందంతో ఉన్నపుడు, క్రియతో ఉన్నపుడు నారాయణుడని గాని, అమ్మవారని గాని పిలుస్తాం. వీరిద్దరు చేసే పనులొకటి అవడం వల్ల వీరిని అన్న – చెల్లెలు అని వ్యవహరిస్తాం. ఆకారాలొకవిధంగా ఉంటాయి.

ఇక అల్లుణ్ణి గురించి చెబుతున్నాను కదా! సుబ్రహ్మణ్య స్వామి, మురుగన్ ఎట్లా అయ్యాడు? అతడమ్మవారి తనయుడే కాక, వల్లి, దేవసేనలను వివాహమాడాడు కదా. వీరిద్దరు విష్ణువు యొక్క సంతానమే. అందొకామె వేటగాని దగ్గరకు, మరొకతె దేవతల దగ్గరకు వెళ్ళింది గనుక మురుగన్ రెండు విధాల మరుగన్ (అల్లుడు) ఐనాడు. అనగా మేనల్లుడు, అల్లుడైనాడు.

శుక్లాంబరధరం...

అందరికీ వచ్చిన ఈ శ్లోకంలో తిన్నగా వినాయకుని పేరు లేదు. ఇతని పేరుతో గాని, ఫలానా తల్లి దండ్రుల కొడుకని గాని లేదు. అనగా శివాత్మజ,

గౌరీసుత వంటి నామాలు లేవు. వాహనానికి, ఆయుధానికి చెందిన పదాలు లేవు. అంటే మూషిక వాహన, మోదక ప్రియ పాశహస్త వంటి పదాలు లేవు. లేదా అతని లక్షణాలు చెప్పే గజముఖ, ఏకదంత, లంబోదర వంటి పదాలు లేవు.

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం

ప్రసన్న వదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోపశాంతయే

శుక్లాంబరధరం అనగా తెల్లని బట్టలు కట్టినవాడు. సరస్వతికి శంకరునకు తెల్లని బట్టలుంటాయి. ఇతర దేవతలను పీతాంబరంధర, రక్తాంబరధర, అన్నట్లుగా స్వామి ప్రత్యేకంగా తెల్లబట్టలు కట్టినవాడనీ లేదు.

ఇక శ్లోకంలోని విష్ణుపదం. విష్ణువంటే సర్వవ్యాపకుడని కదా! ఇక్కడ స్వామి కూడా సర్వవ్యాపియని చెప్పడం వల్ల అతని మామయైన విష్ణువు గుర్తుకు వస్తాడు. అంటే మేనమామ పోలిక.

శశివర్ణం అనగా చంద్రకాంతితో నున్నవాడు. ఈవిధంగా ఈశ్వరుణ్ణి, సరస్వతిని స్తుతిస్తాం కదా!

ఇక చతుర్భుజం, నాల్గు చేతులున్నవాడు. ఇంచుమించు అందరి దేవరలకు నాల్గు చేతులుంటాయి. కనుక ఈ పదమూ ప్రత్యేకంగా ఇతణ్ణి సూచించడం లేదు.

ప్రసన్నవదనం ప్రసన్నమైన ముఖం కలవాడు. ఇట్లా దీనికి విరుద్ధంగా ఏ దేవతనైనా కీర్తిస్తామా? కాళి, నరసింహ, వీరభద్రులు మాత్రం భయంకరంగా ఉంటారు గాని అందరు దేవతలు ప్రసన్నంగానే ఉంటారు కదా. భక్తులననుగ్రహిస్తున్నట్లు వారి విగ్రహాలుంటాయి. ఈ విశాలమైన గజవదనం కూడా అట్లా ఉందనుకుందాం.

కనుక శ్లోకంలోని ఐదు పదాలు వినాయకుణ్ణి ప్రత్యేకంగా పేర్కొనలేదు ఈ పదాలనుచ్చరిస్తూ కణతలను భక్తులు తాకుతారు.

ధ్యాయేత్, ధ్యానం చేయవలసినది. దేనికి ధ్యానం చేయాలి? సర్వ విఘ్న ఉపశాంతయే, విఘ్నాలు తొలగడం కోసం. ఇదిగో ఇక్కడ స్వామి ప్రసక్తి వస్తుంది, ప్రత్యేకంగా విఘ్నేశ్వరుడని పేర్కొనకపోయినా; ఏ ఆటంకాలు లేకుండా ఉండాలంటే ఈ స్వామినే, పూజించాలి. కనీసం ఈ శ్లోకాన్నైనా చదివి చేతులతో కణతల నానించాలి.

మొట్టమొదట పిల్లలకీ శ్లోకం చెబుతాం. ఈ శ్లోకం అంటున్నపుడు వినాయకుడే పిల్లలకు గుర్తుకు వస్తాడు.

ఈ శ్లోకంలోని విష్ణుపదం, ఇతనితో నున్న సంబంధాన్ని వెల్లడిస్తుంది. వినాయకునకు మామయే కదా విష్ణువు!

ఇంతకుముందే 'శ్రీకాంతో మాతులోయస్య' అని చదివాం. ఇది వింటూ ఉంటే మలయాళంలోని 'మారువాక్కతాయం' గుర్తుకు వస్తుంది. ఆ రాష్ట్రంలో మేనమామ సంపద మేనల్లునికి చెందుతుంది. ఇది వారసత్వం (ఔరసత్వం)

ఇక తల్లిదండ్రుల గొప్పదనం: మామను ముందు పేర్కొని మామ చెల్లెలైన అనగా తల్లిని ఇట్లా పేర్కొన్నాడు:

జననీ సర్వమంగలా – సర్వమంగలయైన పరాశక్తియే ఇతని తల్లి. ఆమె గుణాలు, క్రియలు శుభకరములే కదా! అమ్మవారిని నుతించేటపుడీ శ్లోకాన్ని చదువుతారు.

సర్వమంగల మాంగల్యే శివే సర్వార్థ సాధికే

శరణ్యే త్ర్యంబకే గౌరి నారాయణి, నమోస్తుతే

ఎన్నో పేర్లు విష్ణువునకున్నా శ్రీకాంత పదం, సర్వ సంపదలు కలవాడని సూచిస్తుంది. అట్లాగే అమ్మవారికీ ఎన్నో పేర్లున్నా సర్వమంగల పదం అట్టిదే. ఇక తండ్రి – జనకః శంకరో దేవః అనగా తండ్రి శంకర భగవానుడు.

శివునకెన్నో పదాలున్నా ఇక్కడ శంకర పదమే వాడబడింది. అంటే మంచి పనులు చేసేవాడని, లేదా ఆనందాన్నిచ్చేవాడని. ఇట్లా విఘ్నేశ్వరుడు శ్రీ, మంగలం, సుఖం పదాలతో కూడి మామ, తల్లి, తండ్రులతో కూడియున్నాడు.

శ్రీకాంతో వందే కుంజరాననం - తంకుంజరాననం వందే అట్టి గజముఖునికి నమస్కరిస్తున్నాను.

కుమారస్వామి - అన్నగారు

పై వారే కాకుండా ఇతని తమ్ముడూ గట్టివాడే. వినాయకుడు పెద్దవాడు. వేదాలితనిని జ్యేష్ఠరాజని పేర్కొన్నాయి. అన్నగారికి పేరు వస్తే అన్నగారి పేరును తమ్ముడూ వాడుకుంటాడు. ఇక చిన్నవాడు గొప్పవాడైతే అట్టి తమ్ముడికి అన్నగారని తానూ మురిసిపోతాడు. అయితే ఈశ్వరుని ఇద్దరు పిల్లలూ అన్నివిధాలా గొప్పవారే, కనుక వినాయకుని బంధుత్వం చెప్పేటప్పుడు కుమారస్వామినీ పేర్కొనాలి.

మన స్వామికి 16 నామాలు ప్రసిద్ధంగా ఉన్నాయి. అవి షోడశనామాలు. మనం అష్టోత్తర శతంతో (108) పూజ చేయకపోయినా ఈ నామాలను చదివితే చాలంటారు.

సుముఖశ్చైక దంతశ్చ కపిలో గజకర్ణకః
లంబోదరశ్చ వికటో విఘ్నరాజో వినాయకః
ధూమ్రకేతుః గణాధ్యక్షః ఫాలచంద్రో గజాననః
వక్రతుండః శూర్పకర్ణో హేరంబః స్కందపూర్వజః

దీనిలో చివరపేరు స్కంద పూర్వజుడు. అనగా స్కందునకు ముందు పుట్టినవాడు. చిన్నవాని పేరుతో పెద్దవాడు కీర్తింపబడ్డాడు. చిన్నవాని వల్ల పెద్దవానికి పేరు వచ్చింది.

ఇట్టి పిల్లవానిని మనం సంతోషపెట్టాలి. అతనికి కోపం కలిగించకూడదు. ముల్లోకాలకు పెద్ద పిల్లవాడు. అట్టి సుగుణవంతుని, దయార్ద్ర హృదయుని, సంతోషపెట్టే పనులను చేయాలి. అతణ్ణి సంతోషపెడితే అతని తల్లిదండ్రులు సంతోషపడి మనకన్ని శుభాలను కల్గిస్తారు.

ఇతర దేవతలు - స్వామిని కొలుచుట

కొందరు తమకేమీ అర్హతలక్కరలేదని, ఫలానావారు తాము కావలసినవారని పెద్దల పేర్లు చెబుతూ కాలక్షేపం చేస్తూ ఉంటారు. ఇట్లా నిర్లక్ష్యంగా గడుపుతూ ఉంటారు.

కాని మన గణపతి అట్టివాడా? శారీరక బలంలో గాని, మానసిక బలంలో గాని, ఇతరులపట్ల ప్రేమాభిమానాలను కురిపించుటలో గాని ఇతడు మేటియే కదా! తల్లిదండ్రుల గొప్పదనం వల్ల ఇతనికి గొప్పదనం రాలేదు. అతనికి ఒక ప్రత్యేక స్థానముంది. పిల్లవాడని ఏకవచనం ఉపయోగించరు. అసలీ బహువచనం పెద్దలకే కదా.

ముఖ్యమైన దేవతగా

ఇతణ్ణి సంతోష పెడితే అయ్యవారు, అమ్మవారు సంతోష పడతారని లోగడ చెప్పాను.ఇక ఆశీర్వదించే శక్తి తల్లిదండ్రులకే ఉందని, ఇతనికి లేదని భావించవద్దు. తల్లిదండ్రుల మాదిరిగానే ఇతడూ భక్తులపై వరాల జల్లు చల్లగలడు.

ఇతణ్ణి ఈశ్వర తనయునిగా కాక ఇతనినే ముఖ్య దేవతగా కొలిచే గాణపత్యులు ఏమంటారంటే శివ, పార్వతి, కుమారస్వామి, విష్ణు దేవతలను తమ తమ ఇష్టదైవంగా కొలిచేవారు, ముందుగా గణపతి పూజ చేసి కొలుస్తారు కదా, ముందుగా పసుపు విఘ్నేశ్వరుడందరికి ఉన్నాడని. కాని మేము మాత్రం

మా గణపతిని పూజించేటప్పుడు శివాది ఇతర దేవతలను ముందుగా పూజించనవసరం లేదని అంటారు. ఇక వైష్ణవులు, పూజారంభంలో విష్వక్సేనుణ్ణి పూజిస్తారు. విఘ్నేశ్వరుని మరొక రూపమే అతడని అంటారు.

వినాయకుడికి అగ్రపూజ ఉంది. అయనకి సంబంధించిన శ్లోకాలలో ఈశ్వరుడు, పార్వతి, విష్ణువు, కుమారస్వాముల ప్రస్తావన వచ్చినా, ఇతని గొప్పదనం వారివల్ల రాలేదని గుర్తించండని అంటారు. ఏదో ఒక సందర్భంలో మిగతా దేవతలందరూ ఇతని సాయం కోరినట్లుగానే పురాణాలు వర్ణించాయని అంటారు.

అసలు దేవతలలో ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువ అనే విభజన ఉంటుందా? ఒకే పరమాత్మ భిన్నభిన్నంగా కనబడదం లేదా? అతని లీలలు అనంతం కదా! మానవుల మనః ప్రవృత్తుల కనుగుణంగా పురాణాలు ఆయా దేవతలను ఆయా సందర్భాలలో ఎక్కువని కీర్తిస్తూ ఉంటాయి. ఇష్ట దేవతపై భక్తుల మనస్సు కేంద్రీకరించబడాలనే ఉద్దేశ్యంతోనే అట్లా ఉంటాయి. భక్తులు తమ దేవతయే విజయం సాధించినట్లు భావిస్తారు. తద్వారా తమ భక్తిని దృఢం చేసుకొంటారు. ఒక దేవత గెలిస్తే మరొకరు ఓడినట్లే కదా! కాని వినాయకుడు ఓడినట్లుగా ఎక్కడా లేదు. మిగిలిన దేవతలు ఇతణ్ణి కొలిచినట్లు కథలున్నాయి.

కొడుకే - తండ్రి నుండి పూజలందుకొనుట

ఈశ్వరుడు, త్రిపురాసురులను జయించే సందర్భంలో అతని కొడుకును ధ్యానించలేదట. కొడుకు యొక్క గొప్పదనాన్ని గుర్తించలేదట.

తనకు రావలసిన బాకీని గణపతి వదులుకుంటాడా? అందరు దేవతలు, ముందుగా గణపతిని పూజించాలన్నారు. శివుడూ, దానిని దాటడానికి వీలు

లేదు. పూజించకుండా ఈశ్వరుని రథం బయలుదేరబోతోంది. ఇరుసు విరిగి పోవుగాక అని గణపతి యనగా విరిగింది. ఇక రథమెట్లా కదులుతుంది?

అరెరె! నియమాన్ని అతిక్రమించాను, నేనేమో అందరికంటె పెద్దయని భావించాను. నియమాలను పాటించడంలో వ్యక్తిగతమైన గొప్పదనం పోకూడదని శివుడే గణపతిని పూజించాడట. (మరొక సందర్భంలో కనిష్ఠ పుత్రుడైన కుమారస్వామికే నమస్కరించి శివుడు ప్రణవోపదేశాన్ని పొందినట్లుంది కూడా).

వెంటనే ఆటంకాన్ని తొలగించాడు వినాయకుడు. రథం కదిలింది. త్రిపురాసురులను జయించాడు, శంకరుడు. త్రిపురాంతకుడనే బిరుదు వహించాడు.

అచరూప్పాక్కం అనే నగరం చెంగల్పట్టునకు, తిండివనానికి మధ్యలో ఉంది. ఇక్కడే ఈశ్వరుని రథం విరిగిందని, కదలలేదని అంటారు. అచ్చు అంటే ఇరుసు - ఆరు అంటే విరిగింది, పాక్కం అంటే ప్రదేశం.

ఇటీవల ఒక చిత్రమైన సంఘటన పురాణ కథను గుర్తు చేసింది. రామేశ్వరం దగ్గర మేము శంకరమఠాన్ని నిర్మించాలని అనుకున్నాం. జైపూర్ నుండి చలువరాయిని తెప్పించాం. కాంచీపురంలో శంకరుల విగ్రహం, నల్గురు శిష్యుల విగ్రహాలను చెక్కారు. ఒక వాహనం పై వీటిని రామేశ్వరం తీసుకొని వెళ్ళాలి. దారిలో సరిగ్గా అచరూప్పాక్కం దగ్గర వాహనం ఆగిపోయింది. కదలడం లేదు. 108 కొబ్బరికాయలు కొట్టి వాహనాన్ని బాగుచేయగా బండి బాగుపడింది. ఇక ఆటంకాలు లేకుండా తిన్నగా రామేశ్వరం వచ్చింది. ఆ శంకరుని రథం అప్పుడు కదలలేదు. శంకర భగవత్పాదులను తీసుకొని వెళ్ళే ఈ ఆధునిక వాహనానికీ ఆటంకం ఏర్పడింది. ఈయనా ఆగిపోయారు. చిత్రంగా ఉంది కదూ!

నేటి శస్త్రాల కంటె ఆనాటి అస్త్రాలు అధికశక్తి సంపన్నమైనవి. ఇదంతా మంత్రశక్తి వల్లనే. వీటిగురించి పురాణాలలో చాలా విశేషాలున్నాయి. బ్రహ్మాస్త్రం, నారాయణాస్త్రం, పాశుపతాస్త్రం మొదలైనవాటి గురించి చదివేటపుడు నేటి అణ్వాయుధాలు దిగదుడుపుగా కన్పిస్తాయి. ఇవి భ్రూణాన్ని కూడా పాడు చేస్తాయి. అశ్వత్థామ ప్రయోగించిన అపాండవాస్త్రం ఉత్తర గర్భానికి చేటు తీసుకొని రాలేదా? కృష్ణుడే రక్షించాడు.

సైనికుల శక్తిని గుర్తించింది అమ్మవారు. అదృష్టవశాత్తు కుట్ర మాత్రం ఈమె సైన్యం చేయలేదు. ఆమె జ్ఞాన స్వరూపురాలు కదా. అంతా ఆమెకు తెలుసు. ఇదంతా ఆమె లీలయే.

విశుక్రుడు విజృంభించడానికి విఘ్నేశ్వరుని మహత్త్వం ప్రకటింప బడడానికీ ఆమెయే కారకురాలు.

శివశక్తులనుండి శక్తి, జ్ఞానాగ్ని కుండం నుండి బయల్వెడలింది. లలితాంబికగా అవతరించింది. అదే సందర్భంలో శివుడు కామేశ్వరునిగా అవతరించి ఆమెను వివాహమాడాడు. ఎందుకంటే యుద్ధానికి అవివాహితను పంపడం ఎందుకని? వీరిద్దరిని కామేశ్వర కామేశ్వరి దంపతులుగా కీర్తిస్తారు. ఆ కామేశ్వరియే మన మఠంలోని కామాక్షి. కామకోటి పీఠం ఆమె నిలయం.

ఈ సందర్భంలో కామేశ్వరుణ్ణి ఒక్కణ్ణే రంగంలోకి దింపడం ఎందుకని తన కొడుకైన గణపతి మహత్త్వాన్ని లోకానికి చాటడం కోసం కొడుకునూ రంగంలోకి దింపింది, తాను లలితాంబగానే ఉంటూ అమ్మవారు, కామేశ్వరుని ప్రీతిపూర్వకమైన చూపుతో చూసింది. ఆయన చిరునవ్వు చిందించాడు. ప్రేమ పూర్వకమైన చిరునవ్వుల కలయికచే మహాగణపతి ఆవిర్భవించాడు. అందమైన, ఆనందప్రదమైన ముఖంతో మహాగణపతి సాక్షాత్కరించాడు.

ఇట్లా వినాయకుని అవతరణలు చాలా ఉన్నాయి. అందొకటి ఇది. లలితోపాఖ్యానం, బ్రహ్మాండ పురాణంలోనిది.

ఇక్కడ అమ్మవారు, ఈశ్వరుణ్ణి చూసి చిరునవ్వు నవ్వడం వల్లనే ఇతడవతరించాడని. కామేశ్వర ముఖాలోక కల్పిత శ్రీ గణేశ్వరః - లలితా సహస్రనామం

ఆవిడ ఏ దేవత శక్తినైనా ఒక్క నిమేషకాలంలో తగ్గించగలదు, విఘ్న యంత్రాన్ని నిర్వీర్యం చేయగలదు. కాని విఘ్నాలను నివారించడానికి విఘ్నేశ్వరుడు నియోగింపబడ్డాడు కనుక అతనికి అవకాశం ఇచ్చింది.

ధర్మానికి ఆమె ఎట్లా కట్టుబడిందో అట్లాగే ఆమెచే సృష్టింపబడిన విఘ్నేశ్వరుడు కూడా అహంకారం లేకుండా ఆమెకు సాష్టాంగపడ్డాడు. అంతేనే గాని ఆమెకు చేతకాకపోవడం వల్ల తానీ పని చేసానని విఱ్ఱవీగలేదు. ఆమె ఆశీస్సులనందుకొని విఘ్న యంత్రాన్ని ఛేదించడానికి పూనుకొన్నాడు.

అగ్ని ప్రాకారంలో ఒక మూలయంత్రం పూడ్చి పెట్టబడింది. స్వామి దానిని గుర్తించి తన దంతంతో ఛేదించాడు. వెంటనే శక్తి గణాలు మేల్కొన్నాయి. మరల వారి మనస్సులు కుదుటబడ్డాయి. భక్తితో ఆజ్ఞాపాలనతో ఉత్సాహంతో భండాసురుణ్ణి ఎదుర్కొని ఓడించారు.

కుమార స్వామికి సాయం

తల్లిదండ్రులే ఇతని విజయావకాశానికి దారి చూపినపుడు ఇతని తమ్ముడు, ఇతని సాయం కోరకుండా ఉంటాడా? ఎవరు ముందుగా భూప్రదక్షిణం చేసి వస్తారో వారికి పందునిస్తామని తల్లిదండ్రులనడం అనే కథ మీకు తెలిసిందే. ఆ సందర్భంలో సుబ్రహ్మణ్యుడు గెలవలేక విరక్తిని చెందాడు. తల్లిదండ్రులు ఓదార్చారు.

సుబ్రహ్మణ్యుని అవతార ఉద్దేశ్యం శూరపద్ముణ్ణి ఓడించడమే. ఇక వల్లిని వివాహం చేసుకునే సందర్భంలో వేటగాని వేషం వేయవలసి వచ్చింది.

ఇతన్ని ఆమె గుర్తుపట్ట లేకపోయింది. తన నిజరూపాన్ని ప్రకటించి ప్రేమను పొందాలనుకున్నాడు. ఈ సందర్భంలో అన్నగారి గొప్పదనాన్ని చాటాలనుకున్నాడు. ఏ పని చేసినా విఘ్న నాయకుణ్ణి కొలవాలనే సందేశాన్ని ఇచ్చాడు. ఆ సందర్భంలో మహాగణపతిని ధ్యానించాడు.

వినాయకుడు పిచ్చి యెత్తిన ఏనుగులా మారి, వల్లిని భయపెట్టాడు. వేటగాని రూపంలో ఉన్న కుమారస్వామిని భయం వల్ల వల్లి కౌగిలించుకొనవలసి వచ్చింది. అతడు కుమారస్వామియనే ఎఱుక లేకుండా జరిగింది. ఇక వేషాన్ని తొలగించుకొని నిజరూపంలో కుమారస్వామి ఆమె ముందు సాక్షాత్కరించాడు. వల్లిని ఆశ్చర్యంలో ముంచివేశాడు.

తరువాత వల్లీ వివాహం, కుమారస్వామితో జరిగింది. ఇట్లా వీరిద్దరి ప్రేమ వివాహానికి కారకుడు గణపతి.

అరుణగిరినాథుడు, విఘ్నేశ్వర స్తుతి సూచించే తిరుప్పుగళ్‌లోని త్రిపురాసుర సంహారం – వల్లీ వివాహంలో ఇతని సాహాయ్యాన్ని నుతించాడు.

రాముడు - వినాయకుడు

మహా విష్ణువు, గణపతి పట్ల ఎట్టి మర్యాదను చూపించాడో చెబుతాను.

రావణవధానంతరం, రామేశ్వరంలో రాముడు శివుణ్ణి అర్చించడం, రామలింగాన్ని ప్రతిష్ఠించడం మీకు తెలిసిందే. సేతు నిర్మాణానికి ముందు నవ గ్రహాలని పూజించడం, రామనాథపురం సముద్ర ప్రాంతంలో నవపాషాణంలో అర్చించడం తెలిసిందే. ఈ నవ పాషాణ ప్రాంతం నేడు దేవీ పట్టణం. ఈనాటికీ యాత్రికులు ఈ నవ పాషాణాన్ని దర్శిస్తారు. ఇది కాక మరొక ప్రాంతాన్ని కూడా యాత్రికులు చూడాలి. తెలిసినవారు సేతు యాత్రను ఇక్కడనుండే మొదలు పెడతారు.

అదేమిటంటే రాముడు విఘ్నేశ్వరుణ్ణి పూజించిన చోటు. దీనిని ఉత్తర ప్రాంతం నుండి రాముడు బయలుదేరడం వల్ల ఉప్పూర్ అని అంటారు. ఉప్పూర్, నవపాషాణానికి ముందుగా ఉంటుంది. నవగ్రహాలను పూజించడానికి ముందు గణపతిని నుతిస్తాం.

రాముడు శాస్త్ర మర్యాదలను తు.చ. తప్పక పాటించేవాడే కదా. నవ గ్రహాలను పూజించడానికి ముందు అనగా సేతు బంధానికి ముందు గణపతిని పూజించాలి కనుక ఈ ఉప్పూర్ గణపతిని ముందుగా పూజించాడు. అతడు వరప్రసాది కాబట్టి అక్కడున్న స్వామికి ఎట్టి ఆచ్ఛాదన ఉండదు. ఆలయంపై విమానాన్ని కట్టడానికి ఆ గణపతి, అంగీకరించలేదట. నిరాడంబరంగా కూర్చొని ఉంటాడు. శీతాతపాలను భరిస్తూ ఉంటాడు. ఎండ తగిలే వినాయకుడని తమిళులంటారు.

సంస్కృతంలో దేంటి రాజ గణపతి లేదా దుంఠి గణపతి పదాన్ని తుండి అంటారు తమిళులు. ఆ గణపతి కాశిలో ప్రసిద్ధుడు. దానికి తగ్గట్టుగానే తొండి గణపతి ఉన్నాడిక్కడ. ఇక్కడా రాముడు, వినాయకుణ్ణి అర్చించాడట. ఇది వేదారణ్యం. ఉప్పూర్ మధ్యలో ఉంటాడు. అనగా వేదారణ్యం నుండి సముద్ర తీరానికి వెళ్ళేదారిలో ఉంటాడు. ఇక్కడినుండే రాముడు, సేతువును కట్టడానికి మొదలు పెట్టాడని అంటారు. కనుక ఇక్కడి వినాయకుణ్ణి పూజించాడు. రాముణ్ణి ఆశీర్వదించి శ్రమ తగ్గడం కోసం ఇంకా కాస్త ముందుకు వెళ్ళి కట్టమన్నాడట. లంకను సులువుగా చేరవచ్చని సలహా ఇచ్చాడట.

ఈ తొండి వినాయకుడి గుడికి విమానాదులేమీ వుండవు. ఆట్టాహాసాలంటే ఇష్టపడలేదట. ఎందుకంటే తన మామయైన రాముడు ఎండనక వానయనక తిరుగుతూ ఉంటే తనకెందుకు పై ఆచ్ఛాదనలని ఆలయ నిర్మాణానికి అనుమతించి యుండకపోవచ్చు. శంకరుల గణేశ పంచరత్నం, ఈ గణపతిని

గురించే యుంటుంది. ఈశ్వర సుతుడైన వినాయకుణ్ణి అర్చించడం వల్లనే విజయాన్ని సాధించి రాముడు, విజయ రాఘవుడయ్యాడు. అంతే కాదు, భార్యతో కలిసి సీతారాముడయ్యాడు. తిరిగి వచ్చేటప్పుడు రామలింగం గానున్న ఈశ్వరుణ్ణి పూజించాడు.

లోగడ శంకరుల పాలరాతి విగ్రహాన్ని ఒక వాహనంలో తరలించడాన్ని ప్రస్తావించాను. అచిరుపాక్కంలో 108 కొబ్బరికాయలు కొట్టినట్లు, ఉప్పూర్‌లోనూ కొట్టాం. మొదటి ప్రాంతంలో ఈశ్వరునికి వచ్చిన కష్టాన్ని తొలగించాడు. రెండవ ప్రదేశంలో రాముని పూజలందుకున్నాడు. జ్యోతిర్లింగమైన రామేశ్వరం, రాముని దయవల్ల అందరికీ పుణ్యక్షేత్రమైంది. రామ, ఈశ్వరులతో ఇతనికి ఉన్న సంబంధాన్ని ఈవిధంగా పాలరాతి విగ్రహ యాత్రలో శంకరులందించారు.

కృష్ణావతారంలో కృష్ణుడు వినాయకుడిని పూజించడం విస్తారంగా ఉంది.

గణనాథుడు - కృష్ణుని పూజలందుకొనుట
శ్యమంతకోపాఖ్యానము

ఈ కథ భాగవతంలో ఉంది. ఆఖ్యానమంటే కథ. ఉపాఖ్యానం, ప్రక్క కథను సూచిస్తుంది. ఇతిహాసంలోని గాని, పురాణాలలో గాని ప్రధాన కథ సాగుతూ ఉంటే చిన్న చిన్న కథలు ఉపాఖ్యానాలుగా వస్తాయి. ఇందు కొన్ని ప్రధాన కథతో సంబంధం కలిగి యుండవు. భారతంలో నలోపాఖ్యానం అట్టిది. కొన్ని కథలు, ప్రధాన కథతో సంబంధం కలిగి యుంటాయి. వాటిని విడిగా చూపలేం.

భాగవతంలో అట్టి సంబంధం ఉన్న కథ శ్యమంతకోపాఖ్యానం అట్టిది. ఈ కథ అంతా మణిచుట్టూ తిరుగుతూ ఉంటుంది. కృష్ణునిపై వేసిన అభాండాలు, వాటిని అతడెట్లా దాటాడో వివరిస్తుంది.

ఇదే కథ, విష్ణుపురాణంలోనూ ఉంది; కొద్ది తేడాలతో. అట్లాగే స్కాందంలో నందికేశ్వర సనత్కుమార సంవాద రూపంలో ఉంటుంది. స్కాందంలోని ఈ కథకు వినాయకునకు *గల* సంబంధాన్ని తెలుపుతుంది. నందికేశ్వరుడు, సనత్కుమారునితో చెప్పిన కథనే ప్రధానంగా ఇక్కడ ప్రస్తావిస్తున్నా. అక్కడక్కడ భాగవతాన్ని, విష్ణుపురాణాన్ని పేర్కొంటాను.

సూర్యుడు - వినాయకుడు

వివాహానంతరం కృష్ణుడు రుక్మిణితో నున్నకాలమది. యాదవ వంశంలో సత్రాజిత్తు, ప్రసేనుడని ఇద్దరు ప్రముఖ సోదరులుండేవారు. సత్రాజిత్తు, సూర్యారాధకుడు.

ఈనాటికీ కొందరాచారవంతులు ప్రధాన దేవతయైన సూర్యుని పరివార దేవతగా భావించి సూర్య నమస్కారం చేయుట, ఆదిత్య హృదయాన్ని పఠించుట చేస్తూ ఉంటారు. పూర్వకాలంలో ఇతణ్ణే ప్రధాన దేవతగా భావించి విశేషార్చనలు చేసేవారు. ఇతణ్ణి పరమాత్మ స్వరూపంగా భావించడాన్ని సౌరమని అంటారు. దేశ విదేశాలనుండి యాత్రికులను ఆకర్షించే కోణార్క లోనున్న సూర్య ఆలయం ప్రసిద్ధిని పొందింది. కోణార్కమనగా అర్కుని యొక్క కోణం. సూర్యునిలో ఒక భాగమని అర్థం.

అర్క గురించి చెబుతూ ఉంటే వినాయకుడు గుర్తుకు వస్తున్నాడు. ఏమైనా సంబంధం ఉందా అని ఆలోచించా. ఈ కోణార్కను ప్రస్తావించినపుడు ఇద్దరికీ ఉన్న సంబంధం గుర్తుకు వచ్చింది.

గణపతిని పూజించేటపుడు ఏ పుష్పాన్ని అర్పిస్తాం? దండ కట్టినప్పుడైనా? జిల్లేడు కదా! సూర్యునకు, జిల్లేడునకు ఒకే నామం అర్కయని. తమిళనాడులోని సూర్యనార్ కోవెలలో స్థలవృక్షం, జిల్లేడే. అన్ని పుష్పాలు సూర్యోదయం అయిన తరువాతనే వికసిస్తాయి. కాని ఇందులో సూర్య సన్నిధి, విశేషంగా ఉంటుంది.

వినాయకునకు పువ్వుల నర్పించేటప్పుడు ఈ జిల్లేడు పువ్వును అర్పిస్తే సూర్యుడే ఇతని పాదాలపై పడ్డట్టే కదా!

తపస్సు వల్ల దివ్యమణి

ఒకనాడు సత్రాజిత్తు సముద్ర తీరంలో ఇష్టదైవమైన సూర్యుణ్ణి ఆరాధించాడు. ఏ వరం కావాలని సూర్యుడడిగాడు.

సూర్యుని మెడలో తళతళలాడే మణి యుంది. అదే శ్యమంతకమణి. ఇది కాంతినే గాక బంగారాన్ని ప్రసాదిస్తుందని ఆ మణిని సత్రాజిత్తు ఇమ్మన్నాడు. దాన్ని సత్రాజిత్తు మెడలో సూర్యుడు వేసాడు.

నా దివ్య రూపంలా మెరిసే ఈ మణి రోగాదులను కూడా పోగొడుతుందని అన్నాడు. అంతే కాకుండా బంగారాన్ని రోజూ ఇస్తుందన్నాడు. అయితే దీనిని ధరించినవాడు శారీరకంగా, మానసికంగా పరిశుద్ధుడై యుండాలని షరతు పెట్టాడు. ఏ తప్పు చేసినా ఇంతే సంగతులని అదృశ్యమయ్యాడు.

సత్రాజిత్తు మణిని ధరించి నగరంలో ప్రవేశించాడు. ఆ కాంతి ప్రవాహంలో ఇతణ్ణి ప్రజలు గుర్తు పట్టలేకపోయారు. ఆ కాంతినే చూస్తూ ఉండిపోయారు. సూర్యభగవానుడే శ్రీకృష్ణుని దర్శించడానికి వచ్చాడా అని వారు ఆశ్చర్య చకితులయినప్పుడు మరీ దగ్గరగా చూస్తే ఇతడు కనబడ్డాడు. ఈ సూర్య ప్రసాద మహిమను వేనోళ్ళ కొనియాడారు.

కృష్ణుడు రసికుడు కనుక ఇందలి సొగసునకు ఆకర్షితుడయ్యాడు. కృష్ణుడు పొగుడుతూ ఉంటే ఇతనికి ఆ మణి కావాలేమోయని ఊహించాడు సత్రాజిత్తు.

కృష్ణుని నిరాసక్తత

కృష్ణుడు పరమజ్ఞాని కదా! అతనికి ఐహిక విషయాలపై మక్కువ ఉంటుందా? వెన్న దొంగలించడం మొదలైనవి అతని లీలలు మాత్రమే.

అట్లాగే రాసలీల, గృహస్థ జీవనం, 16 వేల స్త్రీలతో కాపురం మొదలైనవన్నీ నాటకంలోని భాగాలు. కంసుణ్ణి చంపిన తరువాత ఇతడు అభిషేకానికి అర్హుడే కదా! అతడే రాజు కావాలని ప్రజలందరూ ఉవ్విళ్ళూరేరు. అతడిష్టపడ్డాడా? ఉగ్రసేనుణ్ణి సింహాసనం మీద కూర్చుండబెట్టాడు. ఉగ్రసేనుడితని తాత. కంసుణ్ణి చంపి మధురను విడిచి కృష్ణుడు ద్వారకలో ఉండిపోయాడు. అప్పటినుండి అతడు ద్వారకాధీశుడు. అయినా రాజ్యాన్ని ఏలాలనే ఉబలాటం లేదు. తాను రెండవ స్థానంలో ఉండి బలరామునకు ఉన్నత స్థానమిద్దాడు. అతడు పూర్ణావతారుడైనా వినయంతో నిస్పృహుడై ధనవాంఛ లేక కాలం గడిపాడు.

భాగవతం కూడా, క్షీరసాగర మథనంలో లక్ష్మి అవతరించినపుడు విష్ణువును పతిగా పొందటం, నిరాడంబరంగానే వర్ణించింది. డబ్బు, బంగారం పట్ల ఎట్లా మోజులేదో స్త్రీల పట్ల కూడా లేదు. లక్ష్మి అవతరించినపుడు దేవతలందరూ దండలు వేయబోతూ ఉంటే ఒకమూల ఏమీ పట్టించు కోకుండా ఉన్నాడు విష్ణువు. ఇట్టి మానసిక బలం ఉన్న విష్ణువునే వివాహమాడాలని భావించింది లక్ష్మి. అతని ప్రేమను చూరగొనాలని అతని మెడలో దండ వేసింది. అంగీకరించి తన వక్షః స్థలంపై ఉంచుకొన్నాడు.

నేను కృష్ణుని నిరాసక్తతను చెప్పదలుచుకున్నాను. శంఖం, చక్రం, గరుడుడు ఆయా సందర్భాలలో కృష్ణుని దగ్గరకు వచ్చాయి. మహావిష్ణువు ధరించే, కౌస్తుభమణి కృష్ణుని దగ్గరకు వచ్చింది.

కస్తూరీ తిలకం లలాట ఫలకే వక్షః స్థలే కౌస్తుభం

అనే శ్లోకాన్ని విన్నాం. అట్టి కౌస్తుభాన్ని ధరించగా ఈ మణి కావాలా?

ఈ శ్యమంతక మణిని ఉగ్రసేన మహారాజు ధరిస్తే బాగుంటుందని సూచించాడు. రాజు ధరించడం వల్ల రాజ్యం సుభిక్షంగా ఉంటుందనే, అంతేనే

కాని తాను ధరించి మురిసి పోవాలని ఉద్దేశ్యం కాదు. సత్రాజిత్తు ఈ భాగ్యమంతా తన కుటుంబానికే చెందాలని భావించే సామాన్య పౌరుడు. ఈ అపార సంపద రాజుకు చెందితే ప్రజలందరికీ సౌభాగ్యము కల్గుతుందనే విశాల భావనతో అట్టి సూచన కృష్ణుడు చేసాడు.

ఒక సామాన్యుని దగ్గర రాజుకంటె అధిక సంపద ఉంటే అతణ్ణే సామాన్యులు రాజుగా భావిస్తారు. కనుక అట్టి విశేష సంపద సామాన్యుల దగ్గర ఉండకూడదని అర్థశాస్త్రం చెప్పింది. విలువైన మణులు రాజునకే చెందుతాయని రాజా రత్నహారీ అనే మాట ఉంది.

ఇట్టి సద్భావనతో కృష్ణుడు సూచించగా నేను రాజును, మంత్రిని లెక్కబెట్టడమేమిటి? ఈ రాజును కృష్ణుడు సింహాసనం మీద కూర్చోబెట్టాడు, ఇతని తాతకే ఆ పదవిని కట్టబెట్టేదని, ఈ మిషతో తానే ఉంచుకోవాలని కృష్ణుడు భావించాడనీ ఊహించాడు సత్రాజిత్తు.

ఈ కథ, ఆశ ఎంత పనిచేస్తుందో సూచించడం లేదా?

కృష్ణుని సందేహించడమే కాదు, అతనినుండి భయం కల్గుతుందనీ సత్రాజిత్తు భావించాడు. కృష్ణుడు చిన్నతనంలోనే చాణూరుడు, ముష్టికుడనే ప్రధాన మల్లురను, కంసుణ్ణి చంపాడు. 17 సార్లు జరాసంధుణ్ణి తరిమి వేసాడు. ఆపైన బిత్తులమారి కూడా. అతనితో శత్రుత్వం వహిస్తే నేనెట్లా నిలబడగలనని సందేహించాడు సత్రాజిత్తు.

ఒక మూల శ్యమంతకమణిని రాజుకు ఈయలేదు, దానిని ఉంచుకొనే సామర్థ్యమూ లేని పరిస్థితి. భౌతిక సంపదలు మనిషిని ఎన్ని ముప్పుతిప్పలు పెడతాయో గమనించారా?

ప్రస్తుతానికి ఆ మణిని తన సోదరుడైన ప్రసేనజిత్తుకు అందజేసి ప్రశాంతంగా ఉన్నాడు. ఇతనికంటె తెలివైనవాడు, బలవంతుడు ప్రసేనజిత్తు.

ఇతడు దీనిని ధరించి వేటకు బయలుదేరాడు. కృష్ణునితో వెళ్ళినట్లు స్కాందం చెప్పింది. నేను చెప్పేది భాగవతాన్ని, విష్ణుపురాణాన్ని అనుసరించేది.

దీనిని ధరించి ఎట్లా ఉండాలని నియమం చెప్పాడు సూర్యుడు? శారీరకంగా మానసికంగా పవిత్రునిగా ఉండాలి కదా! అతడరణ్యంలో ఉండడం వల్ల కాళ్ళు, చేతులు కడుక్కోవడానికి నీరే దొరకలేదు. ఆ సమయంలో సింహం వచ్చి ఇతణ్ణి చంపివేసింది. సింహానికి ఈ మణిని చూస్తే ఏదో ఆకర్షణ కలిగింది. దానిని పట్టుకుని పోతూ ఉంటే చీకటితో నున్న అడవి, పట్టపగలులా వెలిగిపోతోంది. అటూ ఇటూ తిరగటం మొదలు పెట్టింది.

జాంబవంతుడు

అక్కడొక గుహలో జాంబవంతుడున్నాడు. అతడెవరనుకున్నారు? వానరులతో కలిసి రామునికి సాయంగా ఉన్నవాడే. ఆనాటి వాడు ద్వాపరయుగందాకా ఉన్నాడు.

రాముడు అవతార సమాప్తిలో అయోధ్యాపుర వాసులందరూ అతనితో వైకుంఠానికి వెళ్ళారు. హనుమ, జాంబవంతుడు తప్ప. వాళ్ళు ఎందుకాగిపోయారు? ఈ పాప పంకిలమైన భూలోకాన్ని రామనామ సంకీర్తనంతో వైకుంఠంగా మార్చడానికే హనుమ ఉండిపోయాడు. ఇది ప్రపంచానికి తెలియజెప్పడం కోసం చిరంజీవిగా రాముడుంచాడేమో! అట్లాగే లంకలో విభీషణుణ్ణి చిరంజీవిగా ఉంచాడు.

మనమేదో మానవజాతి గొప్పదని మురిసిపోతాం. మానవులు నిరంతరం తనను స్మరించలేరని భావించి వీరికి చిరంజీవిత్వం ప్రసాదించలేదు రాముడు. ఒక రాక్షసునకు, ఒక కోతికి, ఒక ఎలుగుబంటికీ ఇచ్చాడీ వరాన్ని.

అశ్వత్థామా బలిర్వ్యాసో హనూమాంశ్చ విభీషణః
కృపః పరశురామశ్చ సప్తైతే చిరజీవినః

ఈ శ్లోకంలో జాంబవంతుడు లేడు. అయినా అతడు చిరంజీవియే. ఏదైనా చిరకాలం ఒక రంగంలో నిష్ణాతుడైతే అతణ్ణి జాంబవంతుడని అంటాం.

అగస్త్యుడు, నిరంతరము 16 సంవత్సరాల ప్రాయంలో ఉండే మార్కండేయుడూ చిరంజీవులే. అయినా వీరీ శ్లోకంలో లేరు.

సరే ఆ నాటివాడు, ద్వాపరయుగంలో ఉండి ఈ మణిని తీసుకొని వెళ్ళే సింహాన్ని చూసాడు. అతనికి సుకుమారుడనే పిల్లవాడున్నాడు. ఆ వయసులో అతనికి పిల్లవాడేమిటని ఆశ్చర్యపోతున్నాం. మెరిసే మణి, తన పిల్లవానికి ఆటవస్తువుగా పనికి వస్తుందని భావించాడు.

సింహాన్ని చంపి మణిని తీసుకొని పిల్లవాడూగే ఉయ్యాల గొలుసులకు కట్టాడు. వాలి కూడా అంగదుడు నిద్రబోయే ఊయలకు రావణుణ్ణి ఆటబొమ్మగా కట్టాడు. రావణుణ్ణి పది తలల పురుగని అన్నాడు కూడా.

కృష్ణుడు చంద్రుని చూచుట

వినాయకునకు శ్యమంతకమణికి గల సంబంధాన్ని స్కాందంలోని కథ చెప్పింది. దీని ప్రకారం ప్రసేనుడు, కృష్ణుడు కలిసి వేటకు వెళ్ళినట్లుందని చెప్పాను కదా. అపుడు ప్రసేనుడు విడిపోయి సింహం చేత చంపబడ్డాడని తుదకు జాంబవంతుని దగ్గరకు మణి చేరిందని కథ.

భగవానుడు, ప్రసేనునికై వెదికాడు. సూర్యాస్తమయం అయిపోయింది. చీకటి పడింది. ఇంతలో చవితి చంద్రుణ్ణి ఆకాశంలో చూసాడు.

శుక్లపక్షంలో చవితినాటి చంద్రుడు స్పష్టంగా కన్పిస్తాడు. తదియనాడు ప్రొద్దున్న ఎనిమిది గంటల నుండి రాత్రి ఎనిమిది గంటలలోపు అస్తమిస్తాడు. సూర్యుని కాంతి ప్రభావం వల్ల సూర్యాస్తమయం అయ్యేవరకు చంద్రుడు కనిపించడు కదా. వెన్నెలలో 6-30 నుండి 7 గంటలవరకూ పడమర దిక్కు

దిగువున మసక మసకగా కన్పిస్తాడు. దీనిని జాగరూకతతో గమనించాలి. చవితినాడు ప్రొద్దున్న తొమ్మిది గంటల నుండి రాత్రి తొమ్మిది గంటల సమయంలో స్పష్టంగా కన్పిస్తాడు. అట్టి స్థితిలో అరెరె! చీకటిగా ఉంది. ఇక వెదకటం ఎందుకని ద్వారకకు తిరిగి వచ్చాడు కృష్ణుడు.

నీలాపనిందలు కృష్ణునకు

ప్రసేనుడు తిరిగి రాకపోవడం విని సత్రాజిత్తు కంగారు పడ్డాడు. కృష్ణుడే చంపి యుంటాడని సత్రాజిత్తు నిర్ధారణకు వచ్చాడు. భాగవతం ప్రకారం కృష్ణుడు ప్రసేనునితో కలిసి వెళ్ళకపోయినా ఇతడు తన సోదరుడ్ని చంపించి యుంటాడని సత్రాజిత్తు సందేహించినట్లుంది. "ఈ కృష్ణునకు మణిపై ఏనాడో కన్ను పడింది. మణిని ధరించి ప్రసేనుడు అడవికి వెళ్ళడం ఇతనికి మంచి అవకాశాన్ని కల్పించింది. అతడు తిరిగి రాకపోతే ఏ క్రూర జంతువో చంపి యుంటుందని ప్రజలు సందేహిస్తారు. కనుక శ్రీకృష్ణుడు తన మనుష్యులను పంపి ప్రసేనుణ్ణి చంపించి యుంటాడు" అని సత్రాజిత్తు నిర్ణయించాడు.

పరమాత్ముడు, మానవకారం ధరించినపుడు మానవుల పట్ల వేసే నీలాపనిందలు అతనిపట్ల మోపుతారు. వాటిని అనుభవిస్తూ మానవునకు గుణపాఠం నేర్పడమే అవతార ప్రయోజనం.

సత్రాజిత్తు రెండు నేరాలను మోపాడు. కృష్ణుడే ప్రసేనుణ్ణి చంపాడని, మణిని దొంగిలించి ఎక్కడో పెట్టాడని. ఇట్లా నిందా ప్రచారం సాగింది.

మానవ ప్రవృత్తి చిత్రవిచిత్రంగా ఉంటుంది. ఒకమాటు తమ నాయకుణ్ణి ఆకాశానికి ఎత్తుతారు, కొంతకాలానికి చెత్తబుట్టలో వేస్తారు. ఇది అన్నికాలాలలోనూ ఉంది. ఏ కృష్ణుడు కంసుని బారినుండి యాదవ కులాన్ని రక్షించాడో, సుఖ సంపదలనిచ్చాడో అట్టివాడే నీలాపనిందలకు లోనైనాడు.

ఈ ప్రజలు సత్రాజిత్తునకు వంత పాడారు. మోసం, దగా కృష్ణునకు వెన్నతో బెట్టిన విద్యలని అంటూ లేనిపోని అక్షుసును వ్రెళ్ళకక్కారు. కాళీయుని నుండి ప్రజలను కాపాడడం, గోవర్ధనాన్ని గొడుగుగా చేసి ప్రజలను రక్షించడం మొదలైనవి ప్రజలకు గుర్తుకు రాలేదు. చూసారా ప్రజల మనఃప్రవృత్తి?

ఇట్లా ఉన్నారేమిటని భగవానుడే కలత చెందాడు (కలత చెందినట్లు నటించాడని అందాం). ఇట్లా నిందలు వేస్తారని ఊహించలేదు. ఒక నిజాయితీ గల మనిషి ఇట్టి పరిస్థితులలో ఎట్ల బాధ పడతాడో అట్లా బాధపడ్డాడు. తన పరబ్రహ్మత్వాన్ని ప్రకటించకుండా ప్రసేనుడు కనబడకపోవడం ఏమిటో తెలుసుకోవాలని నిందలను తొలగించుకోవాలని ప్రయత్నించాడు.

రహస్యాన్ని ఛేదించాడు

సత్రాజిత్తు యొక్క అనుచరులతో మరల అడవికెళ్ళాడు కృష్ణుడు. గుఱ్ఱపు గిట్టల గుర్తులను బట్టి కొంత దూరం వెళ్ళగా, ఒకచోట గుర్తులు కనబడలేదు. ఆ చోటంతా రక్తపు మరకలతో ఉంది. ఎముకలు పడి యున్నాయి. ప్రసేనుని చివికిన గుడ్డలు కనబడ్డాయి. అతని ఆభరణాలు గుఱ్ఱపు జీను కనబడ్డాయి. భగవంతుడే దండయాత్ర చేస్తే మొత్తం శవం కనబడాలి కదా! పోనీ ఎవరైనా చంపితే ఆ శవాన్ని జంతువులు తినియుండవచ్చు. అట్లా భావించారు ఇతనితో వచ్చినవారు. రాజుయొక్క ఆభరణాలు పడి యున్నాయిగాని మణి మాత్రం కనబడడం లేదు. ఇది సందేహానికి తావిచ్చింది.

ఇంతలో సింహపు కాలిగుర్తులు కనబడ్డాయి, కృష్ణునకు. వీటి జాడ తెలిసి కొందాం రండని అన్నాడు. కొంత దూరం వెళ్ళగా సింహం కళేబరం కనబడింది. సింహం పడినచోట ఎలుగుబంటి జాడలు కన్పించాయి. సింహం పాదాల కంటె వీటి పాదాలు పెద్దవిగా ఉంటాయి. అవి రెండు కాళ్ళమీద నిలబడగలవు కూడా. పాదాల గుర్తులు నేలలో స్పష్టంగా పెద్దవిగా

కన్పిస్తున్నాయి. ఇక జాంబవంతుని గుర్తులను వేరే చెప్పాలా? ఆ గుర్తులను బట్టి గుహలో ప్రవేశించాడు. గుహ చీకటి మయం. తోటి ప్రజలు ప్రవేశించడానికి భయపడ్డారు. ఇక కృష్ణుణ్ణి ఎట్లాగూ సందేహిస్తున్నారాయె. మనలను ఇందులో ప్రవేశపెట్టి చంపుతాడేమో అని భావించారు.

కృష్ణుడు ఆపదలనెదుర్కొంటాడు కదా! కనుక మీరందరూ గుహ దగ్గర ఉండండి, నేనే లోపలకి వెడతానన్నాడు. అతని శరీర కాంతియే ఆ గుహలో వెలుగు.

ఆ గుహలో వెలుగు కనబడింది. అది మణి ప్రభావమే. మధ్యలో ఒక ఊయెలలో పిల్లవాడు నిద్రిస్తున్నాడు. ఆ మణి, ఊయెలపై వ్రేళ్ళాడుతూ ఉంది. పక్కన ఒక అందమైన స్త్రీ ఉంది.

పురాణాలలోని జంతువులు మనుష్య భాషతో మాట్లాడుతాయి. స్త్రీలు కూడా అందంగా ఉన్నట్లు వర్ణనలుంటాయి. జంతు దశనుండి మానవాకారపు దశ ఈ స్త్రీలలోనూ చూడవచ్చుని డార్విన్ సిద్ధాంతం వారంటే అనవచ్చు.

ఒక పాట వినబడింది. ఆ పాట ఏదో వట్టి జోలపాట కాదు. ఆ పాటలో భగవానుడు వెదకడానికి వస్తున్నాడని ఉంది:

సింహః ప్రసేనం అవధీత్ సింహో జాంబవంతా హతః

సుకుమారక! మారోదీః తవహ్యేష శ్యమంతకః

ఈ శ్లోకం భాగవతంలో లేదు. ఇది విష్ణుపురాణంలోనూ, స్కాంద పురాణంలోనూ ఉంది. అనగా సింహం, ప్రసేనుణ్ణి చంపింది. జాంబవంతునిచే సింహం చంపబడింది. ఓ సుకుమార శిశూ! ఇక ఏడవవద్దు. ఈ మణి నీ కొరకే అని.

భగవానుడేమనుకొన్నాడో ఈమెకెట్లా తెలిసింది?

నిందలపాలైన కృష్ణుడు లోపలకు ప్రవేశించి నిందను పోగొట్టుకోవాలి కదా! అతణ్ణి ఆ అందగత్తె చూడగా ఆమెలో ప్రేమ, భయమూ ఒక్కసారే కలిగాయి. అతినికేమైనా ఆపద కల్గుతుందేమో అని భయపడింది.

మణి-యువతి

ఆమె ఎవ్వరో కాదు, జాంబవంతుని కూతురు, జాంబవతియే. ఈ గుహలో ఎవ్వరూ ప్రవేశించలేరు. ఈ అందగాడు ప్రవేశించాడు. కోపంతో తన తండ్రి ఇతనికేమైనా హాని తలపెడతాడేమోనని కంగారు పడింది.

జాంబవంతుడు నిద్రపోతున్నాడని, నిమ్మదిగా నీవెవ్వరివని అడిగింది. భగవానుడు జవాబు చెప్పాడు.

ఇది మా నాన్న వింటే కోప్పడతాడు. నీవు మణిని తీసుకొని వెడతానంటే అగ్గిమీద గుగ్గిలమై పోతాడు. చడీ చప్పుడు కాకుండా వెంటనే తీసుకొని పో అని తొందరపెట్టింది.

అతడు వెళ్ళిపోవాలని ఆమెకూ లేదు. అట్లాగే కృష్ణునిపై మోజుపడి రుక్మిణి, ఒక బ్రాహ్మణుని దూతగా పంపి వచ్చి నన్ను తీసుకొని పొమ్మని చెప్పింది. కాని ఈ స్త్రీ మణిపట్ల మమకారం చంపుకొని, ప్రేమించిన వానికి ప్రాణహాని జరుగుతుందని వెళ్ళిపొమ్మంది.

ఒక నవ్వు నవ్వాడు. నాకెట్లాగూ చోరుడనే బిరుదుంది. సత్రాజిత్తు మోపిన నిందను పోగొట్టుకోవాలని భావిస్తున్నా. అతడు నిందించాడు. నీ తండ్రి కూడా నన్ను నిందించేటట్లు ప్రవర్తించమంటావా? అతడిచ్చినా సరే. లేదా అతనితో యుద్ధం చేసి తీసుకొని వెడతానన్నాడు.

నా తండ్రి స్వభావం నాకు తెలుసు. తనంతట తానియ్యడు. ముసలి తనంలో కలిగిన శిశువు కోసం దీనిని ప్రేలాడదీసాడు. కనుక అడిగి నిరాశ చెందకు, యుద్ధానికే సిద్ధపడమని జాంబవతి హితోపదేశం చేసింది. అతనిపట్ల

ప్రేమ చివురించి మొగ్గ తొడిగింది. అతని గౌరవాగౌరవాలకు తానూ పాత్రురాలేనని సూచించింది.

ఇక శంఖాన్ని పూరించాడు కృష్ణుడు.

జాంబవంతునికి కృష్ణ స్పర్శ సుఖం

జాంబవంతుడు మేల్కొన్నాడు. నేనేమో ముసలివాణ్ణని సులభంగా ఓడించవచ్చని భావించావా? అని బబ్బలు చరిచాడు.

భగవంతునితో కయ్యానికి కాలు దువ్వాడు. జాంబవంతుని పరాక్రమాన్ని లోకానికి చాటాలని కృష్ణుడు, తన శక్తి నంతటినీ వినియోగించలేదు. సరిసమానంగానే యుద్ధం సాగింది.

యుద్ధం చేసేవాడు ఆనాటి రామచంద్రుడే అని గ్రహించలేకపోయాడు జాంబవంతుడు. భగవత్ శక్తిని ప్రకటించకుండా యుద్ధం కొనసాగిస్తున్నాడు కృష్ణుడు. వినోదంగా భావించాడు.

ముష్టియుద్ధాలు, సిగపట్లు మామూలే. తన దివ్య శరీర స్పర్శ సుఖాన్ని భక్తునకు కలిగించాలనే భావనతో యుద్ధాన్ని కావాలని పొడిగించాడు. రామావతార సమయంలో రాముణ్ణి కౌగిలించుకోవాలని జాంబవంతుడు అనుకున్నాడు. కాని ఆ కోరిక నెరవేరలేదు. పైకి ఆ కోరికను తాను చెప్పలేదు. రాముని శరీరం ఎట్లా ఉంటుంది? పట్టుకుచ్చులా ఉంటుందా? ఆ మెత్తని, ఉదారమైన మనస్సే నీలమేఘశ్యాముడై ఉంది. ఇక జాంబవంతుని శరీరం గరుకు గరుకుగా ఉంటుంది కదా. కనుక కోరికను వెల్లడించలేదు. ఒకవేళ అడిగినా రాముడంగీకరించడు. తన శరీర స్పర్శ సీతమ్మకే దక్కాలి. అతడేక పత్నీవ్రతుడు కదా. అన్నీ విడిచి దండకారణ్య ఋషులే కౌగలింతనడుగగా ఈ అవతారంలో ఈ శరీరం సీతకే అంకితమని, కృష్ణావతారంలో మీ కోరిక తీరుస్తానని అన్నాడు. ఆ ఋషులే గోపికలుగా పుట్టారని ఉంది కదా.

అట్లా అడగడం ఋషులకు చెల్లింది. జాంబవంతుడు అడగగలడా? ఋషుల మాదిరిగా ఇంకొక జన్మ నెత్తాలని కోరుకోలేదు. అందుకే జాంబవంతుణ్ణి చిరంజీవిని చేసాడు రామయ్య.

ఈ కృష్ణుడే ఆ రాముడని తెలిసినా కౌగలించుకోవడానికి సందేహిస్తాడు. పుష్ప కోమలమైన ఆ శరీరమెక్కడ? తన శరీరమెక్కడ? అని సందేహిస్తాడు అందుచేత మల్లయుద్ధంలోనే తన శరీర స్పర్శను అతనికి కల్గించి ఆనందాన్నియ్యాలని భావించాడు కృష్ణుడు. అతని లీలలలో అనేకాంతరార్థాలు దాగియుంటాయి.

పరమేశ్వరుడు కూడా తన దివ్య శరీర స్పర్శ యొక్క రుచిని అర్జునునకు యుద్ధం చేసి చూపించాడు.

రోజులు గడుస్తున్నాయి. ఎవరు గెలుస్తారో తెలడం లేదు. ద్వారం దగ్గరగా నున్న యాదవులెంత కాలం వేచియుంటారు? తమకేమైనా ప్రమాదం ముంచుకు వస్తుందని ద్వారకు తిరిగి వచ్చారు. మానవుల నైజాన్ని గమనించారా?

ఇట్లా 21 రోజులు యుద్ధం సాగింది. జాంబవంతుడలిసిపోయాడు. నీలమేఘశ్యాముని స్పర్శ వల్ల ఒక అలౌకికానందాన్ని పొందుతున్నాడు జాంబవంతుడు. తనకున్న బలం ఆ రామచంద్రమూర్తి ప్రసాదించిందేనని రామ, రామ అంటూ కీర్తించాడు. ఇంతవరకూ మరొక అవతారాన్ని పిడిగ్రుద్దులతో సత్కరించడమా?

రామనామశక్తి యున్నా ఈ తన్నులు తినడమేమిటి? శత్రు స్పర్శ, సుఖాన్ని కల్గిస్తోందేమిటి? అని ఆలోచించాడు.

ఇక కృష్ణుడూ ఈ ఆట చాలించాలనుకున్నాడు. జాంబవంతునకు జ్ఞానోదయం కల్గించాడు.

ఏమిటేమిటి? నా ఉపాసనమూర్తితో ఇంతవరకూ యుద్ధమా? రాముడే కృష్ణుడు కదా అంటూ పాదాభివందనం చేసాడు. కృష్ణుడు కరుణించాడు.

మణి - వివాహము

స్వామీ! నేను నీ ఆధీనంలో ఉన్నాను. నీది నీకీయడం సబబు. ఈ మణితో ఈ కన్యామణిని కూడా స్వీకరించవయ్యా! అనగా జాంబవతిని కూడా స్వీకరించాడు. జాంబవతి కోరిక కూడా నెరవేరింది. రెంటినీ గ్రహించాడు నల్లనయ్య. ద్వారకకు ఆ రెంటితో వచ్చాడు.

మణి తన దగ్గర ఉంచుకోవడానికి తగిన అర్హతలన్నీ అతనికున్నాయి. కారణం! జాంబవంతుణ్ణి జయించి ఆ మణిని తీసుకున్నాడు. ఆ జాంబవంతుడు సింహాన్ని ఓడించాడు. అదేమో ప్రసేనుణ్ణి చంపి మణిని పొందింది. ఆవిధంగా తనకు సంపూర్ణమైన హక్కు ఉంది. అయినా ఈ భౌతిక సంపదకై ఆశ పడతాడా? తనపై వేసిన నింద పోగొట్టుకోవడానికే ఈ తతంగం అంతా జరిగింది. కనుక మణిని సత్రాజిత్తునకిచ్చాడు. తపస్సు చేసి దాన్ని సంపాదించాడు కదా సత్రాజిత్తు.

అతడు సంతోషంతో మణిని స్వీకరించాడు. కాని ఏదో అపరాధం చేసాననే చింత, మనస్సును పీకుతోంది. సత్రాజిత్తునకు ఒక్కగానొక్క కుమార్తె సత్యభామ. ఆమె భూదేవి అవతారం. రుక్మిణి లక్ష్మియొక్క అవతారం.

జాంబవంతుని మాదిరిగానే సత్యభామను, మణిని కృష్ణునకే అర్పించాడు సత్రాజిత్తు. భగవానుడు గోపాలరత్నం కదా! కనుక సత్యభామను మాత్రమే స్వీకరించాడు. మణిని స్వీకరించలేదు. మణి, నీ ఆధీనంలో ఉంటుంది, నీ కుమార్తె నా ఆధీనంలో ఉంటుందని అన్నాడు. సత్రాజిత్తుకు ఒక్కతే కుమార్తె కనుక అతని సంపదంతా ఈ దంపతులకే చెందుతుంది.

అయితే కథ ఇంకా ముగియలేదు. ఇంత వరకు మన గణపతి ప్రస్తావన ఏది?

తన జీవితకాలం ఈ మణిని అనుభవిద్దాం. తరువాత వారికే చెందుతుందని భావించాడు సత్రాజిత్తు. ఇది చివరకు ఇతని జీవితాన్నే బలిగొంది. అనేక కష్టాలు. చూద్దాం.

స్త్రీలవల్ల శత్రుత్వం

వివాహానంతరం కుంతితో పాండవులందరూ లాక్షా గృహంలో బూడిదపాలయ్యారనే వార్తను విన్నాడు కృష్ణుడు. వారు బ్రతికి యున్నారని తెలిసి కూడా లోక మర్యాదను పాటించి ధృతరాష్ట్రుణ్ణి పరామర్శ చేయడానికి హస్తినాపురానికి వెళ్ళాడు. అవతార పురుషుడై అట్టి మర్యాదలను పాటించాడు.

ఇతని నిర్గమనం, సత్యభామకు కష్టాలను తెచ్చిపెట్టింది.

యాదవులలో శతధన్వుడనే దుర్మార్గుడున్నాడు. యాదవ వంశంలో కృతవర్మడు, అక్రూరుడనే ముఖ్యులూ ఉన్నారు. వీరిద్దరు కృష్ణునకు దాసోహం అనేవారే. అక్రూరుడు, పరమ భాగవోత్తముడు. అతడే బలరామకృష్ణులను బృందావనం నుండి మధురకు తీసుకొనివచ్చాడు. ఈ పై ముగ్గురూ సత్యభామనే వివాహమాడాలని ఎవరికి వారే నిశ్చయించుకున్నారు. ఎవరడిగితే వారికే తన అమ్మాయిని ఇస్తానన్నాడు సత్రాజిత్తు. కాస్త సమయం కావాలన్నాడు. కాలం గడుపుతున్నాడు. తర్వాత శ్యమంతక మణి రావడం వల్ల భగవానునకి తన కుమార్తెనిచ్చాడు.

ఈ సంఘటన చిచ్చుపెట్టింది. మానవమనః ప్రవృత్తులు ఎంత మోసపూరితంగా ఉంటాయో వివరించింది పురాణం. ఈ ముగ్గురూ సత్రాజిత్తుపై కక్ష కట్టారు. కృష్ణునిపై నింద వేసినపుడు అక్రూరుడు; కృతవర్మలిద్దరూ కృష్ణుణ్ణి వెనకేసుకొని వచ్చారు. ఇది సత్రాజిత్తునకు కోపం తెప్పించింది. ఇప్పుడు కథ తారుమారైంది. వీరిద్దరి మనస్సూ మారిపోయింది. కృష్ణునిపట్ల భక్తి దూరమైంది. స్త్రీ పట్ల కామం, శత్రుత్వం ఇవన్నీ అహంకారం యొక్క వికారాలే కదా! ఇక భక్తికి తావెక్కడ? అది ఈ కథ యొక్క సారాంశం.

ఇక వీరిద్దరూ కూడబలుక్కున్నారు. తమ కిష్టమైన సత్యభామ, ఎట్లాగూ దక్కలేదు. ఇక మణిని అపహరించాలని పన్నాగం పన్నారు. దుర్మార్గుడైన శతధన్వునితో చేతులు కలిపారు."

అందరికీ సామాన్య శత్రువు సత్రాజిత్తే. ఇపుడు కృష్ణుడు లేడు, మనం వెళ్ళి సత్రాజిత్తును చంపి మణిని దొంగిలిద్దాం అనే నిశ్చయానికి వచ్చారు.

ఎదురుపడి యుద్ధం చేయడం కాదు. దొంగచాటుగా శతధన్వుడు సత్రాజిత్తును చంపివేసాడు. మణిని దొంగిలించాడు.

ఇక సత్యభామ, తన భర్త హస్తినాపురం నుండి ఎప్పుడు తిరిగి వస్తాడా అని ఎదురు తెన్నులు చూసింది. తండ్రి మరణానికి రోదించింది. ఎప్పుడు శతధన్వుణ్ణి తన భర్త చంపుతాడా అని తహతహలాడింది.

రోగాలను పోగొట్టేది, భాగ్యాన్ని కల్గించే మణి, ఎన్ని కష్టాలను తీసుకొని వచ్చిందో గమనించారా? కష్టం వెంట సుఖం కష్టం తరుముకు వచ్చిందే! మణిని రక్షించాలంటే పరమ పవిత్రంగా ఉండాలి కదా! అందుకే సూర్యుడీ నియమాన్ని పెట్టాడు. దుష్టమైన ఆలోచనలు రాకూడదు. అందునా కృష్ణుని పట్ల అపచారమా? ప్రసేనుడు, శారీరకమైన అశుచివల్ల పోగొట్టుకున్నాడు. మానసికమైన అశుచివల్ల సత్రాజిత్తు పోగొట్టుకున్నాడు. చిరంజీవియైన జాంబవతుని దగ్గరే మణి కలకాలం ఉండలేదు. అతడేమో సింహాన్ని చంపాడు కదా! ఇట్టి చరిత్రను చూపించే మణి శతధన్వుడి దగ్గర కలకాలం ఉంటుందా? అతడు యజమానినే క్రూరంగా చంపి గ్రహించాడు కదా!

మరల విజయం - మరీ నింద

కృష్ణుడు తిరిగి వచ్చి దుఃఖించే భార్యను చూసాడు. మామగారి మరణం కలత పెట్టింది. కక్షను పెంచింది.

చిరంజీవియైన జాంబవంతుణ్ణే ఓడించిన కృష్ణుడు తనను క్షమిస్తాడా అని శతధన్వుడు పలాయనం చిత్తగించాడు. ద్వారకనుండి వెళ్ళిపోయాడు.

పోతూ పోతూ మణిని అక్రూరుని దగ్గర ఉంచాడు. ఆ మణిని కృష్ణుని పాదాల దగ్గర నుంచితే క్షమించి యుండేవాడు కదా! ఆమలిన మనస్సు అట్లా చేయిస్తుందా? ఈ పరుగెత్తడం కృష్ణుని పరాక్రమానికి దోహదపడింది. తన దగ్గర ఎందుకు పెట్టుకోలేదు? కష్టాలు వస్తాయని విన్నాడు. చూసాడు కాబట్టి ఈ కష్టాలను అక్రూరునకు బదిలీ చేసాడన్నమాట. మొండి పట్టుదల, శత్రుత్వం, దుష్టబుద్ధి, ఇట్టి పనులను చేయిస్తుంది. అక్రూరుడు మంచివాడు కనుక అతని దగ్గర ఉంటే క్షేమమని భావించాడు. పైగా అతడు కృష్ణుడు భక్తుడు.

పరుగెత్తే శతధన్వుణ్ణి చూసి నిజంగా కోపపడలేదు కృష్ణుడు. అతడు ధర్మ సంస్థాపకుడు కదా! కోప పడినట్లు నటించాడు. బలరామునితో కలిసి ఈ రథంపై వెళ్ళి శతధన్వుణ్ణి పట్టుకోబోయాడు.

శతధన్వుని గుఱ్ఱం అలిసిపోయి చనిపోయింది. ఇక పిక్కబలం చూపించాడు. బలరాముడు రథంలోనే ఉండిపోయాడు. ఇద్దరూ కలిసి ఒకణ్ణి ఓడించకూడదనే నియమాన్ని పాటించాడు.

భగవానుడు శతధన్వుని జుట్టు పట్టుకున్నాడు. కొంతసేపు ముష్టియుద్ధం జరిగింది. భగవాని ముందు అతడు నిలబడగలడా? ఇతని చేతిలో చంపబడడమూ అతడు చేసుకొన్న అదృష్టమే అనాలి. అట్లా సద్గతి కల్గించాడు కృష్ణుడు.

ఇట్లా జాంబవంతుణ్ణి ఓడించడం, ఇతణ్ణి చంపడం జరిగినా నీలాప నిందలు మళ్ళీ మొదలు. మణికోసం అతని శరీరాన్ని తడిమితే దొరకలేదు. ఎందుకంటే అది అక్రూరుని దగ్గర ఉంచాడు కాబట్టి గీతలో భగవానుడేమన్నాడు?

వేదాహం సమతీతాని వర్తమానాని చార్జున
భవిష్యాణి చ భూతాని మాంతు వేద న కశ్చన (7-26)

అనగా "ఓ అర్జునా! గతంలో ఏం జరిగిందో, వర్తమానంలో ఏం జరుగుతుందో, భావికాలంలో ఏం జరగబోతుందో అన్నీ నాకు తెలుసు. కాని నన్ను తెలుసుకొన్న వాడెవ్వడూ లేడు". ఇట్లా అన్నవాడే ఏమీ తెలియనట్లు నటించి శతధన్వుని దగ్గర మణి యుందని భావించాడు. మరొక అవతారమైన అన్నగారికి దొరకలేదని నివేదించాడు.

ఇట్లా మానవులు వేసే నిందలను భరించాడు. అంతేకాదు అన్నగారి కోపాన్ని భరించాడు. అతణ్ణి చంపాను, అతని దగ్గర మణి లేదన్న మాటలు అన్నగారు నమ్మాడా? కారాలూ, మిరియాలూ నూరాడు.

"నేనేదో మణిని అడుగుతానని నా దగ్గర బుకాయిస్తున్నావు ఎక్కడో దాచి యుంటావులే. ఋజుమార్గంలో వెళ్ళేవారు నీతో సఖ్యంగా ఉండలేరని" అన్నాడు.

"ఇట్లా నన్ను సందేహించకు, నువ్వే నన్ను శంకిస్తే ఎలా? నేను చెప్పింది నిజం. నన్ను వెదికి చూడు, నీకే తెలుస్తుందని" అన్నాడు కృష్ణుడు.

బలరాముని ఆగ్రహం ఒక పట్టాన చల్లారేది కాదు. ఎవరి మాటలనూ వినడు. నిన్ను వెదకడమేమిటి? టక్కుటమార విద్యలన్నీ నీకు తెలుసు, పచ్చి మోసగాడివని నిందించి నీ దగ్గర ఒక్క క్షణం ఉండనని బలరాముడు ద్వారకకు తిరిగి రాక విదేహ రాజ్యానికి వెళ్ళిపోయాడు.

ద్వారకకు తిరిగి వచ్చాడు కృష్ణుడు. ఇట్లా అవమానాలూ, నిందలూ ఇంకా ఎక్కువయ్యాయి. మణిపట్ల లోభంతో అన్నగారినే తరిమేసాడని లోకులన్నారు. లోకులు పలుకాకులు కదా!

ఇతరుల గుణాలను శ్లాఘించడానికి బదులు లోపాలనే ఎత్తి చూపిస్తూ ఉంటాం. మనం కూడా పత్రికలను చదువుతూ ఇష్టమైన నాయకుల్ని

పొగుడుతూ ప్రతిపక్షాలను నిందిస్తూ ఉంటాం కదా. ఇట్టి మానవ ప్రవృత్తి యొక్క వికారాలు పురాణాలలో పుష్కలంగా ఉన్నాయి.

అక్రూరుడు - మణి

కృష్ణుడి రాక అక్రూరునకు దడ పుట్టింది. ఎప్పుడూ కృష్ణునితో కలిసిమెలిసి యుండేవాడేమో. ఇప్పుడు దూరదూరంగా ఉంటున్నాడు. తేలుకుట్టిన దొంగలా, ద్వారకనుండి చల్లగా జారుకున్నాడు. శంకరులే మన్నారు? అర్థమనర్థం భావయ నిత్యం అని అనలేదా? డబ్బెంత పని చేస్తోందో చూసారా? ఎన్ని అనర్థాలను తీసుకొని వస్తుందో!

అయితే అనవసరమైన భయాందోళనలున్న అక్రూరునకు కృష్ణునిపై అచంచల భక్తి విశ్వాసాలున్నాయి. ద్వారకను విడిచి కాశీయాత్రకు బయలుదేరాడు.

కాశిలో అడుగు పెట్టగానే సద్బుద్ధి కలిగింది. స్వార్థం కోసం మణిని వాడుకోవాలని భావించలేదు. ఎప్పటి మాదిరిగానే ఎనిమిది బారువుల బంగారాన్ని మణి ఇస్తూ ఉండేది. స్వార్థం కోసం వాడక దానితో ఆలయాలను కట్టించాడు. దైవకైంకర్యమే చేసాడు.

ఇతడు సదాచార సంపన్నుడని మణికి తెలుసు. ఇది బంగారాన్ని ఇయ్యడమే కాదు. చుట్టుపక్కల రోగాలు లేకుండా కూడా చేసింది. కఱువు కాటకాలు లేవు. పుష్కలంగా పాడిపంటలు, అంతటా సుఖశాంతులే.

నిందకు కారణం - నేరాలు

ఇట్లా అనేక సంఘటనలచే కృష్ణుని చిత్తం కకావికలమైంది. "ఈ మణివల్ల ఇన్ని కష్టాలా? ఇది ప్రసేనుణ్ణి, సత్రాజిత్తును, శతధన్వుడిని మ్రింగివేసిందే! ఇప్పుడు నా సోదరుడే నన్ను శంకిస్తున్నాడు! దేశంవిడిచి పెట్టి వెళ్ళాడు.

అక్రూరుడు కనబడడం లేదేమిటి. ఒకవేళ అతనిదగ్గర ఉందా? అతడీ నగరంలో లేకపోవడమూ శుభశకునంగా భావించడం లేదు. తండ్రి పోవడం వల్లనే కదా సత్యభామ కుమిలిపోతోంది? నగరం అంతా నన్ను సందేహిస్తోంది. మాటిమాటికీ నిందలేమిటి?" అని కృష్ణుడు చింతిస్తూ ఉండగా ఇంతలో నారద మహర్షి వచ్చాడు. ఎక్కడకు, ఎప్పుడు రావాలో నారదునకు బాగా తెలుసు. ఆయన కథను మలుపు త్రిప్పగల నేర్పున్నవాడు.

కుశల ప్రశ్నలయ్యాయి. నీవు దేవర్షివి, నీకు తెలియనిది ఏమీలేదు. నాకు వచ్చిన సమస్యను పరిష్కరించు, కారణం చెప్పుమని కృష్ణుడడిగాడు.

ఏమీలేదయ్యా! నీవు భాద్రపదచవితి నాటి చంద్రుణ్ణి చూసావు కదా, విఘ్నేశ్వరుని శాపం తగిలిందయ్యా అన్నాడు నారదుడు.

భాద్రపదం - పంచాంగంలో భేదాలు

భాద్రపదమనగా జంట నక్షత్రాలతో ఉన్నది. పూర్వ భాద్రమని, ఉత్తర భాద్రమని. ఒక్కొక్కప్పుడు ప్రోష్ఠపదమని పిలువబడుతాయి. ఈ నక్షత్రాలలో ఏదో ఒకటి పూర్ణచంద్రునితో కలియగా దీనిని భాద్రపద మాసమని అంటారు. నక్షత్రాన్నే పేర్కొంటే అది ప్రోష్ఠపదమనే. ఇట్లా అన్ని నెలలు కూడా నక్షత్రం పేరుమీదుగానే ఉన్నాయి. ఒక్కొక్కసారి ఇది ఒక మాసం ముందుగా గాని ఆలస్యంగా గాని జరుగవచ్చు. నిజానికి సూర్యుడెప్పుడైతే ఆ నక్షత్రంలో సంక్రమణం చేస్తాడో అప్పుడు ఆ మాసం మొదలౌతుంది. అయితే ఈ సూర్యుని స్థితి, మరియు చంద్రుని స్థితి ఒక నక్షత్రంలో ప్రవేశించినపుడు సంబంధం లేకుండా ఉంటుంది. సూర్యుని ప్రవేశం ద్వారా మాసము లేర్పడడాన్ని సౌరమాసమని అంటారు. తమిళనాడులో ఈ పద్ధతిని పాటిస్తారు. కర్ణాటక, ఆంధ్ర, ఉత్తర భారత దేశంలో ఎక్కువమంది చాంద్రమానాన్ని పాటిస్తారు. ఈ చాంద్రమానంలో అమావాస్య తరువాత వచ్చే రోజును క్రొత్తమాసానికి

మొదటిరోజుగా పరిగణిస్తారు. ఇదంతా చంద్రగమనాన్ని బట్టి యుంటుంది కనుక పున్నమి నాటి చంద్రుడు ఏ నక్షత్రానికైతే అతి సమీపంలో ఉన్నాడో ఆ నక్షత్రం పేరుతో మాసం మొదలౌతుంది.

అన్ని పండుగలు చాంద్రమానం ప్రకారం నిర్ధారించబడతాయి. కనుక వినాయక చవితి, భాద్రపదమాసంలో శుక్ల చతుర్థినాడే. తమిళులకు మాత్రం భాద్రపదంలోగాని లేదా శ్రావణంలోగాని రావచ్చు. ఒకొక్కసారి సూర్యుడు కన్యారాశిలో ప్రవేశించడానికి అమావాస్య తరువాత నాల్గు రోజులు పట్టవచ్చు. అటువంటప్పుడు తమిళులకు వినాయకచవితి శ్రావణమాసంలోనే వస్తుంది. ఎందుకనగా సూర్యుడు కన్యారాశిలో ప్రవేశించినపుడు మాత్రమే వారికి భాద్రపదమాసం మొదలౌతుంది. అదేవిధంగా శ్రీరామనవమి కూడా చాంద్రమానాన్ని అనుసరించేవారికి చైత్రమాసంలోనూ తమిళులకు ఫాల్గుణ లేదా చైత్ర మాసాలలోనూ వస్తూ ఉంటుంది. అట్లా గోకులాష్టమి కూడా.

నారదుడిక్కడ చెపుతున్నది చాంద్రమాన భాద్రపద శుక్ల చతుర్థి గురించి. ఇదే వినాయకచవితి. కృష్ణుడట్టి ఒక్క చవితినాడు చంద్రుణ్ణి చూసాడు.

ఆనాడు చంద్రుణ్ణి చూసావని నారదుడన్నాడు. ఎప్పుడది? ప్రసేనునితో అడవికి వెళ్ళడం, విడిపోవడం జరిగిననాడే. ప్రొద్దు పోయిందని ఆకాశం వంక చూసాడు కృష్ణుడు. తిరిగి ఇంటికి వచ్చాడు. ఇట్లా చూడడం వల్ల విఘ్నేశ్వరుని శాపానికి గురి కావలసి వచ్చిందని అన్నాడు.

ఆనాడు చూస్తే దురదృష్టం ఎందుకు వెంటాడుతుందని కృష్ణుడు ప్రశ్నించాడు. నారదుడు కథను చెప్పడం మొదలు పెట్టాడు.

ప్రశ్న-సమాధానం: కథలో కథ

ఎవరో ఒకరు ప్రశ్న వేయడం, మరొకరు సమాధానం చెప్పడం అనే

పద్ధతి పురాణాలలో ఉంటుంది. సాధారణంగా నైమిశారణ్యంలో సూతుణ్ణి మిగిలిన ఋషులు ప్రశ్నిస్తూ ఉంటారు. అట్లాగే పరీక్షిత్తుకు శుకమహర్షి చెప్పడం భాగవతంలో ఉంటుంది. ఇక ఇతిహాసాలు చూస్తే మహోత్తమ గుణ సంపన్నుడెవరని వాల్మీకి అడిగిన ప్రశ్నకు నారదుడు ముందుగా రామచరితాన్ని గానం చేసాడు. దానినే వాల్మీకి విస్తారంగా వ్రాసి లవకుశులకు చెప్పగా అశ్వమేధ మహామంటపంలో కూర్చొని యున్న రామునికి ఎదురుగా వారు గానం చేసారు. ఇక నైమిశంలో సూతునిచే మహాభారతం చెప్పబడింది. ఆదికావ్యంగా పరిగణింపబడిన రామాయణానికి, నైమిశంలోని ఋషులకు సంబంధం లేదు. భారత కథ వైశంపాయనుడు జనమేజయునకు చెప్పబడినట్లుగా ఉంది. జనమేజయుడు పాండవుల మనుమడు. దానిని ఇతిహాసంగా వ్యాసుడు మలచగా విఘ్నేశ్వరుడు వ్రాయసకాడయ్యాడు.

ఆ పెద్ద ఇతిహాసంలో భిన్నభిన్న వ్యక్తులు ప్రశ్నించగా నారదుడు, అగస్త్యుడు, మార్కండేయుడు, మొదలైనవారు ఉపాఖ్యానాల రూపంలో సమాధానాలు చెప్పారు. రామాయణంలోని ఉత్తరకాండను చూస్తే రావణ వంశానికి చెందిన అన్ని కథలు అగస్త్యుడు రామునకు చెప్పినట్లుంటుంది.

అగస్త్యుని ప్రశ్నకు హయగ్రీవుడిచ్చిన సమాధానమే లలితోపాఖ్యానం. అది బ్రహ్మాండ పురాణంలో ఉంది. భారతంలో చాలా ఉపాఖ్యానాలున్నాయి. పాండవులు వివిధ ఋషులను ప్రశ్నించడం, వారు ఉపాఖ్యానాల రూపంలో సమాధానాలివ్వడం ప్రధానంగా అరణ్యపర్వంలో ఉంటుంది. చవితినాడు చంద్రుణ్ణి చూస్తే దోషమేమిటని కృష్ణుడు వేసిన ప్రశ్న స్కాందంలో ఉంది. ఈ కృష్ణ నారద సంవాదానికి సమగ్ర సమాధానం నందికేశ్వర సనత్కుమార సంవాదంలో ఉంది.

చంద్రగర్వ భంగం

మూషిక వాహనం ఎక్కి మహాగణపతి మూడు భువనాలు తిరుగుతున్న సమయంలో ఒకమారు చంద్రలోకానికి వెళ్ళాడు. శశివర్ణుడు శశి (చంద్రుడు) లోకానికి వెళ్ళాడన్నమాట. పిల్లలందరికీ చంద్రుడంటే ఇష్టం కదా!

తానందగాడని చంద్రునకు గర్వం హెచ్చు. భగవంతుని ముఖాన్నే చంద్రునితో పోలుస్తారు కవులు. ఇందువల్ల గర్వం నెత్తికెక్కింది. ఈ స్తుతులకు అలవాటు పడినవానికి మిగతావారందరూ తక్కువగా కనిపిస్తారు. అందమైన పిల్లవాని రూపంలో ఉన్న వినాయకుడు, ఇతని దృష్టిలో ఎందుకూ పనికి రానివాడు.

ప్రేమ, శాంతి, వివేకంగల గజముఖం, విశాలమైన చెవులు, బొజ్జ, చిన్ని కాళ్ళు - వీటిని మరీ మరీ చూడాలనిపిస్తుంది కదా! ఎవరితోనైనా పోల్చగలమా అని భావిస్తాం. మన భావాలకు విరుద్ధంగా ఈ పొట్టేమిటి? ఈ తుండమేమిటి? చేటంత చెవులేమిటి? కడవ వంటి బొజ్జ ఏమిటి? కురుచ కాళ్ళేమిటి? అని నిరసన భావంతో చూసాడు చంద్రుడు. ఏవి భక్తికి ప్రీతిపాత్రంగా ఉంటాయో అవే ద్వేషించేవారికి హేయవస్తువులు. చంద్రుడీ రూపాన్ని చూసి పకాలున నవ్వాడు.

వెంటనే వినాయకునకు కోపం వచ్చింది. అది ధార్మికమైన కోపం. అపమార్గంలో నున్నవారిని శిక్షించేది. అంతేనే కాని అహంకారంతో కూడినది కాదు.

హే చంద్ర! చల్లని కాంతిని ప్రసరిస్తున్నావు. నయనానందకరంగా ఉంది. కవులు నిన్ను పొగుడుతున్నారు. ఆ తెల్లని కాంతి నీ సొంతమా? సూర్యకాంతిని అప్పుగా తీసుకున్నావు కదా! నీ కాంతి ప్రసరించని చోటు అంధకార బంధురంగా ఉంటుందని ఎప్పుడైనా భావించావా?

దానినినట్లా ఉంచు. అందంకంటె శీలం ప్రధానం కదా! నీవు చేసిన 'నిర్వాకం' ఏమిటి? భార్యల పట్ల పక్షపాతం చూపించలేదా? దక్షుని శాపం వల్ల కృశించి పోతున్నావు కదా! 27 నక్షత్రాలలో రోహిణి పట్ల మక్కువ చూపించడం, దక్షుని శాపం తెలిసిందే కదా. నిన్ను ఉద్ధరించినవాడు నా తండ్రియైన శివుడని గుర్తుందా? తదియనాటి చంద్రుణ్ణి శిరస్సునధరించి క్రమక్రమంగా కృష్ణపక్షంలో కృశించి పోవడాన్ని నా తండ్రి అడ్డుకోలేదా? మాసంలో శుక్లపక్షంలో క్రమక్రమంగా పుంజుకొంటావనే భరోసా ఇచ్చాడు కదా. నా తండ్రి అనుగ్రహమొక పక్షంలో మరొక పక్షంలో, నీ తప్పిదమూ గుర్తుకు రావడం లేదా? ఇక నీ గురుపత్నిని ఏం చేసావో అందరికీ తెలుసు. అది పైకి చెప్పలేని సంగతి. ఇవన్నీ తెలిసి ఏదో చల్లని కాంతిని ప్రసరిస్తున్నావని ఈ మిడిసిపాటేమిటి?

ఇకనుండి నీ అందాన్ని చూడడానికి ఎవ్వరూ ముందుకు రారు. ఒకవేళ చూస్తే వారికి నీ కళంకం అంటుకొంటుందని శపించాడు.

శాప ఫలం

తాము అందంగా అందరి కంటే ఉన్నామని గర్వించిన వారికి శిక్ష ఏమిటి? వారి ముఖాన్ని చూడకుండా ఉంటే అదే చాలు కదా. నీ కన్నులకు గ్రుడ్డితనం వస్తుందనో, శిలగా పడియుండమనో శపించలేదు. నిన్ను చూసిన వారికే కళంకం, నింద కల్గుతాయని అన్నాడు. ఈ పద్ధతి బాగా ప్రభావాన్ని చూపిస్తుంది. నాకీ నింద పడింది, నేను చంద్రుణ్ణి చూడడం వల్లనే కదా అని మాటిమాటికీ నిందిస్తూ ఉంటారు కదా!

మరొక కారణాన్ని ఊహించవచ్చు. ప్రజలలో గ్రుడ్డిగా తమకు నచ్చిన నాయకుణ్ణి పొగుడుతూ ఉంటారు. శీలాన్ని పట్టించుకోరు. ఇట్టి సాధారణ జనుల మనః ప్రవృత్తిని గమనించి అట్లా శపించి యుంటాడు.

మదమెక్కి గర్వంతో చూసేవాళ్ళ ముఖమెత్తి చూడకుండా ఉండడమే తగిన శిక్ష. అట్టివారిని పొగడడం, వీళ్ళ శీలాన్ని కళంకితం చేసుకోవడమే.

చంద్రుడు సిగ్గుతో తల దించుకున్నాడు. భయపడ్డాడు. తనవెవ్వరూ చూడడం లేదు. ఎవరైనా చూసినా శాపం వల్ల వారికి నీలాపనిందలు వస్తున్నాయి. సిగ్గుపడి తాను పుట్టిన సముద్రంలో మునిగిపోయాడు.

శాప విముక్తి

చంద్రుడు లేకపోతే రాత్రిళ్ళు ప్రజలకు గడవడం కష్టమైంది. ఓషధులుండాలన్నా చంద్రుడుండవలసిందే. అన్నిచోట్లా రోగాలు ప్రబలు తున్నాయి. ఓషధులు లేవు. ఇంతవరకూ చల్లని వెన్నెలనుభవించిన వారు నిరుత్సాహంలై యున్నారు.

ప్రజల పట్ల జాలిపడి దేవతలు, ఋషులు బ్రహ్మను వేడుకున్నారు.

ఏదైనా కష్టం వస్తే త్రిమూర్తులలో బ్రహ్మ దగ్గరకువెళ్ళడం ఆనవాయితీ. సాధారణంగా ఆయనే పరిష్కరిస్తూ ఉంటాడు. తనకు సాధ్యం కాకపోతే శివుని దగ్గరకో, విష్ణువు దగ్గరకో వెళ్ళండని చెబుతూ ఉంటాడు.

శాపం తొలగించండని అడిగారు. మహాగణపతి శపిస్తే నేనెట్లా తొలగించనయ్యా! పరమేశ్వరుడే త్రిప్పలేదు, నేనెంత? ఎవరు శపించారో వారి దగ్గరకు వెళ్ళండని బ్రహ్మ అన్నాడు. ప్రత్యేకమైన పూజ చేయండి, మోదకాలు సమర్పించండి, అతని గుండె కరిగి మీకు సరియైన మార్గాన్ని చూపిస్తాడని అన్నాడు.

సాధారణంగా వ్రతమంటే పగలు తిని రాత్రియందు తినకుండా ఉంటారు. ఈ పద్ధతి కొన్ని వ్రతాలలో తలకిందులుగా ఉంటుంది. పగలు ఉపవాసం ఉండి, పూజ చేసుకుని రాత్రియందు భుజించే వాటినీ వ్రతాలని అంటారు.

నక్తం అంటే రాత్రి. Nocturnal అనే పదం దీనినుండే వచ్చింది. ఒక్కొక్క దేవతకు ఒక్కొక్కటి ప్రీతి.

శివునకు అభిషేకం. విష్ణువునకు అలంకారము; వినాయకునకు నైవేద్యము ప్రీతి. ఇతడు పిల్లవాడు కదా! పిల్లలకు తిండిపై ధ్యాస ఉంటుంది. హాని చేస్తుందని తెలియకపోయినా ఏది పడితే దానిని నోట్లో పెట్టుకుంటారు. ఏవో తినుబండారాలిచ్చి వాటిని తీసివేస్తాం. కనుక కడుపునిండా అతనికి నైవేద్యం పెట్టాలి. అవ్వైయార్ అనే గణపతి భక్తురాలు, మొదట ప్రార్థనలో నైవేద్యాల గురించే చెప్పింది.

బ్రహ్మ సలహా ననుసరించి దేవతలందరూ పూజలు చేసారు. సముద్రంలో... చంద్రుణ్ణి చూసి నీ తప్పు నీవు తెలుసుకోవాలయ్యా, మా పూజలకంటె ఇది చాలా ముఖ్యం, అపుడు వినాయకుడూ నీమీద జాలి పడతాడని అన్నారు.

కోపంతో ఊగిపోయేవారికి వినయం, దుఃఖం ఒక్కొక్కప్పుడు వివేకాన్ని కల్గిస్తాయి. గుణపాఠం నేర్పుతాయి.

చంద్రుడిన్నాళ్ళూ కుమిలిపోయాడు. దేవతలతో కలిసి ఇతడూ వినాయకుణ్ణి పూజించాడు.

గణేశుడు సాక్షాత్కరించాడు. శూర్ప కర్ణాలతో అనగా చేటంత చెవులతో వారి విన్నపాన్ని విన్నాడు. వినయ భరితుడై తనను క్షమించుమని చంద్రుడు వేడగా ఉదార హృదయంతో అతణ్ణి క్షమించాడు వినాయకుడు.

శాపాన్ని కాస్త సడలించాడు. "నా నోటి నుండి వచ్చిన వాక్కు వ్యర్థము కాదు, పూర్తిగా వెనుకకు తీసుకోవడమూ కుదరదు. జ్ఞానం, డబ్బు, అధికారం కలవారి గర్వం పోవాలంటే వారిని ఉపేక్షించడం, వారివైపు కన్నెత్తి చూడకుండా ఉండడమే ఉచితం. ఇతని కథ, అట్టివారికి గుణపాఠంగా ఉండాలి. కనుక ఒక్కరోజున, భాద్రపద శుక్ల చతుర్థినాడు మాత్రం ఎవ్వరూ ఇతణ్ణి చూడకూడదు. ఈ మాటను తిరస్కరించినవారు నీలాపనిందకు గురి వలసి వస్తుంది సుమా"!

కనుక సంవత్సరంలో ఒక్కరోజున మాత్రమే ఈ నియమం పెట్టాడు.

భాలచంద్రుడు

చంద్రునికి వేసిన శిక్షను తగ్గిస్తూ ఇంకా ఉదార హృదయంతో అతనికి గౌరవాన్ని ప్రసాదించాడు. నెలవంకను తన కిరీటంపై ధరించాడు కూడా.

శంకరుని మాదిరిగానే, అమ్మవారికి, గణపతికి ఇట్లా నెలవంకను ధరించడం ఉంది.

దీనివల్ల గణపతి, భాలచంద్రుడయ్యాడు. ఇతని 16 నామాలలో ఇది యొకటి. చాలామంది దీనిని బాలచంద్రుడని అనుకుంటారు. అనగా చిన్న చంద్రుడని అది 'బ' కాదు. 'భ'. భాలయనగా నుదురు. ఫాలయని కూడా అనవచ్చు. ఇట్లా ఉచ్చరిస్తే నుదుటిపై కొంత జుట్టున్న భాగం తోస్తుంది. శిల్పాలలో ఈశ్వరునికి జటాజూటంపై ఎడమవైపున ప్రక్కగా చంద్రరేఖ కన్పిస్తుంది. తిన్నగా కాదు. కనుక పరమేశ్వరుడు ఫాలచంద్రుడే. భాలచంద్రుడనే పదానికి అతికినట్లుంటాడు గణపతి.

చంద్రునకు, ఈశ్వరునకు తిన్నగా సంబంధం లేదు. చంద్రుణ్ణి క్షమించడం శివుని కథలో ప్రధానం కాదు. చంద్రుడు తన భార్యల పట్ల వివక్షత చూపించాడు కనుక శిక్షింపబడ్డాడు, క్షమాపణ కోరాడు, క్షమింపబడ్డాడు కూడా.

కాని గణపతిని ప్రత్యక్షంగా అవమానించాడు చంద్రుడు. కనుక ఇతడు చంద్రుణ్ణి క్షమించడం లోనే విశేషం దాగియుంది.

మనం ఎవరినైనా స్తోత్రం చేస్తూ ఉంటే ఏమిటయ్యా, నెత్తిన పెట్టుకొని ఊరేగుతున్నావేమిటని అంటాం కదా. గణపతి, చంద్రునిపై దయ చూపించి నృత్యం చేసాడు. అతనికి నృత్త గణపతి అని కూడా పేరు.

చంద్రుణ్ణి గణపతిని ఎంతసేపు చూసినా తనివి తీరదు. ఒకరు ఒకరి నెత్తిపై కూర్చొనియుండగా ఒకనియందం మరొకనికి సంక్రమించినట్లుంటుంది.

సంకట హార చతుర్థి

స్వామి, చంద్రునికి మరొక గౌరవాన్ని కల్గించాడు. ప్రతి దేవతకు, తిథికి సంబంధం ఉంది. ప్రతి నెలలో రెండుసార్లు శుక్ల కృష్ణ పక్షాలలో తిథి వస్తుంది. ఒక్కొక్క తిథితో సంబంధం ఉంటుంది. కుమార స్వామికి శుక్ల పక్ష షష్ఠితోనే సంబంధం. శివునకు కృష్ణ చతుర్దశితోనే. దానినే మాస శివరాత్రి అని అంటారు. రామునకు శుక్ల నవమితో. కృష్ణునకు కృష్ణపక్ష అష్టమితో. (నల్లని కృష్ణునకు, తెల్లని శివునకు కృష్ణ పక్షంతోనే బంధం) అమ్మవారికి పూర్ణిమతో. అది శుక్ల పక్షంలోనే వస్తుంది. కాని మన గణపతికి శుక్ల, కృష్ణ పక్షాలతో సంబంధం ఉంది.

ఆయన అవతరించింది శుక్ల చతుర్థినాడు. అందుకే వినాయక చవితియని యుంటాం. ఈ శుక్లచతుర్థిని అన్ని మాసాలలోనూ ఆచరించవచ్చు. ఇంకా సంకటహర చతుర్థి కూడా ఉంది. అనగా కష్టాలను పోగొట్టే చతుర్థి. (హర అనే పదాన్ని విడిచి సంకట చతుర్థియని కూడా వాడుతూ ఉంటారు). ఇది కృష్ణ పక్షంలోనే వస్తుంది. శుక్లపక్షంలో కాదు.

ఇది ఎట్లా వచ్చింది? ఆనాడే చంద్రుణ్ణి క్షమించాడు. శుక్ల చతుర్థి నాడు చూడకూడదనే నియమం ఉంది కదా! బాధ పెట్టానని భావించి కృష్ణ పక్షంలోనూ ఇతణ్ణి పూజించాలని దయతో ఈ నియమాన్ని ఏర్పాటు చేసాడు. ఇట్లా ప్రకటించాడు కూడా. నన్ను కృష్ణ పక్షంలో పూజించినవారికీ అన్ని కష్టాలను పోగొడతాను. ఆనాడే రోహిణితో కూడిన చంద్రుణ్ణి నా పూజతో బాటు పూజించాలి సుమా అన్నాడు. ఇట్లా రోహిణిపై పక్షపాతం చూపించిన చంద్రుని పట్ల జాలి చూపించాడు.

కృష్ణుడు-చంద్రుడు

కృష్ణునికి సంబంధించిన గోకులాష్టమి పూజలోనూ చంద్రునకు అర్ఘ్యం ఉంటుంది కూడా. ఇట్లా కృష్ణుడు చంద్రుణ్ణి కూడా పూజించాలనే నియమాన్ని పెట్టియుంటాడు, విఘ్నేశ్వరుడు దయ చూపించినట్లుగా.

మరొక కథ ఇతనితో సంబంధం ఉంది. రాముడు సూర్యవంశంలో పుట్టి రవికుల తిలకుడని, ఇనకుల తిలకుడని పేరు గడించాడు. అంటే సూర్యునకు ప్రాధాన్యం ఇచ్చి చంద్రునకు అప్రాధాన్యం ఉన్నట్లే కదా. రాముని దగ్గరకు వెళ్ళి నన్నెట్లా విస్మరించావయ్యా అని విలపించాడు. బాధపడకయ్యా, నా పేరు చివర నీ పేరు నుంచుకొని ఇక రామచంద్రుడని పిలువబడుతానులే, అన్నాడట. అంతేకాదు, మరొక అవతారంలో చంద్రవంశంలోనే పుడతానని అన్నాడట. అందువల్ల కృష్ణుడు, చంద్రవంశంలో అవతరించాడు. చంద్రుడికి అర్ఘ్యం ఇచ్చేటట్లు చేసాడు. కనుక కృష్ణాష్టమి రోజున చంద్రునకు అర్ఘ్యం ఇయ్యాలి.

నింద పోగొట్టడానికి వరం

మరొకవిధంగానూ సత్కరించాడు గణపతి. సంకటహర చతుర్థినాడు తనతో చంద్రునికి పూజ చేయాలని చెప్పడమే గాక ఆ తిథికి ముందున్న తిథినాడు చంద్రుణ్ణి చూస్తే మంచిదని కూడా అన్నాడు. అమావాస్య తరువాత వచ్చే పాడ్యమినాడు చంద్రుణ్ణి చూస్తే చవితినాడు చూసిన దోషం తొలగిపోతుందనే నియమాన్ని ఏర్పాటు చేసాడు.

ఆ చవితి ముందున్న తదియనాడు చూడాలి. ఈ రోజే ఈశ్వరుడు, అమ్మవారు, గణపతి కూడా చంద్రరేఖను నెత్తిపై ధరించారు. అమావాస్య తరువాత వచ్చిన పాడ్యమిలో చంద్రుడు మసక మసకగా కన్పిస్తాడు.

విదియనాడు కన్పిస్తాడు. దానిని చంద్రదర్శనమని పంచాంగాలలోనూ ఉంటుంది. ఆ తదియనాడు చూడడాన్ని మరిచిపోయాం. లోకంలో చవితినాడు చూస్తే బాధలు పడవలసి వస్తుందనే నానుడి మాత్రం ఏర్పడింది. అమావాస్య నుండి మొదలు పెడితే నాల్గవ తిథి, తదియ వస్తోంది. *(అట్లా లెక్కబెట్టి చూడడం లేదేమో!)*

ఇట్లా చంద్రుడు – గణపతి కథను వినిపించాడు నారదుడు కృష్ణునికి. నీవు భాద్రపద శుక్ల చవితి నాడు చంద్రుడ్ని చూసావు. వినాయకుని శాపం నీకు తగిలి యుంటుందని అన్నాడు. దానికి విరుగుడుగా చవితినాడు పూజ చేయవలసిందని అన్నాడు.

కృష్ణుడా మాటలను నమ్మి వ్రతం ఆచరించాడు. మేనల్లుడు కదాయని తేలికగా చూడలేదు. అతడు శుక్ల, కృష్ణ పక్ష చతుర్థులను రెంటినీ ఆచరించాడు. లేకపోతే ఇందెవరు గొప్పయని మనం శంకిస్తాం.

శుక్లాంబరధరుడైన గణపతి, కృష్ణుని ముందు సాక్షాత్కరించి నీవు మానవాకారం ధరించావు, ఆదర్శవంతంగా ఉండడానికి నీవూ నియమాలను పాటించవలసిందే. ఇకనుండి నింద తొలగిపోతుందిలే చంద్రుని మాదిరిగా తళతళా ప్రకాశిస్తావులే – అని మేనమామకే వరం ప్రసాదించాడు గణపయ్య.

లీలా ఫలితం - లోకక్షేమం

గణపతితో కృష్ణుడొక విజ్ఞప్తిని చేసాడు. అతనికి లోకక్షేమం కావాలి కదా! "నీవు నా ఎదురుగా కనబడ్డావు, నా సమస్యను తీర్చావు. బాగానే ఉంది. అయితే ఇట్టి బాధలనుండి విముక్తి నాకొక్కడికే చెందకుండా అందరికీ ఉపయోగించే మార్గాన్ని చూపుమని" అన్నాడు.

ఇంతకుముందు గణపతి, చంద్రుణ్ణి ఎవరు చూసినా కష్టాలు పడతారని అన్నాడు కదా. కృష్ణుని మాటలను పురస్కరించుకుని అందరికీ మేలు చేయాలని

ఇట్లా అన్నాడు. "ఆ చవితినాడు చూస్తే నిందలు వస్తాయని లోగడ అన్నాను. ఇక నీ శ్యమంతకమణి కథను ఎవరు చదివినా, విన్నా వెంటనే వారికి వచ్చిన నిందలు పోతాయని ఇప్పుడు వరం ఇస్తున్నా. ఈ చవితినాడు నేనావిర్భవించాను కదా! ఈనాడు ఆ కథ చదివితే చాలని అంటున్నా. నీలాపనిందలే కాదు ఎట్టి మానసిక ఆందోళనలూ ఉండవని అందరూ సుఖశాంతులతో ఉంటారని హామీ ఇస్తున్నానని" గణపతి అన్నాడు.

మానవావతారం ఎత్తినపుడు కష్టాలూ, నష్టాలూ తప్పవు. ఇట్లా లీలగా అనుభవించి కృష్ణుడు, లోకానికి ఉపకరించాడు.

ఒక్క శ్లోకం చాలు

ఇక నీలాపనిందలు తొలగాలంటే మరొక సూక్ష్మోపాయం ఉంది. మొత్తం శ్యమంతకోపాఖ్యానాన్ని చదవడమూ కష్టమే. కనీసం కథపై దృష్టి పెట్టండి. అందొక్క శ్లోకమైనా చదవండి. ఈ శ్లోకాన్నే జాంబవతి పల్కింది, పిల్లవాణ్ణి జోకొట్టే సందర్భంలో. ఈ శ్లోకాన్ని బట్టి రహస్యాన్ని ఛేదించాడు కృష్ణుడు. దీనిని లోగడ పేర్కొన్నాను. అయినా:

సింహః ప్రసేనం అవధీత్ సింహో జాంబవతా హతః

సుకుమారక! మారోదీః తవహ్యేష శ్యమంతకః

ఈ ఒక్క శ్లోకం చదివితే మొత్తం కథ అంతా మదిలో మెదులుతుంది. ఈ శ్లోకంలో రెండవ సగం, మనలనుద్దేశించినట్లుంది చూడండి. ఓయి పిల్లవాడ! ఏడవకుమని అంది. ఈ సుకుమారక అనే పదం మనకూ అన్వయిస్తుంది. తవహ్యేష శ్యమంతకః. మణి నీకొరకే. ఇట్లా వినాయకమణి, కృష్ణమణి మనకే, మనకొరకే ఉన్నాయని భావించండి. వాళ్ళ అనుగ్రహం ఉంటే చీటికీ మాటికీ మనం ఏడవాలా?

వ్రత చూడామణి కల్పంలో వ్రతమెట్లా చేయాలో చెప్పబడింది. ఈ శ్లోకాన్ని తప్పక చదవాలని చెప్పింది.

నింద తొలగింది

ఇక కృష్ణునిపై వేసిన నింద ఎట్లా తొలగిందో చూద్దాం:

ద్వారకలో అనుకోకుండా కఱువు అలముకొంది. అదే సమయంలో కాశీ పట్టణం భాగ్య భోగ్యాలతో కళకళలాడుతూ ఉందనే వార్త వినబడింది. అక్రూరుడక్కడున్నాడని ఆలయ సేవలు చేస్తున్నాడనే వార్తలూ వినబడ్డాయి. కనుక మణి, అక్రూరుని దగ్గర ఉండాలని ఊహించారు.

భగవానుడు సర్వజ్ఞుడు కదా! అతనికి వార్తాహరులు కావాలా? కాని మామూలు మనిషిలా ప్రవర్తిస్తూ ఉంటాడు. ఇట్లా ప్రజల మాటల కనుగుణంగా ఒక వార్తాహరుణ్ణి పంపాడు. ఏమని?

"ద్వారక, నీవు లేకపోతే వెలవెలబోతోంది. కఱవు తాండవించింది, నీవు వెంటనే వచ్చి నీ యదు వంశపు పెద్దరికాన్ని నిలబెట్టుకో, నీ దగ్గర మణియున్నా సరేసరి, సత్రాజిత్తు ఇప్పుడు లేడు, అతనికి ఔరసునిగా మగసంతానమూ లేదు, సత్యభామ తండ్రిని పోగొట్టుకొని విలపిస్తోంది. మణిని గురించి పట్టించుకోవడం లేదు. ఎవరి చేతిలోనో ఆ మణి ఉండటం కంటె నీవంటి సచ్చరిత్రుని దగ్గర ఉండటమే మేలు". కృష్ణుడు ఈ మణిని తీసుకోవడానికి పూర్తిగా అర్హుడైనా తన గురించి చెప్పకుండా అతణ్ణే పొగిడాడు. సందేహం కలగకుండా ఇట్లా ప్రశంసించాడు: "నా అన్నగారు నన్నే శంకిస్తున్నాడు. అతడు శంకిస్తే ఇక జాంబవతి శంకించకుండా ఉంటుందా? నా దగ్గరే ఈ మణి యున్నట్లు జాంబవతి భావిస్తోంది. మొదట తపస్సువల్ల సత్రాజిత్తు సంపాదించాడు కనుక, దానిని దాచివేసి అతని కూతురుకే కట్టబెట్టతాడని

భావించి యుండవచ్చు కూడా. ఇక సత్యభామ, ఈ మణి జాంబవంతుని దగ్గర ఉండడం వల్ల దీనిని జాంబవతికే నేను కట్టబెడతాననీ భావించి యుండవచ్చు. ఇట్లా అందరిలోనూ సందేహాలలుముకున్నాయి. ద్వారకలో ఉన్న రకరకాల ప్రజలు చెవులు కొరుక్కుంటున్నారు. కనుక నీవు బాహాటంగా నీ దగ్గరే ఉందని తెలియపర్చాలి. అంతేకాదు, మన ప్రాంతం కఱవు కాటకాలనుండి దూరంగా ఉండాలన్నా ఆ మణి నీ దగ్గర ఉండవలసిందే" అని కబురు పెట్టాడు కృష్ణుడు.

ఇట్లా ప్రేమను, గౌరవాన్ని చూపిస్తూ వార్తలో లౌక్యాన్ని మేళవించాడు కృష్ణుడు. గమనించారా?

అసలేదో బుద్ధి చలించిందే గాని, అక్రూరుడు పరమ భాగవతుడే. ఈ మాటలను వినగా అతనిలో భక్తి పెల్లుబికింది. వచ్చి కాళ్ళపై బడ్డాడు.

నీ దగ్గరే ఉంచుకో అని భగవానుడన్నా మొత్తం సంపద అంతా లక్ష్మీపతికే చెందాలి కదా. తనకోసం దాచిపెట్టడం పాపమని, ఇది రాజద్రవ్యాన్ని అపహరించడమని పశ్చాత్తప్తుడయ్యాడు, అక్రూరుడు. మణిని తిరిగి ఇచ్చివేసాడు.

"దీనిని బహుమతిగా స్వీకరించవయ్యా, నేను ప్రేమతో ఇస్తున్నా, దానిని తిరస్కరించడం బాగుందా" అని అన్నాడు కృష్ణుడు. "నాపై నింద పోగొట్టుకోవడం కోసం ద్వారక ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలనే నేను నిన్ను రమ్మన్నాను. నీ దగ్గరే ఉంచుకో" అని తిరిగి ఇచ్చివేసాడు.

కృష్ణుడు ద్వారకను నిర్మించాడు. ఉగ్రసేనుణ్ణి సింహాసనంపై కూర్చుండబెట్టాడు. ఇతడు యదువంశ నేత. కనుక అధికారంతో ఉన్నవారు ఇతరులపట్ల ఎట్లా ఉండాలో తెలియపర్చడం లేదా? తాము నిజాయితీతో

ఉండడమే కాదు, నిజాయితీతో ఉన్నట్లుగా కూడా కనబడాలి, లోకులను సంఘాన్ని అవినీతినుండి కాపాడాలి. వారి పవిత్రమైన నడవడిని చూపించాలి కూడా .అందుకే ఆంగ్లంలో 'Ceasar's wife must be above suspision' అనే నానుడి ఏర్పడింది. అందువల్లనే తనపై మోపబడిన నిందను తుడిచివేసుకోవడాన్ని కృష్ణుడు, నానా తంటాలు పడవలసి వచ్చింది. అతడు నిజంగా బాధపడి కాదు. లోకానికి ఆదర్శప్రాయంగా ఉండాలి. నాటకంలో వేషం వేసినవారికి బాధ లేకపోయినా, బాధపడుతున్నట్లు నటిస్తారు కదా!

మణి లేకపోవడం వల్ల కఱవు రావడం, మరల భాగ్యం రావడం, అంతా నాటకంలో భాగమే. అసలు ద్వారకలో కృష్ణుడుండగా మణితో నిమిత్తం లేకుండా భాగ్యం ఉండదా? కఱవు, నాటకంలో ఒక భాగం. తరువాత భాగ్యం రావడమూ అంతే. మణిని ఆధారంగా తీసుకొని ఈ నాటకం ఆడించాడు, ఆ జగన్నాటక సూత్రధారి.

అతడు చెప్పినట్లే అక్రూరుని దగ్గరే మణియుంది. ప్రజలు సత్యం తెలుసుకొన్నారు. లెంపలేసుకున్నారు. కృష్ణుణ్ణి నుతించారు.

బలరాముడూ విదేహ రాజ్యం నుండి తిరిగి వచ్చాడు. ఈ మొత్తం కథను వినిపించారు. కృష్ణుణ్ణి అనవసరంగా శంకించానని బాధపడ్డాడు బలరాముడు.

"మీదేమీ తప్పులేదు. నేను చవితి చంద్రుణ్ణి చూడడమే కొంప ముంచింది. ఇదీ బాగానే ఉంది. దీనివల్ల వినాయకుని గొప్పదనం వెల్లడైంది కదా అని కృష్ణుడన్నాడు. *(అపార సంపద ఒక వ్యక్తి చేతిలో ఉంటే ఎన్ని అనర్థాలు వస్తాయో గమనించారా? ప్రజలందరికీ చెందవలసిన విలువైన సంపద ప్రభుత్వాధీనంలో ఉండాలని ఈ కథ వెల్లడించడం లేదా? సంపద కలకాలం*

ఉండాలంటే శారీరక, మానసిక శుచి తప్పక యుండాలని బోధించడం లేదా? - అనువక్త)

జయంతుల ప్రత్యేకత

సౌర మాన పంచాంగాన్ని అనుసరించే తమిళులు అదృష్టవంతులంటున్నా కారణమేమంటే వీరికి గోకులాష్టమి (కృష్ణ జయంతి), వినాయక చవితి రెండూ శ్రావణ మాసంలో వస్తాయి. ఇతరులకు గోకులాష్టమి, శ్రావణమాసంలో, వినాయక చవితి భాద్రపదమాసంలో వస్తుంది.

ఈ శ్రావణ మాసంలో దోసకాయలు విస్తారంగా పండుతాయి. ఇది సాత్త్వికాహారం కూడా. వండకుండానే పచ్చివాటిని తినవచ్చు. కృష్ణుడు, వినాయకుడు, బాలలీలలను చూపించే కాలమది. వారి జయంతులలో పచ్చి దోసకాయలు వస్తాయి. ఆధ్యాత్మికంగా మనం ఎదగడానికీ.అని తగిన కాలం దోసపండ్లను దేవతలకు నివేదించవచ్చు. మనం తినవచ్చు. మనము చల్లగా ఉండాలని వారు దీవిస్తారు.

సారాంశం

ఈ కథలవల్ల గణపతి, చిన్న పిల్లవాడే కాదు అనేక సందర్భాలలో పెద్దల కంటె పెద్దగా ఉంటాడు. ఎవరికంటె? తన తల్లిదండ్రులు, మేనమామ కంటె కూడా.

పరమేశ్వరునకు, లలితాంబకు రామునకు వచ్చిన ఆటంకాలను పోగొట్టినవాడు, సుబ్రహ్మణ్య వివాహానికి తోడ్పడినవాడు, మన అందరి సమస్యలను తీర్చువాడైన గణపతిని, అందరికంటె పెద్దగా ఉన్నానని నటించేవానిని భజిద్దాం.

దేవతలారాధించిన దేవత

గజవక్త్రుని పూజ వల్ల విజయం

సంవత్సరాదినాడు పంచాంగ శ్రవణంలో ఈ శ్లోకాన్ని చదువుతారు:

వాగీశాద్యాః సుమనసః సర్వార్థానాం ఉపక్రమే

యం నత్వా కృతకృత్యాస్యుః తం నమామి గజాననం

ఇందు గజానన పదం వినబడుతోంది. కనుక శ్లోకార్థం తెలియకపోయినా, వినాయకుణ్ణి స్తుతిస్తున్నామని అర్థమవుతుంది. ఏమని చెప్పింది? దేవతలు, తుదకు బ్రహ్మ కూడా ఏదైనా పనిని ఆరంభించి పూర్తి కావాలని అనుకొనేవారు ఈ గజాననుణ్ణి కొలుస్తారని.

బలహీనులైన మానవులే కాదు, బలవంతులైన దేవతలూ కొలుస్తారట. వారు నిర్దిష్టమైన తిథులలోనే కాదు, ఏదైనా పని ఆరంభించునపుడు నిరంతరమూ కొలుస్తారట. చేసిన పనులు ఫలిస్తాయని శ్లోకం చెబుతోంది. వీరి నమస్కారాన్ని మాత్రమే స్వీకరించడు, వారెందుకు నమస్కరించారో దానిని నెరవేరుస్తాడు. అనగా వారిని కృతకృత్యులను చేస్తాడన్నమాట. అనగా వారి లక్ష్యాన్ని నెరవేరుస్తాడు.

వాగీశాద్యాః సుమనసః = వాగీశుడు మొదలగువారు. సుమనస్ అనగా దేవతలు.

పువ్వు - మనస్సు

సుమనస్ అనగా మంచి మనస్సని అర్థం. అసలు మంచి మనస్సే దేవశక్తి. చెడ్డమనస్సు అసుర శక్తి. పువ్వును కూడా సుమనస్ అంటారు. ఒక మొక్క లేక లతలా పువ్వులా ఉంటుంది మంచి మనస్సు. మంచి మనస్సు యొక్క

లక్షణమేమిటి? అందులో ప్రేమ ఊరుతూనే ఉంటుంది. మొక్కకైనా, లతకైనా దాని యొక్క సారమైన మాధుర్యం పువ్వులో కన్పిస్తుంది. పండు కంటె తియ్యగా ఉండేది మకరందమే. కొన్ని మొక్కలలో, కొన్ని చెట్లలో పండ్లు చేదుగా ఉండవచ్చు. కాని వాటి పువ్వులలో తేనె, తియ్యగానే ఉంటుంది. చేదుగా ఎన్నటికీ ఉండదు. పువ్వు కంటికి, ఒంటికి, ముక్కుకు, నాల్కకు సంతోషాన్ని కల్గిస్తుంది. అందమైన ఆకారం వల్ల కంటికి, మెత్తగా ఉండడం వల్ల చర్మానికి, సుగంధం వల్ల ముక్కుకు; దానిలోని తేనె నోటికి రుచికరంగా ఉంటుంది. ఇక చెవి ఒక్కటే మిగిలింది. పువ్వు తుమ్మెదలను తనవైపునకు ఆకర్షించుకొనేటట్లు చేస్తోంది. ఆ తుమ్మెదల ఝుంకారం వీనుల విందుగా ఉంటుంది.

ఈ సుమనస్సుకి – మంచి మనస్సు, అందం, దేవతలు అనే అర్థాలిచ్చే చాలా శ్లోకాలున్నాయి. మహిషాసురమర్దనీ స్తోత్రంలో ఈ సుమనస్ పదం చాలాసార్లు వస్తుంది. దీనికున్న అన్ని అర్థాలలోనూ వాడబడింది. ఇందులో అమ్మవారిని నుతిస్తూ, కాంతి కలిగిన పువ్వులతో అమ్మవారు, మంచి మనస్సు కల దేవతలచే అర్చింపబడిందనే అర్థంలో 'సుమనస్' మంచి హృదయమని, దేవతలని; అందమని, పువ్వులని అనేకార్థాలలో వాడబడింది. ఆ శ్లోకం యొక్క నడకయే అందంగా ఉంటుంది. (ఈ శ్లోకం అనంతరామదీక్షితుల కాలంలో ప్రాచుర్యం పొందింది)

గణపతి, సుమనస్సులచే అర్చింపబడ్డాడని అనినపుడు మంచి మనస్సు కలవారిచే అర్చింపబడ్డాడని అర్థం. అందుకే వాగీశాద్యాః సుమనసః అని వాడబడింది. దేవతలనిక్కడ ఏ పదంతోనూ కాకుండా సుమనస్ అనే వాడబడింది.

మంచి మనస్సు కలవారు ఎవర్నో ఒకర్ని పూజిస్తారు. పూజింప బడేవాడూ మంచి మనస్సు కలిగి యుండాలి కదా.

ఏనుగు కాని ఏనుగు ముఖం కలవాడు

అతడెంత ఉదార హృదయుడో చెప్పడానికి ఒక్క సంఘటన చెబుతాను. ఎవని దగ్గర కోపం రాదో, ఎవర్ని చూస్తే కోపం పటాపంచలౌతుందో, శాంత మనస్కులౌతారో అట్టివానికి ప్రేమ పూర్వకమైన హృదయం ఉండాలి కదా! దానికి ఉదాహరణ మన గణపతియే. చీమనుండి బ్రహ్మవరకూ ఎవరు ప్రేమిస్తారు? ఆమెయే అమ్మవారు. ఆమె విశ్వజనని. అట్టి తల్లి, అఖిలాండేశ్వరి ఒక సందర్భంలో ఉగ్రరూపం ధరించింది. తమిళనాడులోని జంబుకేశ్వరంలో అఖిలాండేశ్వరి అట్లా ఉండేది. కలియుగ ప్రజలను చూసి ఉగ్రురాలైందట. ఆమె అమితశక్తి కలదైనా, లలిత మాదిరిగా అందరినీ ప్రేమించినా ఉగ్రమైన కాళిగా కూడా ఉండగలదు.

ఇట్టి కాళీ రూపం తగ్గించడానికి శంకరులు ఇక్కడకు వెళ్ళారట. వారు పరమేశ్వరుని అవతారం కదా! కనుక ఆయన సమీపించగలరు. ఈ సందర్భంలో గణపతి యొక్క మహత్మ్యాన్ని లోకానికి చాటించాలనుకొన్నారు. అందువల్ల అమ్మవారి ముందరగా గణపతిని ప్రతిష్ఠ చేసారు. అంతే! ఎప్పుడైతే గణపతి వెలిశాడో అమ్మవారి కోపతాపాలు చల్లారాయి. పిల్లవానిపై తల్లికి మమకారం ఉంటుంది కదా!

అట్టి ఉగ్రత్వం తిరిగి ఆమెలో ప్రవేశించకూడదని విగ్రహంలోని ఉగ్రకళలను గ్రహించి తాటంకాలలో ఉంచారు. అంటే కర్ణాభరణాలుగా. అవి యంత్ర రూపంలో ఉంటాయి. వాటిని ఆమెకు అలంకరంగా ఉంచారట.

తాటంకం, సౌభాగ్యానికి గుర్తు. శంకరులు, సౌందర్యలహరిలో ఒక ప్రశ్న వేసారు. అమృతం త్రాగినా దేవతలు ప్రళయకాలంలో నామరూపాలు లేకుండా ఉన్నారేమిటి? ఒక్క పరమేశ్వరుడే నిలబడడానికి కారణం ఏమిటి? ఆపైన విషపానం చేసిన వాడుండడేమిటి? అని ప్రశ్న వేసుకొని, ఇదంతా నీ తాటంకాల మహిమయమ్మా, 'తవజనని తాటంక మహిమా' అన్నారు.

ఇట్లా ఉగ్ర కళలను తాటంకాలలో బంధించి, పాతివ్రత్యానికి చిహ్నమైన తాటంకాలనమర్చి ఎదురుగా కొడుకైన గణపతిని ప్రతిష్ఠించారు.

గణపతికి జంబుకేశ్వరంతో, సంబంధం ఉంది. జంబు అంటే నేరేడు. నేరేడు ఫలాలంటే స్వామికి ఇష్టం. ఒక స్తోత్రంలో 'కపిత్థ జంబూఫల సార భక్షితం' అని ఉంది. నేరేడు పండును సుబ్రహ్మణ్య స్వామి, అవ్వైయార్ అనే కవయిత్రికి ఇచ్చాడని, ఆమె గణపతి భక్తురాలని కథ.

శంకరుని అవతారమైన శంకరులు, శివపార్వతులకు ప్రీతిపాత్రుడైన వినాయకుణ్ణి ప్రతిష్ఠ చేయడంలో ప్రత్యేకత ఉండాలి.

పరాశక్తి యొక్క కోపాన్ని తగ్గించగల శక్తి గణపతికే ఉంది. అతనికి శక్తి ఉందంటే ఏదో మంత్రాన్ని ఉపయోగిస్తాడనో, ఏదో చేసి పరాశక్తిని మారుస్తాడని కాదు. పరాశక్తి యొక్క చూపు పడితే చాలు. ఆమె కంటికి ఇతడు ప్రీతి పాత్రుడు ప్రేమ మూర్తి. అతని మనస్సూ గొప్పదే. వాగీశాది దేవతలు ఇతనిని అర్చించి విజయాన్ని పొందారు కదా!

వాగీశుడెవడు?

ఈ పదం, తిరునావుక్కరుసు స్వామికి ఉంది. ఇతడు జైనుడై, జైన మత ప్రవర్తకులలో గొప్పవాడై ధర్మసేనునిగా కీర్తింపబడ్డాడు. అతడు తిరిగి శైవమతంలోకి వచ్చినపుడు పరమేశ్వరుడే అశరీరవాణితో "నా వుక్కరసు" అనే బిరుదు నిచ్చాడట. అది సంస్కృతంలో వాగీశుడని అర్థం. దీని తరువాత తిరుజ్ఞాన సంబంధర్ ఇతణ్ణి అప్పర్ అని సంబోధించాడు. ఈ పేరూ ప్రచారంలో ఉంది. శ్లోకంలోని వాగీశపదం అప్పర్‌స్వామిని చెప్పడం లేదు. వాగీశ మరియు దేవతలని ఉంది కదా! అయితే దేవతలలో వాగీశుడెవడు? బ్రహ్మకు, బృహస్పతికి ఈ పేరుంది.

దేవ గురువు బృహస్పతి చాలా బుద్ధిమంతుడు. అందుకే లోకంలో నువ్వేమైనా బృహస్పతివా అనే మాట వచ్చింది. అతదన్ని శాస్త్రాలలో నిష్ణాతుడు. కనుక అతడు వాగీశుడు. అతడు గీష్పతి కూడా. రెంటికీ ఒకే అర్థం. ఇతనికి గణపతికి దగ్గర సంబంధం ఉంది. వేదాలలో నున్న బ్రహ్మణస్పతియే పురాణాలలోని విఘ్నేశ్వరుదని పరిశోధకులంటారు. గణానాంత్వా అనే మంత్రాన్ని వినాయక ప్రతిష్ఠలో వాడతాం. ఇక్కడ అతడు బ్రహ్మణస్పతియే.

ఈ శ్లోకంలోని అంతరార్థాన్ని గ్రహించవచ్చు. దేవతలు, వినాయకుణ్ణి వారి గురువు, బృహస్పతి ద్వారా తెలుసుకొని అర్చించారనవచ్చు. అనగా దేవగురువు, గణపతిని అర్చించి శిష్యులకిట్లా చేయాలని ఉపదేశించినట్టైంది.

సరస్వతి భర్త, బ్రహ్మ కనుక, ఆమెను వాగ్దేవియని అంటాం, కనుక ఇతదు వాగీశుడయ్యాడు. శ్లోకంలోని వాగీశుదు బ్రహ్మయే. బ్రహ్మ దేవతలలో వాగీశుడైనట్లు,వాగీశుడైన గణపతి – బుద్ధికి, పాండిత్యానికి పెట్టింది పేరైనాడు.

బ్రహ్మ సృష్టికర్త కదా! సృష్టి అనినపుడు కాలం గుర్తుకు వస్తుంది. కాలానికి సంవత్సరమొక కొలమానం క్రొత్త సంవత్సరం నాడు పంచాంగాన్ని వినేటపుడు ముందుగా బ్రహ్మను గుర్తుంచుకోవడం, సబబే. తరువాత బ్రహ్మాది దేవతలు కొలిచే గణపతిని స్మరించడం సబబు.

బ్రహ్మ, వాగీశుడైనా బుద్ధితో, పాండిత్యంతో సంబంధమున్నవానిని పూజించాలి. ఇంకా విఘ్నాలు లేకుండా ఉండాలన్నా గణపతిని పూజించాలి. అందుకే ముందుగా శ్రీ మహాగణాధిపతయే నమః అని వ్రాసి మొదలుపెడతాం.

సరస్వతి భర్తయైన బ్రహ్మ, వాగీశుడైనా గణపతిని కొలిచాడు కనుక ముందుగా గణపతిని పూజించాలి. రామాయణాన్ని పారాయణం

చేసేటప్పుడైనా వాగీశాద్యా: అనే శ్లోకాన్ని ముందుగానే చదువుతాం. తరువాత సరస్వతీ స్తుతి యుంటుంది.

దేవతల విఘ్నాలను పోగొట్టినవాడు

ఏ పురాణం ఆరంభించినప్పుడైనా అసలు వాగ్దేవిని, విద్యాదేవిని స్మరించడం సబబు. కాని అంతకంటె ముందు గణపతిని నుతిస్తాం. వాగ్దేవిని పూజించడానికి కూడా ఏదైనా ఆటంకం వస్తే ఏం జరుగుతుంది? అందువల్ల ముందుగా గణపతిని పూజించవలసిందే.

మరొక ముఖ్య కారణముంది. మనం పూజించేటపుడే కాదు. దేవతలు మనలను ఆశీర్వదించాలన్నా ఏదైనా వారికి ఆటంకం రావచ్చు. ఇట్లా జరుగుతుందా? పార్వతీ పరమేశ్వరులు, మహావిష్ణువు, అతని అవతారాలు, సుబ్రహ్మణ్య స్వామి మిగిలిన దేవతలు వారనుకొన్నవి జరుగకపోతే వారే గణపతిని పూజించినట్లు పురాణాలలో కావలసిన కథలున్నాయి. శ్లోకంలో బ్రహ్మాది దేవతలని ఉంది కదా! అంటే అంతటివారే ఇతణ్ణి అర్చించవలసి వచ్చింది. పూజిస్తేనే కాని వారి పనులు జరగలేదు. పుస్తకం వ్రాసినపుడు సరస్వతిని ప్రార్థించినా డబ్బుకోసం లక్ష్మిని పూజించినా, రోగవిముక్తి కోసం సూర్యుణ్ణి ఆరాధించినా మునుముందుగా ఆయా దేవతలు కరుణించడానికి ఆటంకాలు లేకుండా ఉండాలంటే ముందుగా మనం గణపతిని పూజించవలసిందే. అప్పుడే దేవతలు మనపై అనుగ్రహం చూపించగలరు.

అది రుద్రాభిషేకం కావచ్చు, చండీహోమం కావచ్చు, ఏదైనా ముందుగా శుక్లాంబరధరం శ్లోకం చదువకుండా ఆరంభించం.

మన్నారు గుడికి చెందిన రాజు శాస్త్రిగారనే మహావిద్వాంసుడుండేవాడు. గొప్ప శివభక్తుడు. అనుష్ఠానపరుడు. ఆయన గురుకులం నడిపి ఎందరినో విద్వాంసులుగా తీర్చి దిద్దాడు. ఆయన అసలైన కులపతి. ఆయన గురించి

ఎవరైనా చెప్పవలసి వచ్చినపుడు వారిపేరుతో చెప్పేవారు కాదు. మన్నారు గుడి పెరియవ అనేవారు. ఆ మాటకు మన్నారు గుడి పెద్దవారని అర్థం. నా మాదిరిగా మఠాధిపతి కాదు. నన్నట్లా గౌరవంతో పిలుస్తున్నారు. ఆయన సన్యాసి కాదు, గృహస్థే.

సుమారు వంద సంవత్సరాలు బ్రతికారు. 20వ శతాబ్దం మొదటివరకూ ఉన్నారు. అంత విద్వాంసుడైనా గొప్ప వినయవంతుడు. 1887లో తెల్లదొరల ప్రభుత్వం వారికి మహా మహోపాధ్యాయ బిరుదునిచ్చింది. "ఇది పెద్ద విద్వాంసులకిచ్చేది. నాకు అర్హత లేదని" వినయంతో అన్నారు. ఆ బిరుదును ఢిల్లీ వెళ్ళి తీసుకోలేదు. జిల్లా కలెక్టర్‌గారే బిరుదును, బహుమతిని తీసుకొని వచ్చి యిచ్చారు. ఇతర విద్వాంసులు వీరితో వాగ్వాదం చేసినా సున్నితంగా సమాధానం చెప్పేవారు. తిరువిసైనల్లూర్‌లో రామ సుబ్బశాస్త్రిగారనే మహా మహోపాధ్యాలుండేవారు. ఆయన స్మార్తుడైనా అద్వైతాన్ని, సన్యాసాన్ని, శివభక్తిని గూర్చి నిందావాక్యాలు వ్రాయగా వ్యక్తిగతంగా వారిని దూషించకుండా ప్రతి మాటను శాస్త్రోక్తంగా దుర్జనకోటినిరాసం అనే గ్రంథంలో రాజుశాస్త్రిగారు ఖండించారు.

వారు వ్రాసిన అనేక రచనలలో న్యాయేందు శేఖరగ్రంథము గొప్పది. అది తర్కవేదాంతాల సంగమం. దానినే న్యాయశాస్త్రమంటారు.

అనంతాచార్యులనేవారు అద్వైతాన్ని ఖండిస్తూ న్యాయభాస్కరం వ్రాయగా న్యాయేందు శేఖరం వ్రాసి శాస్త్రిగారు ఖండించారు. సూర్యుని మాదిరిగా వెలుగుతుందనే అర్థంలో వారు న్యాయ భాస్కరం వ్రాయగా అతడస్తమిస్తే చంద్రుడే ప్రకాశిస్తాడు, చల్లని వెన్నెలను ప్రసరిస్తాడు, విద్వాంసుల హృదయం చల్లబడుతుంది కనుక న్యాయేందు శేఖరం మన శాస్త్రిగారు వ్రాసేరు. దానిని ఈశ్వర ప్రసాదంగా భావించారు. మనస్సులో చంద్రుడు, ఈశ్వరుడు ఉండాలి కనుక పుస్తకానికి ఆ నామముంచారు. ఈ పుస్తకంపై ప్రతి సంవత్సరమూ

అద్వైత సభ జరుపుతారు. మా మఠానికి చెందిన పరమ గురువులే ఏర్పాటు చేసారు. వారే ఆరవ చంద్రశేఖరేంద్ర సరస్వతి. వీరు 1894లో ఈ సభను స్థాపించారు. ఈ పుస్తకం పై పరిశోధన చేసేవారికి ప్రతి ఏటా బహుమతినిస్తారు. ఇది ఈ పుస్తకం యొక్క గొప్పదనం.

ఇక్కడ తర్క శాస్త్రానికి, గణపతికి ఉన్న సంబంధాన్ని వివరిస్తాను. తర్క శాస్త్రం కార్యకారణ విచారణ చేస్తుంది. ఈ నియమాలను న్యాయమని అంటారు. ఇందు కొన్ని పోలికలుంటాయి. లోకోక్తులూ ఉంటాయి. ఉదాహరణకు కాకి, తాటిచెట్టు మీద వ్రాలితే తాటిపండు పడిందని దానినే కాకతాళీయ న్యాయమని అంటారని తెలుసు కదా!

చెవిదుద్దు, మంగలసూత్రము స్త్రీల సౌభాగ్య చిహ్నాలు. పూర్వకాలంలో నిరాడంబరంగా ఉండేవారు కనుక ఆ చెవి దుద్దు, మెడలో కట్టిన తాళి తాటాకులతో ఉండేవి. తాటాకును నేడు ధరించకపోయినా, వజ్రాన్ని ధరించినా ఆ పదాన్ని గుర్తు చేస్తూ వజ్ర తాటంకాలని నేటికీ వ్యవహారంలో ఉంది. శ్యామలా నవరత్నమాలలో అమ్మవారు తాళీవలాశ తాటంకం అని పేర్కొనబడింది. తాటాకుతో చుట్టబడి కర్ణాభరణంగా ఉందని అర్థం. మంగళ సూత్రంలోని బిళ్ళ కూడా తాటాకుతోనే ఉండేది. అందువల్ల మంగళసూత్రాన్ని తాళియని వ్యవహరిస్తారు. గణపతి గురించి చెబుతూ మిగతా విషయాలను ప్రస్తావించాను. ఇక పుస్తకంలోని గణపతిని పేర్కొంటాను.

ప్రతి పుస్తకానికి ముందు మంగళ శ్లోకం ఉంటుంది కదా. సాధారణంగా గణపతి గురించే ఉంటుంది. ఈ స్తుతిలోనూ న్యాయ శాస్త్రాన్ని రుచి చూపించారు శాస్త్రిగారు.

అప్యన్యామరమారి రాధ యిపతాం యత్పాద పంకేరుహ
ద్వంద్వారాధనమంతరాయ హతయే కార్యం త్వవశ్యం విదుః

తద్భేతోవిధినీతివిత్తు భజతే దేవం యమేకం పరం
సర్వార్థ ప్రతిపాదనైక చతురోద్వైమాతురోఒవ్యాత్ సనః

అనగా గణపతి కంటె మిగిలిన దేవతలను పూజించేవారు కూడా ఆటంకాలు రాకుండా ఉండాలంటే గణపతినే ముందు పూజించాలి. తాము పూజించే ఇతర దేవతల అనుగ్రహం కావాలన్నా ముందితనినే పూజించాలి. ఈ 'తతఃహేతు' న్యాయాన్ని బట్టి ఇతడే ప్రథమ దేవత అవుతాడు. అట్టి విఘ్నేశ్వరుడు మా ప్రయత్నాలను ఫలించేటట్లుగా అనుగ్రహించుగాక.

తతఃహేతు న్యాయం

హేతువంటే కారణం. విద్యుత్తున్న తీగను ముట్టుకుంటే ప్రమాదం కదా. ఆ తీగ హేతువైంది. హేతువునకు విరుద్ధం అహేతువు. ఏ కారణం లేకుండా దేనినీ ఆపేక్షించకుండా భగవానుని పట్ల చూపు భక్తి అహైతుకీభక్తి అని అంటారు. అట్టి జ్ఞానియైన భక్తుడు, నిర్గుణ స్వరూపం రుచి చూసినవాడే.

మరొక ఉదాహరణతో ఈ న్యాయాన్ని వివరిస్తాను. మనకు బియ్యం బస్తాలు కావాలి. అది మన లక్ష్యం అనగా తతః. భూయజమాని దగ్గరే తీసుకొనవచ్చు. కనుక భూస్వామి ఇక్కడే హేతువు. కానీ అది స్థానికమైన కిరాణా వ్యాపారి సిఫార్సు చేస్తేనే ఇస్తాడు. ఈ కిరాణా వ్యాపారి ఎవరి సిఫార్సు అక్కఱలేకుండానే మనకిస్తాడు. కనుక ఇతడు మనకు ప్రత్యక్ష హేతువు. అటువంటప్పుడు ఇతని దగ్గరకే వెళ్ళి తీసుకోవచ్చు కదా. మధ్యలో భూయజమాని ఎందుకు? ఇక్కడున్న దీపంలో చాలా వత్తులున్నాయి. తూర్పువైపు వెలుగు రావాలని అనుకున్నామనుకోండి. ఆ వైపున ఉన్న వత్తిని వెలిగిస్తే సరిపోతుంది. ముందు పడమరవైపు వెలిగించు, దానితో తూర్పువైపున ఉన్న దానిని ముట్టించని ఎవరైనా అంటారా? (అందరూ నవ్వారు) అట్లా తతః హేతుశ్చేమధ్యే కింతేన ఈ న్యాయంతో ఆ శ్లోకంలోని గణపతిని ఎందుకు పూజించాలో చెబుతాను.

చదువుకై సరస్వతిని; డబ్బుకై లక్ష్మిని మొదలైనవి పూజించాలని చెప్పాను. వివిధ ఫలాలు కావాలంటే వివిధ దేవతలను పూజిస్తున్నాం. అయితే ఏ దేవతను పూజించినా ముందు గణపతినే పూజిస్తారెందుకు? ఇతర దేవతలను పూజించడంలో విఘ్నాలు రాకుండా ఉండడానికి అదే శ్లోకం ప్రథమ భాగంలో ఉన్నది:

అప్యన్యామరమారిరాథ యిషతా........

శ్లోకం మొదట్లో 'అపి' అని ఉంది. అంటే ఏదో చెప్పబోతున్నాడు. కుతూహలం ఏర్పడుతోంది కదా.

మిగతా దేవతలను పూజించేవారేమి చేస్తారు? వారిని పూజించేటపుడు కూడా ఆటంకాలు రాకుండా ఉండడానికి ఒకని పాద పద్మాన్ని అనగా గణపతిని పూజించాలి కదా. అదే సంస్కృతంలో యత్ పాదపంకే రుహ ద్వంద్వారాధనం, అంతరాయ హతయే కార్యం త్వవశ్యం విదుః అని ఉంది. పాదద్వంద్వం అంటే రెండు పాదాలను.

పాద పద్మం

పంకం నుండి పుట్టింది పంకేరుహం. పద్మం. మురికిగా నున్న బురదనుండి పుట్టి స్వచ్ఛంగా ఉంటోంది. ఇది ఏమని గుర్తు చేస్తోంది? ఏ స్థితిలో మనిషి పుట్టినా ఉత్తమునిగా తీర్చి దిద్దబడాలని, బడవచ్చని చెబుతోంది. పద్మం నీటిలో పుట్టడం వల్ల నీరజం, అంభోరుహం, సరసిజం అని పేర్లు వచ్చాయి. బురదనుండి పుట్టడం వల్ల పంకేరుహమైంది. అట్లాగే సంశయాలతో కూడిన మనస్సు నుండే భగవానుని పాదపద్మం వికసించాలి.

అంతరాయహతయే =విఘ్నాలు పోవడానికి. ఇట్లా గణపతిని పూజించడం మంచికే కాదు, కార్యం తు అవశ్యం విదుః తప్పనిసరి కూడా అని తేలింది.

అందువల్ల ఇక్కడ ఫలానా వాడని చెప్పలేదు. ఆ ఎవరో చెప్పకపోవడం కవులు చేసే చమత్కారం. యత్ పాద పంకేరుహద్వంద్వారాధనం ఎవని పాద పంకేరుహాన్ని పూజిస్తే అన్నారు.

ఇతర దేవతలను పూజించాలన్నా ఆ ఒక్కణ్ణి అని చెప్పడం వల్ల అతని గొప్పదనం తెలియవస్తుంది. ఆ ఒక్కణ్ణి పూజించడం వారి లక్ష్యం కాదు. అయినా ఆ ఒక్కణ్ణి పూజించి తీరాలి. ఇది అతని గొప్పదనాన్ని సూచించదా?

ఇతర దేవతలను పూజిస్తే వారికి విఘ్నాలను తొలగించే శక్తి లేదు. విఘ్నేశ్వరునకే అట్టి శక్తి.

శ్లోకంలో రెండవ పంక్తిలో ఎవరిని తప్పక పూజించాలో అని ఉంది. మూడవ పంక్తిలో తతః హేతున్యాయం ప్రకారం మహోత్తమ దేవతగా ఎవనిని భావిస్తారో అని ఉంది. ఇందు కూడా ఆ ఒకని గురించి చెప్పలేదు. యం ఏకం పరం అని ఉంది. తేలిందేమిటి? సమస్త దేవతలకు మూలం పరబ్రహ్మం కదా! ఆ మాటను సూచిస్తూ ఏకంపరం ఉంది. ఆ ఒక్కడు, అద్వైతమైన పరబ్రహ్మమే అని చెప్పినట్లైంది. ఆ శ్లోక రచయిత పరవస్తువునే స్తుతిస్తున్నాడు. తతః హేతున్యాయం ప్రకారం అతణ్ణే స్తుతిస్తున్నాడు.

శ్లోకం, అతని పేరు చెప్పకపోయినా అతడెవరో మనకు తెలుసు. మన వినాయకుడే. కనుక ఈ న్యాయం చెప్పి బాగా నప్పునట్లు చేసాడు రచయిత.

ఈ న్యాయం తెలిసినవారికి, తెలియనివారికి ఏం జరిగింది?

ఎవరైనా తమ ఇష్టదైవాన్ని ఒక ప్రధాన ప్రయోజనంతో కొలుస్తారు. ఏదైనా ఆటంకం వస్తుందేమోనని శంకిస్తారు. అయితే అట్లా శంకించడం ఆ దేవత పట్ల పూర్తి భక్తి విశ్వాసాలను ప్రకటించడం లేదని మనం నిర్ణయించవచ్చా! ఏదైనా ఆటంకం వస్తే తాను కొలచిన దేవత ఊరకే చూస్తూ

కూర్చుంటాడా? అయితే బాధ పడడానికి కారణం ఉంది. పురాణాలు చూస్తే దేవతలు మంచి పనులను చేయాలని సంకల్పించినా ఆటంకాలెదురవడం, తరువాత గణపతి అట్లా చేయడం జరిగినట్లు చదువుకున్నాం. వాళ్ళే భయపడినపుడు మానవ మాత్రులం మనమెంత? పూజకోసం డబ్బు కూడబెట్టడంలో సామగ్రిని సేకరించడంలో, లేదా మనస్సు యొక్క ఏకాగ్రతలో ఆటంకాలు వస్తాయి. కనుక ఇట్టివి తొలగాలంటే దేవతలే పూజించిన గణపతిని మొదటగా ఆరాధిస్తే మంచిదే.

ఈ శ్లోకంలోని ఉపాసకుడు సామాన్యుడు కాదు. అతడు 'తతః **హేతోరీతివిత్**' అనగా న్యాయం తెలిసినవాడు. తర్కశాస్త్రం బాగా తెలిసిన వాడగుటచే బాగా ఆలోచించి పూర్వాపరాలను వీక్షించి నిర్ణయానికి వస్తాడు. అతడు వినాయకుని పట్ల ఎట్లా ప్రవర్తిస్తాడు?

అందరు దేవతలు ముందు విఘ్నేశ్వరుని పూజిస్తున్నారు. అప్పుడే వారికి ఆటంకాల బాధ ఉండడం లేదు. ఏ దేవతయైనా ఇతణ్ణి పూజించకపోతే ఇతడు వారికి ఆటంకాలను కల్గిస్తాడు. అందువల్ల ఇతని అనుగ్రహం కోసం కొలుస్తున్నారు. అందువల్ల అందరి దేవతలకంటె ఇతడధికుడు, ఫలప్రదాత. గణేశుని నామాలను పరికిస్తే ఇది తేలతెల్లమౌతుంది. 'లక్ష్మీ, గణపతి, విద్యా గణపతి, విజయ గణపతి మొదలైన నామాలు. అనగా లక్ష్మీ, సరస్వతి, దుర్గ లిచ్చేవన్నీ ఇస్తాడన్న మాట. అంతేకాదు సర్వసిద్ధి ప్రద గణపతి అనగా అన్నిటినీ ఈయగలడు. అందువల్లనే చాలాచోట్ల సిద్ధి వినాయక ఆలయాలు వెలిసాయి. అందువల్ల సమస్త దేవతల కంటె ఇతడధికుడని, తెలివైన భక్తుడు, తర్కజ్ఞానం గల భక్తుడు, ఇతణ్ణి ఏకం పరందేవంగా భావిస్తాడు.

ఒక్క విఘ్నేశ్వరుడు అన్నిటినీ ఇచ్చినపుడు మిగతా దేవతలను పూజింప **నేల? తతఃహే తో రేవ తతః హేతుత్వే మధ్యే కింతేన?** అనగా తతః హేతున్యాయం తెలిసినవాడు అతడు పరమ దైవమని భావించి అతని పూజకే కట్టుబడి యుంటాడు.

తత: హేతోరితి నీతివిదు: భజతే దేవం యం ఏకం పరం

ఇంకా ఏమంటాడు? మామూలు పూజ ఇతనికి చేసి, విస్తారమైన పూజ మిగతా దేవతలకు చేసినా ఇతనికి జరిగిన పూజతోనే సరిబెట్టుకుంటాడు.

అన్ని ఫలాలూ అతడీయకపోయినా

వినాయకుడు శక్తిమంతుడైనా అతడన్నీ ఈయకుండా, ఉన్న ఆటంకాలను మాత్రమే తొలగిస్తాడని కాసేపు ఊహిద్దాం. మిగతా దేవతలే ఫలాలిచ్చేటట్లుగా చేస్తాడని భావిద్దాం. అతని గురించి ఎట్లా పరదైవమని అంటున్నామో మిగతా దేవతలను వర్ణించేటపుడూ ఎవరికి వారే పరమ దైవాలని పురాణ కథలంటున్నాయి కదా. అదీ సత్యమే. ఒక్క పరమాత్మయే భిన్న దేవతలుగా కన్పిస్తున్నాడు. మనపట్ల కూడా అంతే. మాయ, మనలను కప్పివేయడం వల్ల మనము అఖండాత్మ స్వరూపులమని గుర్తించలేకపోతున్నాం. అయితే దేవతా రూపాలలోనున్న వారు తాము పరమాత్మయనే గుర్తిస్తున్నారు.

ఈ పరమాత్మననే భావన అందరి దేవతలకూ ఉందా? అందుకొందరే భావిస్తున్నారని కొంత వరకే కొందరని ఒక అభిప్రాయముంది. ఇట్టి సందేహం, మనం శివుణ్ణి, అమ్మవారిని, విష్ణువుని పూజించినపుడు కలగదు. వీరు ముగ్గుర్నీ రత్న త్రయంగా, పూర్ణ బ్రహ్మ శక్తి కలవారుగా అప్పయ్య దీక్షితులు పేర్కొన్నారు. వీరిని పూజించేటపుడు కూడా గణపతిని పూజిస్తాం.

సాధారణ నియమ మేమంటే ఏ దేవత యైనా అది తాను పరమాత్మనని తెలుసుకున్నా, పూర్తి ఫలాన్ని భక్తునకీయకుండా, భక్తుడు కోరినది మాత్రం ప్రసాదిస్తుంది. ఒక పరమాత్మ – భిన్న రూపాల లక్ష్యం ఇది కదా! ఈ సనాతన ధర్మంలో అనేక దేవతలుండాలని రకరకాలుగా అలంకరించి, వివిధ నైవేద్యాలు ఆయా దేవతలకు అర్పించవచ్చని భగవత్ప్రణాళికగా ఉంది.

ఇట్టి ప్రణాళికలో విఘ్నాలను తొలగించడం అనే పనిని వినాయకునకు ఈశ్వరుడు నిర్దేశించాడు. కనుక వినాయకుడు తన ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తిస్తూ ఉంటాడు. వినాయక రూపంలో విద్యను, భాగ్యాన్ని, విజయాన్ని తిన్నగా ప్రసాదించడు. అట్టి పనులను వివిధ దేవతలకు పరమాత్మ, కేటాయిస్తాడు. అయితే తతఃహేతున్యాయం ఇక్కడ నప్పుతుందా?

ప్రభుత్వం ఏర్పడినప్పుడు వివిధ శాఖలను వివిధ మంత్రులకు కేటాయిస్తారు కదా! ఏ మంత్రియైనా వివిధ శాఖలను నిర్వహించగలడు. అతనికి అంతకుముందు ఆ విషయం తెలియకపోయినా. అయితే ఒక మంత్రికి కేటాయించిన శాఖలో మరొక మంత్రి తలదూర్చకూడదు. అట్లాగే జగత్ ప్రభుత్వం కూడా దేవతలచే అట్లా నిర్వహింపబడుతుంది. వారి వారి పరిధిలో ఆయా దేవతలు భక్తుల కోరికలను తీరుస్తారు.

ఇది సాధారణ నియమమన్నాను. అంటే ఏదో విశేష నియమం ఉండాలి కదా.

ఒక ప్రత్యేకమైన దేవత – అది వినాయకుడు కావచ్చు, మరొక దేవత కావచ్చు, పరమాత్మ మాదిరిగా ఒక ప్రత్యేక ఫలాన్నే ఈయడమే కాకుండా దేనినైనా ఈయగలడు. ఒక భక్తుడు తన ఇష్ట దైవాన్ని నీవే నాకు ఏకైక దైవం, ఇక ఏ దేవతను కొలవనని భీష్మించుకొని కూర్చుంటే ఆ దేవత, పరమాత్మ మాదిరిగా అన్నిటినీ ఇస్తుంది. తాను పరమాత్మనని ఎఱుక లేని దేవత కూడా. ఇట్టి సర్వార్పణ భావాన్ని అసలు పరమాత్మ గ్రహించి ఈ చిన్న దేవత ద్వారా భక్తుడు కోరిన అన్నిటినీ ప్రసాదింపజేస్తాడు. అది మానవ రూపంలోనూ ఉండవచ్చు. అట్లా సర్వార్పణ భావం, ఒకే దేవతపై గాఢభక్తి కలిగి యుండడం, ఎక్కడో గాని ఉండదు.

అనేక దేవతల అవసరం

అనేక రుచులను ఇష్టపడతాం. నాటకంలో భిన్న రసాలుంటాయి. అది సంగీతమైతే భిన్నరాగాలుండాలి. కొందరు మంద్రస్థాయిని, కొందరు ద్రుత పద్ధతిని కోరుతారు. అట్లాగే ఉపాసనలో కూడా. సమాధి స్థితి చిట్టచివర దశలోనే. అందరూ ప్రాథమిక దశలోనున్నవారే. అట్టి మహోన్నత సమాధి స్థితి రావాలంటే పరమేశ్వరుని అనుగ్రహం తప్పనిసరి. అతడు నానా రూపాలను ధరిస్తాడు. రకరకాల కోరికలను తీరుస్తాడు. పూజలో కూడా భిన్నంగా ఉంటుంది. ఒక దేవతకు మారేడు, మరొక దేవతకు తులసి, మరొక దేవతకు మోదకం ఇష్టం. భిన్న రుచులతో కూడినది లోకమనే నానుడి యుంది కదా. లోకో భిన్న రుచిః

ఈశ్వరుని లీలలను లెక్కపెట్టలేం. కొందరికి ఇష్టదైవముండి అతణ్ణే కొలుస్తారు. పెక్కుమందిని కొలవనే కొలవరు. తాము కొలిచిన దేవతయే పరమాత్మయని భావిస్తారు. అందుకే సుబ్రహ్మణ్య భక్తులు, దేవీ భక్తులు, శివ భక్తులనే వ్యవహారం ఉంది. పరమాత్మ వీరి భక్తి తీవ్రతను గమనించి అన్ని ఫలాలనిస్తాడు.

ఇట్లా ఇష్ట దేవతయున్నా వినాయకుణ్ణి మాత్రం విస్మరించరు. శుక్లాం బరధరం అనకుండా పూజ నారంభించరు.

ఒక్క దేవతను పూజించే వారు అరుదు అని చెప్పాను కదా! ఆలయాలకు వెడితే అనేక దేవతల సన్నిధాలు కన్పిస్తారు. ప్రతి సన్నిధికి వెళ్ళి అందర్నీ పూజిస్తాం. శివాలయంలో విష్ణు విగ్రహం లేకపోయినా, విష్ణ్వాలయాలలో శివమూర్తి లేకపోయినా, శివాలయానికీ, విష్ణ్వాలయానికీ వెడతాం. కాంచీపురంలో భిన్న భిన్న మూర్తులకు భిన్న భిన్న దేవాలయాలు విడిగా

ఉన్నాయి. కామాక్షి, ఏకామ్రేశ్వరుడు, వరదరాజు మొదలైనవి అనేకం ఉన్నాయి. అన్నిటికీ వెడతాం. విష్ణ్వాలయంలో విష్వక్సేనుడు, విష్వక్సేన నామంతో పిలువబడతాడు. అతనికి నామం ఉంటుంది నుదుటిపై.

ఇక ప్రతి దేవత వినాయకుణ్ణి పూజించాడని లోగడ చెప్పాను కదా.

కనుక ఆటంకాలను తొలగించే బాధ్యత అతనికి అప్పజెప్పారు కనుక దానిని సమస్త దేవతలూ పాటించారు. పూజించారు. అందువల్ల అన్ని కోరికలను తీర్చే దేవతయని భావించక ఒక్కొక్క ఫలానికి ఒక్కొక్క దేవతను కొలుస్తున్నాం. ఇట్టి సందర్భంలో తతః హేతున్యాయాన్ని ఇట్లా అర్థం చేసుకోవాలి.

సారాంశమేమనగా ఏ దేవతను పూజించినా ముందితణ్ణి పూజించాలని అందరి దేవతలపై ఆధిపత్యం కలవాడని, ఇతర దేవతలను ఫలాలనీయ వలసిందిగా ఆజ్ఞాపించగలడని, అతని ఆజ్ఞను మిగతా దేవతలు శిరసా వహిస్తారని, అట్టి ఆజ్ఞను ఉల్లంఘిస్తే ఆటంకాలెదురౌతాయని తేలింది.

నేనిట్లా చెప్పానంటే శాస్త్రిగారి అభిప్రాయాన్ని అందించాను. అంటే ఒక్క వినాయకుణ్ణే పూజించి మిగతా దేవతలను పూజించవద్దని కాదు. రకరకాల అభిరుచులు, మనః ప్రవృత్తులుంటాయి కదా. ఆపైన ఒక్కొక్క దేవతనే పూజించడం వల్ల వారి విశ్వాసమూ గట్టిపడుతుంది. అందుకే తిరునల్లార్‌లోని శనిని పూజించడం, మకర సంక్రమణకాలంలో అయ్యప్పను ఆరాధించడం విశేషంగా కన్పిస్తుంది. ఎవరికో గాని అద్వైత జ్ఞానం పట్టుబడదు. ఒక్కొక్క దేవతనే ఇష్టదైవంగా భావించేవారున్నా పెక్కుమందిని పూజించాలనే సాధారణంగా ఉంటుంది. అంతేకాదు, తమ ఇష్టదేవతనే రకరకాలుగా అలంకరిస్తారు.

రకరకాల రుచులను మనస్సు కోరుతుంది. కోరనీయండి. దానిని సహజ మార్గంలో పోనీయండి. అది ఒక్కదానిపై లగ్నమగునట్లు నెమ్మది నెమ్మదిగా

దీనిని నియమించండి. అనగా ఒక్కదానినే పట్టుకోవాలని నిర్బంధంగా మనస్సును బిగించకూడదు. మనస్సునకు ఒత్తిడి చేస్తే అది మన అదుపులో అస్సలుండదు. ఇట్లా పెక్కుమంది దేవతలను ఆరాధించి మనస్సులోని మాలిన్యాన్ని క్రమక్రమంగా పొగొట్టుకొనేటట్లు చేయడమే మన లక్ష్యం. ద్వైతభావన నుండి అద్వైతానికి పయనించునట్లుగా చేయడమే లక్ష్యం. ఇదంతా విఘ్నేశ్వరుడొక్కడే చాలనే తతః హేతున్యాయాన్ని వివరించడం వల్ల ఇంతగా చెప్పవలసి వచ్చింది. అంత మాత్రంచే ఇతర దేవతలను భజించకూడదని కాదు. ఈ శ్లోక రచయిత కూడా పెక్కు దేవతలను భజించినవాడే. ఇట్లా చెప్పినవాడు శివుణ్ణి అర్చించాడు కదా!

ఏదో బౌద్ధిక స్థాయిలో (Intelectual Plane) చెప్పితే సరిపోదు. మనకు మనస్సుంది కదా. భక్తి విషయం వచ్చేప్పటికి బుద్ధికి అవకాశం ఉండదు. అందువల్ల మనం ప్రాథమిక దశలో ఉన్నాం కనుక ముందుగా అందర్నీ కొలుద్దాం. ఇష్ట దైవాన్ని భజిద్దాం. ఏది మనకు తృప్తి నిస్తే అట్లా కొలుద్దాం.

శ్లోకం చివరలో అనేక దేవతలను భజించవడం వల్ల వచ్చే అన్ని ఫలాలను వినాయకుడిస్తాడని ఉంది. సర్వార్థ ప్రతిపాదనైక చతురో ద్వైమాతురో. అనగా నాల్గు పురుషార్థాలను ఇస్తాడని ఉంది.

ఇద్దరు తల్లుల ముద్దుల బిడ్డడు (ద్వైమాతురుడు)

పై శ్లోకంలో మన స్వామి, ద్వైమాతురుడని పేర్కొనబడ్డాడు. అనగా ఇద్దరు తల్లులు కలవాడు. ఎప్పుడైనా ఒకనికి ఇద్దరి భార్యలున్నట్లు వింటాం. కాని ఒకనికి ఇద్దరు తల్లులుండడమేమిటి? అమ్మవారు తల్లియని తెలుసు.

ఈశ్వరుని నెత్తిపైనున్న గంగను అతనికి రెండవ భార్యగా తలుస్తాం. సౌందర్య లహరిలో శంకరులు, అమ్మవారి నేత్రాలు క్రోధాన్ని, అశ్చర్యాన్ని

భయాన్ని, అసూయను ప్రదర్శిస్తున్నాయని; ఈశ్వరుని నెత్తిపై నున్న గంగను చూచినప్పుడు కోపమని సరోషా గంగాయం అని చెప్పారు (51 శ్లో). ఎవరీ గంగ? ఆమె నా తండ్రి భార్య. కాబట్టి ఆమెను కూడా తల్లిగా భావిస్తానని ప్రేమతో అంటాడట వినాయకుడు. అందువల్ల ద్వైమాతురుడు.

అంతకంటె సుబ్రహ్మణ్యుని గంగాతనయుడని అనడం మేలు, గంగనుండి పుట్టాడు కనుక. శివుని నేత్రం నుండి నిప్పురవ్వలు వచ్చాయని వాటిని గంగ భరించిందని, అపుడు సుబ్రహ్మణ్యుడవతరించాడని అందరికీ తెలుసు. కనుక అతడు గాంగేయుడు.

ఇట్లా గంగతో వినాయకునకు ప్రత్యక్షంగా సంబంధం లేకపోయినా ఆమెను తల్లిగా భావించాడు. ఇది అతని ప్రేమతత్త్వాన్ని, స్నేహ తత్త్వాన్ని ప్రకటిస్తోంది. స్త్రీలనందరినీ తల్లులుగా భావించిన స్వచ్ఛమైన బ్రహ్మచారి.

ఏనుగుకి నీళ్ళంటే చాలా ఇష్టం. ఇట్లా గుణ్ణం, పెద్ద పులి, సింహం ఉండవు. బురదలో పొర్లాడదానికి ఇష్టపడతాయి గేదెలు. పెద్ద శరీరంతో నీళ్ళలో ఈత కొట్టడానికి ఇష్టపడుతుంది ఏనుగు. అవి గుంపులుగా నదుల వద్దకు వెళ్ళడం, అందులో జలకాలాడటం మనకు తెలిసిందే. అట్టి దృశ్యాన్ని మనం గజేంద్ర మోక్ష ఘట్టంలో చూడవచ్చు.

ఒకనికి ఆర్గురు తల్లులు

వినాయకునకు ఇద్దరు తల్లులైతే అతని తమ్ముడైన సుబ్రహ్మణ్యునకు ఆర్గురు తల్లులు. అతడు షాణ్మాతురుడు. అందు అమ్మవారు, గంగ లేరు. వీరు కృత్తికానక్షత్రానికి అధి దేవతలైన ఆర్గురు తల్లులు. వీరే ఇతనికి పాలనిచ్చారు. వీరిని తల్లిగా భావించాడు కనుక అతడు కార్తికేయుడయ్యాడు.

అయ్యప్ప విషయంలో వివాదం

ఇక పరమేశ్వరుని మూడవ సంతానమైన అయ్యప్పకు తల్లి ఎవరు? ఇతనికి రాను రాను భక్తులధికమౌతున్నారు. ఇతడీశ్వరునకు, మోహిని అవతారమెత్తిన విష్ణువునకు కలిగిన బిడ్డ.

16వ శతాబ్దంలో అప్పయ్యదీక్షితులనే మహానుభావులుండేవారు. ఆయన వంశంలో మన్నారు గుడి శాస్త్రిగారు పుట్టారు. దీక్షితుల వారద్వైతియైనా శివభక్తిని ప్రచారం చేసారు. వారి కాలంలో శివ ద్వేషం బాగా ఉండేది. అందువల్ల అట్టి వారిని ఎదుర్కొనడం వీరి లక్ష్యమైంది. తాతాచార్యులనే వైష్ణవుడు ఆకాలంలో వుండేవాడు. విజయనగర రాజులతనిని పోషిస్తూ ఉండేవారు. అతడు వైష్ణవ మతవ్యాప్తిని తీవ్రంగా కొనసాగిస్తూ ఉంటే దాని నెదుర్కొనడం కోసం దీక్షితులు తీవ్ర ప్రయత్నం చేసారు. కాని వీరికి విష్ణు ద్వేషం లేదు. విష్ణువును పరమాత్మ స్వరూపంగానే భావించేవారు. యుక్తులతో, శాస్త్రాధారంతో విష్ణువు, రత్నత్రయంలో ఒకడని నిర్ధారించారు కూడా.

ఒకనాడు రాజు, తాతాచార్యులు, దీక్షితులు ఆలయానికి వెళ్ళారు. ఆ రాజు రామరాయలుగాని, లేక వెల్లోర్‌కి చెందిన చిన్న బొమ్మ నాయకుడు గాని కావాలి. లేదా తంజావూరునకు చెందిన వీర నరసింహ భూపాలుడైనా కావాలి. ఆలయంలో అయ్యప్ప విగ్రహముంది. అతణ్ణి శాస్త అని కూడా అంటారు. అది చిత్రమైన విగ్రహం. ముక్కుమీద వేలు వేసుకొన్నట్లుగా ఆ విగ్రహముంటుంది, ఏదో ఆలోచిస్తున్నట్లుగానూ ఉంటుంది.

చిత్రంగా ఉన్నాడేమిటని రాజు ప్రశ్నించాడు. అక్కడున్న భక్తులు, ఇది పురాతన విగ్రహమని; శిల్పికి ఇట్లా మూర్తి సాక్షాత్కరించడం వల్ల మలిచాడని అన్నారు. రాబోయే కాలంలో అన్నీ తెలిసిన విద్వాంసుడు వచ్చి శాస్త యొక్క బాధను వెల్లడి చేస్తాడని అప్పుడు మిగతా విగ్రహాల మాదిరిగా ముక్కు

మీద వేలు ఉండకుండా ఉంటుందని అన్నాడట. అప్పటికే ఎందరో విద్వాంసులు వచ్చారు. రకరకాల కారణాలను చెప్పినా మునుపటి మాదిరిగానే విగ్రహం ఉందన్నారు. ఎవ్వరూ ఇంతవరకూ ఆ వ్రేలును క్రిందకు దింపలేక పోయారని అన్నారు. రాజు తాతాచారి వంక చూసాడు. దానికి కారణాన్ని ఇట్లా శ్లోకరూపంలో ఆయన అందించాడు:

విష్ణోః సుతోహం విధినా సమోహం ధన్యస్త్వతోహం సురసేవితోహం

తథాపి భూతేశ సుతోహమేతైః భూతైః వృతైః చింతయతీహ శాస్తా

శ్లోకంలో శాస్త ఇట్లా అన్నాడని ఉంది: "నేను విష్ణువు యొక్క తనయుణ్ణి. కనుక బ్రహ్మతో సమానం. అందువల్ల దేవతలచే పూజలందుకొంటున్నాను" కాని...?

శ్లోకంలో తథాపి, అనగా అయినా అని అర్థం. ఇందువల్ల శివునకు సంబంధించిన విషయాలలో తల దూర్చనని తాతాచార్యులగారి అభిప్రాయం.

శాస్త ఏమి చెప్పి యుంటాడు? నేను శివుని కుమారుణ్ణి కూడా అనాలి కదా. **తథాపి భూతేశ సుతోహం** అని అనాలి. శివునకు చాలా పేర్లున్నాయి. శివ, ఈశ్వర, శంభు, పశుపతి మొదలైనవి. ఇన్ని పేర్లున్నా భూతేశ పదం వాడబడింది. అనగా భూతాలకు నాయకుడని; అట్టి వాని కొడుకునయ్యానని బాధపడినట్లు తాతాచార్యులూహించారు.

భూతాల ఆధిపత్యం అంటే అది అతని శక్తిని, అధికారాన్ని సూచించడం లేదా? పరమేశ్వరుడు భూతాలను నియమిస్తాడు, మంచివారిని బాధించకుండా చేస్తాడు. అట్లా వారిని రక్షిస్తున్నాడు కదా! భూతాలను ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించకుండా చేస్తున్నాడు కదా.

అతడు భూతేశుడే కాదు, మహదేవుడు కూడా దేవతలలో గొప్పవాడు. దేవతలపై ఆధిపత్యాన్ని తన కొడుకైన సుబ్రహ్మణ్యునకు అర్పించాడు. అంటే

సేనాధిపత్యం. భూతాలను రెండుగా చేసి అందొక దానికి గణపతిని నియమించాడు. గణపతి స్తోత్రంలో భూత గణాధిసేవితం అని అంటాం. మరొక విభాగానికి అయ్యప్పను నియమించాడు. కేరళలో అయ్యప్పను భూతేశుడని అంటారు.

భూతాలను అదుపులో పెట్టడం శాస్త్రకు గర్వకారణమైన బిరుదు. క్షుద్ర శక్తులను గ్రామాలలో చొరబడకుండా చేస్తాడు. ప్రజల బాధలనుండి విముక్తులను చేస్తాడు. శివ సంబంధమైన వాటిని చెప్పడానికి తాతాచార్యుల వారికిష్టముండదు కనుక ఇట్టి భూతాలకు అదినాథుడైన ఈశ్వరునకు కొడుకునయ్యానని బాధపడుతున్నట్లు వ్రాసాడు. ఏతైః భూతైర్వృతః = భూతాలచే చుట్టుబడినవాడు అని. చింతయతీహశాస్తా అని శ్లోకాన్ని ముగించాడు. ఇట్టి కర్మం దాపురించిందని బాధపడుతున్నట్లు ముగించాడు. అందువల్ల ముక్కుపై వ్రేలు వేసుకున్నాడు.

శ్లోకం చెప్పినా ముక్కుమీద వ్రేలును శాస్త తొలగించలేదు. భూతాలనుండి గ్రామాన్ని రక్షించడం బాధపడవలసింది కాదు. గర్వకారణం.

ఇక దీక్షితులవైపు చూసాడు రాజు. ఈయనా శ్లోక రూపంలో సమాధానమిచ్చాడు.

అంబేతి గౌరీం అహమాహ్వయామి పత్న్యః పితుః మాతర ఏవ సర్వాః

కథంను లక్ష్మీం ఇతి చింతయంతం శాస్తారమీడే సకలార్థ సిద్ధ్యై

తా: శివుని భార్యయైన గౌరిని తల్లియని పిలుస్తున్నాను. "అంబ ఇతి అహ్వయామి;" కాని మోహిని రూపంలో విష్ణువుండడం వల్ల మోహినియే నా తల్లి. తండ్రి యొక్క భార్యలందరూ నాకు తల్లులే కదా! గణపతి, గంగను తల్లియని అనలేదా?

పరాశక్తితో నాకున్న సంబంధాన్ని నేను సందేహించడం లేదు. కారణమేమంటే ఈశ్వరుడు నా తండ్రి, విష్ణువు నా తల్లి. పత్న్యః పితుః మాతర ఏవ సర్వాః=తండ్రి భార్యలందరూ నా తల్లులే.

కాని ఒక విషయంలో సందేహం ఉండిపోయింది. ఈ బాంధవ్య విషయంలోనే. ఏమది? ఎవరితో నా బాంధవ్యాన్ని బాహాటంగా చెప్పలేకపోతున్నాను? లక్ష్మితోనున్న సంబంధాన్ని, లక్ష్మిని ఎట్లా సంబోధించను? = కథంను లక్ష్మీం? ఇది శాస్త యొక్క సందేహం. అందువల్ల ముక్కుపై వ్రేలు వేసుకున్నాడు. దీనికి సమాధానం మనకు తెలియదు ఎట్లా?

ఎవరు లక్ష్మి? విష్ణుని భార్య. విష్ణువెవరు? శాస్తతో అతనికున్న సంబంధమేమిటి? మహావిష్ణువు మోహినీ అవతార మెత్తాడు. పరమేశ్వరునితో కూడడం వల్ల శాస్త పుట్టాడు. అందువల్ల శాస్త, హరిహరపుత్రుడయ్యాడు. అయితే ఈ శాస్తకు లక్ష్మికి ఉన్న సంబంధమేమిటి? అంటే తల్లి యొక్క భార్యయని అనాలి కదా?

తండ్రి యొక్క భార్యయని, మేనమామ యొక్క భార్యయని విన్నాం. తల్లి యొక్క భార్యయనే మాటను విన్నామా? ఇప్పుడు శాస్త లక్ష్మిని ఎట్లా సంబోధించాలి?

'కథంను' లో 'ను' సందేహాన్ని తెలివిడి చేస్తోంది. 'ఇతి చిం' తయంతం శాస్తారం = ఇట్లా అయ్యప్ప బాధపడుతున్నాడు. ఈడే = స్తుతిస్తున్నాను.

సకలార్థ సిద్ధ్యై శాస్తారమీడే = సకల పురుషార్థాలను ప్రసాదించే శాస్తను నుతిస్తున్నానని దీక్షితులు శ్లోకాన్ని ముగించారు.

లోగడ విఘ్నేశ్వర స్తుతిలో 'సర్వార్థ ప్రతి పాదన చతుర' అని విన్నాం. శాస్తకు సంబంధించిన శ్లోకంలో సకలార్థ సిద్ధియని అంటున్నాం. ఇట్లా ఇద్దరికీ సంబంధం ఉంది. వినాయకుని స్తోత్రం వ్రాసినవాడు దీక్షితుల వంశంలో జన్మించిన మన్నారు గుడి శాస్త్రిగారే. శాస్త శ్లోకాన్ని దీక్షితులు వ్రాసేరు.

దీక్షితుల శ్లోకంలో ఒక దేవత పెద్దయని, ఒకదు తక్కువ వాదని లేదు. అమ్మవారిని, లక్ష్మిని కలిపి వాదాడు. తన బుద్ధివైభవాన్ని చూపించదమే కాకుండా అన్ని పురుషార్థాలు పొందాలంటే శాస్త్రను భజించాలని భక్తితో అన్నాదు.

మరో మాట ఏమిటంటే ఇది తెలియని ప్రశ్నల ద్వారా ఆదే ఆటలా ఉంది. ఈ చిక్కు సమస్యను ఎవరూ విప్పలేరు కూదా.

ఇక ఆ వ్రేలు క్రిందకు వచ్చింది. ఇట్లా విగ్రహం, మామూలుగా మారదాన్ని చూసినవారూ ముక్కుమీద వ్రేలు వేసుకొని ఆశ్చర్యపోతారు కదా!

పరమేశ్వరుని పెద్ద కొదుకును చెప్పబోయి మిగిలిన పిల్లలను తడిమాం. ఇది బాగుంది.

విఘ్నేశ్వరుదు రక్షించుగాక

ఇట్లా 'సర్వార్థ ప్రతిపాదనైక చతురో...' తో న్యాయేందు శేఖర గ్రంథంలోని శ్లోకం పూర్తి అవుతుంది. తతః హేతున్యాయం ఉగ్గడింపబడింది కదా.

ఒకదు నవాబు గారిని యాచించదానికి అతదున్న భవనానికి వెళ్ళాదట. కాసేపు ఆగు; నవాబుగారు నమాజ్‌కి వెళ్ళారని జవాబు వచ్చింది. నాకు కావలసింది అదగదానికి నవాబు దగ్గరకు వచ్చాను. అతనికేదో కావాలని అల్లాను ప్రార్థిస్తున్నాదు. అటువంటప్పుదు ఒక యాచకుదు, మరొక యాచకుడ్ని అదగదానికి బదులు తిన్నగా అల్లానే అదుగవచ్చు కదా అని తిరిగి వెళ్ళిపోయాదట.

అట్లా అందరు దేవతలూ వినాయకుడ్ని విఘ్నాలు లేకుండా ఉందాలని వేదుకొంటున్నారు కదా. ఏవో చిన్న కోరికలను వేదుకోవదానికి బదులు తిన్నగా విఘ్నేశ్వరుడ్ని వేదుకోవచ్చు కదా అని పై శ్లోకం వల్ల తెలియవస్తోంది.

చంద్రకళతో స్వామి ఆడుకున్న రోజు

మైసూర్ రాష్ట్రంలో, చామరాజనగర్‌లో రామశాస్త్రి అనే కవి యుండేవాడు. రావణ సీతా సంభాషణాన్ని సీతారావణ సంవాదంగా వ్రాసేడు. ఆమె తక్కువగానే మాట్లాడుతుంది. ఇందు రావణ సుదీర్ఘ సంభాషణయే యుంటుంది. ఆవిడ విని చాలా తక్కువగా మాట్లాడి తిరస్కరిస్తుంది. ప్రతి శ్లోకంలోనూ మూడు పంక్తుల సంభాషణ, రావణునిది. మిగిలిన పాదం, సంభాషణ సీతది. దీనిని సీతారావణ సంవాద ఝరి అని కూడా అంటారు. ఒక శ్లోకం వెంబడి మరొక శ్లోకం ఉండడం వల్ల దీనిని ఝరియని అన్నారు. ఇందు ముందుగా గణేశస్తుతి యుంది. ఈ శ్లోకంలో చంద్రమౌళియైన గణేశుని లీల ఉంది. కోపాన్ని నటించే పార్వతీ పరమేశ్వరులు ఈ లీలవల్ల ఒకటౌతారు. ఇది మంగల శ్లోకం:-

క్రీడారుష్టాద్రి జాంఘ్రి ప్రణత శివశిరశ్చంద్రఖండే కరాగ్రం
లీలాలోలం ప్రసార్య స్ఫురతరామలబిసశంఖ్యాక్రష్టుకామః
విద్యాత్ హృద్యస్మితాఖ్యాం అహమహమిక యాభిగమ్యమానః శివాఖ్యాం
కశ్చిత్ నః చింతితార్థం కలయతు కలభోబాల లీలాభిరామః

తా: గణపతి అనే పిల్ల ఏనుగు క్రీడిస్తోంది. కలభో బాలలీలాభిరామ; అట్టి పిల్లవాడు మనం కోరేది ఇచ్చుగాక నః చింతిత అర్థం కలయతు అనేది చివరిపాదం. ముందున్న మూడు పాదాలు గణపతియొక్క క్రీడను వర్ణిస్తాయి. అది అమాయకమైన క్రీడయని గాని; తుంటరిపని యనిగాని అనలేం. ఏదైనా వినడానికి బాగుంటుంది. ప్రణయ కలహం ఇందలి తత్త్వం.

కవి, పార్వతిని అద్రిజయని చెప్పి ఆమె భర్తపై లేనిపోని కోపాన్ని ప్రదర్శిస్తోంది అని చెప్పడానికి క్రీడారుష్టా అన్నాడు. అంటే సరదాగా కోపమని; అట్టి సందర్భాలలో నాయకుడు, నాయిక యొక్క కాళ్ళపైబడి వేడుకుంటాడు.

గీత గోవిందంలో రాధ పాదాలపై కృష్ణుడు పడినట్లుంది. తమిళంలోని తిరుప్పుగళ్‌లో సుబ్రహ్మణ్యస్వామి, ఆటవిక కన్యయైన వల్లి పాదాలపై పడినట్లుంది.

అసలర్థమేమిటి? జీవాత్మయే ఇక్కడి నాయిక. పరమాత్మయే నాయకుడు. పరమాత్మ నుండి బైటకు జీవుడు పోవాలనుకున్నా, పరమాత్మ తనలో కలుపు కొనేటట్లు చేస్తాడు. కనుక జీవాత్మను వేడుకొంటాడని అతని కాళ్ళపై పడతాడు. వీరిద్దరి మధ్య సఖి యుంటుంది. వీరిద్దర్నీ కలపాలని ప్రయత్నిస్తుంది. ఇద్దర్ని కలుపువాడే ఆచార్యుడు లేదా గురువు. ఆ గురువే సఖి. పైపైన ఇది ప్రేమగా కనబడినా లోతుగా ఆలోచిస్తే జీవాత్మ పరమాత్మల కలయికయే. పార్వతీ పరమేశ్వరుల బిడ్డయైన వినాయకుడు చేసాడు.

పార్వతి ఏదో ముభావంగా కూర్చొని యుంటుంది. పరమేశ్వరుడు కాళ్ళపై బడ్డాడు. ప్రణతశివ యనగా శివుడు నమస్కరిస్తున్నట్లుగా పడ్డాడని. జటతో కూడిన శిరస్సుతో పార్వతి పాదాలపై శివుడు పడగా ముందుగా చంద్రకళ యొక్క ప్రకాశం బాగానే పడింది.

పిల్ల యేనుగు సరస్సులో ప్రవేశించినపుడు తామరతూండ్లను పెకలించి అందలి నారను ఇష్టంతో తింటుంది. తామర తూడుతో బైటకు వస్తుంది. ఆ చంద్రలేఖ తామర తూడునుండి వచ్చే తెల్లని పీచులా కనబడింది గణపతికి. వెంటనే దాని నూడ బెరికి తిందామనుకున్నాడు.

అతనికి నిజంగా సందేహం కలుగుతుందంటారా? తల్లిదండ్రులను కలవడం కోసం నాటకం ఆడుతున్నాడా? శ్లోకాన్ని 'బాల లీలాభిరామ'తో ముగించాడు. 'లీలాలోలం' అనే మాట శ్లోకంలో వ్రాసాడు.

భజనలో 'లీలాలోల' అనే మాటనూ వినే యుంటారు. రాసలీలాలోల అనే మాట వినబడుతుంది. ఒకదానిని కోరి నృత్యం చేయడం లోలం.

లీలాలోలం అనే మాట వినాయకుని పూర్తి రూపాన్ని గురించి చెప్తుడు. ప్రేమతో ఆడే తుండం యొక్క చివరి రూపాన్ని వర్ణిస్తుంది. శ్లోకం తరువాతి భాగంలో లీలాభిరామంగా వర్ణింపబడ్డాడు. ఏనుగు యొక్క ఒక అవయవమైన తుండం ఆటలాడాలని ఉవ్విళ్ళూరుతోందట. కరాగ్రం లీలాలోలం అని ఉంది. తుండంతో ఏనుగు దేనినైనా పీల్చగలదు, నొక్కగలదు, బ్రద్దలు కొట్టగలదు. ఇట్లా చెబుతూ ఉంటే తుండం తనంతట తనకే ప్రాణం ఉన్నట్లు అది ఆడాలని కోరికతో ఉన్నట్లు పైకి కన్పిస్తుంది.

తామర తూడులోని దారాల మాదిరిగా చంద్రుడుంటాడు. రెండూ చల్లగానే ఉంటాయి. దాని దారాల మాదిరిగా చంద్రకిరణాలూ ఉంటాయి.

పరాశక్తి, మనలోని కుండలినిగా తామర తూడులోని దారంగా ఉంటుంది. 'బిసతంతు తనీయసీ' అని లలితాసహస్ర నామాలలో ఒక నామం, అమ్మవారికుంది.

తామర తూడులోని పీచు మాదిరిగా ఉండే చంద్రకళను వినాయకుడు పెకలిద్దామనుకున్నాడు. తుండాన్ని చాచాడు. చంద్రకళ శివుని తలనుండి పార్వతి పాదాలను తాకుతోంది.

తన తలపై ఉన్న చంద్ర కళను పీకాలని ప్రయత్నించే తనయుని చేష్టను చూసి సంతోషిస్తాడు శివుడు. అట్టి దృశ్యాన్ని చూస్తే మనమూ సంతోషిస్తాం. శివుడే లీలా వినోదుడు కదా! ఇక వినోదాన్ని కలిగించే పిల్లవానిని చూసి సంతోషించడా? అతడు చంద్రకళా విభూషితుడైనా తన పిల్లవాడు లాగుతూ ఉంటే సంతోషించడా?

ఇక తల్లి ఎట్లా సంతోషిస్తుంది? తండ్రి కంటె తానే ఎక్కువగా సంతోషిస్తుంది. బాగా జరిగింది, బాగా జరగవలసిందే, తన భర్త నెత్తిపైనున్న చంద్రకళ ఊడవలసిందే అనుకోదా?

ఇట్లా లీలావినోదం కలిగించే పిల్లవానిని చూసి వారిద్దరి కోపం పోయి, హాయిగా నవ్వు కొన్నారట, శ్లోకంలో 'హృద్య స్మితాభ్యాం' అని ఉంది. అంటే కేవలం నోటితో నవ్వడం కాదు. అతడామె సేవకుడని నటించడం కాదు, వారి హృదయాలూ విచ్చుకొన్నాయి, విచ్చుకొని నోటితో నవ్వారన్నమాట 'హృద్యా'.

ఇద్దరూ పిల్లవాణ్ణి ఒక్కమాటే ముద్దాడదామని అనుకున్నారు. హృద్యా స్మితాభ్యాం అహమహమికయా ఆలింగ్యమానః శివాభ్యాం. హాయిగా నవ్వుతూ నేనంటే నేనని ముద్దాడాలని ముందుకు వచ్చారు.

ఒక్కమారే ముద్దు పెట్టుకున్నారు. పిల్లవాణ్ణి ముద్దు పెట్టుకోవడంలో తల్లిదండ్రులు పొందే ఆలింగన భాగ్యాన్ని తిరుక్కురల్ కూడా ప్రశంసించిది. శకుంతలను విడిచి పెట్టిన దుష్యంతుడు, కణ్వాశ్రమంలోని తన కొడుకైన భరతుణ్ణి చూసీ చూడడంతోనే కౌగలించుకొనాలని బుద్ధి పుట్టిందని, తొడపై కూర్చుండబెట్టుకొన్నపుడు అతనికి కలిగిన ఆనందాన్ని వర్ణించాడు కాళిదాసు. అట్లాగే లవకుశులను రాముడు కౌగలించుకున్నట్లు భవభూతి ఉత్తర రామచరితంలో వర్ణించాడు.

పార్వతీ పరమేశ్వరులు గణపతిని నిజంగా కౌగలించుకున్నారా? నిజంగా వీరిద్దరే కౌగలించుకున్నారు. కౌగలించుకొనేటపుడు చేతులు చాస్తారు కదా!

వారు అభినయించే కోపం కలకాలం ఉంటుందా? వారు జగత్తునకు తల్లిదండ్రులు కదా!

మనమందరమూ వారి సంతానమైనా గణపతివారికి మొదటి సంతానం. గణపతి వారిలో వారికి రాజీ కుదర్చగలడు. అందువల్ల ప్రపంచానికి క్షోభ ఉండదు. ఇట్లా తండ్రి శిరస్సుపైనున్న చంద్రలేఖను ఊడబెరికి వారినిద్దరినీ కలిపాడు.

పిల్లవాణ్ణి ముద్దుపెట్టుకునేటపుడు వారు ప్రత్యక్షంగా పరస్పరం తాకినట్లు కవి చెప్పలేదు. హృదయపూర్వకంగా నవ్వుకున్నారని అన్నాడు. కృత్రిమంగా కోపాన్ని అభినయించినవారు పరస్పరం కలుసుకున్నారని అన్నాడు.

అట్టి వినాయకుడు మన పురుషార్థాలను నెరవేర్చుగాక. నః చింతితార్థం కలయతు.

ఇందలి శ్లోకం, న్యాయేందుశేఖరంలోని శ్లోకానికి ప్రమాణంగా ఉంది.

పార్వతి, తనతో కూడాలని పరమేశ్వరుడు భావించాడు. కాళ్ళమీద పడ్డాడు. కాని వినాయకుడే అతని కోర్కెను తీర్చాడు. పై తర్క గ్రంథంలో ఈ సంవాదంలోనూ ఇందు శేఖర పదం ఉంది. చూసారా ఈ తర్కశాస్త్ర శ్లోకానికి ప్రామాణ్యాన్ని? ఇట్లా ప్రాచీన వాఙ్మయాన్ని పరిశీలిస్తే అది ఒక బంగారు గనిగా కన్పిస్తుంది.

మొదటి శ్లోకం ఏమని చెప్పింది? మనమే దేవతను భజించాలన్నా, ఆ దేవత ముందుగా వినాయకుణ్ణి భజించాలని, అందువల్ల వినాయకుణ్ణే భజిస్తే సరిపోతుంది కదాయని చెప్పింది.

ఇక రెండవ శ్లోకం అట్లా చెప్పలేదు. శంకరుడు, పార్వతి కాళ్ళపై బడినా, పార్వతి కోపాన్ని అభినయిస్తూనే ఉంది. లోపల కలవాలని ఆమెకూ ఉన్నా చివరకు వినాయకుని లీలావినోదం వల్ల హాయిగా వారు నవ్వుకొని హృదయ పూర్వకంగా కలిసారని ఉంది. అంటే ఇందు శంకరుడు ముందుగా వినాయకుణ్ణి అర్చించలేదు. పార్వతిని అర్చించినట్లైంది. కనుక అతని ప్రార్థన నెరవేరలేదు. ఎప్పుడు నెరవేరింది? వినాయకుడు వినోదాన్ని కల్గించినపుడే. అంటే వినాయకుడు ఫలాన్ని అందించాడు. అట్లాగే శంకరుని కలవాలని పార్వతి భావించినా ఆమె కోపం అడ్డు తగిలంది. వినాయకుని వల్లే ఆమె కోపం చల్లారింది. కనుక ఇద్దరి ప్రార్థనలూ ఇతనివల్ల నెరవేరాయి. ఇందువల్ల,

ఇతడేదైనా ఎవరికైనా ఈయగలడని తేలలేదా? ఇతడు ఒక్కణ్ణి అర్చించినా చాలని తేలడం లేదా?

ఇలా వీరిద్దర్నీ కలపాలని అనుకొన్నట్లుగా ముందితనిలో లేదు. వారిద్దరు కలుసుకునేటట్లు ఒక ఆట ఆడాడు. రెండు శ్లోకాలలోనూ ఇతడు స్వార్థ ఫల ప్రదాతయే.

బరువును దించుగాక, ఆశీర్వదించుగాక

మనకున్న పెద్ద ఆటంకం మన మనస్సే. కొందరేదో కోరుతారు, కొందరు బాధపడతారు. ఇది ఇట్లా చేయాలి, అది అట్లా జరగాలి అనుకున్నది జరుగుతుందో జరగదో అని ప్రతిక్షణమూ ఆలోచనలతో కొట్టుమిట్టాడుతూ ఉంటాం. మనకు మనమే ఆటంకాలని సృష్టించుకుంటూ ఉంటాం. కాని నిరంతరమూ వినాయకుణ్ణి భజించేవారికే పిల్లల అమాయక ప్రవృత్తి అలవడుతుంది. అమలిన మనస్సు లభిస్తుంది.

అట్టి శుద్ధ మనస్సుంటే ఏ బాధలూ, విచారమూ ఉండదు. అపుడు మనకేదైనా సంతోషించే సంఘటన ఎదురైతే ఒక నవ్వు నవ్వి ఊరుకుంటాం. విషాదం కలిగినపుడు ఒక్క ఏడుపు ఏడ్చి ఉత్తర క్షణంలో మర్చిపోతాం. అసలు పిల్లవాడు ఏడ్చే సమయం కంటె నవ్వే సమయమే ఎక్కువుంటుంది. అట్టి పిల్లవానిగా మనం మారిపోతే మనకంటె అదృష్టవంతులెవ్వరుంటారు? ఇక సంతోషంతో అణుమాత్రమూ బాధ లేదు కదా! అందుకే స్వామి ఎంతో బరువున్నా మానసికంగా తేలికగా ఉంటాడు.

దుఃఖాలూ, కోరికలే బరువు కాదు. తనను తాను చూసి గర్వించుట కూడా బరువే. నిజం చెప్పాలంటే ఇదే అసలైన పెద్ద బరువు. అనగా అహంకారం. ఏదో దుఃఖం కలిగినపుడు ఇది పోతే బాగుండునని అనుకుంటాం.

కాని అహంకారం బరువుగా కనబడకుండా ఎక్కువ బరువుతో ఉంటుంది. అసలు అది బరువని తెలియదు. ఇంకా తగ్గించకుండా దీనినింకా పొడిగించి మిక్కిలి బరువగునట్లు చేస్తున్నాం. మనం చెప్పుకోవలసింది ఏమీ లేకపోయినా ఏదో చేసినట్లు భావించి నానా అల్లరి చేస్తాం. ఎవడైనా సరిగా చేయకపోతే నేనైతేనా ఇట్లా చేసి యుండేవాణ్ణని బీరాలు పల్కుతాం, మనం అధమంగా చేసినా సరే! ఈవిధంగా చాలా బరువును మనమే మోస్తున్నాం. ఇట్టి కర్తృత్వ భావన నుండి దూరంగా ఉండడమే చేయవలసింది.

దేవతల ఆటంకాలను పోగొట్టానని వినాయకుడు గర్విస్తాడా? అతడెట్లా ఉంటాడు? తండ్రి నెత్తిమీదున్న చంద్రకళను లాగుతూ ఉంటాడు. తల్లి దండ్రులను కలిపినా నా అంత మొనగాడెవ్వడూ లేడని అంటున్నాడా? అతడేనుగు ఆకారం ధరించినా అతని మనస్సు తామర తూడులోని దారం మాదిరిగా తేలికగా ఉంటుంది.

ఆ రెండు శ్లోకాలూ వ్రాసి మనకెంత ఆనందాన్ని కల్గించారో! అట్టి వినాయకుడు మన కోరికలను నెరవేర్చు గాక. మన మనస్సులు తామర తూడులో దారాలలా తేలికగా ఉండుగాక.

16 నామాలు

అన్ని ఆటంకాలకూ విరుగుడు:

విద్యారంభంలో, వివాహంలో, క్రొత్త ప్రదేశానికి వెళ్ళేటపుడు, తిరిగి వచ్చేటపుడు, యుద్ధంలో ఇట్లా అన్ని కార్యాలలో స్వామిని పూజిస్తే ఎట్టి ఆటంకాలు లేకుండా ఉంటాయని ప్రసిద్ధి శ్లోకం:

విద్యారంభే, వివాహేచ, ప్రవేశే, నిర్గమే తథా

సంగ్రామే, సర్వకార్యేషు విఘ్నః తస్య న జాయతే

'విద్యారంభే' – విద్యను నేర్చుకునేటపుడు, అనగా బ్రహ్మచర్యాశ్రమంలోనూ, 'వివాహేచ' అనగా గృహస్థాశ్రమంలోనూ ఆటంకాలు ఉండవు. కొందరే సన్యాసం తీసుకుంటారు-గనుక మొత్తం జీవితంలో ఎట్టి ఆటంకాలూ ఉండవు.

జీవితమంటే ఏమిటి? ఇందెన్నో మార్పులు, కదలికలు; మనస్సుతో, వాక్కుతో, శరీరంతో, బుద్ధితో, డబ్బుతో ఎన్నో పనులుంటాయి. జీవితం అంటే అంతా కదలికయైనా శరీరం యొక్క కదలికలే బాగా కన్పిస్తాయి. ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి బయలుదేరడం స్పష్టంగా కన్పిస్తుంది. అట్లాగే ఒకచోటునుండి మరొక చోటుకు రావడం అందుకే ప్రవేశే, నిర్గమే తథా అని శ్లోకం. ప్రవేశమనగా ఒక చోటునకు వెళ్ళుట, నిర్గమం అనగా తిరిగి వచ్చుట. ఇక ఈ కదలికలలోనూ ఆటంకం ఉండదంటున్నాడు.

జీవితం గురించి, మరొక నిర్వచనం జీవితమొక సంఘర్షణ యని పత్రికల వల్ల తెలుస్తోంది. డార్విన్, హెర్‌బెర్ట్ స్పెన్సర్ సిద్ధాంతాల ప్రకారం సంఘర్షణ నుండే జీవనం ఆరంభమైందని అంటారు.

మనం గమనిస్తే ఈ కదలికకు, ఈ సంఘర్షణలకు దగ్గర సంబంధం ఉంది. ఒక కదలిక, ఒకనికే ఉంది, మిగిలినవన్నీ కదలకుండా ఉంటే అతడు హాయిగా తన కిష్టం వచ్చినచోటుకు వెళ్ళగలడు. (అన్ని కదలికల గురించి చెబుతున్నా). ఇది అభ్యాసంలో ఉందా? అందరికీ విశ్రాంతి లేని కదలికలే ఉన్నాయి. అచేతనాలలోనూ కదలిక ఉంది. అణువులోనూ నిరంతరం కదలిక యుంది. ఇట్లా చేతన అచేతన వర్గాలన్నీ కదిలేటపుడు పరస్పరం సంఘర్షణ ఉండదా? ఇట్టి సంఘర్షణ ఒకదానికొకటి పొసగక పోవడమే కదా!

అసలు మూలాన్ని అన్వేషిస్తే చేతనంగాని, అచేతనం గాని కదలికలో నుండుటయే సంఘర్షణ. శాంతి కలిగినపుడు ఎట్టి కదలిక లేకపోవడాన్ని గమనిస్తున్నాం. శాంతి లేనపుడు సంఘర్షణయే. యుద్ధం, శాంతి పరస్పర విరుద్ధాలని మనం అనడం లేదా?

అసలు జీవితమే ఒక సంఘర్షణ కాగా ఇది ఇద్దరు యుద్ధం చేసినపుడు స్పష్టంగా గోచరిస్తోంది. అందువల్ల 'సంగ్రామే' అని శ్లోకం. అంటే యుద్ధం. అట్టి సంగ్రామంలో కూడా విఘ్నాలుండవని, విజయం వరిస్తుందని శ్లోకార్థం.

దీనినింకా పొడిగిస్తే అన్ని రంగాలలోనూ విజయమే. ఇంకా ఈ అర్థాన్ని పొడిగిస్తే సంపూర్ణత్వం వస్తుందని అనగా సమాధి స్థితి కల్గుతుందని, అది కదలిక, సంఘర్షణ లేని స్థితియని తెలుస్తుంది. విద్యారంభమనగా బ్రహ్మచర్యాశ్రమమని, వివాహే అనగా గృహస్థాశ్రమమని; అన్నాం. ఆత్మ సమాధి యనినపుడు సన్న్యాసాశ్రమమని అర్థం.

ఫలానా ఆశ్రమమని చెప్పకుండా అన్ని కార్యాలలోనూ "సర్వ కార్యేషు" అని విఘ్నం లేకుండా అని చెప్పింది.

సర్వ కార్యేషు విఘ్నః తస్య నజాయితే

ఒక విషయాన్ని రకరకాలుగా చెప్పినపుడు మన మనస్సులో బాగా నాటుకుంటుంది. దేంట్లోనూ విఘ్నం ఉండదని అంటే నాటుకోదు. ఇక అన్నిటిలో విఘ్నం ఉండదని చెప్పినపుడు బాగా నాటుకుంటుంది.

విఘ్నాలు లేకుండా చేసే ఆ వ్యక్తి ఎవరు? అతనికున్న నామాలెన్ని?

షోడశైతాని నామాని యః పఠేత్ శృణుయాదపి

అనగా వినాయకుని 16 నామాలను ఎవరు పఠిస్తారో లేదా వింటారో వారికి వారి పనులలో ఆటంకాలుండవని. ఈ పదహారింటిని కంఠస్థం చేయాలి. చేయలేనివారు చదవడం వల్లగాని, వినడం వల్ల గాని లాభం పొందవచ్చు. అంతేకాదు, అనేక నామాలున్నాయి స్వామికి. 21 దళాలతో అర్చిస్తాం. 21 నామాలను పల్కుతాం. 21 దూర్వలతో అర్చిస్తాం. కాని శ్లోకంలో 16 నామాలే చెప్పబడ్డాయి.

16 గొప్పదనం

16నకు ప్రాధాన్యం ఉంది. చంద్రుడు షోడశకళాపూర్ణుడు కదా. అమావాస్యనుండి పూర్ణిమ వరకూ చంద్రునకు 16 కళలుంటాయి. 16వ కళ వచ్చేది పూర్ణిమనాడే. 16 ఉపచారాలు చేస్తాం. ఏడుగురు దేవులను కొలిచేటపుడు సప్తమాతృకలని అంటాం. అట్లాగే షోడశ మాతృకలూ ఉన్నాయి. అమ్మవారి మంత్రాలలో షోడశాక్షరికి ఉన్నతస్థానం ఉంది. అందువల్ల అమ్మవారు షోడశి.

తమిళనాడులో ఆశీర్వదించేటపుడు 16తో ఉండి గొప్ప జీవితాన్ని గడుపమని అంటారు. ఇక్కడ పదహారు మంది పిల్లలతో ఉండమని కాదు. మంచి జీవితం గడపాలంటే 16 మంచి లక్షణాలుండాలని. భర్తతో కూడిన స్త్రీని వైదికంగా దీవించునపుడు పదిమంది పిల్లలను కను భర్తను పదనొకండవ పిల్లవానిగా చూడుమని దీవిస్తారు.

పూజ చేసేటపుడు ముందుగా సంకల్పం చెబుతారు. ఫలానా వాటిని ప్రసాదించుమని ప్రార్థిస్తారు. ఇక 16తో ఉండడమేమిటి? భాగ్యం, స్థిరత్వం, వీర్యం, విజయం, దీర్ఘజీవనం, మంచి ఆరోగ్యం, సంపద ఇవన్నీ మొత్తం కుటుంబానికి ఉండాలని; అనగా ఏడయ్యాయి. తరువాత ధర్మ, అర్థ, కామ, మోక్షములు - కలిపి నాలుగు. కోరికలు నెరవేరుట, మంగలకరమైనవి సిద్ధించుట, పాప పరిహారం కలిపి మూడు; పిల్లలు, మనుమలు వృద్ధిలోనికి రావడం, చివరకు ఏ దేవతను పూజిస్తున్నాడో అతని అనుగ్రహం లభించుట - ఇట్లా మొత్తం పదహారయ్యాయి. ఇందు ప్రాపంచికమైన కోర్కెలే ఉంటున్నాయి. కాని జ్ఞాన వైరాగ్యాలను కలుపుతారు.

మంచి జీవితం కావాలంటే పై 16 ఉండాలి. స్వామికీ 16 నామాలున్నాయి చూసారా?

షోడశనామ శ్లోకాలు

స్వామికి ప్రధానంగా 16 నామాలు. సుముఖ, ఏకదంత, కపిల, గజకర్ణక, లంబోదర, వికట, విఘ్నరాజ, వినాయక, ధూమ్రకేతు, గణాధ్యక్ష, ఫాలచంద్ర, గజానన, వక్రతుండ, శూర్పకర్ణ, హేరంబ, స్కంద పూర్వజ – అనేవి.

సుముఖశ్చైక దంతశ్చ కపిలో గజకర్ణకః

లంబోదరశ్చ వికటో విఘ్నరాజో వినాయకః

ధూమ్రకేతుః గణాధ్యక్షః ఫాలచంద్రో గజాననః

వక్రతుండః శూర్పకర్ణో హేరంబః స్కందపూర్వజః

ఈ శ్లోకం తరువాత షోడశైతాని నామాని అనే శ్లోకం వస్తుంది.

విఘ్నేశ్వరుడు అనేక రూపాలనెత్తాడు. దానికి తగ్గట్లు షోడశగణపతులూ ఉన్నారు.

ఈ 16 నామాలూ, 16 గణపతులను సూచిస్తాయని పరిశోధన చేయగా కానవస్తోంది. షోడశనామాలలో మూడవది కపిలుడు. అనగా ఎరుపున్న రూపం (నీల పీతమిశ్రిత వర్ణమని కొందరు, గోరోచన వర్ణమని కొందరంటారు). కాని ధ్యాన శ్లోకంలో ఇతనికి శరత్కాలపు కాంతి యున్నట్లు వర్ణింపబడింది. ఇక పదహారవ నామం హేరంబుడు. ఇందులోనూ అభిప్రాయ భేదాలున్నాయి కనుక ఈ రెండూ భిన్న వర్గానికి చెందుతాయి. సరేసరి.

సుముఖ

ఇది మొదటి పేరు. ఎవరినైనా మనం ఆహ్వానిస్తున్నపుడు సుముఖ పిలవాలి. అనగా మంచి ముఖం. అట్టి ముఖంతో ఉన్నపుడు ప్రే......,

సంతోషాన్ని చూపించగలం. అవి హృదయంలో ఉంటే ముఖంలో ప్రతిబింబిస్తాయి. Face is the index of the mind అని ఆంగ్లంలో ఉంది కదా. విఘ్నేశ్వరునకు ప్రేమను వ్యక్తీకరించే ముఖం ఉంది. మంచి మనస్సును ప్రకటింపచేసేది సుముఖం.

శుక్లాంబరధరం శ్లోకంలో ప్రసన్నవదనం అని ఉంది కదా. అది సుముఖం. ప్రేమ, సంతోషం ప్రతిబింబించినపుడు ప్రసన్నవదనమౌతుంది. అంతేకాదు, స్పష్టత, ఆత్మవిశ్వాసం, కాంతి ఉంటే ప్రసన్నవదనమౌతుంది. సుముఖ శబ్దంలో 'సు' ఉంది. అదీ ప్రసన్నత్వాన్ని సూచిస్తుంది.

విఘ్నేశ్వరుడే రూపంలో ఉన్నా అతడు సుముఖంగానే ఉంటాడు. ఏనుగు ముఖం ఉండడం వల్ల ఈ సుముఖత్వం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. అందేదో ప్రత్యేకత దాగియుంది. ఎంతసేపు చూసినా తనివి తీరని లక్షణమేదో ఉంది. ముఖం విశాలంగా, ఆహ్వానిస్తున్నట్లుగా, పరమశాంతంగా చెప్పనలవి కాని రీతిలో ఉంటుంది. అందువల్ల ప్రత్యేకంగా అతనికి నప్పింది.

మానవముఖం కాక, ఏనుగుముఖం ఎందుకు వచ్చింది?

ఏ రూపాన్నైనా ధ్యానించవచ్చనే మాటను బట్టి నరముఖ గణపతిని కూడా ధ్యానించొచ్చు అను కొంటాం. చిదంబరంలోని దక్షిణ వీధిలో ఇట్టి విగ్రహముంది. తెలిసినవాళ్ళు చెబితేగాని తెలియదు. కాని మనం చటుక్కున నమ్మలేం. తిరుచిరాపల్లిలో ఒక బాతికోట ఆలయంలో నరముఖంతో ఉన్నాడు.

కొన్ని కథలననుసరించి అతని రూపం నరుడే యని ఉంది. అమ్మవారు తన భవనానికి ఒక రక్షకుణ్ణి నియమించాలని అనుకొందట. తన శరీరాన్ని పసుపు సున్నిపిండితో రుద్దుకుందట. దానితో ఒక బొమ్మను చేసి దానికి ప్రాణం పోసింది. అతణ్ణి కాపలాగా ఉంచి స్నానానికి వెళ్ళింది.

అమ్మవారు అన్నివిధాలా పవిత్రమైనదే కదా. కనుక మంగళకరమైన పసుపుతో నలుగు బెట్టుకోవడం వల్ల అసలు వినాయకుడు పసుపువల్లనే ఏర్పడ్డాడు. అందుకే ముందుగా పసుపు విఘ్నేశ్వరుణ్ణి చేసి కొలుస్తాం.

పరమేశ్వరుడు పార్వతి భవనానికి వచ్చాడు. ఎవరీ మగవాడని గద్దించాడు. ఏమీ తెలియనట్లు కోపపడి అతని తలను నరికాడు. అన్నీ తెలిసి ఇట్లా ఎందుకు చేసాడు? అది లోక క్షేమం కోసమే. అది నాటకంలో ఒక భాగం వంటిది. గజముఖాసురుడనే రాక్షసుడుండేవాడు. పేరునుబట్టి గజముఖంతో ఉన్నవాడనే కదా అర్థం. మానవులకు పుట్టని గజముఖం కలవాడే నన్ను సంహరించగలడనే వరాన్ని అది ఎలాగూ సాధ్యం కాదనుకొని పొందాడు. అపుడు కైలాసంలో ఉత్తరంవైపు తల పెట్టుకొని పడుకొన్న ఏనుగు కనబడింది. అట్లా పెట్టి పడుకోవడం లోకానికే అశుభం. దానిని చంపి ఆ తలను ఈ పిల్లవానికి అతికి నాటకం ఆడాడు శివుడు. మరల దానికి ప్రాణంబోసి అమ్మవారిని సంతోషపెట్టాడు. ఇట్లా వినాయకుని నిమిత్తంగా చేసుకొని గజముఖ సంహారం జరిగేటట్లు లోకాన్ని రక్షించాడు, శంకరుడు.

ఆనందరూపుడు

వినాయకుడు నవ్వుతూ కన్పిస్తాడు. సంతోషం పూర్ణత్వాన్ని సూచిస్తుంది. సదాశివ బ్రహ్మేంద్రులు 'సతతం ఆనందపూర్ణ బోధోఽహం' అని 'సచ్చిదానంద పూర్ణ బోధోఽహం' అని గానం చేస్తూ ఉండేవారు. సంతోషంగా ఉంటే నవ్వుతూ ఉంటాం. ఆడుతూపాడుతూ ఉంటాం. దుఃఖపడుతున్నవాడు గంతులు వేయగలడా? గణపతి ఆనంద స్వరూపుడు కనుక అతడు నృత్త గణపతి. చాలా శివాలయాలలో గర్భగుడికి ఉన్న దేవతా ప్రతిమలలో

ప్రధానంగా ఈ నర్తనమూర్తి కన్పిస్తాడు. పెద్ద బొజ్జతో నృత్యం చేస్తున్నట్లుగా ఉంటాడు. ఆనందాన్ని ముఖమే కాదు బొజ్జ కూడా సూచిస్తుంది.

ముఖం అనగా ఆరంభమని అర్థం. సుముఖ పదంతో మొదలు పెట్టబడ్డాడు కూడా.

మంచి నోరు కలవాడు

ముఖానికి నోరని అర్థం కూడా ఉంది. సంస్కృతంలో నోటికి విడిగా పేరు లేదు. మాట్లాడడానికి ప్రధానమైన ముఖానికి అన్ని పేర్లు. ఉచ్చరించే దానికే పేరు లేదు చూసారా?

ముఖమనగా నోరని ప్రస్తుతం చెప్పదలచుకున్నాను. సుముఖం అనగా మంచి నోరు. ఏమిటిది? మంచి మాటలు మాట్లాడేది సుముఖం. కనుకనే మంచి విద్వాంసుణ్ణి సుముఖుడని అంటాం. ఇట్లా అర్థం చేసుకుంటే గణపతి సుముఖుడే. ఆయన గొప్ప విద్వాంసుడు కదా! విద్వాంసుడనేమాట వేదాలలో బ్రహ్మణస్పతి, బృహస్పతి పదాల ద్వారా వ్యక్తీకరింపబడింది.

ఇతనికి అనేక రూపాలలో విద్యాగణపతి రూపం ఒకటి. వినాయక చవితి నాడు పూజా కల్పంలో 21 రూపాలకున్న నామాలు, 21 రకాల పువ్వులతో అర్చించాలని ఉంది. ఇందులో విద్యాగణపతికి రసాల పుష్పంతో పూజించాలని ఉంది. రసాలమనగా మామిడి. ఆత్మకు విద్యయే పండు వంటిది. నారదుడు ఒక పండును తీసుకొని వచ్చి చూపించగా ఎవరు ప్రపంచాన్ని ముందుగా చుట్టి వస్తారో వారికి పండు నిస్తానని ఆశ చూపించాడు. అందు గణపతి జయించినట్లున్న కథ మనకు తెలిసిందే. జ్ఞాన ఫలానికి గుర్తే ఆ మామిడి పండు.

ఏనుగు నోరు - దాని తత్త్వము

ఏనుగు నోటికి ఒక ప్రత్యేకత ఉంది. నరులకు, జంతువులకు పెదవులను కదిపితే నోరు కన్పిస్తుంది. కన్నులకు రెప్పలుండి అవి పైకి క్రిందకు కదులుతూ కన్నులను రక్షిస్తూ ఉంటాయి. కన్నులు చూడడానికి కనురెప్పల పని యేమీ లేదు. కాని మాట్లాడడంలో పెదవులకు పాత్ర ఉంది. నాల్క, పండ్లు, పెదవులవల్లనే మాట్లాడగల్గుతున్నాం. శబ్దం వినబడుతోంది. ప, మ, అనే ధ్వనులు పెదవుల కలయిక వల్లనే సాధ్యం. వాటిని ఓష్ఠ్యములని అంటారు. ఆంగ్లంలో అట్టి అక్షరాలను Labial అంటారు.

నోటిని కప్పేది ఏనుగు యొక్క తుండమే. నోటిని, చేతితో కప్పుట వినయాన్ని సూచిస్తుంది. చేతితో నోటిని కప్పుతాం. కాని ఏనుగు సహజమైన తుండంతోనే నోటిని మూస్తుంది. అది నోట్లో ఆహారం వేసినపుడు, కాని ఇంక ఏదైనా కారణం వల్లగాని తుండం ఎత్తినపుడు దాని నోటిని చూడగలం. ఇందులో చాలా తత్త్వం ఇమిడి యుంది. తుండంతో కప్పబడిన నోరు, ఏమని సూచిస్తోంది? పాండిత్యం ఎంత ఉన్నా, వాగుడుతనం లేకుండా ఉండాలని తప్పనిసరియైనపుడు మాత్రమే ప్రదర్శించాలని అదే సరియైన విద్వాంసుని లక్షణమని సూచించడం లేదా! అనగా పాండిత్యానికి మౌనమే చివరి మెట్టు.

ఏకదంతుడు - త్యాగానికి నిదర్శనం

ఏకదంతుడనగా ఒక దంతం కలవాడు. సాధారణంగా మగ ఏనుగులకు రెండు దంతాలుంటాయి. ఆడ ఏనుగులకు దంతాలే ఉండవు. కాని వినాయకుడు ఏక దంతుడేమిటి?

అతనికి మొదట్లో రెండు దంతాలున్నాయి. కుడివైపున ఉన్న దంతాన్ని తాను ఊడబెరుకున్నాడు. అది విగ్రహాలలో క్రిందనున్న కుడిచేతిలో ఉన్నట్లుగా ఉంటుంది. ఎందుకీ పనిచేసాడు? పురాణాలలో రెండు కథలున్నాయి. ఒక

కథ ప్రకారం వ్యాసుడు భారతాన్ని చెబుతూ ఉండగా విఘ్నేశ్వరుడు హిమాలయపు రాతిపై వ్రాయవలసివచ్చిందట. వ్రాసే సాధనమేమీ లేదు. అందువల్లనే తన దంతాన్ని విరిచి కలంగా ఉపయోగించాడట. దేనిని ఏనుగు గొప్పగా భావిస్తుందో దానినే విరిచి త్యాగం చేసాడని త్యాగగుణాన్ని ప్రశంసించే కథ ఇది.

మరొక కథ ప్రకారం గజముఖాసురుడు ఏ ఆయుధం వల్ల చంపబడలేదట. అందువల్ల తన దంతాన్నే పెరికి ఆయుధంగా గణపతి ప్రయోగించాడట. లోక క్షేమం కోసం తన అవయవాన్నే వినియోగించాడు. ఇంద్రునికి వృత్రాసురుని చంపడానికి వజ్రాయుధం కావాలి. దధీచి తన వెన్నెముకనే ఇచ్చి దాని నట్లా వాడు కొమ్మన్నాడు. దంతం, ఏనుగు యొక్క ఎముకయే కదా! దధీచి మాదిరిగా ఇతడూ ఎముకనిచ్చి లోకాన్ని కాపాడాడు.

అతనితో స్త్రీత్వం

ఒక దంతంతో ఉండడంలోనూ ఒక తత్త్వం దాగియుంది. దేవతాత్మం, స్త్రీ పురుషాత్మకం. ఒక ప్రక్క దంతం కలిగియుండి పురుషునిగా, మరొక ప్రక్క దంతం లేక స్త్రీ లక్షణంతో ఉన్నట్లే కదా! అతని తల్లిదండ్రులు అర్ధనారీశ్వర స్వరూపులే. తానూ అర్ధనారీశ్వరునిగా కనబడుతున్నాడు. శివుని అర్ధనారీశ్వర తత్వంలో కుడివైపున మగవాడు, ఎడమవైపున ఆడది ఉండగా వినాయకునిలో మార్పుతో ఉంది. ఇతని కుడివైపున దంతం లేకపోవడం వల్ల స్త్రీగా, ఎడమవైపున పురుషునిగా ఉన్నట్లుంటుంది.

విఘ్నేశ్వర గాయత్రి

ప్రతి దేవతకు గాయత్రీ మంత్రం ఉంది. ఉపనయనంలో ఉన్న గాయత్రీ మంత్రానికి సవిత, దేవత. ఆమెయే పరమాత్మ శక్తి. ఇందు 24

అక్షరాలుంటాయి. అందరు దేవతలకూ అట్లా అక్షరాల సంఖ్య ఉంటుంది. వారి గాయత్రీ మంత్రంలో దేవత పేరుంటుంది. మొదటి భాగంలో ఒక పేరు చెప్పి అట్టి దేవతను తెలిసికొందుము గాక అని యుంటుంది. రెండవ భాగంలో ఆ దేవత యొక్క మరొక పేరు చెప్పి అట్టి దేవతను ధ్యానింతుము గాక అని యుంటుంది. మూడవ భాగంలో మరొక పేరు చెప్పి ఆ దేవత మమ్ములను సన్మార్గమున నడిపించును గాక అని ఉంటుంది.

గాయత్రీ మంత్రంలో సవితకు రెండు భాగాలలోను ధ్యానింతుము గాక అని యుండి మూడవ భాగంలో పేరు చెప్పకుండా అట్టి దేవత, బుద్ధులను ప్రేరేపించుగాక అని యుంటుంది.

మహా నారాయణోపనిషత్తులో పెక్కు గాయత్రీ మంత్రాలు చెప్పబడ్డాయి. పరమ శివ, విఘ్నేశ, సుబ్రహ్మణ్య, నందికేశ్వర గాయత్రులున్నాయి. ముందుగా తత్పురుష అని యుంటుంది. కాని అథర్వవేదంలో విఘ్నేశ్వరునకు ప్రత్యేక గాయత్రి ఉంది. దానిని గణపత్యథర్వశీర్షం అంటారు. అందొక గణపతి గాయత్రి ఉంది. ఇందులో ముందుగా ఏకదంత అనే పదముంది.

కపిల - తిరు చెంగట్టాన్ కుడిలో వినాయకుడు

మూడవ నామం కపిలుడు. కొద్దిగా ఎఱుపు డాలుండే రూపమది.

గణపతి, పెక్కు రంగులలో కన్పిస్తాడు. శుక్లాంబరధరం శ్లోకంలో చంద్రకాంతి వంటి తెలుపుతో ఉన్నట్లు వర్ణింపబడ్డాడు. కుంభకోణం దగ్గర ఉన్న తిరు చెంగట్టాన్ కుడిలో. తిరుతురై పూండి దగ్గర ఉన్న ఇదుంబనంలో శ్వేత వినాయకులున్నారు. అవ్వైయార్, తన స్తోత్రాలలో స్వామిని నీలం రంగుతో ఉన్నట్లు, మరొక చోట పగడపు రంగుతో ఉన్నట్లు వర్ణించింది. ఆమెకు అనేక వర్ణాలతో ఉన్న మూర్తి సాక్షాత్కరించాడు. ఉత్తర దేశంలో

సాధారణంగా సిందూరంతో ఉంటాడు. తంజావూరు జిల్లాలో గణపతీశ్వరం అని ఉంది. ఇందు ముఖ్యమైన పదం సెంకాడు అనగా ఎఱ్ఱని అరణ్యమని. గణపతి, గజాసురుని చంపినపుడు అసురుని రక్తం అరణ్యంలో ప్రవహించగా అది ఎఱ్ఱనైంది. స్వామి కూడా ఎఱ్ఱనయ్యాడట. అది శుద్ధమైన రక్తవర్ణం కాదు. ఏనుగు శరీరానికి రక్తం పులిమితే ఎట్లా ఉంటుందో అట్టి వర్ణం.

గొప్ప యోధుణ్ణి చంపి రక్తం కారేట్లుగా చేయడం వల్ల ఇతనికి బ్రహ్మహత్యా దోషం చుట్టుకొందిట. అతనికి అసలు దోషం ఉంటుందా? లోకానికి చూపడం కోసం బ్రహ్మహత్యాదోషం ఉన్నట్లుగా నటించాడు. రావణుని చంపి రాముడట్లా బాధపడినట్లు కనబడలేదా? దానికి ప్రాయశ్చిత్తంగా రామలింగాన్ని స్థాపించి పూజించలేదా? అట్లాగే గణపతి అక్కడొక ఈశ్వర లింగాన్ని ప్రతిష్ఠించి పూజించాడని దోషం నుండి విముక్తుడయ్యాడని కథ. రాముడు శివపూజ చేసినచోట రామేశ్వరమైనట్లు, తిరు చెంగట్టాన్‌కుడి, గణపతీశ్వరంగా ప్రసిద్ధిని పొందింది.

వాతాపిగణపతి - చారిత్రిక వివరాలు

ఈ వాతాపి గణపతిని అగస్త్యుడు అర్చించాడు. వాతాపియనే రాక్షసుడు మోసపూరితంగా అగస్త్యుని ఉదరంలో ప్రవేశించుట, అతడు జీర్ణం చేసుకొనుట మనకు తెలిసిందే. వాతాపి నివసించిన చోటు, చంపబడినచోటు, వాతాపి అని పిలువబడుతుంది. కర్ణాటకలోని బీజాపూర్ జిల్లాలో బాదామి అనే ప్రాంతమే ఇది. ఇది చాళుక్యుల రాజధాని.

చాళుక్య సామ్రాజ్యంలో పులకేశి అనే పేరు కలవారిద్దరున్నారు. చాళుక్యుల తామ్ర శాసనాలు సంస్కృతంలో; జాతి శాసనాలు కన్నడంలో ఉంటాయి. కన్నడంలో పులకేశిని పోలేకేసి అన్నారు. ఇట్లా చాలా పదాలు ప్రాంతీయ

భాషలలో ఉన్నా వారు రాజులైన తరువాత వారి పేర్లు సంస్కృతీకరింపబడతాయి. కనుక సంస్కృతంలో ఇతడు పులకేశి. చరిత్ర కారులు పులకేశిన్ అన్నారు. పులకేశి అని సంస్కృతంలో ఉందని అట్లా ఆంగ్లంలోనూ వ్రాసేరు.

పులకేశి యనగా సంతోషంతో నిక్కబొడుచుకున్న వెంట్రుకలు కలవాడని అర్థం. పులకాంకితుడని విన్నాం కదా. అట్లా సాహస కృత్యాలు చేసి రాజులు, పులకాంకితులయ్యేవారు. ఇతరులకు గగుర్పాటును కలిగించి అనగా పులకాంకితులగునట్లుగా చేసేవారు.

చెప్పబోవు కథలో మహేంద్రవర్మ పల్లవుడనే గొప్ప రాజుకు బద్ధ విరోధి రెండవ పులకేశి. ఈ పల్లవ రాజుకంటె ఉత్తర దేశంలోని హర్షవర్ధనుడు ఇంకా గొప్పవాడు. హర్ష శబ్దం, పులకేశి పదాన్ని తలపింపచేస్తోంది. పులకేశి, హర్షుణ్ణి తరమివేసాడు. పులకేశికి కన్నడంలో అసలు నామం, ఎరాయమ్మ. రాజైనపుడు తాతపేరును గ్రహించి హర్షవర్ధనునకు బద్ధ శత్రువైనాడు.

వెంట్రుకకు అలకమని సంస్కృతంలో అంటారు. యక్షరాజైన కుబేరుడు అలకేశ్వరుడు. అతని రాజధాని అలకాపురి. హృషీకేశ, పులకేశి, అలకేశన్ అనే పదాలు రోమాంచిత లక్షణాన్ని, గొప్పదనాన్ని సూచిస్తాయి.

రెండవ పులకేశి, దగ్గర బంధువుచే మోసగింపబడి రాజ్యాన్ని కోల్పోయాడు. తరువాత అమితశక్తితో అతణ్ణి జయించి గద్దెనెక్కాడు. చాళుక్య రాజులందరిలో ప్రసిద్ధిని పొందాడు. సత్యాశ్రయుడనగా సత్యానికి ఆశ్రయుడనే బిరుదు వహించి పరిపాలించాడు. దండెత్తిన హర్షవర్ధనుని తరమివేసాడు. నర్మదకు ఉత్తరపు వైపున అతడు పరిపాలించ వలసి వచ్చింది.

ఆనాటి కాలంలో దక్షిణ దేశంలో ఒక పల్లవ రాజుండేవాడు. అతడు మహేంద్ర వర్మన్. అతడు వ్రాసిన మత్తవిలాస ప్రహసనంలో తాను మహేంద్ర

విక్రమ వర్మనని వ్రాసుకున్నాడు. గొప్ప రసజ్ఞుడు. సంగీత శిల్ప పోషకుడు. అట్టివానిపై పులకేశి దండెత్తి, కోటకే అతణ్ణి పరిమితమగునట్లుగా చేసాడు. అట్లా విజయం సాధించాడు.

పులకేశి చేతిలో ఓడింపబడడం అతనికి అవమానకరమైంది. పగ తీర్చుకోకుండానే కన్ను మూసాడు. అతని కొడుకు నరసింహవర్మ. అతనికే మామల్లన్ అనే బిరుదుండేది. అతడు వాతాపిపై దండెత్తి చాళుక్యుల నోడించాడు. ఆ నగరాన్నే ధ్వంసం చేసాడు.

క్షత్రియులలో మంచి లక్షణాలున్నా వారిలోని క్షాత్రగుణం, శత్రుత్వంగా మారి వారి మనస్సులను చెడగొడుతుంది.

క్షత్రియుల పేర్ల చివర వర్మ అని ఉంటుంది. అనగా అసలర్థం కవచమని... కవచం ధరిస్తారు కనుక వర్మలయ్యారు. అంతేకాదు, దేశాన్ని; జీవితాన్ని పోగొట్టుకొనైనా రక్షిస్తారు కనుక వర్మలయ్యారు. పై వర్మలో అట్టి లక్షణం కంటె శత్రుత్వమే ప్రధానమై కన్పించింది. చాళుక్యులూ ఈ విషయంలో పల్లవులకు తక్కువ వారేమీ కాదు. పగబట్టి కాంచీపురాన్ని ధ్వంసం చేసారు. వంద సంవత్సరాల తరువాత రెండవ విక్రమాదిత్యుడు కంచిపై దండెత్తాడు. కంచిలో కైలాస నాథాలయ నిర్మాణం జరిగిన కాలమది. విక్రమాదిత్యుడు తలుచుకుంటే కంచిని, అందలి ఆలయాన్ని ధ్వంసంచేసి యుండేవాడు. కాని ఆ పని చేయలేదు. శివమంత్ర దీక్షాపరుడు. శివభక్తి వల్లనో, పోషకుడవడం వల్లనో గాని అట్టి పాడు పని చేయలేదు. అంతేకాదు, దండెత్తి తిరిగి వచ్చిన తరువాత కైలాసనాథ ఆలయ ప్రతిబింబమా అన్నట్లుగా విరూపాక్షాలయాన్ని నిర్మించాడు. తమిళ దేశంనుండి శిల్పులను ఆహ్వానించి వారిని గౌరవాదరాలతో చూసాడు.

వాతాపిని జయించిన నరసింహవర్మ దగ్గరకు వెడదాం. అతని సైన్యాధిపతి, పరంజ్యోతి, మహామాత్ర అనే బ్రాహ్మణ శాఖకు చెందినవాడు. వీళ్ళు వైదిక

మార్గాన్ని విడిచిపెట్టి మిగిలిన లౌకిక వ్యవహారాలలో ఆరితేరియుండేవారు. పరంజ్యోతి, శివాలయం ఉన్న తిరుచెంగట్టాన్ కుడికి చెందినవాడు. అతనికి వినాయకుని పట్ల భక్తియుండేది. వాతాపిని జయించి తిరిగి వచ్చేటపుడు అనేక వస్తు వాహనాలతో అక్కడి గణపతిని కూడా వెంట తీసుకొని వచ్చాడు. కళింగ యుద్ధం తరువాత అశోకునిలో ఎట్టి మార్పు వచ్చిందో ఇతనిలోనూ అట్టి మార్పు కనబడింది. ఇక సైన్యాధిపత్యానికి స్వస్తి చెప్పి స్వగ్రామంలో శివభక్తితో కాలం గడిపేవాడు. వాతాపినుండి తెచ్చిన గణపతి విగ్రహాన్ని తిరుచెంగట్టాన్ కుడిలో ప్రతిష్ఠించి సిరు తొండనాయనార్‌గా ప్రసిద్ధుడయ్యాడు. ఇట్లా తీసుకొని రాలేదనే అభిప్రాయమూ ఉంది. విగ్రహం యొక్క లక్షణాలను బట్టి వాతాపినుండి వచ్చిందని నిర్ధారణ చేసారు. వాతాపిలోనున్న విఘ్నేశ్వరుని పట్ల అచంచల భక్తి యుండడం వల్లనే వాతాపిని జయించగలిగాడని తిరిగి ప్రతిష్ఠించాడనీ కొందరన్నారు. అతడు కారణ మగుటచే ఇది వాతాపి గణపతి అయిందని అన్నారు. మరొక అభిప్రాయం ప్రకారం వాతాపి నుండి మూర్తిని తీసుకొని వచ్చినా మూలాధార క్షేత్రమైన తిరువారూర్‌లో ప్రతిష్ఠించాడని కొందరన్నారు.

గజాననతత్వం - అగస్త్యుడు

అగస్త్యునకు గణపతికి గట్టి సంబంధం ఉంది. ఇద్దరికీ పెద్ద బొజ్జలే. బొటన వ్రేలంత పొట్టివాడు అగస్త్యుడు. ఇక మన స్వామి వామన రూపుడే కదా.

వామనరూప మహేశ్వర పుత్ర
విఘ్నవినాయక పాద నమస్తే

వామనరూపం అంటే గుజ్జు రూపమే కదా. ఇక అతడు వక్రతుండ

మహాకాయుడు కూడా. అంటే ఒకమూల గొప్ప శరీరం కలవాడు, మరొక విధంగా అతడు వామనరూపుడు కూడా. అంటే చిన్నవాడూ ఆయనే, పెద్దవాడూ ఆయనే. అణువు ఆయనే. మహత్తూ ఆయనే.

హంపిలో రెండు పెద్ద విఘ్నేశ్వరమూర్తులున్నాయి. ఒకటి పది అడుగులు, మరొకటి ఇరవై అడుగుల ఎత్తుతో ఉంటాయి. అయితే ఆ మూర్తుల పేర్లు ఆవగింజంత వినాయకుడు, కంది బద్దంత వినాయకుడు అని ఉంటాయి. అతడు విశ్వరూపుడని, అట్టి మూర్తిని చూపించలేమని కనుక ఈ చిన్నిమూర్తినే చూపించామని అంటారు. ఆ మాటలను (ఆవగింజ, కందిబద్ద అని) వినయంతో అంటారు.

అగస్త్యుడు, కావేరీ నదిని కమండులువులో బంధించాడు. విఘ్నేశ్వరుడు కాకిరూపంలో వెళ్ళి దానిని తన్ని కావేరిని ప్రవహించునట్లు చేసాడు. అగస్త్యునకు కోపం వచ్చింది. కాని తన్నినవాడు వినాయకుడని తెలిసి అతనికి భక్తుడయ్యాడు. ఇప్పుడు వాతాపి కథ చెప్పుకొందాం. వాతాపి, ఇల్వలులనే ఇద్దరు రాక్షసులుండేవారు. వారు నరమాంసానికి అలవాటు పడ్డారు. ఇక మంత్ర పూతమైన శరీరాలు గల మహర్షుల మాంసం అంటే వారికి మరీ ఇష్టం. మోసం చేసి వారిని చంపుతూ ఉండేవారు. అందులో పెద్దవాడు, బ్రాహ్మణ వేషం వేసుకొని మా ఇంటికి ఆతిథ్యానికి రమ్మనేవాడు. ఋషి నమ్మేవాడు. తప్పని సరియైతేనేగాని ఋషులు అతీంద్రియ శక్తిని వాడరు. వాతాపి తినే ఆహారమయ్యేవాడు. ఇక తమ్ముడు "వాతాపి బయటకు రా" అని అంటే మేకరూపం ధరించి అవతలి వాని పొట్టను చీల్చుకొని వచ్చేవాడు. ఇద్దరూ కలిసి ఆ ఋషిని తినేవారు. అగస్త్యుని దగ్గర కూడా ఆ మోసం చేద్దామనుకున్నారు. అతడు నిరంతరం వినాయకుణ్ణి స్మరిస్తూ ఉండేవాడు. అందువల్ల వారి పన్నాగాన్ని పసిగట్టేడు. వెంటనే 'వాతాపి! జీర్ణోభవ' అన్నాడు. అందువల్ల వాతాపి తిరిగి రాలేదు.

ఇతడు వినాయకుని పూజించడం వల్ల లోకానికి ఉపకారం చేసినవాడయ్యాడు. ఆ సందర్భంలో ఆవిర్భవించినవాడే వాతాపి గణపతి. అగస్త్యుడు తిరువారూర్ వెళ్ళి అక్కడ ఈ గణపతిని ప్రతిష్ఠించాడు. ముత్తుస్వామి దీక్షితులు, ఈ గణపతి మీదనే వాతాపి గణపతిం భజే అనే కీర్తనను వ్రాసేరు. అంతేనే కాని తిరుచెంగట్టాన్ కుడిలో నున్న గణపతి మీద కాదని గుర్తించండి. పాటలో మూలాధార క్షేత్రం అని వస్తుంది. తిరువారూర్, పృథ్వీక్షేత్రం కనుక మూలాధారక్షేత్రమే.

గజ కర్ణకుడు

తరువాతి నామం ఏనుగు చెవులున్న గజకర్ణకుడు. అతణ్ణి గజముఖు డనినపుడు ఏనుగుల చెవులతో ఉంటాడు కదా! మరల చెప్పాలా?

మిగతా విగ్రహాలలో చెవులకు చుట్టూ ఉన్న నాల్గవ భాగం భుజాలవరకూ వ్రేళ్ళాడుతూ ఉంటుది. సాధారణంగా చెవులు కనబడవు. వాటికి వ్రేళ్ళాడే కుండలాలే కన్పిస్తాయి. వినాయకుడు భిన్నంగా ఉంటాడు. చెవులు విప్పుకొన్నట్లుగా, వింజామరల మాదిరిగా అతని పెద్ద తలకు అతకబడి నట్లుంటాయి.

అట్లా ఎందుకున్నట్లు? మన ప్రార్థనలను బాగా ఆలకిస్తాడని, ఆ చెవులు కనబడకపోతే ఏం ప్రయోజనం! విస్తరింపబడిన చెవుల వల్లనే నేను మీ ప్రార్థనలను వింటున్నానని చెప్పకనే చెబుతున్నాడన్నమాట.

జంతువులకు చెవులు ఒక గిన్నె మాదిరిగా ఉంటాయి. ఏనుగునకే విసన కర్రల మాదిరిగా ఉంటాయి. మిగతా జంతువులకు శబ్దం చెల్లాచెదురు గాకుండా లోపలికే పంపునట్లుగా గిన్నె మాదిరిగా ఉంటాయి. అయితే ఏనుగులకు ఆ ఇబ్బంది లేదు. అవి సూక్ష్మమైన శక్తి కలవి.

అది చెవులని అటూ ఇటూ ఆడిస్తూ ఉంటే చూడముచ్చటగా ఉంటుంది. జంతు ప్రపంచంలో ఇట్లా ఆడించగల శక్తి ఒక్క ఏనుగునకే ఉంది. పశువులు కూడా అప్పుడప్పుడు చెవులును కదిలిస్తూ ఉంటాయి. పురుగులను తోలుతూ ఉంటాయి. కాని ఏనుగు మాదిరిగా చేయలేవు. అట్లా పురుగులను తోలడానికి అవి కష్టపడవు కూడా. కాని ఏనుగు సహజంగానే త్రిప్పగలుగుతుంది. అందుకే గజాస్ఫాలన మన్నారు. గజ తాళమనీ ఉంది. తాళం అంటే తాటాకు. విసనకర్రగా ఉంటుంది. సంగీతంలో తాళం ఉంటుంది కదా! ఎవరైనా మనుషులు అట్లా చెవుల నాడించగలిగితే అది ఒక అద్భుతకృత్యమే. ఏదైనా ఎవ్వరూ చేయలేని దానిని గజకర్ణం ఉన్నా చేయలేదని అంటారు. అంటే చెవులు త్రిప్పలేదని. మనం చేయలేనిదానిని అతడు చేస్తాడు. కనుక అతనికి గజకర్ణకుడని పేరు.

ఏనుగు చెవులను అట్లా త్రిప్పడం ఊరకే కాదు. దానికీ ఒక లక్ష్యం ఉంది. దీనినుంచి ఒక్కొక్కప్పుడు మదం కారుతూ ఉంటుంది. ఆ సమయంలో చీమలు, పురుగులు మూగుతాయి. వాటిని తరమడం కోసం భగవంతుడే వీటికి చేటలంత చెవులనిచ్చాడు.

గణేశ పంచరత్నంలో శంకరులు, మదం కారుతున్న వినాయకుని కపోలాలను 'కపోల దాన వారణం' అని వర్ణించారు.

అతని చెక్కిలినుండి కారే మద జలం సంతోషం వల్ల, దయవల్ల కూడా. అది మధురంగా ఉంటుంది. దీని రుచి కోసం తుమ్మెదలు మూగుతాయి. ఈ మాటను శంకరులు ఇలా అన్నారు. గలత్ దానగండం మిలత్ భృంగషండం

ఆ తుమ్మెదను కోపంతో తరుముతున్నాడా? ఆ పిల్ల దేవతకు ఇది కూడా ఆటయే. తుమ్మెదలు వచ్చి ఆటలాడుకుంటున్నాయి. అసలితణ్ణి చూడడం తోనే అవి నృత్యం చేస్తాయి. అవి అట్టి మకరందాన్ని పానం చేయాలా?

పిల్లల చెవులలో కూతలు కూసి మనం ఆడుకోమా? అవి ఝుంకారం చేస్తూ ఉంటాయి. అవి ఎందుకు వచ్చాయో స్వామికి తెలుసు. వాళ్ళను తరుముతున్నట్లుగా సరదాగా చెవులనాడిస్తాడు. ఆ గాలికి వెళ్ళి పోతూ ఉంటాయి. తిరిగి వస్తూ ఉంటాయి. దీని మదంపై ఆ గాలి చల్లదనాన్ని ఇతనికి కలిగిస్తుంది.

రాఘవ చైతన్యుడనే ఒకాయన, మహా గణపతి స్తోత్రం వ్రాసేరు. అందు మంత్ర శాస్త్ర రహస్యాలే కాదు, కవిత్వపు సొగసులూ ఉన్నాయి. అతడు చెవులనాడించడం, తుమ్మెదలను గెంటివేస్తూన్నట్లు ఆటలాడుకోవడాన్ని వర్ణించాడు.

తానా మోదవినోదలుబ్ధ మధుపప్రోత్సారణావిర్భావత:

కర్ణాందోళనఖేలనో విజయతే దేవోగణ గ్రామణీ

చెక్కిళ్ళపై మదం కారేటపుడు వచ్చే సుగంధాన్ని తానామోదం అంటారు. ఆ సువాసనకు తుమ్మెదలు మూగాయి. ఆ మదాన్ని త్రాగాలని అనుకున్నాయి. లోభంతో ఉన్నాయి. 'లుబ్ధమధుప'. లేదా ఆ సుగంధాన్ని ఆస్వాదించడంలో తమను తామే మరిచిపోయాయి.

స్వామి వాటిని తరమాలని అనుకున్నాడు. అనగా ప్రోత్సారణం. అందుండి ఒక ఆట పుట్టింది. అనగా ఖేలనం. ఏమిటా క్రీడ? కర్ణాందోళన ఖేలనం. అంటే చెవులను అటూ ఇటూ కదపడం. ఆ ఊపు ఆందోళన స్వామిని ఊయెలలో పెట్టి అటూ ఇటూ ఊపుతూ ఉంటారు. అదే డోలోత్సవం.

తుమ్మెదలను తరిమే స్వామి ఇంకా అందంగా ఉన్నాడట. బాగా ప్రకాశిస్తున్నాడట. 'విజయతే' గెలిచిన వాని మాదిరిగా నాయకునిగా ఉన్నాడట. మూగే తుమ్మెదలను గెంటివేసి గెలిచాడు కదా.

ఇక్కడ స్వామిని గణగ్రామణి అని అన్నాడు. గ్రామణి అంటే ఒక గుంపునకు పెద్ద. గ్రామానికి అధిపతి గ్రామణి. శివగణాలకు పెద్ద అగుటచే గణపతి – గణేశ – గణాధిప – గణనాయక – అనే పదాలను తలపింపచేస్తోంది. ఇక్కడ ఉన్న గ్రామణి శబ్దం.

అతడు గణ గ్రామణియైనా, గణాలతో చుట్టబడియున్న అతనికెవ్వరూ విసరనవసరం లేదు. తన చెవులను తానే ఆడిస్తున్నాడు. అందువల్ల చామర కర్ణుడయ్యాడు.

మూషిక వాహన మోదక హస్త చామరకర్ణ:

అతడు గజకర్ణకుడవడం వల్ల అతడు విసురు కొనగలడు. అతడే కారణం, సాధనం, కర్త కూడా.

లంబోదర: వ్రేలాడే ఉదరం కలవాడు లంబోదరుడు. పెద్ద కడుపున్నవాడు. విదేశీయులితనిని Pot-bellied God అని పిలుస్తారు. చేతిలో మోదకం, అందు పూర్ణం ఉంటాయి. ఆ పూర్ణం అతని పూర్ణత్వాన్ని సూచిస్తుంది. విశ్వంలోని గ్రహాలు గుండ్రంగానే ఉంటాయి కదా.

మోదకం, అందులో తీపి పదార్థం దానిపై పిండి తొడుగూ ఉంటుంది. మోదకమంటే సంతోషమని, సంతోషాన్నిచ్చేదని. అతడు సంతోషంతో ఉంటాడు. సంతోషాన్ని కల్గిస్తాడు కూడా. ఆ తీపియే అతని ప్రేమను సూచిస్తుంది. గుండ్రని బొజ్జతో ఉండి తనలో ప్రేమ అనే తీపి పదార్థం ఉన్నట్లు కన్పిస్తాడు. పూర్ణమని ఎప్పుడైతే అన్నామో దానికి మొదట, తుద – అంటూ ప్రస్తావించం. అందుకే బ్రహ్మమును పూర్ణుడని అంటాం. ఇతడూ పూర్ణుడే.

ఎవరికైనా వ్రేలాడుతూ ఉన్న బొజ్జ కనిపిస్తే ఏదో తృప్తిగా ఉంటుంది. ఒక చిన్న పిల్లవాడు అట్లా ఉంటే ఇంక చూడముచ్చటగా ఉంటుంది. బక్కచిక్కిన పిల్లవాణ్ణి చూస్తే అట్టి తృప్తి కల్గుతుందా? శరీరానికి గుణాలకు సాధారణంగా

లంకె పెడుతూ ఉంటాం. వ్రేలాడే బొజ్జ గలవాణ్ణి చూస్తే బుజు ప్రవర్తన ఉన్నట్లు భావిస్తాం. అంతేకాదు, అతణ్ణి చూసి నవ్వుతాం కూడా. వినాయకుడట్లా సుముఖుడై మనలనూ నవ్విస్తూ ఆనందాన్ని కల్గిస్తున్నాడు. లంబోదరునిగా ఎందుకున్నాడు? మనుష్యులు నానా సమస్యలతో ఉక్కిరి బిక్కిరౌతున్నారు. ఎవరికీ వేదాంత బోధ అంటే వారి మనస్సు లగ్నం కాదు. కాసేపు నన్ను చూసుకుని బాధలను మరిచిపోతారని భావిస్తాడట.

పిల్లలకు ఈ రూపం అంటే చాలా ఇష్టం. పురందరదాసనే వాగ్గేయకారుడు సంగీత పాఠాలను పిల్లలు నేర్చుకోడానికి 'లంబోదర లకుమికర' అనే పాటను రచించాడు. లకుమికర అంటే లక్ష్మీకరుడు. అనగా సౌభాగ్యదాత.

వికటుడు

వికటం అంటే నవ్వు, హాస్యోక్తి, ఇతరులను నవ్వించేది. ఆ హాస్యోక్తులలో తెలివి తేటలు మిళితమై ఉంటే వానిని వికటకవియని అంటాం. ఈ పదంలోనూ ఒక మాటల గారడీ ఉంది. దీనిని చివరనుండి చదివినా వికటకవే అవుతుంది.

అయితే నిఘంటు ప్రకారం, ఆ అర్థం రాదు. హాస్యోక్తి అని లేదు. అపైన భయంకరమని అర్థం కూడా. అయితే వాడుకలో హాస్యోక్తి అనే అర్థంలో వాడతారు. అట్టి హాస్యానికి పూర్వపు నాటకాలలో విదూషకుడుంటే వాడు. నాటకంలో ప్రతి నాయకుడు భయంకరంగా, క్రూర కృత్యాలు చేస్తున్నట్లుగా ఉంటాడు.

పరిశోధకులేమంటారంటే ముందుగా వినాయకుడు ఉగ్రదేవతయని. భయంకర రూపుడని అతడు సౌమ్య రూపునిగా క్రమక్రమంగా తీర్చి దిద్దబడ్డాడని, అంటారు. మనకు జీవితంలో పూర్ణత్వం రావాలంటే సంతోషం కలగాలంటే అది భక్తివల్లనే కదా. మనకు ఊగిసలాడే మనస్సు కలిగించే బాధలు పోవాలంటే భక్తివల్లనే సాధ్యం. నిండైన బొజ్జతో, గజముఖంతో

ఉన్న మూర్తిని చూస్తే మనకూ సంతోషం కల్గుతుంది. అతని ప్రతిమను చూచినపుడు అందవికారంగా, భయంకరంగా కన్పిస్తాడా? పరిశోధకుల మాట అట్లా ఉంచండి. నవ్వును పుట్టించే ఇతణ్ణి వికటరూపునిగానే భావిద్దాం.

ఇతడు చాలా చమత్కారాలు చేస్తూ ఉంటాడు. అతని తల్లిదండ్రులు ఎడముఖం పెడముఖంగా ఉంటే ఏదో చిన్న పనిచేసి వారికి వినోదాన్ని కల్పిస్తూ ఉంటాడని లోగడ చదువుకున్నాం. కాకి రూపం ఎత్తి అగస్త్యుని కమండులువును ఒరుగునట్లు చేయడం వల్ల కావేరి నది మనకు లభించింది. బ్రహ్మచారిగా వెళ్ళి విభీషణుణ్ణి మోసగించి శ్రీరంగనాథస్వామిని కావేరీ తీరంలో ప్రతిష్ఠించునట్లు చేసాడు కదా. అతని అన్నగారైన రావణున్ని మోసగించి శివలింగాన్ని గోకర్ణ క్షేత్రంలో ప్రతిష్ఠించునట్లు చేసాడు కదా. ఇవి అందరికీ ఉపయోగించే చమత్కారాలు. లోక క్షేమంకోసం అట్టి వికట కృత్యాలు చేసాడు. ప్రజల పట్ల ప్రేమతోనే అట్టి చిల్లర పనులు చేసాడు. అంతా ఒక అతని లీల.

పవిత్ర ప్రదేశాలలో వికట వినాయకులు

తంజావూరులో ఒక వినాయకుడున్నాడు. అతనిని చేదు పుచ్చగింజ వినాయకుండంటారు. ఒక వర్తకుడు అక్కడికి జాజికాయల బస్తాను తెచ్చాడు. దీనికి ప్రభుత్వానికి తగిన పన్నును కట్టాలి. ఆ కేంద్రం దగ్గర దీనిలో చేదు గింజలున్నాయని బుకాయించాడు. ముందుగా చేదు గింజల బస్తాలను చూపించాడు. అయితే విఘ్నేశ్వరుడూరుకుంటాడా? రాత్రికి రాత్రే జాజికాయ బస్తాలను చేదు పుచ్చ గింజల బస్తాలుగా మార్చేశాడు. కుయ్యో మొర్రో అన్నాడు వర్తకుడు. స్వామీ! వీటిని మళ్ళీ జాజికాయల బస్తాలుగా మారిస్తే ప్రభుత్వానికి పన్ను కడతానని, అపరాధపు రుసుమూ చెల్లిస్తానని ప్రార్థించాడు. వినాయకుడు మార్చి వేసాడు. మోదక వినాయకుడప్పటినుండి చేదు పుచ్చగింజల వినాయకుడయ్యాడు.

ఈ గింజల రుచికి విరుద్ధంగా, చెఱకు గడ రుచి కదా! కుంభకోణంలో చెఱకుగడల వినాయకుడున్నాడు. అక్కడున్న మూర్తి అసలు పేరు, వరాహ వినాయకుడు. మహావిష్ణువు వరాహావతారాన్ని ఎత్తినపుడు ఇతనికి మ్రొక్కడం వల్ల హిరణ్యకశిపుని నుండి భూమిని రక్షించగలిగాడట.

ఒకనాడు బండినిండా చెఱకు గడలను వర్తకుడు వేసుకొని చక్కెర కర్మాగారానికి తీసుకొని వెడుతూ ఉండగా ప్రొద్దు పోయింది. బండిని వినాయకుని దగ్గర ఆపాడు.

అసలు విఘ్నేశ్వరుని నిలయం ఇక్షు సముద్రమే. ఇతర దేవతలకు కైలాసం, వైకుంఠం అనే లోకాలున్నట్లు ఇతనికీ శాశ్వత లోకం ఉంది. అది ఆనంద రూపంలో ఉండడం వల్ల ఆనంద భువనం. మహా విష్ణువు క్షీరసాగరంలో పవ్వళించి యుంటాడు. అమ్మవారు మణి ద్వీపంలో ఉంటుంది. వినాయకుని ఆనంద భువనం చెఱకు రస సముద్రంతో చుట్టబడి యుంటుంది. ఇతని చేతిలో తీపి ఉండ్రాళ్ళే కాదు, చుట్టూ చెఱకు రసమే.

చెఱుకు బండివాడి దగ్గరకు ఒక బ్రహ్మచారి వేషంలో వినాయకుడు వెళ్ళి నాకొక చెఱకుగడను ఇవ్వమని అన్నాడు. వెళ్ళు వెళ్ళని అతడు గద్దించాడు. బండెడు గడలలో ఒకటి ఇస్తే ఏం మునుగుతుందయ్యా అన్నాడు బ్రహ్మచారి. ఇవి పుల్లగా ఉంటాయని వద్దని అబద్ధమాడాడు వర్తకుడు.

మరునాడే ఆ చెఱకు గెడలన్నీ పుల్లనై పోయాయి. కర్మాగారం వారు తీసుకోమని అనగా లబోదిబో అన్నాడు వర్తకుడు. ఆలయం దగ్గర బ్రహ్మచారిని చూసాడు కదా. అతణ్ణి వెదికాడు. అతణ్ణి కనబడేటట్లు చేయవయ్యా అని వినాయకుణ్ణి ప్రార్థించాడు. స్వామి కరుణించాడు. మళ్ళీ గడలన్నీ తియ్యగా మారాయి. అప్పటినుండి వరాహ వినాయకుడు, చెఱకు గడల వినాయకుడయ్యాడు.

ఇట్లా వందల కొద్దీ కథలున్నాయి. తుండంతో ఎత్తి అవ్వైయార్ కైలాసాన్ని చూపించాడని ఇంతకుముందు చెప్పాను కదా.

వికటచక్ర వినాయకుడు

కాంచీపురంలో వికట చక్ర వినాయకుడున్నాడు. స్వామి, సుబ్రహ్మణ్యాలయంలో అనగా కుమార కొట్టంలో ఉంటాడు. ఈ పేరు ఎట్లా వచ్చింది? లోగడ విష్ణుని చక్రం మ్రింగివేయడం, విష్ణువు గుంజిళ్ళు తీసి ఇతణ్ణి నవ్వించడం, చక్రం ఊడి పడడం మొదలైన కథను చెప్పాను కదా! అతడే ఈ వికటచక్ర వినాయకుడు.

విఘ్నరాజు

విఘ్నరాజే విఘ్నేశ్వరుడు. రాజుకంటె ఈశ్వరుడెక్కువని తలుస్తాం. ఈశ్వర శబ్దాన్ని పరికిస్తే దాని ధాతువును బట్టి రాజేమి చేస్తాడో, ఈశ్వరుడూ అదే చేస్తాడు. ఈశ్ అనగా పాలించుట. భగవంతుని నామాల చివర ఈశ్వర, రాజ, నాథ అనే పదాలుంటాయి. అన్నీ ఒకే అర్థాన్నిస్తాయి. నటరాజును నటేశుడంటాం. నటేశ్వరుడంటాం. రంగరాజుని రంగనాథుడు, రంగేశుడని పిలుస్తాం. అట్లాగే విఘ్నరాజన్నా, విఘ్నేశ్వరుడన్నా ఒక్కటే.

ఒక ప్రత్యేకాధికారం ఇతడు కలిగియున్నాడని ఈ పదం వెల్లడిస్తోంది. సృష్టికి బ్రహ్మ, రక్షణకు విష్ణువు, సంపదకు లక్ష్మి, విద్యకు సరస్వతి; ఆరోగ్యానికి ధన్వంతరి; ఇట్లా ఒక్కొక్కరికి ఒక్క శక్తి నిచ్చాడు పరమేశ్వరుడు. ఇతని పని ఏమిటి? ఆటంకాలను తొలగించే పనే. పరమేశ్వరుడే ఈ కారణం వల్ల విఘ్నరాజయ్యాడు.

అంటే ఆటంకాలను కలిగించేవాడని అర్థం చేసుకోకూడదు సుమా! ఆటంకలను మటుమాయం చేస్తాడనే అర్థం చెప్పాలి.

ఆటంకాలను కలిగించినా ఒక పరమ లక్ష్యంతోనే

అప్పుడప్పుడు ఆటంకాలనూ కల్గిస్తూ ఉంటాడు. త్రిపురాసుర సంహారానికి శంకరుడు బయలుదేరేటపుడు ఇతణ్ణి స్మరించలేదు. అందువల్ల అతని రథపు ఇరుసు ఊడిపోయింది. దేనికోసం చేసాడు? ఎవ్వరైనా ఒక నియమాన్ని ఉల్లంఘించకూడదనే లక్ష్యంతోనే. అందరికీ ఈ నియమాన్ని నేర్పడానికే అట్లా ముందు ఆటంకాలేర్పడినా దానికి ప్రాయశ్చిత్తం చేసుకొనేవారు చివర సుఖాంతంగానే ఉంటారు. అంతా మనమే చేయగలమని విఱ్ఱవీగడం పనికిరాదనే పాఠం నేర్పడానికే. ఆటంకాలు రావడం, వెంటనే స్వామిని స్మరించడం, వాటిని తొలగించడమూ జరుగుతుంది.

స్వీయానుభవాలు

రెండు స్వీయానుభవాలను వివరిస్తాను.

మేము వెల్లూర్ వెళ్ళాం. వెల్లూర్ దగ్గర మహిమాన్వితమైన గణపతి విగ్రహాలున్నాయి. శేణ్ పాక్కం దగ్గర, పదకొండు విగ్రహాలు అలాంటివి ఉన్నాయి. వాటిని ఎవ్వరూ చెక్కలేదు. అవి స్వయంభువములు. ఏకాదశ రుద్రులని విన్నాం. కానీ ఇక్కడ ఏకాదశగణపతులున్నాయి.

పూర్వం అన్ని వినాయకుడి విగ్రహాలూ భూమిలో కప్పబడి ఉండేవి. అంటే తాను పృథ్వీతత్త్వానికి చెందిన వాణ్ణని తెలియజెప్పడం కోసమేమో! అట్టి క్రీడ కూడా ఆయన చేస్తాడు. మరాఠా రాజ్యానికి మంత్రియైన తుకోజీ అలాంటి మార్గం గుండా ఒక గుఱ్ఱం బండిలో వెడుతున్నాడు. ఒకచోట వచ్చేటప్పటికి బండి ఇరుసు విరిగింది. బండి ఆగిపోయింది. దిగి చూడగా అక్కడ రక్తపు మరకలు కన్పడ్డాయి. మనిషి ఎవ్వడూ కనబడడం లేదు. మర్నాడు ప్రొద్దున్న వరకూ అక్కడే ఉండిపోవలసి వచ్చింది. ఏమిట్రా

భగవంతుడా, ఈ ఆటంకమేమిటని వినాయకుణ్ణి ప్రార్థించి పడుకున్నాడు. స్వామి, కలలో కనబడి, ఇక్కడే నా ఏకాదశ మూర్తులు కప్పబడ్డాయి, నీ బండి చక్రాలు వాటికి తగలడం వల్ల రక్తం వచ్చింది. ఇంతవరకూ భూమిలో కప్పబడి ఉండాలని అనుకున్నాను. ఇక ప్రజల క్షేమం కోసం బయట పడాలనుకున్నా, కనుక ఒక మందిరాన్ని కట్టు, కుంభాభిషేకం చేయవలసిందని ఆజ్ఞాపించాడు. తుకోజీ ఆలయాన్ని కట్టాడు.

ఆ ప్రాంతం గుండా మేమూ వెడుతున్నాం. ఏం జరిగిందో తెలుసా? చిన్నస్వామి, జయేంద్ర సరస్వతి ఏనుగు మీద కూర్చొని యున్నారు. ఏనుగు ఇక్కడకు వచ్చేటప్పటికి కదలలేదు. ఏమిటో చుట్టూ తిరుగుతోంది. దానిని శాంత పరచడానికి మావటీడు, శతవిధాల ప్రయత్నించాడు. స్వామియేమో దానిపై కూర్చున్నారు. ఏమిటా అని కంగారు పడ్డాం.

అప్పుడు శేనప్పాకం దగ్గర వినాయకుడికి 108 కొబ్బరి కాయలు కొడతామని మ్రొక్కుకున్నాం, ఎప్పుడో. దానిని మరిచామని గుర్తుకు వచ్చింది.

మరిచిపోయామని చెప్పడంలో అర్థం లేదనుకుంటాను. అది నిర్లక్ష్యమే. మీరిచ్చే దండలను సత్కారాలను, పూర్ణ కుంభాలను స్వీకరిస్తున్నాం కదా! ఇవేమీ మరిచిపోని వాళ్ళం. అది మరిచిపోవడమేమిటి? ఇట్లా మరిచిపోవడం తప్పని గుర్తు చేసాడు స్వామి. నాకేదైనా అయితే నాకేమీ బాధలేదు. ఏనుగుపై స్వామికి ఏదైనా జరిగితే ఎలా? ఆయనా బాధపడలేదు. ఈ పాతంనాకే. నేనే కదా లోగడ మ్రొక్కినది?

వెంటనే కొబ్బరికాయలను కొట్టడం, ఏనుగు శాంతించడం, యాత్ర సాగడం చకచకా సాగిపోయాయి. ఇది నిజంగానే జరిగింది. ప్రత్యేక పూజలు తరువాత చేసాం.

ఇట్లా చేయడం వల్ల స్వామికి ఉపకారం చేసినట్లా? ఆయనకేదైనా లాభం ఉందా? ఆయనెప్పుడూ ఆనంద స్వరూపుడే కదా! ఇట్టి వాటిని మన చేత చేయించి మనకు ఆనందాన్ని, పుణ్యాన్ని కల్గిస్తూ ఉంటాడు.

ఆటంకం వచ్చినపుడు ప్రతి క్రియ చేసి దానిని తొలగించుకొనే సమయంలో ఇంకా ఆనందాన్ని పొందుతాం. బాగా ఎండ మండిపోతూ ఉంటే నీడయొక్క రుచి తెలుస్తుంది. ఒక నల్లని బట్టపై తెల్లని వెండి జరీ ఉన్నపుడు చూడడానికి బాగుంటుంది. అట్లాగే ఏదైనా పని చేసినపుడు విఘ్నం వస్తే దానిని తొలగించుకోవడం వల్ల ఎక్కువ తృప్తి కల్గుతుంది.

ఇట్టి ఆనందం, భక్తి వల్ల వచ్చింది. అపుడు మనమేమనుకొంటాం? స్వామిని మరిచిపోయినా, అతనికేది అక్కఱ లేకపోయినా మన కోరికలను తీరుస్తున్నాడని, మన చిన్నపాటి భక్తికి సంతోషిస్తున్నాడని అతని అనుగ్రహం లేకపోతే మనమొక అడుగూ ముందుకు వేయలేమని, ఇది గుర్తు చేయడానికి చిన్న చిన్న ఆటంకలు కల్గిస్తూ ఉంటాడని భావిస్తాం. కనుక అప్పుడప్పుడు మనకు బుద్ధి రావడానికి ఆటంకాలూ కల్పిస్తాడు.

ఇద్దరు వినాయకులు

విఘ్నరాజో వినాయకః అని కదా. విఘ్నరాజ పదం తరువాత వినాయకుడు వస్తాడు.

ఇద్దరు వినాయకులను ప్రక్కప్రక్కనే స్థాపించడమూ ఉంది. చాలాచోట్ల ఇద్దరు వినాయకులున్న వీథి అని ఉంటుంది. అందు ప్రక్కప్రక్కనే కూర్చొని యుంటారు. శివాలయాలోలనూ ఇట్లా ఉంటుంది.

ఇట్లా ప్రతిష్ఠించిన తరువాత మిగతా దేవతా మూర్తులుందరు. ఇట్టి గౌరవం ఒక్క మన స్వామికే.

ఎందుకిట్లా చేస్తారు? రెండు విరుద్ధ కార్యాలు చేస్తాడు కనుక. ఒక మూర్తి విఘ్నాలను కల్గిస్తాడు. మరొక మూర్తి విఘ్నాలను పోగొడతాడు. ఇద్దరూ పరస్పరం విరుద్ధంగా ఉన్నట్లు కన్పిస్తారు. విఘ్నాలను కలిగించే ఈశ్వరుడని, రాజని ఆ పదాన్ని అర్థం చేసుకోకూడదని లోగడ అన్నాను. గుర్తుందా? ఈశ్వరుడైనా, రాజైనా ఆటంకాలను తొలగిస్తాడని, అందువల్ల అట్లా అర్థం చేసుకోవాలని అన్నాను. మనం విఘ్నేశ్వరుని పూజించేటపుడు ఈ భావనతోనే ఉండాలి.

అయితే రెండూ ఒకే మూర్తులు ఒక్కవోటుంటే ఏమని అర్థం? విఘ్నాలు కల్గించడంలో ఒక మూర్తి అధికుడని, అప్పుడతడు విఘ్నరాజని, దానిని తొలగించినపుడు వినాయకుడని పిలువబడతాడు.

ఆటంకాలను తొలగిస్తున్నాడంటే ఆ స్వామి క్రూరుడని లెక్కబెడతామా? కాదు. అందువల్ల విఘ్నాలను కలిగించినా, తొలగించినా రెండూ పరస్పరం విరుద్ధం కావని, విరుద్ధంగా ఉన్నట్లే కన్పిస్తాయని, ఇద్దరి కృత్యాల పరమార్థం ఒకటేనని, ఒక్కడే రెండు రూపాలను ధరించాడని గట్టిగా మనం నమ్మాలి.

అయితే విఘ్నాలను కలిగించడం అనుగ్రహం అవుతుందా? మనం దుష్టకర్మలనే మూటలను ఎన్నో జన్మలనుండి మోస్తున్నాం. స్వామియొక్క అనుగ్రహం వల్ల అతనిపట్ల కొంత భక్తిని చూపించి ఏ పని చేసినా అందేమీ ఆటంకాలు లేకుండా చేయమని ప్రార్థిస్తున్నాం.

ఇట్లా ప్రార్థించినంత మాత్రంచే మన గత జన్మ కర్మలనంతటినీ పట్టించుకోకుండా ఇప్పుడు మనం చేసే పనులలో విజయం సాధించేటట్లు చేస్తాడా? మనపట్ల సంపూర్ణ దయను చూపి గతజన్మ కర్మలనన్నిటినీ తుడిచి వేస్తాడా? ఇట్లా చేయగలిగితే ప్రజలలో పాపం పట్ల భయపడతారా? అట్లా ఉంటే ఇక ధర్మం, న్యాయం అనే పదాలకు అర్థం ఉంటుందా. ఇక ప్రజలలో మనమే చెడ్డపనైనా చేయవచ్చు, ఒక మాటు స్వామికి పూజ చేస్తే సరిపోతుందిలే

అనే భావం రాదా? మనం తప్పులు, నిరంతరం చేస్తూ ఉండడానికి బాగా అలవాటు పడిపోతాం కదా!

అట్టి పరిస్థితి రాకుండా ఉండడం కోసం విఘ్నరాజు మనకు అప్పుడపుడు విఘ్నాలను కల్గిస్తాడు. అతడు సృష్టిస్తాడంటే మనలను అన్యాయంగా బాధిస్తాడని కాదు. పూర్వ కర్మల వల్ల మనం విజయం పొందలేకపోతాం. అందువల్ల అతడు కల్పించే విఘ్నాలు మన పూర్వ కర్మల వల్ల వచ్చిన ఫలాలే. అవే నిజంగా అడ్డుకొంటున్నాయి. అవి తమంతట తామే చేస్తే మనకింకా చిక్కు లేర్పడతాయి. ఇక అట్టి ఆటంకం వల్ల మనం చేసే ప్రయత్నం అంతా వ్యర్థమై, మనం అన్నివిధాలా ఓటమి పాలవడం గాని, లేదా అప్పుడప్పుడు విజయం సాధించడం గాని జరుగుతూ ఉంటుంది. సర్వసాధారణంగా ఓటమి పాలవుతాం. అట్టి విఘ్నాలను కలిగించే బాధ్యత, స్వామితనంతట తానే గ్రహిస్తాడు. ఎట్లా అంటే వరద వచ్చినపుడు ఒక ఆనకట్ట కట్టగా కొంతవరకూ దాని ఉద్ధృతి తగ్గి ఒక పద్ధతిలో నీటిని విడుదల చేయడం మాదిరిగా ఉంటుంది. అంటే ఆటంకాలను ఒక పద్ధతిలో నడిపిస్తాడన్నమాట. అట్లా క్రమమార్గంలో పెట్టడమే కాకుండా కొన్నిచోట్ల ఆ ప్రవాహాన్ని ఆవిరియై పోయేటట్లు చేస్తాడు కూడా. అనగా ఒక పెద్ద ఆటంకం వచ్చి మనపై విరుచుకుని పడవచ్చు. అట్టి దానిని కొద్దికొద్దిగా అనుభవించేటట్లు చేస్తాడన్నమట. అనగా పాప ఫలాలను కొద్దికొద్దిగా అందిస్తాడన్నమాట. అంటే వాటిని మనం భరించగలిగేటట్లు చూస్తాడు. మొత్తం పాపకర్మ అంతా సాధ్యమైనంత త్వరలో పోవడం మంచిది కదా. నిజమే. అతడాలస్యం చేసినకొద్దీ మనం ఇంకా పాపకర్మల భారాన్ని జోడించడం లేదా? అట్టిదానిని అడ్డుకోవడం కోసం ఒక విఘ్నాన్ని కలిగిస్తాడు. అది ముందు చెడ్డదిగా కనబడవచ్చు. కాని నిజం ఆలోచిస్తే అది మనకే మంచిది.

అతని అష్టోత్తర పూజలో విఘ్నకర్త, అనగా విఘ్నాలు కలిగించేవాడని, మరొక నామం విఘ్నహర్త అనగా విఘ్నాలను పోగొట్టేవాడనీ ఉంది. ఇందులో విఘ్నరాజు ముందు వస్తాడు. తరువాత వినాయకుడు వస్తాడని అర్థం.

ఇతనిలో నాయకత్వం గొప్పది. అందరు దేవతలూ నాయకులే. ఒక అసురుణ్ణి చంపి వారు నాయకులౌతారు. అయితే మిగిలిన వారికి లేని నాయకపదం ఇతనికెందుకుంది? అసుర బాధలను పోగొట్టడమే కాదు, ఆటంకాలను తొలగిస్తాడు, ఆపైన విఘ్నాలకు విఘ్నరాజై కల్గిస్తాడు కూడా. కనుక అన్నివిధాల ఇతడు నాయకుడే. వినాయకుడయ్యాడు. కనుక విఘ్న వినాయక పాదనమస్తే అంటాం.

ప్రసిద్ధ నామం

ఇతని ప్రసిద్ధ నామం వినాయకుడే. ఉత్తర దేశంలో కంటె దక్షిణ దేశంలో ఈ నామం బాగా ప్రచారంలో ఉంది. ఇతని జయంతిని వినాయక చతుర్థి అంటున్నాం. ఉత్తర దేశంలో దీనిని గణేశ చతుర్థి అంటారు. దక్షిణ దేశంలో ఈ వినాయకునకు సిద్ధి వినాయకుడని, వరసిద్ధి వినాయకుడని, శ్వేత వినాయకుడనే నామాలున్నాయి.

వినాయక పదం ఉచ్చరిస్తే అతడు ప్రముఖుడని, అతని క్రింద కొందరుంటారని, వారిని నియమిస్తాడని అర్థం వస్తుంది.

దక్షిణ దేశంలో నాయకర్ అంటే ఒక జాతి వాచకం. అందు పుట్టినవారిని అందర్నీ నాయకర్‌లని అంటారు. మహారాష్ట్రలో నాయక్ అంటే బ్రాహ్మణుడు. తంజావూర్‌లో మధురలో నాయకరాజ్యం ఉండేది. వారు రాజవంశానికి చెందినవారు. కన్నడ ప్రాంతం నుండి తమిళనాడునకు ఈ నాయకర్‌లు. వీరినే నాయుడులని, తెలుగు దేశంలో అంటారు. వీరు శూద్రులే. నాయకుడే నాయుడు, నాయుడయింది. తమిళనాడులో ప్రసిద్ధ శివభక్తులను నాయనార్

అంటారు. ఇందు భిన్న భిన్న వర్ణాలవారున్నారు. వైశ్యులను తమిళనాడులో చెట్టియార్ అంటారు. శ్రేష్ఠిపదం, చెట్టి అయింది కన్నడంలో షెట్టి అయింది. పైన పేర్కొన్న వారందరూ భిన్న భిన్న వృత్తులను చేస్తూ పరస్పరం ఈర్ష్యాద్వేషాలు లేకుండా మసులుతూ ఫలానా జాతిలో పుట్టామని ఎవరికి వారే గర్విస్తూ ఉంటారు.

వి-అనే ఉపసర్గ

'వి' ఏమని చెబుతోంది? ఒక పదానికి ముందు వి అనే ఉపసర్గను చేరిస్తే పదం యొక్క అర్థం మారుతుంది. మలం అంటే 'అశుద్ధం'. విమలం అంటే 'స్వచ్ఛమని'; ఆ 'వి'ని శుద్ధపదం ముందుంచితే ఇంకా స్వచ్ఛమని అర్థం. పరీతం అనగా ఒక పద్ధతిలో వెళ్ళడం. విపరీతం అంటే తప్పుడు మార్గంలో వెళ్ళడం. జయానికి, వి చేరిస్తే ప్రత్యేకమైన జయం.

శేషం అంటే మిగిలినది. మిగిలిన వాటితో కలవకుండా విడిగా ఉంటూ గొప్పదనాన్ని సూచించేదనే అర్థంలో విశేషం అంటాం. శిష్ట అనే పదం ఈ శేషనుండి వచ్చిందే. వారు విశేష గుణ సంపన్నులని, శిష్టులని వాడతారు. శిష్టాచార మనే మాటను విన్నాం కదా.

రెండర్థాలలో వినాయకుడు

ఇందులో రెండు పరస్పర విరుద్ధార్థాలు వస్తాయి. చిత్రంగా లేదూ!

ధవుడనగా పతి. మాధవుడనగా లక్ష్మికి పతి. విధవయనగా భర్తలేనిది. అట్లా వినాయకుడుని తన విశిష్ట నాయకుడు, విగత నాయకుడు. అనగా తనకెవ్వరూ నాయకులు లేరని, తానే అందరి కంటె గొప్ప నాయకుడని అర్థాలు వస్తాయి.

ఒక భక్తుడు, భగవంతుని దగ్గరకు వెళ్ళి నేను 'అనాథను' అన్నాడట. 'నీవూ అనాథుడవే' అన్నాడట వెంటనే. 'నన్ను అనాథనంటావా' అని భగవంతుడు అన్నాడట: 'అవునయ్యా, నాకు నాథుడు లేకపోవడం వల్ల నేను అనాథ నయ్యాను, ఇక నీవు నీ కంటె పైన నాథుడు లేకపోవడం వల్ల నీవు అనాథవయ్యా'వని అన్నాడట. అట్లా వినాయకుడు కూడా.

అమర నిఘంటువులో ఇతని నామాలు

జైనుడైన అమరసింహుడు తన నిఘంటువులో ఎనిమిది నామాలను పేర్కొన్నాడు:

వినాయకో, విఘ్నరాజ, ద్వైమాతుర, గణాధిపాః

అప్యేక దంత, హేరంబ, లంబోదర, గజాననాః

దీనిలోని ఆరు నామాలు, ప్రసిద్ధ షోడశనామాలలోనూ ఉన్నాయి. ఇందలి గణాధిపదం, గణాధ్యక్ష అని షోడశ నామాలలో ఉన్నదానిని తలపిస్తోంది. షోడశనామాలలో లేనిది, అమరంలో ఉన్నది, ద్వైమాతుర పదం. అనగా ఇద్దరు తల్లులు కలవాడు. పార్వతి గంగా తనయుడని.

గంగలో నున్న శరవణ సరస్సులో శివుని కంటి నుండి వెలువడిన తేజస్సునుంచగా సుబ్రమణ్య జననం. అందుచేత గంగ తిన్నగా సుబ్రహ్మణ్యుని తల్లియే. అందువల్ల అతడు గాంగేయుడే. అయితే గణపతికి గంగకు ప్రత్యక్ష సంబంధం లేకపోయినా, ఇతని తండ్రి నెత్తిపై నుండడం వల్ల, తన తండ్రికి భార్య అవడం వల్ల వినాయకుని తల్లిగా పరిగణిస్తారు. అమరంలో మొదటి నామం వినాయకుడే అని చెప్పడానికి ఇదంతా చెప్పాను. నిఘంటువులో ఆ మొదటి పదం ప్రాముఖ్యాన్ని సూచిస్తుందని చెప్పడానికే.

ధూమ్రకేతువు

ధూమమనగా పొగ. ఇది మామూలు కట్టెలను మండిస్తే వచ్చేది కదా. అయితే పొగ, సువాసనతో ఉంటే దానిని ధూపం అంటున్నాం. అనగా సాంబ్రాణి పొగ. పంచోపచారాలలో ధూపం ఒకటి. పొగను జెండాగా కలిగినవాడు ధూమకేతువు. నిప్పునుండి బైటకు వచ్చిన పొగ జెండాగా ఉంటుంది కదా. అగ్నికి ధూమ కేతువని పేరు కూడా. ధూమకేతు పదం శుభాన్ని తెలియ పర్చడానికి బదులు కీడును సూచిస్తుంది సాధారణంగా. అది తోకచుక్క కూడా కాబట్టి అది కనబడడాన్ని అశుభంగా భావిస్తారు.

(అన్ని తోకచుక్కలూ అట్లా కావని, కొన్ని మాత్రమే అని వరాహమిహిరుడు, తన బృహత్సంహితలో అన్నాడు – అనువక్త)

ఈ అశుభ సూచకమైన పదం వినాయకునకు ఉందేమిటి? ఆయన మంగలమూర్తి కదా!

వినాయక పురాణాన్ని చూసాను. వినాయకునకు సంబంధించిన రెండు పురాణాలున్నాయి. ఒకటి భృగుమహర్షి చెప్పినది. కనుక భార్గవ పురాణమైంది. ముద్గలుడు చెప్పనది ముద్గలపురాణం నేనిపుడు చెప్పేది భార్గవ పురాణం నుండే.

ఈ పురాణంలో ఉపాసన కాండం, లీలా కాండమని రెండు కాండలున్నాయి. లీలా కాండంలో వినాయకుని 12 అవతారాలు వర్ణింపబడ్డాయి. ఒక్కొక్క దానికి ఒక్కొక్క అధ్యాయం. ఇందు గణేశుడొకడు, గణపతి యొకడు. ఇందు షోడశనామాలలో పేర్కొన్న వక్రతుండుడు, భాలచంద్రుడూ గజాననుడూ విడివిడిగా అవతారాలుగా ఉన్నారు. అందులో ధూమ కేతు అవతారం గురించిన కథ ఉంది. ఎప్పుడో చదివాను. గుర్తున్నది చెబుతాను.

ధూమాసురుడనే అసురుడు ఉండేవాడు. వృత్రాసురుడు, మహాబలివంటి వారు భాగవతంలో పేర్కొన్నట్లుగా; అసురులలో భక్తి అనే లక్షణమూ ఉంది. అయితే వారిలో అసురత్వం ప్రధానంగా ఉంటుంది. ధూమాసురుడట్టివాడు. ఒక రాజు, అతనికొక భార్య ఉన్నారు. ఆ రాణి గర్భంలో విష్ణువు జన్మిస్తాడని తన మరణానికి కారకుడౌతాడని విన్నాడీ అసురుడు. అందువల్ల సైన్యాధ్యక్షుణ్ణి పిలిచి రాత్రి వెళ్ళి ఆ రాణిని చంపుమని అన్నాడు. ఇతడు వెళ్ళి గర్భిణియైన స్త్రీని, అందునా శుభలక్షణాలు కలిగిన స్త్రీని చంపడం తప్పని గ్రహించాడు. ఆ జంటను విడదీయకూడదని భావించాడు. కనుక మంచంపై నిద్రించే వారినిద్దరిని మంచంతో బాటు మోసుకొని ఒక అరణ్యంలో విడిచి పెట్టాడు. ఇదేమి కష్టంరా బాబూ అంటూ వారిద్దరూ వినాయకుని ప్రార్థించారు. సుఖప్రసవం జరగాలని, తిరిగి రాజ్యానికి వచ్చేటట్లు చేయమని ప్రార్థించారు.

వీరెక్కడో అరణ్యంలో దాగియున్నారని ధూమాసురుడు విన్నాడు. వెంటనే శస్త్రాలతో వెళ్ళాడు. అతని చేతిలోని శస్త్రం పొగయే. అతని పేరే ధూమాసురుడు కదా! అంటే ఒక అస్త్రాన్ని ప్రయోగిస్తే అందుండి బాగా పొగ వస్తుందన్నమాట.

నేడు కూడా బాష్ప వాయువులను ప్రయోగిస్తూ ఉంటారు. మనుష్యులను చంపే రసాయనిక వాయువులనూ విడిలుతూ ఉంటారు. ఇట్టివే ఆనాడు మంత్రశక్తితో ప్రయోగించేవారు. గర్భిణిని చంపాలని వెడితే ఆమె ఒడిలో పిల్లవాడు కన్పించాడు. అతడు విష్ణ్వంశతో బుట్టిన వినాయకుడే. అనగా సమస్త దేవతా స్వరూపుడు వినాయకుడని తెలియడం లేదా? శివుని తనయుడైన వినాయకుడు, విష్ణ్వంశతో పుట్టాడంటే శైవవైష్ణవాల సంగమమే. శుక్లాంబరధరం విష్ణుం అని చదువుతాం కదా.

అతడస్త్రాన్ని ప్రయోగించగా పొగ క్రమ్మింది. ఆ పొగనంతటిని పిల్లవాడు ఒడిసి పట్టాడు. తన అస్త్రం పనిచేయడం లేదని అసురుడు తెల్లమొహం వేసాడు. ఒక క్రొత్త అస్త్రం ప్రయోగించే ఓపిక లేదు. ఆ సమయంలో మన

స్వామి అతణ్ణి చంపడానికి ఉద్యుక్తుడయ్యాడు. ప్రత్యేకంగా ఒక అస్త్రం వేయకుండా అతడు ప్రయోగించిన విషవాయువునే విడుదల చేసాడు స్వామి. అట్లా అతని సంహారమైంది.

అందువల్ల ధూమకేతువయ్యాడు. ధూమమే ధూమ్రము, ధూమ్రకేతువు కూడా.

గణాధ్యక్షుడు

అధ్యక్షుడనగా ముఖ్యుడనే. పర్యవేక్షించే వాడని అర్థం. Head of the Government. Head Priest అనే పదాలున్నాయి కదా ఆంగ్లంలో.

గణాధ్యక్షుడన్నా, గణపతి యన్నా గణేశుడన్నా, గణాధిపతియన్నా, గణనాథుడన్నా ఒకటే.

భూత గణాలకు అధ్యక్షునిగా గణపతిని, దేవగణాలకు అధ్యక్షునిగా కుమారస్వామిని నియమించాడు శంకరుడు. అందుకే వినాయకుని గజాననం, భూతగణాది సేవితం అని కీర్తిస్తాం. చిన్నవాడైన కుమారస్వామిని దేవసేనాధి పతియని పిలుస్తాం. ఈ మాటకు రెండర్థాలున్నాయి. దేవగణాలకు అధిపతియని, దేవేంద్రుని కూతురైన దేవసేనకు పతియని. అసలు దేవగణాలను అదుపులో పెట్టడం కంటె భూతగణాలను అదుపులో పెట్టడమే కష్టం. అయితే గణపతి మాత్రం ఏమాత్రం కష్టం లేకుండా, హాయిగా వారిని నియమించగలడు.

అందుకే దేవగణాలు, మనుష్య గణాలు, గణపతి శక్తిని, దయను బాగా గుర్తించి పూజిస్తాయి. అందువల్ల గణాధ్యక్షుడంటే అన్ని గణాలకూ అధ్యక్షుడని భావించాలి.

(గణేశ తంత్రాలు, ప్రతియుగంలోనూ విఘ్నేశ్వరునకు ఒక ప్రత్యేక నామం, రూపం ఉంటాయని వర్ణించాయి. కలియుగంలో ఉన్న మూర్తికి ధూమకేతువని నిర్దేశించాయి. దానికి అనుగుణంగా బూడిద రంగుతో ఉంటాడు. రెండు చేతులతో, గుఱ్ఱపువాహనం; ఇక కృతయుగంలో రంగుజ్యోతి స్వరూపం – దశభుజాలు – వాహనం సింహం; ఇక త్రేతాయుగంలో మయూరేశ్వరుడు – తెలుపు రంగు; ఆరు చేతులు – వాహనం నెమలి; ఇక ద్వాపర యుగంలో గజాననుడు – రంగు – ఎరుపు – నాల్గు చేతులు – వాహనం ఎలుక – ఆంగ్లానువాదకుడు)

భాలచంద్రుడు

ఈ పదం ఫాలచంద్రుడే. 'ఫ'కాని, 'భ'కాదు. ఈ రోజులలో చాలామంది బాలచంద్రుని పేరు పెట్టుకుంటారు. కాని, అర్థం తెలియదనుకుంటాను. చిన్న చంద్రుడని అర్థంగా భావిస్తారేమో! బాలకృష్ణుడు, బాల సుబ్రహ్మణ్యుని మాదిరిగా వీరికీ పేరు. చిన్నతనంలో అనేక లీలలను ప్రదర్శించారు కనుక వచ్చింది. వాల్మీకి రామాయణంలో రాముని బాలలీలలు లేవు. దశరథుడు తన పిల్లల వివాహం గురించి భావించింది, విశ్వామిత్రుని రాక సందర్భంలోనని గుర్తించండి. అందువల్ల బాలకృష్ణుడున్నట్లు బాలరాముడు లేడు. ఇక చంద్రునకు బాలలీలలే లేవు. తదియనాడు మాత్రం సమగ్రంగా కనబడకపోవడం వల్ల బాలచంద్రుడే. కనుక అట్టి పేరును పెట్టుకొనడం శుభావహం కాదు.

ఇటీవల క్రొత్త క్రొత్త పేర్లను పెట్టుకొంటున్నారు. చంద్రన్ అనే పదం దక్షిణ దేశంలో విరివిగా ఉండేది కాదు. రామచంద్రుణ్ణి ఆర్. చంద్రన్ అని వ్రాయడం ఉంది కొంతవరకు. రామచంద్ర, చంద్రమౌళి అనే పదాలున్నాయి. చందు, చందర్ మొదలైనవి ముద్దు పేర్లు.

దక్షిణ దేశంలో ఇక సూర్యుని నామం తప్ప మిగిలిన గ్రహాలలో ఎవరి పేరు పెట్టుకోరు. అంగారకుడని, బుధుడని పెట్టుకోరు. ఎవరైనా బృహస్పతియని పిలిస్తే తెలివి తక్కువవాడనే అర్థంలోనే వాడతారు. శుక్రుని పేరు వినబడదు. ఇక శని మాటేమిటి? (ఇది చెప్పినపుడు స్వామివారు మందహాసం చేసారు). ఈ పదాన్ని ఇతరులను నిందించేటపుడు వాడతాం. ఇక రాహుకేతువులసలే ఉండరు. రాహు కేతువుల్లా పట్టుకొన్నాడని నిందార్థంలో వాడతాం. ఒక్క సూర్యుణ్ణి పేరు పెట్టుకుంటారు. దానికి విష్ణు పదం చేరుస్తారు. సూర్యనారాయణ. ఉత్తర దేశంలో రవి, ప్రభాకర, దివాకర, ఆదిత్య, మార్తాండ పదాలుంటాయి. దక్షిణ దేశంలో అట్టివాడుక ఇటీవల వచ్చింది. పంచాయతనంలో సూర్యుడొకడు. శంకరులు స్థాపించిన షణ్మతాలలో సూర్యమతం ఒకటి. అదే సౌరం, సూర్యుడంటే పరమ దైవమని నమ్మే మతం. కనుక అతని పేరు పెట్టుకోవడంలో ఔచిత్యం కన్పిస్తుంది. అయితే చంద్రునకా అవకాశం లేదు. కనుక బాల చంద్రన్ అనే మాట పూర్వులు వాడేవారు కాదు. ఇటీవల తెలియక వాడుతున్నారు. ఇది చంద్రుణ్ణి ఉద్దేశించి కాదు. బాలచంద్రుడంటే బాలుడైన చంద్రుడని కాదు.

ఫాలచంద్రుడంటే ఫాల భాగంపైన చంద్రుడున్నవాడు. అతడు చంద్రమౌళి, చంద్రశేఖరుడే.

చంద్రుణ్ణి నెత్తిపైన ధరించినవాడంటే చటుక్కున శివుడు గుర్తుకు వస్తాడు. ఇట్టి ప్రత్యేకత మరో ఇద్దరికీ ఉంది. అమ్మవారిని శ్యామలా దండకంలో కాళిదాసు, చంద్రకళావతంసే అని కీర్తించాడు. శంకరులు దానికి కొంత హాస్యాన్ని జోడించారు. ఆమె శంకరుని ఎడమ వైపు అర్థభాగాన్ని గ్రహించడమే కాదు, మొత్తం పతినే కైవసం చేసుకుందని, చంద్రకళ ఆమె కిరీటంపై అర్థంలో **శశిచూడాలమకుటం** (సౌందర్యలహరిలో 23 శ్లోకం) అన్నారు. లలితా సహస్రనామాలలో చారుచంద్రకళాధరా అని ఒక నామంలో ఈ అర్థం ఉంది. అమ్మవారికే కాదు, ఆమె కొడుకునకూ ఈ గౌరవం దక్కింది.

గణపతి - చంద్రుడు

చంద్రుడితణ్ణి చూసి వేళాకోళం చేసినట్లు చదువుకున్నాం. ఆ కథలో చంద్రుణ్ణి నెత్తిపై పెట్టుకున్నాడని విన్నాం. అందువల్ల అతడు ఫాలచంద్రుడయ్యడు.

ఫ కు బదులు భ కూడా వాడవచ్చు కనుక భాలచంద్రుడని వ్యవహారం. నుదిటి పై భాగాన్ని భాలం అంటారు. ఫాలమనగా సీమంత భాగము. అక్కడ చంద్రుడుంటాడు.

చంద్రుని పట్ల దయను, తప్పు క్షమించడాన్ని ఆ పదం సూచిస్తోంది. ఒకడు తప్పు చేసినా అతడు గణపతి యొక్క క్షమా గుణానికి నోచుకున్నాడు. అది భాలచంద్ర పదం యొక్క సార్థక్యం.

గజాననుడు

ఏనుగు యొక్క గొప్ప లక్షణాలు

దీన్ని గురించి లోగడ చదువుకున్నాం. ఇంకా కొన్ని విషయాలు చేయి యుండేచోట తుండం గల ఏకైక జంతువు ఏనుగే. ఏ జంతువైనా భగవంతునకు వీచగలదా? ఇది చేయగలదు. తుండం ఎత్తి దేవునకు నమస్కరిస్తుంది.

మిగిలిన జంతువులు మనుష్యులను తన్నగలవు. అంతేనే కాని అవి మనలను మోసుకొని వాటిపై పెట్టుకోలేవు. కాని ఏనుగు అట్టి పనులను ప్రేమతో చేస్తుంది. తన శరీరంపై పెట్టుకొని అవతలివానికి ఉన్నత స్థితిని తీసుకొని వస్తుంది కూడా. పెద్ద శరీరం, దానికి తగ్గట్లు బలం రెండూ సరిసమానంగా ఉండడం ఏనుగులో చూస్తాం. తన మార్గంలో ఎవరైనా నిలబడినా అతణ్ణి తన్నదు. తుండంతో ఎత్తి ప్రక్కన పెడుతుంది. తప్పనిసరి పరిస్థితులలో ముద్దముద్దగా చేయగలదు.

దీనికి ద్విపం అని పేరు. అనగా రెండు సార్లు త్రాగుట, రెండుసార్లు తినుట అని మామూలుగా అర్థం. ద్విపం ఎట్లా అయింది? ముందుగా తుండంతో నీటిని గాని ఆహారాన్ని గాని తీసుకొని నోట్లో పెట్టుకుంటుంది. మిగతా జంతువులు నోటితోనే ఆహారాన్ని స్వీకరిస్తాయి. మనిషి మాదిరిగా ఏనుగు ఆహారాన్ని స్వీకరిస్తుంది. ఘనమైన దానిని విడువాలంటే నోటిద్వారానే విడుస్తుంది. అందువల్ల ఇది ద్విపం. నీరైతే తుండం ద్వారా విడిచిపెడుతుంది. జలయంత్రం నుండి నీరు చిమ్మినట్లుగా ఉంటుంది. ఇందులో ఒక తాత్త్వికత దాగియుంది. మనమేదైనా తినాలని అనినపుడు రెండు మూడుసార్లు ఆలోచించి తరువాత స్వీకరిస్తాం. తిరస్కరించవలసి వస్తే ఒక్క మారే గెంటి వేస్తాం. ఇట్టి లక్షణాన్ని ద్విపం సూచిస్తుంది.

ఎవరో ఒకాయన ఒక చిత్రమైన విషయాన్ని వ్రాసాడు. తుండంలాంటి సాధనం ఎక్కడా లేదన్నాడు. చిన్న గుండుసూదిని తీయడం, దాని తోనే పెద్ద దుంగల్ని గ్రహించే సాధనం లేదన్నాడు. భగవత్ సృష్టిలో ఏనుగు తుండానికే అట్టి శక్తి ఉంది. అట్టివాడు గజముఖుడైన గణపతియని అతడు చిన్నవాటినీ, పెద్దవాటినీ నిర్వహించగలడని వ్రాసేడు.

ఈ భువనం అంతా ఎనిమిది గజాలచే మోయబడుతుందని, ఎనిమిది దిక్కులలో అవి యున్నాయని వాటిని అష్టదిగ్గజములని అంటారు. *(విద్యుత్ శక్తి, విద్యుదయస్కాంత శక్తి, ఆకర్షణ శక్తి మొదలైనవాటిని దిగ్గజములుగా భావించండి.)* శారీరక బలంతోబాటు, బుద్ధి శక్తి కూడా కావాలి. పరిపాలనలో ఎనమండుగురు ముఖ్యులు. ఇక కొందరు రాజులు, అష్ట దిగ్గజములనే కవులను పోషించారు. కృష్ణ దేవరాయల కాలంలో అట్లా కవులు పిలువబడేవారు.

అంతకంటె ఈ ఏనుగు నడుస్తూ ఉంటే అందమూ ఉంది, ఆజ్ఞాపించే లక్షణమూ ఉంది. దాని నడకను గజగతి యంటారు. ఇది స్త్రీ పురుషుల

ఇద్దరి నడకనూ సూచిస్తుంది. ఆజ్ఞాపూర్వకమైన చూపు, నడక ఉంటే పురుషుణ్ణి గజగమనంతో పోలుస్తారు. ఉత్తమ జాతి స్త్రీలను గజగామినులని అంటారు.

అంతేకాదు, దీనిపై కూర్చున్నవానికే ఈ లక్షణాలు సంక్రమిస్తాయి. అట్లా రాముణ్ణి ఊరేగింపులో ఏనుగుపై నెక్కినవానిగా చూడాలని ప్రజలు దశరథునితో అన్నారు. గజేన మహతాయాంతం – (అయోధ్య కాండ సర్గ 2. శ్లో 22) రాముని నెత్తిపై రాజచ్ఛత్రం ఉండాలన్నారు. ఛత్రవృతాననం. వినాయకుని ప్రతిమపై గొడుగు పెడతాం.

విభూతిగాని, వైష్ణవ నామాలు గాని ఏనుగు యొక్క నల్లని ముఖంపై పెట్టినపుడు, ఎంత అదంగా ఉంటుందో వేరే చెప్పాలా? ఏ జంతువుకైనా నగలు పెట్టవచ్చు. కాని ఈ నామాలుంటాయా?

ముత్యపు చిప్పనుంచి ముత్యాలు వస్తాయని అందరికీ తెలుసు. కాని అవి మిగతా చోట్ల నుండి కూడా లభిస్తాయి. అరుదుగా వెదురునుండి, ఏనుగు ఫాలభాగం నుండి వస్తాయట. ఏనుగు నుండి వచ్చినవి చాలా విలువైనవట.

మరొక గొప్పదనం, దివ్యత్వం. దీని ముఖమే లక్ష్మీనిలయంగా ఉంటుంది. పద్మంలో, పాలకాంతిలో, మారేడు వెనుక తట్టున, స్త్రీల సీమంతంలో ఆవు వెనుక తట్టున ఏనుగు కుంభస్థలంలో – ఇట్లా ఐదు స్థలాలు లక్ష్మీనిలయాలని ప్రమాణముంది.

దాని ముఖమే విలువైనదని, మిగతా దానికి విలువ లేదని భావించకండి. దాని తోకకూ విలువుంది. అందలి వెంట్రుకలు, దుష్ట శక్తులను తరుముతాయి. ఐశ్వర్య ప్రదం అని ఉంగరంలో బంధిస్తారు. ఇది ఆభరణము, రక్షించే శక్తి కలదు కూడా. సాధారణంగా వెంట్రుకలను, గోళ్ళను దోషంతో కూడియుంటాయని దూరంగా పారవేస్తారు. తాంత్రిక శక్తులను కలిగినవారే

పీటిని వాడతారు. వెంట్రుకలు, గోళ్ళు శరీరంమీద ఉన్నంతవరకూ వాటికి దోషం లేదు. కత్తిరిస్తే మాత్రం దూరంగా పారవేస్తాం. కాని ఏనుగు వెంట్రుకలకు, దుష్టశక్తులను తరిమే లక్షణముంది. పెద్దపులి గోరునకూ ఇది ఉంది. కృష్ణుని బొమ్మలో పులిగోరు పతకంతో ఉన్నట్లుంటాడు కదా!

జంతువులు - దేవతా సంబంధం

మన మఠంలో రోజూ జంతువులకు పూజ యుంటుంది. ఒకటి గోపూజ, రెండవది గజపూజ. ఆవును జంతువుగా చూడం. తల్లిలా చూస్తాం. గజ పూజ చేస్తాం. మిగిలిన జంతువులకు పూజ యుండదు. ప్రాతః కాలంలో గోపూజ, సాయం సమయంలో గజ పూజ యుంటుంది, గజపూజలో పండ్లను పెడతాం. గౌరవంతో శంకరుల పాద పద్మాలకు చామరం దానిచే వీచునట్లు చేస్తాం. రోజువారీ ఖర్చును పాదపద్మాలకు నివేదిస్తాం. మేము నమస్కరించిన తరువాత ఏనుగు తుండం ఎత్తి అదీ జయఘోష చేస్తుంది.

గోపూజలో దానిని పూజించడంతోనే సరి. గజ పూజలో దానిని పూజించడమే కాకుండా అదీ పూజ చేస్తుంది.

అన్ని పెద్ద ఆలయాలలోనూ ఏనుగులుంటాయి. కేరళలో త్రిచూర్‌లో భగవంతుని కంటె ఏనుగులకే ప్రాముఖ్యం ఉన్నట్లు కన్పిస్తుంది. అట్లా ఏనుగులకు దైవానికి సంబంధం ఉంది. ఏనుగు మొఱ పెడితే వైకుంఠం నుండి విష్ణువు రాలేదా? గజేంద్ర మోక్షకథ తెలుసుకదా. అన్ని జంతువులలో పెద్ద శరీరం కలది, దొడ్డ గుణాలున్నది ఏనుగు ఒక్కటే. పరమాత్మ అందరి శరీరాలలోనూ ఉన్నా అతని విభూతి ఇందు వ్యక్తీకరింపబడుతుంది.

అన్ని ప్రాణులూ వినాయకునిలో ఉన్నాయి. అతణ్ణి ముందుగా అర్చిస్తారు కనుక దేవగణాలకు చెందినవాడు. దేవుడని చెప్పడానికి గుర్తేమిటంటే సేవించినవారికి ఆశీస్సులనందించే శక్తి కలిగి యుండడమే. గణపతికి ఆ శక్తి యుంది.

అతడు భూతగణాలకు చెందినవాడు. ఆ పెద్ద బొజ్జ, పొట్టికాళ్ళు మొదలైన లక్షణాలు సూచిస్తున్నాయి కదా!

దేవతలకు ఎన్నో ఆహార పదార్థాలను నివేదిస్తాం. వాటిని ప్రత్యక్షంగా తింటారా? వాసన చూస్తారట. మానవులే వండిన ఆహారాన్ని తింటారు. విఘ్నేశ్వరునకు రెండుసార్లు ఉడికిన మోదకాలంటే మక్కువ. ముందు బియ్యపు పిండిని ఉడకపెడతాం. అందు పూర్ణం పెట్టి మరల ఉడకపెడతాం. ఇంకా పవిత్రత కోసం వాటిని నేతిలో కూడా వేయిస్తారు. గణపతి హోమంలో వాటినే హోమం చేస్తారు. అతడు మోదకహస్తుడు. అంటే తీపిగానున్న మోదకాలను చేతిలో ఉంచుకొనే స్వామి ఇతడొక్కడే. కృష్ణుని చేతిలో వెన్నముద్ద యుంటుంది. వెన్నకుండను ఆలింగనం చేసుకున్నట్లుగా బొమ్మలుంటాయి. అయితే వెన్నను ఉడకబెట్టరు కదా! తేనెగాని, పిండిని గాని సుబ్రహ్మణ్యునకు అర్పిస్తాం. అవీ ఉడక బెట్టినవి కావు. అన్నపూర్ణేశ్వరికి చేతిలో పాయసముంటుంది. అది ఆమె కోసం కాకుండా మనకీయడానికే అన్నట్లుంటుంది. ఒక్క గణపతి మాత్రమే వండినవి తింటాడు, వండినవి ఇస్తాడు.

అందువల్ల తనలో దేవాంశ, భూతాంశ, మానవ లక్షణాలను వినాయకుడు ప్రకటిస్తున్నాడు. కేవలం దేవతగా కేవలం మానవునిగా కేవలం భూతంగా ఉన్నాడా? అన్నీ కలబోసిన మూర్తిగా ఉన్నాడు.

అయితే ఏనుగు ఆకారంలోనే ఎందుకుండాలని ప్రశ్న. దానికి మిగిలిన జంతువులకంటె గొప్ప గుణాలున్నాయి కనుక. మరొక్క విషయం. ఏనుగు తలనే ఎందుకు ధరించాడు? పరమాత్మ తానన్నిటికీ మూలమని సూచించడానికి, అట్టి రూపాన్ని అందరూ భజించాలని తెలుపడానికి అట్టిరూపాన్ని ఎంచుకున్నాడు. అసలు సృష్టికి మూలం ఏమిటి? అన్నిటికీ

మూలం ప్రణవం. అన్ని జంతువులలోనూ దేనికీ లేని ప్రత్యేకత ఏనుగు ముఖానికి ఉంది. దాని ముఖం, కుడివైపున తిరిగిన తుండం, ప్రణవాకారంగానే ఉంటాయి. అందువల్ల గజానన రూపంలో సాక్షాత్కరించాడు.

ముఖం - నోరు

గజాననంలో ఆననం ఉంది. అనగా ముఖం. ముఖానికి అమర కోశంలో చాలా పర్యాయ పదాలున్నాయి. వక్త్రాస్యం, వదనం, తుండం, ఆననం, లపనం, ముఖం ఇవన్నీ ముఖాన్నే సూచిస్తాయి.

ఇక సంస్కృతంలో నోటికి ప్రత్యేక పదం లేదని, ముఖానికి ఉన్న పదమే నోటికీ ఉందని లోగడ చెప్పాను. వాక్, వచనం మొదలైనవి మాటకు సంబంధించినవి. మాట్లాడతాడు కనుక, వక్త. మాట్లాడదగినది వక్తవ్యం. కనుక వక్త్రం అనే మాట నోటికే చెందుతుంది. వదనం అనేమాట కూడా మాటకాధారమైన అంగం, ముఖ్యంగా నోటినే చెబుతుంది. వద అనగా మాట్లాడు. ధాతువును చూస్తే లపనం కూడా మాటకే చెందింది. లప్ అనగా మాట్లాడుట. దాని నుండే ఆలాపం, సల్లాపం, ఆలాపన అనే మాటలు వచ్చాయి. కనుక ముఖాన్ని సూచించే పదాలు నోటినీ సూచిస్తాయనడం సబబు కాదు. ఆపైన వక్త్రం, వదనం అని నోటిని సూచించే పదాలు ముఖాన్ని సూచిస్తాయి. మాట్లాడేశక్తి మానవునకే ఉంది కనుక నోటికి ప్రాధాన్యం ఉంది. నోరు, అన్ని అవయవాలలో ముఖ్యమైన ముఖంలో ఉంది. చూసే కళ్ళు గాని, వినే చెవులు గాని, వాసన చూసే ముక్కు గాని, స్పృశించడానికి అందంగా ఉండే చెక్కిళ్ళు గాని అన్నీ ముఖంలోనే ఉన్నాయి. మానవులలో ప్రత్యేకత, మాట్లాడే లక్షణం కనుక, నోరే మాట్లాడుతుంది. కనుక నోటిని, ముఖాన్ని సూచించే పదం ఉంచారు. నోటికే రెండు లక్షణాలున్నాయి. కన్ను, చెవులనే జ్ఞానేంద్రియలతోబాటు ఇదీ జ్ఞానేంద్రియమే. మాట్లాడగలదు, రుచి కూడా చూడగలదు. ఇట్లా రెంటి పనులూ చేసి ప్రముఖ స్థానాన్ని పొందింది.

అందువల్ల ముఖాన్ని, నోటిని సూచించు పై పదాలున్నాయి. గజానుడన్నా, విఘ్నేశ్వరుడన్నా ఏనుగు ముఖమే గుర్తుకు వస్తుంది.

శరీరంలో తలకు ప్రాధాన్యం. ఒకడు అందంగా ఉన్నాడా లేదా అని చెప్పేది ముఖాన్ని బట్టే కదా! అట్టి ముఖం ఉన్నవాడు గణపతి. ఇందన్ని అవయవాలూ చూడముచ్చటగా ఉంటాయి.

(ఇక అమరకోశంలో – వక్త్రం దీనిచే పలుకబడును; ఆస్యం=దీని యందు భక్ష్య వస్తువులు వేయబడును; వదనం=దీనిచే పలుకుదురు; తుండం=భక్ష్య వస్తువు దీనిచే పీడింపబడును, ఆననం=దీనిచేత బ్రతుకుదురు; లపనం=దీనిచే పలుకుదురు; ముఖం=దీనిచే భక్ష్యము పీడింపబడును. ఇందు చాలా పదాలు నోటికే ప్రాధాన్యాన్ని సూచిస్తున్నాయని సారాంశం –అనువక్త)

వక్రతుండుడు

ముఖాన్ని సూచించే పదాలలో తుండం ఒకటి. సాధారణంగా తుండం అంటే ముఖమని ఉన్నా పంది, ఏనుగులకు ముక్కును బట్టే వాటికి ప్రాధాన్యం. తుండమనగా ఆ రెండింటికే 'ముక్కు' అని చెప్పాలి. పంది యొక్క ముక్కుకు ప్రాధాన్యం ఏమిటి? గుఱ్ఱం మొదలగు జంతువుల ముక్కు క్రమంగా తగ్గుబాటుతో ముఖంవైపు సారించినపుడున్నట్లు ఉండగా, పంది ముక్కు వృద్ధి పొందుతూ ఉంటుంది. ఏనుగుకు ముక్కు వ్రేలాడుతూ ఉంటుంది. చెట్టుబోదెలా ఉండేదే తుండం. పక్షులకు ముక్కు పొడవుగా ఉండి పోను పోను కోసుగా ఉంటుంది. దీనినీ సంస్కృతంలో తుండం అంటారు.

శరీరంలో తలకెంత ప్రాధాన్యమో తలలో ముక్కునకు అంత ప్రాధాన్యం ఉంది. అది చేసే పనివల్లనే కాదు, దాని ఆకారానికీ ప్రాధాన్యం ఉంది, ఒకని ముక్కును బట్టి అతని ఆకారం చెబుతాం. (గ్రద్ద ముక్కున్నవాడు మొదలైన వ్యవహారంలో ఉన్నాయి)

వక్రమనగా వంకర. ఎవడైనా తప్పుపని చేస్తే వాడిని వక్రుడని అంటాం. అంటే వాడిది వక్రగుణం. ఋజుప్రవర్తన ఉన్నవాడికి తిన్నని గీతలా మనః ప్రవృత్తి ఉంటుంది. ఇట్టి దానిని సంస్కృతంలో ఆర్జవమంటారు. తిన్నగా అని అర్థం. ఋజు - ఆర్జవం.

ఇక వక్రతుండం అనినపుడు చెడ్డ అనే అర్థంలో వాడం. కేవలం వంకరనే. ఇతని తుండం, వంకరగా తిరిగియుండుటవల్ల ఇతడు వక్రతుండుడు.

మరొక చిత్రం. ఏనుగు, మొత్తం తుండాన్ని కదపకుండా దాని అగ్రభాగాన్ని వంచగలదు, అటూ ఇటూ సాధారణంగా ఎడమవైపునకు త్రిప్పుతుంది. ఎప్పుడైనా కుడివైపునకు కూడా.

ముత్తుస్వామి దీక్షితులు వక్రతుండ మహాకాయ అని స్వామిని కీర్తించారు. దాని అగ్రభాగాన్ని కుడివైపునకు త్రిప్పినపుడు (వలంపురి) అతడు ప్రణవ స్వరూపునిగా కనబడతాడని లోగడ చెప్పాను.

వెన్నను దొంగిలించే కృష్ణుణ్ణి భావిస్తే మనలో చోరగుణం పోతుంది. అతని రాసలీలలను స్మరిస్తే మనలో కామం పోతుంది. అట్లాగే వక్రతుండుని స్మరిస్తే మనలో వక్రలక్షణాలు పోతాయి. గణపతి గాయత్రిలో వక్రతుండ పదమే ఉంది. ఈ మంత్రం యొక్క లక్ష్యం మనలను సన్మార్గంలో పెట్టుమనే.

శూర్పకర్ణుడు

అనగా చేటల వంటి చెవులు కలవాడు. ఇంతకుముందే గజకర్ణకుడని చెప్పడం వల్ల అట్టిదే శూర్ప కర్ణుడు చెప్పడంలో ఔచిత్యం ఉందా? ఉంది.

గజకర్ణకుడని చెప్పినపుడు, పెద్ద చెవులుంటాయని, వాటి ద్వారా మన ప్రార్థనలను వింటాడని తెలుసుకున్నాం. మన ప్రార్థనలొక్కటే వింటాడా? మనం మాట్లాడేవన్నీ, అందునా వ్యర్థ ప్రసంగాలనూ వింటాడు. ఇక మన

ప్రార్థనలు కూడా వెఱ్ఱి మొఱ్ఱిగా ఉంటాయి. వ్యర్థమైన మన మాటలను చెవినొక్కి ఎట్లా వినగలడు? అందువల్ల అతడన్నిటినీ వింటున్నా దేనిని మనస్సులో ఉంచుకోవాలో దానిని అట్టే పెట్టుకుని మిగిలిన వాటిని గెంటి వేస్తూ ఉంటాడు. అందువల్ల అతడు శూర్పకర్ణుడయ్యాడు. శూర్పమనగా చేట. చేట గింజల నుంచుకొని పొట్టును చెరిగి వేస్తుంది. అంటే చెత్తా చెదారాన్ని గెంటి వేస్తుందన్నమాట.

ఇట్టి రూపం ఏమని సందేశమిస్తోంది! మిగతా జంతువులకు లేని పెద్ద పెద్ద చెవులు దీనికి ఉన్నాయి కనుక అన్నీ వినే శక్తి కలవాడు. అందువల్ల మనము సరియైన ప్రార్థనలే అతని ముందు చేయాలని హితోపదేశం చేస్తోంది. ఏది సరియైనదో కాదో ఆయన తూకం వేసి చూస్తాడు. సరియైన ప్రార్థనకే బదులిస్తాడని భావించాలి. అందుకే ఈ నామం.

హేరంబుడు

నాకు తెలిసినంతవరకూ ఎవ్వరూ ఈ ధాతువునకు అర్థం ఈయలేదు, లేదా నేను సరిగా అర్థం చేసుకొని యుండకపోవచ్చు. భాస్కర రాయలనే మంత్ర శాస్త్రవేత్త ఉండేవాడు. లలితా సహస్ర నామాలపై వారి వ్యాఖ్య చాలా ప్రసిద్ధిని పొందింది. ఆయన గణేశ సహస్రనామాలపై వ్యాఖ్య వ్రాసేడు. ఈ పదానికి అతడెట్టి వ్యాఖ్యానం చేసాడా అని చదివినాను. వ్యాఖ్యననుసరించి శైవాగమాన్ని స్థాపించినవాడని; బాగా శౌర్యం కలవాడని వ్రాసేడు. ఆ వ్యాఖ్యాత, గొప్పవాడే. ఆ పదానికి ఆ అర్థం ఎట్లా వస్తుందో నాకైతే అర్థం కాలేదు. ఇది నా లోపం కావచ్చు. తమిళ పదమైన ఎరుమై (Erumai) అనగా దున్నపోతు, హేరంబునిగా మారిందని కొంతమంది పరిశోధకులంటున్నారు.

సంస్కృత పదాలకు అర్థం చెప్పేటపుడు వాటి ధాతువులను బట్టి నిర్ణయిస్తారు. ఈ నియమానికి కొన్ని మినహాయింపులు లేకపోలేదు. ఆయా ధాతువును బట్టి ఆయా అర్థం వస్తుందని చెప్పడం వల్ల యౌగికార్థం వస్తుంది. యౌగికమనగా వ్యుత్పత్తి కలది. వ్యుత్పత్త్యర్థము కలది.

(దీనికి విరుద్ధంగా అవయవ శక్తిని అపేక్షించకుండా కొత్త అర్థంలో ప్రసిద్ధమైన దానిని రూఢియని అంటారు. ఉదా: లావణ్యం. లవణము యొక్క భావం లావణ్యం. కాని తళతళలాడే వస్తువు, లావణ్యంతో ఉందని అంటాం. ఉదా: లావణ్యవతి. లవణమనగా ఉప్పు. అది తళతళలాడుతుంది. కాని మిగిలిన సందర్భాలలోనే ఈ లావణ్య పదాన్ని వాడతారు. అంటే వాడుకలోనున్న అర్థము. ఇంకా వివరంగా చెప్పాలంటే ప్రకృతి ప్రత్యయముల అపేక్ష లేకుండా బోధపడే అర్థం, యౌగికము కాని అర్థం – అనువక్త) ఇట్లా హేరంబపదం రూఢికెక్కింది.

వనవాసానికి ముందు పాండవులు ఇంద్రప్రస్థంలో రాజసూయ యాగం చేయాలనుకున్నారు. ధర్మరాజు, సోదరులను నలువైపులా పంపించాడు. అపుడు సహదేవుడు దక్షిణ వైపునకు వచ్చాడు. ఆ ప్రాంతాలను జయించాడు. భారతంలో హేరంబం అనే రాజ్యాన్ని జయించినట్లుంది. ఇదే కాలక్రమంలో మైసూరుగా రూపొందిందేమో! మహిషుని ఊరు, మైసూరు. మహిషం అంటే దున్నపోతే కదా! మహిషానికి, హేరంబ పదానికి దగ్గర సంబంధం ఉంది. సహదేవుని చేతిలో ఓడిపోయినా తాము గొప్ప వారమనే అహంకారంతోనే అక్కడవారు యుండి యుంటారు. ఎవడు తన గొప్పను తాను చెప్పుకుంటూ ఉంటే వాటిని హేరంబుడని పిలిచి యుంటారు. ఇట్టి ప్రాంతంలో వినాయకుడు కొలవ బడడం చేత ఇతడు హేరంబ గణపతి అయ్యాడు.

ఇది ఊహ మాత్రమే. నాకేమని తట్టుతోందంటే అర్థం కోసం ప్రాకులాడకుండయ్యా, హేరంబపదం వీనులవిందుగా లేదా? నామాదిరిగా

ఆజ్ఞా సూచకంగా లేదా? నేనీ పేరుతో పిలువబడడం సబబే కదా, నా పేరుతో పిలవండి. నిఘంటువుల నెందుకు చూస్తారు? అని చెబుతున్నాడేమో!

అతడు హేరంబ రాజ్యానికి చెందినవాడైనా కాకపోయినా పదం ప్రసిద్ధిపొందింది. షోడశనామాలలో ఇదీ ఉంది.

(హేరంబ పదం అమరంలో: హేరుద్ర సమీపే రంబతే తిష్ఠ తీతి హేరంబః = రుద్రుని యొద్దనుండువాడు. ఋగతౌ హేరతే వర్ధయతి భక్తానితివా - భక్తులవృద్ధి బొందించువాడు. హే వృద్ధౌ - అమరం - గురుబాల ప్రబోధిక-అనువక్త)

ఏనుగును పూజించిన సింహం

హేరంబ గణపతి రూపం ప్రత్యేకంగా ఉంటుంది. ఇతనికి ఐదు ముఖాలు. అన్నీ గజ ముఖాలే. 'పంచమాతంగ ముఖ' అనే పాట కూడా ఉంది. తిరువారూర్‌లో ఇట్టి గణపతిని చూసి ముత్తుస్వామి దీక్షితులు పాడియుంటారు.

పరమశివునకు ఐదు ముఖాలు. శివపంచాక్షరి ధ్యానంలో అలా ఉంటుంది. శంకరులిక్కడే శ్లేషను ప్రయోగించారు.

ఐదు ముఖాలుంటాయి. కనుక ఈశ్వరునకు పంచాస్యుడని పేరు. సింహానికీ పంచాస్యమని పేరు. ఇక్కడ పంచయనగా విస్తరించినదని (పెద్ద ముఖం కలది) అర్థం. ప్రపంచం అనినపుడు విస్తరించినది యనే అర్థంలో వాడుతున్నారు. ఈ సందర్భంలో పంచ్ అనగా ఐదని, ఐదు భూతాలతో ప్రపంచముంటుందని అర్థం చేసుకోవచ్చు కదా. సింహం అంటే భయపడుతుంది ఏనుగు. సింహాన్ని స్వప్నంలో చూసినా భయపడి చనిపోతుందని అంటారు. సింహ స్వప్నం అనే మాట ఉంది. ఏనుగును చూస్తే ఉన్న బలాన్ని అంతా పుంజుకుని మీద పడడానికి సిద్ధమౌతుంది సింహం. దాని కుంభస్థలం బ్రద్దలు కొడుతుంది. అట్టి సింహం ఏనుగునకు పూజ చేస్తే ఆశ్చర్యం. అందుకే శంకరులు మహాదంతి

వక్త్రాపి పంచాస్యమాన్యా అని తిరుచెందూర్‌లోని సుబ్రహ్మణ్యుని భుజంగ స్తోత్రంలో నుతించినపుడు, వినాయక స్తుతిగా ఈ మొదటి శ్లోకాన్ని వ్రాసేరు:

సదాబాల రూపాపి విఘ్నాద్రిహంత్రీ

మహాదంతి వక్త్రాపి పంచాస్య మాన్యా

విఘ్నేశ్వరుడెపుడూ బాలరూపంలో ఉంటాడు. సదా బాలరూపాపి. అపి అంటే అయినా, కొండల వంటి విఘ్నాలను పిండి చేస్తున్నాడు.

దాని తరువాత అతడేనుగైనా సింహం చేత పూజింపబడ్డాడు. 'మహాదంతి వక్త్రాపి పంచాస్య మాన్యా'

ఎక్కడా జరగనివి, గణపతి విషయంలోనే జరిగే సంఘటనలను, శంకరులు తమ ప్రతిభతో పేర్కొన్నారు. మొదటగా కొండంత విఘ్నాలను గణపతి, పిండి చేస్తాడని అంటూ అతడేనుగు ముఖం కలవాడైనా సింహం చేత పూజలందుకొంటున్నాడని వ్రాసేరు. మొట్టమొదటిగా పంచాస్య మంటే సింహమని భావిస్తాం. కానీ ఇక్కడ సింహం కాదు. పరమశివుడే. త్రిపురా సుర సంహార విషయంలో విఘ్నేశ్వరుణ్ణి శివుడు పూజించలేదా! అతని రథపుటిరుసు విరిగినపుడు పూజించాడని విన్నాం కదా.

ఐదు ముఖాలున్నవానికి సింహం వాహనంగా

అతడు పంచాస్య మాన్యుడే కాదు అతడే ఐదు ముఖాలున్న హేరంబ రూపంలో ఉంటాడు. అప్పుడు అతనికి ఐదు ఏనుగు ముఖాలు, పదిచేతులు సింహం వాహనంగా ఉంటుంది. ఇక్కడ ఏనుగు సింహాన్ని చూసి భయపడడం లేదు. సింహంపైనే ఎక్కి స్వారీ చేస్తుంది. ఐదు ముఖాలు కలిగి తండ్రిని తలపింప చేస్తున్నాడు, సింహం వాహనంగా కలిగి తల్లిని గుర్తు చేస్తున్నాడు. అమ్మవారికి, సింహ వాహిని అని పేరుంది కదా. ఇక మహాగణపతి మూర్తికి

పది చేతులున్నా ఐదు ముఖాలూ ఉండవు. సింహం, వాహనం గానూ ఉండదు. ఒక్క హేరంబ రూపంలోనే అట్టి రూపాన్ని చూడగలం. నాగ పట్టణంలో ఉన్న నీలాయతాక్షి ఆలయంలో ఇతడు రాగిరూప విగ్రహంగా ఉంటాడు. నాల్గు ముఖాలూ నాల్గు దిక్కులను చూస్తూ ఉంటాయి. ఐదవ ముఖం కిరీటంగా ఉంటుంది. ఇట్లా ఐదు ఏనుగు ముఖాలతో కనువిందు చేస్తుంది ఆ మూర్తి.

స్కంద పూర్వజుడు

చివరి నామం దగ్గరకు వచ్చాం. స్కందునకు అన్న గారని అర్థం. ఇతణ్ణి అగ్రజుడని పేర్కొన్నాం.

సహోదర పదం వాడబడినపుడు అన్నగారూ కావచ్చు, తమ్ముడూ రావచ్చు. పూర్వజుడని చెప్పడం వల్ల ముందు పుట్టినవాడని స్పష్టంగా తెలుస్తోంది. తమ్ముణ్ణి అనుజుడని అంటాం. రామానుజుడు అనగా రాముని తరువాత పుట్టినవాడు. అమర కోశంలో సుబ్రహ్మణ్యస్వామికి గజముఖానుజుడని నామం.

కుమారస్వామికి అన్న గారవడం వల్ల గొప్పదనాన్ని సూచిస్తుంది

షోడశనామాల నుచ్చరిస్తూ ఉన్నపుడు శివుని కొడుకని గాని అమ్మవారి కొడుకని గాని లేదు. ఎవరి పతి యని కూడా లేదు. బ్రహ్మచారిగా అనేక రూపాలలో ఉన్నవానికి భార్యతో కలిసి యుండగా అనేక నామాలతో కీర్తింపబడ్డాడు. వల్లభితో ఉన్నపుడు వల్లభ గణపతి. సిద్ధి, బుద్ధి కూడా ఇతని భార్యలు. ఫలానా వారికి ఇతడు తండ్రియని సూచించే పదాలు లేవు. షోడశనామాలలో మాత్రం చివరి నామం, స్కందునికి అన్నగారనే ఉంది. ఎందుకిట్లా?

ఇక్కడ చిన్నవాని పేరు చెప్పి అతని అన్నగారైన వినాయకుడని చెప్పడం జరిగింది. ఎందుకిట్లా చెప్పారు?

వినాయకుడు, కుమారస్వామితో సంబంధం పెట్టుకొని యున్నాడు కనుక. సోదరుని జీవితంలో మూడు దశలలో అనగా పుట్టుక, వివాహం, సన్న్యాసంలో అన్నగారి పాత్ర ఉంది.

కుమారస్వామి జననం - అన్నగారి పాత్ర

విశ్వామిత్రుడు రామలక్ష్మణులకు కుమార స్వామి కథను చెప్పాడు. వాల్మీకి రామాయణంలో ఈ కథను చెప్పేటపుడు కుమార సంభవమని అన్నాడు. కాళిదాసు ఈ మాటలను గ్రహించి ఆ పేరుతో కావ్యమే వ్రాసేడు.

పుట్టుకలో ప్రత్యేకత ఏమిటి? ఎవరైనా పుట్టిన తరువాత, పెరిగినపుడు, విద్యాభ్యాసం తరువాత కీర్తిని గడిస్తారు. ఇక కుమార సంభవానికి ముందే దేవసేనాధిపత్యం అనే బాధ్యత తారసపడింది. దానిని నిర్వహించడానికి కుమారస్వామి పుట్టితీరాలి. పుట్టుకతోనే దేవగణాలకు సైన్యాధిపతి కావలసి వచ్చింది. అసురుల చేతిలో దేవతలు నానా ఇబ్బందులూ పడుతూ ఉండగా రోగొట్టేవాడెపుడు అవతరిస్తాడా అని ఎదురు చూస్తూ ఉన్నారు.

శూర పద్మడు, తారకా సురుడు మొదలైనవారు శివునినుండి, తమను సంహరించడానికి శివునితో సమానుడైన వాడే అర్హుడని నియమం పెట్టారు. ఇక శివునకు సాటి ఎవరు? శివునకు సాటి శివుడే కదా! అయితే వరాన్ని ఇచ్చినవాడే చంపుతాడా? అందువల్ల తెలివిగా శివుడెట్లాగూ చంపలేడని, ఇక శత్రుబాధ ఉండదని దేవతలను హింసించడం మొదలు పెట్టారు.

దేవతలొక మార్గాన్ని అన్వేషించారు. వేదం, ఆత్మావై పుత్ర నామాసి అని చెప్పింది. తండ్రియే పుత్రునిగా పుడుతున్నాడని అర్థం. అందువల్ల పరమేశ్వరుణ్ణి

సంతానం కనవలసిందని, అతడు మా నాయకుడవుతాడని తపస్సు చేసారు. అదే సమయంలో శివుడు, దక్షిణామూర్తి రూపంలో ఉండి తపస్సు చేస్తున్నాడు. అమ్మవారు, స్వామికి పరిచర్య రూపంలో తపస్సు చేస్తూ ఉంది. ఇట్టి పవిత్ర వాతావరణంలో కుమారుడు పుట్టాడు.

పిల్లవానిగా ఉన్నపుడు ఆరు రోజులు కొన్ని లీలలను ప్రదర్శించాడు. ఇతనికి, ఆరు సంఖ్యకూ దగ్గర సంబంధం ఉంది. ఇతనికి ఆరు ముఖాలు. ఇతని మంత్రంలోనూ ఆరు అక్షరాలే. పుట్టిన రోజు కూడా షష్ఠియే. ఇతనికి పాలనిచ్చినవారు ఆర్గురే. వారే కృత్తికలు. అతని పేరు కుమారుడవడం వల్ల ఆరు రోజులతని లీలలు. తరువాత సైన్యాధిపత్యం వహించాడు. అసురులను చంపాడు. దేవతలను రక్షించాడు.

అయితే ఇక్కడ విఘ్నేశ్వరుని పాత్ర ఏమిటి? శివుని కొడుకు శివుడైతే ఇక విఘ్నేశ్వరుడు శివుని కొడుకు కాదా? దేవతలు కుమారస్వామికై తపస్సు చేస్తున్నారని చెప్పినపుడు అప్పటికి విఘ్నేశ్వరుడు పుట్టి యుండలేదా? అందువల్ల ఈ విషయం తేటతెల్లం కావడం కోసం స్కంద పూర్వజుడని ఇతనికి నామం ఏర్పడింది.

సరే బాగానే ఉంది. ఇక కుమారస్వామికి ముందే విఘ్నేశ్వరుడు పుట్టియుండగా మరొక శివపుత్రుని కోసం తపస్సు చేయాలా? గణపతి, శివునితో సమానుడు కాదా? ఇతని ఘనత ఏనాడో వెల్లడైంది. త్రిపురాసురులపై శివుడు దండెత్తినపుడు విఘ్నం వస్తే శివుడే వినాయకుణ్ణి పూజించాడు కదా! ఇతని కీర్తిని దేవతలు విన్నా శివునకు మరొక సంతానం కావాలని ఎందుకు కోరుకున్నారు?

శూర పద్ముడు పొందిన వరంలో ఒక మెలిక దాగియుంది. అట్లా తెలివిగా వారు అడుగుతూ ఉంటారు కూడా. శివునితో సమానుడైనవాడు, స్త్రీ పురుషుల

కలయిక లేకుండా పుట్టాలని అట్టివాడే మమ్మల్ని చంపగలడని అన్నారు. అట్టిది కుదురుతుందా?

విఘ్నేశ్వరుడు పెక్కువిధాలుగా పెక్కు రూపాలు ధరించాడు. అందొక రూపం, అమ్మవారు ఒంటికి రాసుకున్న పసుపు నుండే. ఇంకా అనేక కథలున్నాయి. కైలాసంలోని విలాస భవనంలో ప్రణవాక్షరం చాలా అందంగా గీయబడి యుంది. దానిని శివపార్వతులు రెప్పలార్పకుండా ఒక్కసారే ఇద్దరూ చూసారు. వెంటనే వినాయకుడు పుట్టినట్లు కథ. రెండు ఏనుగులకు పుట్టినట్లుంది. అమ్మవారు ఆడ ఏనుగు కాగా, అయ్యవారు మగ ఏనుగయ్యాడట. ఈ కథను తేవారంలో జ్ఞాన సంబంధులు పేర్కొన్నారు.

లలితాంబ, భండాసురుణ్ణి ఎదుర్కొనగా అతడు విఘ్నయంత్రాన్ని సృష్టించగా, అపుడామె పరమ శివుని ముఖం చూడగా గణపతి పుట్టినట్లు ఒక కథ.

అన్ని కథలలోనూ విఘ్నేశ్వరుని పుట్టుకకు అమ్మవారితో సంబంధం ఉంది. అందువల్ల శూర పద్ముడు, స్త్రీ పురుష సంబంధం లేకుండా అనే మెలిక పెట్టాడు. శివుని నేత్రాలనుండి కొన్ని నిప్పురవ్వలు రాగా అమ్మవారితో సంబంధం లేకుండానే మన స్వామి పుట్టాడు.

ఇట్టి సంఘటనకు వినాయకుడు అవకాశం ఈయడం వల్లనే కుమార సంభవం కుదిరింది. వినాయకునకు అసురులను సంహరించే శక్తియున్నా శంకరుడిచ్చిన వరాన్ని గౌరవించాలని యుద్ధానికి వెళ్ళలేదు. ఇతడు యుద్ధరంగానికి వెళ్ళకుండా కుమారస్వామి వెళ్ళుటకు అవకాశం ఇచ్చినవాడయ్యాడు. అనగా కుమారస్వామి అవతారానికి ఒక విధంగా దోహదం చేసాడు.

అతడు తలుచుకుంటే తండ్రి శరీరంలో ప్రవేశించి, అమ్మతో సంబంధం లేకుండా శివుని నుండే అవతరించి యుండేవాడు. అతడే దేవగణాలకూ

అధిపతియై యుండేవాడు. అసురులను చంపడం ఒక లెక్కా? అట్టి పనులు చేయకుండా ఉండడం వల్లనే సుబ్రహ్మణ్యుడనే ఆరాధ్యమూర్తి లోకానికి వచ్చింది.

కుమార సంభవానికి, గణపతికి ప్రత్యక్ష సంబంధం లేకపోయినా శక్తి ప్రదర్శనను సోదరునిచే చేయించి ఆ కీర్తిని సోదరునికే చెందునట్లుగా చేయడం మాటలా? అట్టి కీర్తిని తమ్మునికి ప్రసాదించి పెట్టాడు కదా!

సోదరుని వివాహంలో ఇతని పాత్ర

ఇక వల్లీ సుబ్రహ్మణ్యుని వివాహంలో ఇతని పాత్ర ఉంది. ఇట్టి వివాహం, అనేక కథలకు, నాటకాలకు ఊపిరి పోసింది.

చాలామందికి ఈ కథ తెలుసు. వినాయకుడు ఏనుగు రూపమెత్తడం, వల్లిని తరమడం, చివరకు ఆమె సుబ్రహ్మణ్యుని చెంత చేరడం జరిగింది. వల్లి, తన దగ్గరకు రాకపోతే ఏం చేయాలో కుమారస్వామికి తెలియలేదు. అన్నగారిని మనసారా ప్రార్థించడం వల్ల ఆ ఆటంకం తొలగిపోయింది. ప్రార్థనను ఆలకించాడు గణపయ్య. వెంటనే ఏనుగు రూపాన్ని, ధరించాడు. వల్లిని తరిమాడు, సోదరుని దగ్గరకు చేర్చాడు. ఇట్లా వల్లీ సుబ్రహ్మణ్యుల కలయిక. తిరుప్పుగళ్, ఇతణ్ణి చిన్నస్వామియని పేర్కొంది. అపుడతడు యువకుడే. అంతకుముందే అసురులను సంహరించి యున్నాడు. భగవద్గీతలో సేనానులలో నేనని అనగా స్కందుడనని భగవానుడనలేదా? అట్టి సేనాని కూడా ఒక భిల్లవనితయైన వల్లిని లొంగదీసుకోలేకపోయాడు. అన్నగారిని ప్రార్థించడం వల్ల ఆటంకం తొలగింది. ఇట్టి సందర్భంలో యువకుడైన కుమారస్వామిని చిన్న మురుగన్ అని అరుణగిరి నాథుడు అన్నాడు. వయస్సును గురించి ఎత్తుకొనలేదు.

కనుక వల్లీ సుబ్రహ్మణ్యుల వివాహంలో గణపతికి ప్రత్యక్ష పరిచయ ముంది.

సోదరుని సన్యాసంలో ఇతని పాత్ర

స్కందుని కథలో ఒక సందర్భంలో అతడు సన్యాసం తీసుకున్నట్లుంది. చిత్రమేమిటంటే, వివాహానికి ముందే స్వీకరించడం. సన్యాసియైనపుడు ఇతడు దండాయుధపాణి. పళని క్షేత్రం గురించి వినని వారుండరు. అది సుబ్రహ్మణ్య స్వామి యొక్క పవిత్ర స్థలం. దండాయుధమనగా శత్రువులను దండించే దండం కాదు సుమా! వట్టి దండమే. మేము ధరించే దండమే. అది వెదురు కఱ్ఱయే. సైన్యాధిపతికి దండాయుధం ఉంటుంది. లలితాంబ, దండిని. దండాయుధపాణి యైన స్వామి, పళని కొండలపై శాంతికి చిహ్నమైన దండాన్ని పట్టుకొని యుంటాడు. ఇక్కడి దండం, మనస్సును నిగ్రహించాడనే దానికి గుర్తుగా ఉంటుంది. మనస్సును నియమించడమే ఒక గొప్ప యుద్ధం వంటిది కదా! అట్టి దండాన్ని మనస్సును నియమించడానికి వాడుతున్నాం. కాని అతనికి దండం, ఒక అలంకార వస్తువు. అట్టి మూర్తి, మనవంటి వారికి గుణపాఠంగా ఉంటుంది.

ఇట్టి సన్యాసరూపం, ఇక ఏ దేవతకూ ఉండదు. చిన్నవయసులో తల గొరిగించుకొని, కాషాయ బట్టలు కట్టుకొని దండాన్ని ధరిస్తూ ఏ అవతార మూర్తియైనా ఉంటుందా? అందంలో, శక్తిలో, అధికారంలో ఇతణ్ణి మించినవారెవరైనా ఉన్నారా? దేవసేనాధిపతిగా ఉన్నాడు. పుట్టిన ఆరు రోజులకే అన్నిటినీ త్యాగం చేసి శాంతి స్వరూపుడై యున్నాడు. ఇట్లా మారడానికి ఎవరు కారణం? విఘ్నేశ్వరుడే. ఇతనికి ఇతని అన్నగారికి జరిగిన పందెంలో పార్వతీ పరమేశ్వరులకు ప్రదక్షిణం చేస్తే భువనాలన్నీ చుట్టిన ఫలం వస్తుందని తల్లిదండ్రులకే ప్రదక్షిణం చేసి పందును వినాయకుడు పొందాడు. ఆ అపజయం వల్ల విరక్తి కలిగి సన్యాస రూపం ఎత్తిన వాడు కుమారస్వామి. జ్ఞాన రూపునిగా, శాంతి రూపునిగా తీర్చి దిద్దినవాడు వినాయకుడే కదా!

తరువాత తల్లిదండ్రులు కుమారస్వామిని శాంత పరిచారు. ఇదంతా ఒక నాటకం కాదా? కాషాయం కట్టుకున్న వాడు వెంటనే దేవ సైన్యాధిపతి అయ్యాడు. ఏ త్యాగాన్ని చేసి ఇంద్రియాలను జయించాడో, దేనివల్ల జ్ఞానాన్ని, శాంతిని పొందాడో, అట్టివాడే అమితమైన శక్తితో సైన్యాధిపతిగా మారాడు.

కనుక ఇట్లా సుబ్రహ్మణ్య జననానికి; దేవ సైన్యాధిపత్యానికి; వల్లితో ఒక ఇంటివాణ్ణి చేయడానికి; విరక్తితో మారడానికి, అన్నిటికీ గణపతి ప్రత్యక్షం గానో, పరోక్షంగానో కారకుడయ్యాడు. కనుక ఇతణ్ణి స్కందపూర్వజుడని కీర్తిస్తున్నాము. ఏదో ఫలానా వారికి అన్నగారనే మామూలు అర్థంలో కాదు. ఇంత కథ ఉంది. షోడశనామాలలో ఈ మాట చేరడానికి ఇంత నేపథ్యం ఉంది.

పూర్వజుడనగా ముందు పుట్టినవాడు. ఆది యందని అర్థం. కాని ఈ మాట ఎక్కడ వచ్చింది? షోడశనామాలలో చివర వచ్చింది. సంపూర్ణమైనది. ఆదిలోనూ, అంతంలోనూ యుంటుంది. అదీ చమత్కారం.

కుమారస్వామి - ఫలశ్రుతిలోని లాభాలు

ఒక చక్కని విషయం గుర్తుకు వస్తోంది. విద్యారంభే... జాయతే అనే శ్లోకం ఫలశ్రుతిలో వస్తుంది. అనగా 16 నామాలు ఎవరైతే స్మరిస్తారో వారు ఇట్టి ఫలాలను పొందుతారని కదా! వీటికీ, కుమార స్వామి కథకూ సంబంధం ఉన్నట్లనిపిస్తోంది.

విద్యారంభే: పరమేశ్వరుని జ్ఞాననేత్రం నుండి కుమారస్వామి పుట్టాడు కనుక మామూలు అక్షరాభ్యాసం ఇతనికి ముందు అక్కర లేదు. అతడే ప్రణవ స్వరూపుడు. ఇతడే తండ్రికి ప్రణవోపదేశం చేసాడు. ఇక తనకి విద్యారంభం, సన్న్యాసాన్ని స్వీకరించడం బ్రహ్మవిద్యానుభవం పొందడమే. ఈ సన్న్యాసం

తీసుకోవడం దానికి కారణం, విఘ్నేశ్వరుడు పందెంలో జయించడం, ఫలాన్ని పొందడం వల్లనే!

(కంచి మహాస్వామివారు, విఘ్నేశ్వరునకు కుమారగురు అనే పదం ఉందని, ఒక సందర్భంలో కార్తికేయునకు విద్యారంభం చేసినట్లు చెప్పారు. దూర్వా యుగ్మాలను అర్చించేటపుడు 21 నామాలలో ఈ కుమారగురు పదం వస్తుంది – ఆంగ్లానువాదకుడు)

స్వామివారిట్లా ప్రసంగం కొనసాగించారు. అసలు ఈశ్వరునకు ప్రణవార్థం తెలియదా? లోకానికి చెప్పడం కోసం గురుశిష్య సంబంధం ఉండాలని హితోపదేశం చేయడం కోసం కొడుకు నుండే ఉపదేశం పొందినట్లు కనబడ్డాడు. దానిని విని సుబ్రహ్మణ్యుడు కూడా గణపతి నుండే ఉపదేశాన్ని పొందాడు. తండ్రే శిష్యుడైనపుడు, అతడు కుమారునకు ఉపదేశం ఇస్తాడా? ఇక తల్లి కూడా భర్తలో సగమైనపుడు ఆమె కూడా ఈయదు. అందువల్ల అన్నగారైన గణపతి నుండే ఉపదేశం పొందాడు. ఇతని సన్న్యాసానికి గణపతి పరోక్ష కారకుడయ్యాడని లోగడ వివరించాను. కానీ తిన్నగా కుమారస్వామికే గురవవడం వల్ల కుమార గురువనే పదం వహించాడు.

వివాహే: వల్లితో వివాహం చేయించాడు కదా! మనమా కథ విన్నాం.

ఇట్లా తమ్ముని వివాహానికి, సన్న్యాసానికి ప్రధాన సూత్రధారి అయ్యాడు. చిన్నపుడు ఇతనిలో వైరాగ్య భావం కల్గించాడు. పెద్దయిన తరువాత గృహస్థుణ్ణి చేసాడు. చిన్నతనంలోనే అవ్వైయార్‌ని ముసలిదానిగా మార్చాడు. వివాహం కావలసిన వయస్సులో ముసలిరూపా! ఇట్లా ఎన్నో లీలలు.

ప్రవేశే: పవిత్ర మూర్తియైన కుమారస్వామిని ప్రపంచంలోనికి అడుగుబెట్టునట్లు చేసాడు. విఘ్నేశ్వరుడు శూర పద్ముణ్ణి చంపగలిగియుండి చంపలేదు. ఆ ఫలం సోదరునికే దక్కాలని. అట్లా యుద్ధ ప్రవేశాన్ని సోదరునకు పరోక్షంగా అందించాడు.

నిర్గమే: ఏదో విడిచి వెళ్ళిపోవడం నిర్గమం. వల్లితో వివాహమైన వెనుక తన శాశ్వతమైన స్కందలోకానికి వెళ్ళాడు. భార్యలతో వెళ్ళాడు. వల్లికి ముందు దేవసేనను వివాహం చేసుకున్నాడు కదా.

ఈ లోకంలో అవతరించడానికి రెండు కారణాలున్నాయి. ఒకటి శూరపద్ముని సంహరించుట. రెండవది తన మేనమామ పిల్లలను వివాహం చేసుకొనుట. ఒక కూతురు దేవరాజు కూతురుగా, మరొక కూతురు భిల్లరాజు కూతురుగా పెరిగారు.

తిరు చెందూర్ దాటి సముద్రంలో అసుర సంహారం చేసాడు. తరువాత దేవసేనతో వివాహం తిరప్పరన్ కున్రంలో జరిగింది. అక్కడ ఉండగా నారదుడు వచ్చి చిత్తూర్‌లో వల్లి, విరహవేదన పడుతూ ఉందని వివరించాడు. అందువల్ల తిరుప్పరన్ కున్రంలో వల్లి దేవసేనలతో కూడి కలిసిన మూర్తి ఉండదు. కాని ఒక ప్రక్క దేవసేన ఒక ప్రక్క నారదుడూ ఉన్న విగ్రహం ఉంటుంది. పరమాత్మ యొక్క దయను జీవాత్మునిపై ప్రసరింపజేయు గురు స్వరూపునిగా ఉన్నవాడూ నారదుడే. సుబ్రహ్మణ్యుడు వల్లిపై మరులు గొనునట్లుగా చేసినవాడూ నారదుడే. అందువల్ల ఇతడు స్వామియొక్క మూర్తి ప్రక్కన ఉంటాడు.

వల్లి వివాహమైన వెనుక ఇద్దరు భార్యలతో తిరుత్తనిలో సాక్షాత్కరిస్తాడు. స్కంద లోకానికి వెళ్ళడం, నిర్గమనం. వల్లి వివాహం ఇట్లా దోహదం చేసింది. ఇట్లా అవతార ప్రయోజనం నెరవేరింది.

వల్లితో వివాహానికి కారకుడైన విఘ్నేశ్వరుడు, స్కంద లోకానికి ఇతడు నిర్గమించడానికీ కారకుడయ్యాడు.

సంగ్రామే: కుమారస్వామి యుద్ధరంగంలో అవక్ర పరాక్రమం చూపించాడు. దేవగణాలకు సేనాధిపతి అయ్యాడు. ఈ సంగ్రామానికి ముందు విఘ్నేశ్వరుకే పూజ చేసియుంటాడని ఊహించవచ్చు. ఎందుకంటే తండ్రి, త్రిపురాసుర సంహారానికి వెళ్ళేముందు, తల్లి భండాసుర సంహారానికి

వెళ్ళేముందు ఇతణ్ణి పూజించకపోవడం వల్ల వారికి ఆటంకాలెదురయ్యాయని పురాణాలలో చదివాం కదా! అందువల్ల జాగరూకతతో పూజ చేసియుంటాడని ఊహింపవచ్చు.

సర్వకార్యేషు: అన్నగారితో పోటీపడి భువన ప్రదక్షిణ సమయంలో విజయం సాధించలేకపోయాడు. ఇక సన్యాసియైన తరువాత అన్నగారికి నమస్కరించకపోవడం వల్ల జీవితాంతం సన్యాసిగా ఉండలేకపోయాడు. యుద్ధాలకు వెళ్ళేముందు నమస్కరించి యుండవచ్చుగాని, వల్లి దగ్గరకు వెళ్ళేటపుడు మరిచియుంటాడు. అతనిని మోహపెట్టి ఎట్టి తిప్పలను పెట్టిందో చూసారా! అనేక ఆటంకాలు వచ్చాయి. అన్నగారికి నమస్కరించిన తరువాత వివాహ విషయంలో విజయం సాధించాడు. ఆపైన అన్ని విషయాలలోనూ పూజించి యుంటాడు గనుక ఇక అపజయం మాటయే అతని చరిత్రలో వినబడదు.

ఇట్లా నామాలు చదవడం వల్ల ఎట్టి ఫలాలు వస్తాయో అన్ని ఫలాలూ స్కందునకు లభించాయని, స్కంద పూర్వనామంతో ఈ వివరణ పూర్తి అయింది.

స్కందనామ మహిమ

స్కందుడనగా శత్రువులను శోషింపచేయువాడని; దేవస్త్రీ దర్శనం వల్ల వదలిన ఈశ్వర రేతస్సు వల్ల పుట్టినవాడని నిర్వచనం. పరమేశ్వరుని జ్యోతిస్సువల్ల ఆవిర్భవించినాడు. ఇతనికి సుబ్రహ్మణ్య, కార్తికేయ, కుమార, శరవణభవ మొదలైన అనేక పదాలున్నా ఇతనికి సంబంధించిన పురాణం పేరు స్కంద పురాణమే. ఇతని నుద్దేశించి చేయబడు వ్రతము స్కంద షష్ఠియే. పరమేశ్వరుడు, అమ్మవారితో కుమారస్వామితో ఉన్నపుడు అతని పేరు సోమ స్కందుడే.

ఏదైనా విషయం వేదమంత్రాలలో కన్పిస్తే దానికి గొప్పదనం, గౌరవం కల్గుతుంది. స్కంద పదానికి అట్టి విలువ వచ్చింది. వల్లికి గురువు నారదుడని స్కంద పురాణంలో రాగా; ఛాందోగ్యోపనిషత్తులో సుబ్రహ్మణ్యుని పూర్వావతారమైన సనత్కుమారుడు, నారదునకు ఉపదేశించినట్లుంది. సనత్ అని బ్రహ్మకు ఒక పేరు. సృష్టికి పూర్వం బ్రహ్మ యొక్క సంకల్పానికి అనుగుణంగా సనత్కుమారుడు ప్రత్యక్షమయ్యాడు. ఇతడు సనక, సనందన, సనాతన, సనత్కుమారులలో ఒకడు. ఈ నల్గురు బ్రహ్మజ్ఞానులు. పుట్టుకనుండీ నివృత్తిమార్గంలో ఉన్నవారు. జ్ఞానులకు మార్గదర్శకులు. వీరు నిత్య యౌవనులు. కామవాసన అణుమాత్రం లేనివారు. ఛాందోగ్యంలో సనత్కుమారుడు సుబ్రహ్మణ్యునిగా వచ్చినట్లుంది. ఇట్లా వచ్చినట్లు స్కంద పదం రెండుమార్లు ఉచ్చరింపబడింది.

స్కందుడు, ప్రపంచ వ్యాప్తమైన దేవత. కొందరు స్కూల్‌ని ఇ స్కూల్ అన్నట్లు స్కంద పదాన్ని ఇ స్కందర్‌గా విదేశాలలో ఉచ్చరిస్తారు. సెమెటిక్ భాషలలో 'AL' అనేది ఇంగ్లీషులోని 'The' వంటి 'Definite Anticle'. (A, An, The) అది ఒక వస్తువును నిర్దిష్టంగానే చెప్పేది. స్పష్టంగా AL పదం, ఒక పదానికి ముందు చేరిస్తే ఇస్కందర్, అల్ ఇస్కందర్ అవుతుంది. ఇది గ్రీసుదేశం వెళ్ళి అలెగ్జాండర్‌గా అయింది.

సికిందర్ అనేమాట కూడా స్కందర్ పదం నుండే వచ్చింది. ఇటీవల సికింద్రాబాద్‌లో స్కందగిరి ఆలయం వచ్చింది. అసలు సికింద్రాబాద్‌యే సిక్కందరాబాద్.

స్కాండినేవియా, అనేక దేశాలతో అనగా స్వీడన్, నార్వే, డెన్మార్కులతో కూడింది. అది స్కాందియా ప్రాంతం. హిందూ – ఇండియా మాదిరిగా స్కంద – స్కాందియాగా మారింది.

పెద్దన్నగారితో రోజును మొదలుపెడతాం

వినాయకుడనగానే శివ-శక్తి తనయుడని చటుక్కున గుర్తుకు వస్తుంది. షోడశనామాలను స్కంద పూర్వజనామంతో పూర్తిచేసినపుడు వారి మరియొక తనయుని స్మరించగా మొత్తం వారి కుటుంబాన్ని స్మరించినట్లౌతుంది కదా! కనుక చివరి నామం అట్లా పలికి మంగళాంతంగా ముగిస్తున్నాం.

మన మందరమూ పార్వతీ సంతానమే. మన కందరికీ అన్న, వినాయకుడే. అతని తమ్ముడైన స్కందమూర్తిని స్మరించడం వల్ల అందరూ ఆ కుటుంబానికి చెందినవారయ్యారు. కనుక లేచీ లేవగానే షోడశనామాలను కీర్తిస్తే రోజువారీ కృత్యాలు నిరాటంకంగా సాగుతాయి. అన్నిటిలోనూ నిర్విఘ్నత కల్గుతుంది.

సర్వకార్యేషు విఘ్నః తస్య నజాయతే

ఇట్లా రోజూ నామాలు చివర ఫలశ్రుతిని చదివి చూడండి. లాభమే.

వినాయకుడు - తమిళం

ఒక దేవత, భారతదేశంలో అన్నిచోట్లా పూజలందుకొంటున్నా, ఒక్కొక్క ప్రాంతంలో ఆ ప్రాంత వాసులు ఒక దేవతతో మమైకమై పూజిస్తూ ఉంటారు. అట్లా తమిళ ప్రజలు, సుబ్రహ్మణ్యునితో ఐక్యమయ్యారు. ఈ స్వామియే తమిళ దైవమని. వారి భాషకు అధిదేవతయని భావిస్తారు. కాని వినాయకునకు అట్టి స్థానం ఇవ్వడంలో ఔచిత్యముందంటాను. సోదరులిద్దర్నీ విడదీయకుండా కలిపే పూజించాలంటాను.

రాజకీయాలలో ఉన్న ద్వేషానికి తోడు కొంతమంది బుద్ధిమంతులు, పరిశోధకులు, రెండు తప్పుడు తీర్మానాలను చేస్తున్నారు. తమిళనాడులో వినాయకపూజ, కంచి పల్లవులు, వాతాపి చాళుక్యుల మధ్య జరిగిన యుద్ధకాలంలో ప్రవేశపెట్టబడిందని అన్నారు. పల్లవ సైన్యానికి అధిపతియైన

నరసింహ వర్మ, పరంజోతిగా పిలువబడ్డాడు. అతడు వాతాపినుండి వినాయకుణ్ణి తీసుకొని వచ్చాడని అన్నారు. ఆ పరంజోతి, తరువాతి కాలంలో శైవసాధువయ్యాడు. మరొక అభిప్రాయం ఏమంటే కార్తికేయుడు, అసలు తమిళ దైవమే అని, ఇట్టి దేవుణ్ణి ఉత్తర దేశస్థులు స్వీకరించి అతనిపై ఎన్నో కథలల్లి అనేక పురాణాలను వ్రాసారని, ఆగమాలను సృష్టించారని వీరి వాదం. నిజం చెప్పాలంటే ఇద్దరూ సమస్త భారతీయులకు ఆరాధ్య దైవాలే.

తమిళనాడుకు విఘ్నేశ్వరుని సాహాయ్యం

ప్రత్యక్షంగా తమిళనాడుకు గణపతి ఎంతో సాయం చేసాడు. కొడగునుండి కావేరీ జలాన్ని తమిళనాడులో ప్రవహింప చేసినవాడని లోగడ చదువుకున్నాం.

మనం, నదీ పరీవాహక సంస్కృతిని గురించి మాట్లాడుతూ ఉంటాం. నదీతీరంలో ఉన్న జనులకు తిండికి, నీటికీ కొరత ఉండదు. ఎప్పుడైతే భౌతికమైన తృప్తి ఏర్పడిందో గొప్ప గొప్ప పనులు చేసి నాగరికతా వృద్ధి కోసమై ప్రజలు పాటు పడుతూ ఉంటారు. అట్టి గొప్ప నాగరికత, ఈ ప్రాంతంలో ఏర్పడడానికి కావేరీ నదియే కారణం. దీనికి కారకుడు గణపతియే.

గొప్ప సంస్కృతి అంటే చిత్రకళ, సంగీతం, సాహిత్యం, నృత్యం అని అనుకుంటూ ఉంటాం. అంతేకాదు, ఇది ఆత్మోన్నతినీ సూచిస్తుంది. ఇక్కడ ఉన్న దేవాలయాల చుట్టూ ఆ కళలు పరిభ్రమిస్తూ ఉంటాయి. ఇందున్న ఆలయ సంపద, ఏ ప్రాంతంలోనూ ఇంత విస్తారంగా కనబడదు. తమిళనాడు లోనే చోళ ప్రాంతం ఉంది. కావేరీ నదీ ప్రాంతంలో లెక్కకు మిక్కిలి ఆలయాలు వెలిసాయి.

ఆ పవిత్రాలయాలలో శైవ భక్తులైన అప్పర్, జ్ఞాన సంబంధర్, సుందరర్ భగవానుని కీర్తిస్తూ వందలకొద్దీ పాటలు వ్రాసారు. అట్టి ఆలయాలు 274. ఇందు 194 వరకూ కావేరికి ఉత్తర దక్షిణ తీరాలలో ఉన్నవే. వైష్ణవ ఆళ్వార్లు

కీర్తించినవి 108 దివ్యక్షేత్రాలు. ఇందులో చాలా భాగం చోళ ప్రాంతంలోనే ఉన్నాయి. సుమారు 40 వరకూ కావేరీ నదీ తీరంలోనే ఉన్నాయి.

ముఖ్యమైన వైష్ణవ క్షేత్రాలు - వినాయకుని లీలలు

కావేరీ నదీ తీరంలో శైవక్షేత్రాలంత విరివిగా వైష్ణవ క్షేత్రాలు లేకపోయినా శ్రీరంగంలోని రంగనాథాలయం ప్రసిద్ధిని పొందింది. అసలు కావేరీ నదికి దాని ఉపనదియైన 'కొల్లిడం'కు మధ్య శ్రీరంగనాథుడు వెలిసాడు. అతడు కావేరీ రంగడు, రంగరాజు.

పూర్వకాలంలో రంగనాథుణ్ణి అయోధ్య నేలిన ఇక్ష్వాకురాజులు కులదైవంగా ఆరాధించేవారట. అట్టి స్వామి, శ్రీరంగంలో ఎట్లా ప్రతిష్ఠితు డయ్యాడో అనే విషయం, రామాయణానికి చెందింది. దానికీ వినాయకునకూ సంబంధం ఉంది. శ్రీరాముని పట్టాభిషేకం పూర్తియైన తర్వాత వచ్చినవారు అయోధ్యను విడిచి పెట్టే సందర్భంలో రాముడనేకమైన కాన్కలను వారికందించాడు. వారందరూ యుద్ధంలో సాయపడ్డారు. కాబట్టి విభీషణునకు విశేషమైన కానుకలను ఈయాలనుకున్నాడు రాముడు. తన భార్యను, రాజ్యాన్ని తిరిగి పొందడానికి సుగ్రీవుడు, రాముని చెంత చేరితే ఏమీ ఆపేక్షించకుండా కేవలం శరణాగతిని పొందినవాడు విభీషణుడు. ఇదీ వారికున్న తేడా. అతణ్ణి చేరదీస్తూ ఇట్టి ప్రతిజ్ఞను చేసాడు రాముడు.

సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చయాచతే

అభయం సర్వభూతేభ్యో దదామి ఏతత్ వ్రతం మమ

అట్టి త్యాగియైన విభీషణునకు తగ్గట్లుగా గొప్ప కానుకలను ఇవ్వాలి. అందుకోసం కులదైవమైన రంగనాథ విగ్రహాన్ని దానితో బాటు ప్రణవాకార విమానాన్ని లంకకు తీసుకొని వెళ్ళవలసినదిగా అన్నాడు రాముడు.

ఈ రెంటినీ తీసుకొని వెళ్ళి కావేరీ తీరాన్ని సమీపించాడు విభీషణుడు. మన గణపయ్య దీనిని గమనించాడు. ఇట్టి సంపద, లంకకు తరలిపోవడాన్ని ఇష్టపడలేదు. ఇది తమిళనాడును, భారతదేశాన్ని దాటకూడదని భావించాడు. ఇక్కడొక లీలను ప్రదర్శించాడు ఏమది?

విగ్రహాన్ని, విమానాన్ని క్రిందపెట్టకూడదని షరతు. ఎక్కడైనా పొరపాటున పెడితే అది అక్కడే ప్రతిష్ఠితమైపోతుందని హెచ్చరిక.

అపుడు కావేరీ నది వరదలతో నిండియుంది. కావేరిలో ఒక మాటు స్నానం చేస్తే మంచిదనే భావనను కలిగించాడు గణపతి. ఒక బ్రహ్మచారి వేషంలో విభీషణుని ముందు నిలబడ్డాడు. వీటిని నీ చేతిలో పెట్టి, జాగ్రత్తగా ఉంచగలవా అని విభీషణుడన్నాడు.

దానికేమి? అయితే నేను చాలాసేపు ఈ బరువును మోయలేకపోతే ఏం చేయాలి? నేను మూడు సార్లు పిలుస్తాను, సకాలంలో నీవు రాకపోతే తప్పనిసరై నేను నేలమీద పెట్టవలసి వస్తుంది. అంగీకరిస్తావా అని గణపతి యన్నాడు. అతడు నదిలో ఈత కొడుతూ ఉండగా మూడుసార్లు పిలిచాడు. విభీషణుడు సకాలంలో రాలేకపోయాడు. ఇదిగో పిలిచాను, నా తప్పేమీ లేదు, నేనిక్కడ ఉంచేస్తున్నానని బిగ్గరగా అన్నాడు గణపతి. ఇంకేముంది? అక్కడే ప్రతిష్ఠితమై పోయింది.

ఈ కథ వల్ల విమానం, విగ్రహం చేతిలో ఇమిడినట్లుగా మొదట ఉన్నాయని, ప్రతిష్ఠ జరిగిన తరువాత అవి రెండూ పెద్దవయ్యాయని ఊహించవచ్చు.

నదినుండి బైటకు వచ్చి కోపండి, విభీషణుడు విగ్రహాన్ని కదలింపబోయాడు. బ్రహ్మచారి నెత్తిపై ఒక దెబ్బ వేయాలనుకున్నాడు. గణపతి, పరుగు లంకించుకొని కొండనెక్కాడు. విభీషణుని పట్ల దయతో లొంగిపోయాడు.

స్వామియే భక్తునికి లొంగాలని భావించినపుడు మాత్రమే లొంగుతాడు. యశోద, కృష్ణుణ్ణి త్రాళ్ళతో బంధించినపుడు జరిగింది కదా!

(త్రాటితో యశోద, కృష్ణుణ్ణి కట్టాలని ప్రయత్నించగా రెండు అంగుళాల త్రాడు తక్కువ వచ్చిందని, కట్టలేకపోయిందనే కథ, భాగవతంలో ఉంది కదా. రెండంగుళాలు తక్కువ అవడమేమిటి? మహత్తు, అహంకారం, తన్మాత్రలని ప్రకృతి, పరాప్రకృతిగా ఉంటుంది. పంచ భూతాలతో కూడినది, అపరాప్రకప్రుతి. ఈ రెంటి ప్రకృతులకు స్వామి అందడని సూచిస్తోంది ఆ కథ. కనుక తనంతట తాను లొంగిపోయాడు కన్నయ్య. – అనువక్త)

విభీషణుడు, వినాయకుని తలపై ఒక దెబ్బ కొట్టాడు. అపుడు నిజరూపాన్ని చూపించాడు గణపయ్య. అట్టి దర్శనం వల్ల ఇతనిలో కోపం, బాధ మటుమాయ మయ్యాయి. "లంకకు స్వామిని తీసుకొని వెళ్ళలేకపోయానని బాధపడకు. నేనెట్లా విగ్రహాన్ని ఉంచానో గమనించావా? ఇది లంకను చూస్తున్నట్లుగానే ఉంటుంది. లంకపై నిరంతరం ఈ స్వామి అనుగ్రహాన్ని వర్షిస్తూనే ఉంటాడులే. సాధారణంగా దక్షిణవైపు చూస్తున్నట్లు విగ్రహాల్ని ప్రతిష్ఠించరు. నీకోసం అట్లా చేసాను, దిగులు చెందకు" అని గణపయ్య ఊరడించాడు.

దక్షిణాన్ని చూసే ముగ్గురు దేవతలు

దక్షిణామూర్తి రూపంలో, నటరాజు రూపంలో పరమేశ్వరుడు, దక్షిణవైపు చూస్తూ ఉంటాడు. ఇప్పుడు గణపతి, విష్ణువును ఆవైపు చూస్తున్నట్లు ప్రతిష్ఠించాడు. దక్షిణామూర్తి ధ్యానమూర్తిగా, అచంచలంగా ఉన్నట్లు కన్పిస్తాడు. నటరాజు, నిరంతరం నృత్యం చేస్తున్నట్లుగా జగత్తును ఆనంద డోలికలలో ఊపుతున్నట్లుగా ఉంటాడు. మహావిష్ణువు పడుకొన్న రూపంలో, ఒరిగిన

రూపంలో సమాధి స్థితిలో ఉన్నట్లుంటాడు. యోగనిద్రలో ఉన్నట్లుంటాడు. దీనిని సమాధి స్థితి అని నొక్కి చెప్పకుండా యోగ నిద్ర అని ఎందుకు చెప్పినట్లు? విష్ణువు, అనేక ఇంద్ర జాలాలను ప్రదర్శిస్తూ ఉంటాడు. అవి మనకర్థం కావు. అతని సమాధి స్థితిలో సృష్టికార్యం నిరంతరం సాగుతూనే ఉంటుంది. ఇది ఎట్లా సాధ్యం? మనం కలలో ఎందరినో వ్యక్తులను సృష్టిస్తూ వినోదిస్తూ ఉంటాం. అందువల్ల ఈ ప్రపంచం అతని కలవంటిదన్నారు. నిద్రలోనే కలలు వస్తాయి. అందువల్ల సమాధిని కూడా నిద్రకాని నిద్రయని అన్నారు. మరొకటి, సమాధిలో నిటారుగా యోగి కూర్చొని యుంటాడు. ఇతడు ఇక్కడ వంగి విశ్రాంతి తీసుకొన్న రూపంలో సాక్షాత్కరిస్తాడు. అయితే మన నిద్రకు, అతని నిద్రకు తేడాను చూపించడం కోసం అతనిది యోగనిద్రయని అన్నారు.

విఘ్నేశ్వరుని చేతి మహిమ వల్ల, అతని గొప్ప ఆలోచనల వల్ల శివునకు దేనిని అన్వయిస్తున్నామో విష్ణువునకూ అదే. అందుకే అతడు రంగరాజు. వైష్ణవ క్షేత్రాలలో ఇది ప్రముఖమైంది, ప్రధానమైంది. ప్రతిష్ఠ జరిగినచోటు శ్రీరంగం.

కొంచెం భిన్నంగా చెప్పానేమో! రంగరాజు ఉండడం వల్ల అది శ్రీరంగంగా పిలువబడలేదు. ఆ ప్రదేశం రంగం అవడం వల్ల దానినతడు పరిపాలించడం వల్ల అతడు రంగరాజయ్యాడు. ఇక్ష్వాకుల కాలంలో అతనిపేరు నారాయణుడే, లేక విష్ణువే! లేదా అనంతశాయి కావాలి. వినాయకుడు అతనికై రంగాన్ని సృష్టించాడు కనుక అతనికి రంగరాజని పేరు వచ్చింది. ఇదీ కావేరీ తీరంలోనే.

రంగం అంటే నాటకాలు ప్రదర్శించే స్థలం. దానిని ప్రజలు చూస్తారు. రంగస్థలిలో. ఆ గొప్ప నటుడు, ప్రపంచమనే నాటకాన్ని నడుపుతున్నాడు. ఆ నాటకాన్ని ఎక్కడ ప్రదర్శించాలి, రంగంలోనే. నటరాజు చూపించే నృత్యం,

చిదంబరంలోనే. దానిని సభయని అంటారు. చిత్‌సభ, మామూలు జనులు దీనిని కనకసభయని పిలుస్తారు. అక్కడ సభ ఎట్లాగో ఇక్కడ రంగం అట్టిది.

నా తండ్రికి ఒక సభయుండగా యోగనిద్రలోనున్న నా మేనమామ యైన విష్ణువకు సభ యుండవద్దాయని వినాయకుడు భావించాడు. ఇతడు యోగనిద్రలో ఉండే నాటకాన్ని నడుపగలడు. ఇద్దరు చేసే పనులు ఒకటియైనా పేర్లతో కొంత తేడా ఉంటే రమ్యంగా ఉంటుందని రంగమని, విష్ణు సన్నిధికి పేరు పెట్టాడు. అందుకే అక్కడ ప్రతిష్ఠ.

వినాయకుని లీలలలోని ఔచిత్యం

శ్రీరంగం యొక్క స్థల పురాణం సరిగా నాకు గుర్తులేదు. ఇది వైష్ణవ క్షేత్రం కనుక వినాయకుని పేరు, అతని లీలలను వారు వర్ణించి యుండకపోవచ్చు. ధర్మవర్మ అనే చోళరాజు, రామునకు సమకాలికుడు. ఇక్కడ మూలస్థానానికి ముందున్న వసారా ధర్మవర్మ పేరుతో ఉంది. ఇక్ష్వాకు రాజుల కుల దైవాన్ని ఇక్కడ ప్రతిష్ఠించాలని ఘోర తపస్సు చేశాడు. అతని తపః ఫలంగా విశ్రాంతికై విభీషణుడు దీని నిక్కడ ఉంచగా అది స్థిరంగా ఉండిపోయిందని విన్నట్లు గుర్తు. కాని విఘ్నేశ్వరుడే ఈ లీలను ప్రదర్శించాడని లోకంలో ప్రచారంలో ఉంది. ఇట్లా శైవ వైష్ణవ శాఖల సంగమంగా ఉంది. కథను, ఇంకా వింటే నిజమనిపిస్తుంది.

విభీషణుడు బెదిరిస్తూ ఉంటే వినాయకుడు ఊతికోట నెక్కాడని విన్నాం కదా! విభీషణుడు తనని తరిమి తరిమి నెత్తిపై దెబ్బకొట్టాడు కదా! దీనికి దృష్టాంతంగా ఆ కొండపై నున్న విఘ్నేశ్వర మూర్తి తలపై దెబ్బ తగిలినట్లుంది. ఇట్లా కొండపై విఘ్నేశ్వరుడుండడం అఋదు. ఇందులో ఒక తత్త్వం దాగియుంది. మూలాధారం, సహస్రారంతో చేరిందనే యోగపరమైన అర్థమూ వస్తుంది.

రంగనాథునకు, గణపతికి ఇంకొక సంబంధం ఉంది. అగస్త్యుని కమండులువును కాకి రూపమెత్తి తిరగబడినట్లు చేసాదని విన్నాం. అగస్త్యుడు ఈ కాకిని తరుముతూ పరుగెత్తాడట. అప్పుడా కాకి, బ్రహ్మచారి రూపం ధరించింది. విభీషణుని కథలోనూ బ్రహ్మచారియే. అగస్త్యుడూ ఒక దెబ్బ కొట్టాలని పరుగెత్తాడు. కొట్టబోయేముందు బ్రహ్మచారి రూపంలో ప్రత్యక్షమయ్యాడు గణపతి. నీ తలమీద దెబ్బ కొడదామని అనుకున్నాను. ఓహో! నువ్వా అన్నాడు. అపుడు తన తలమీదే కొట్టుకున్నాడట. ఈ కథ జరిగిన తరువాత వినాయక భక్తులు తమ తలమీద కొద్దిగా కొట్టుకునే ఆచారం వచ్చింది. ఇది పూజలో ఒక అంగమైంది.

కమండులువును త్రోయడం, కావేరీ నది ప్రవహించడం జరిగింది సహ్యాద్రితీరంలో. అక్కడ ఒక ఉసిరిక చెట్టుంది. ఆ చెట్టు ఏమిటో కాదు, అది మహావిష్ణువే. అది విష్ణుమాయవల్ల లోపాముద్రగా మారి అగస్త్యుని భార్య అయింది. అగస్త్యుని కమండులువులోని నీరుగా మారిందట.

ఇట్లా కావేరి, భగవానుని పాదం నుండి ప్రవహించగా గంగ నా పాదం నుండి ప్రవహిస్తోంది. కాని గంగ కంటె నామీద నాకధిక ప్రీతి యుందని, మొత్తం నా శరీర స్పర్శ నీకు కల్గుగాక అని అనుగ్రహించాడు విష్ణువు. నీవు నదిగా ప్రవహిస్తున్నప్పుడు రెండుగా చీలుతావు, ఒక ద్వీపందగ్గర రెండు పాయలూ కలిసి నపుడు నీవు నన్ను రెండు చేతులతో ఆలింగనం చేసుకొంటావని కావేరీతో విష్ణువన్నాడట.

మరొక సందర్భంలో శైవవైష్ణవాలు కలిసాయి. విభీషణుడు రాముడి నుండి రంగనాథుని విగ్రహం పొందినట్లు, రావణుడు పరమేశ్వరుని నుండి ఆత్మలింగాన్ని పొందాడు. దానిని నేలమీద పెట్టకూడదని షరతు పెట్టాడు. లంకకు వెళ్ళేవరకూ చేతిలోనే ఉండాలి సుమా! అన్నాడు. అదీ భారత భూమిని దాటకూడదని పన్నాగం పన్నినట్లున్న కథ మీకు తెలిసిందే. ఆ లింగం

స్థాపించబడిన చోటు గోకర్ణం. అది కర్ణాటకలో పశ్చిమ తీరంలో ఉంది. ద్వారక, రామేశ్వరం మాదిరిగా ఇదీ ఒక ద్వీపంలా ఉంటుంది. అక్కడున్న స్వామికి మహాబలేశ్వరుడని పేరు. అక్కడ పెట్టీ పెట్టగానే రావణుడు పెకలించబోయాడు. వీలుపడలేదు కనుక స్వామి పేరు తగ్గట్లుగానే ఉంది. రావణున్ని ఎట్లా వినాయకుడడ్డుకున్నాడో, విభీషణునికీ విఘ్నం కలిగించాడు. ఇట్లా ఇతని లీలలు అనంతం. ఇతనివల్ల గోకర్ణ, శ్రీరంగ క్షేత్రాలు ప్రసిద్ధిని పొందాయి.

భారతదేశ ప్రత్యేకత

పరమేశ్వర మూర్తులు ఈ దేశాన్ని విడిచి పెట్టకుండా ఎందుకు అడ్డుకున్నాడు గణపతి?

చెట్టుకి నీళ్ళు పోయాలంటే దాని మొదట్లో పోస్తాం గాని, ఆకులపై, కొమ్మలపై నీళ్ళు చల్లుతామా? కనుక దైవత్వానికి సంబంధించిన దాంట్లో ప్రపంచం, ఒక పెద్ద వృక్షమైతే దాని వేళ్ళు భారతదేశంలోనే ఉన్నాయి. వీటిని తడిపితే చెట్టు కలకలలాడుతుంది. అట్లా అన్ని దేశాలూ సుఖ సంపదలతో ఉంటాయి. అట్లా భారతదేశంలో కర్మానుష్ఠానం పూజలు, సక్రమంగా జరిగితే మిగతా దేశాలూ శక్తిని పుంజుకుంటాయి. ప్రపంచ క్షేమానికి ఇక్కడ ఆరాధన సక్రమంగా జరగాలి.

భగవంతుడేమని భావించాడు? ఒక ప్రాంతంలో మంచి వాతావరణం ఉండాలి, పంటలు, పచ్చదనం కొన్ని దేశాలలో ఉండాలి. వజ్రాలు, బంగారం, విలువైన ఖనిజ సంపద మరొక దేశంలో ఉండాలి. కొన్ని దేశాలలో అధిక ఉష్ణోగ్రత, మరొక దేశంలో అతిశీతలత్వం. కొన్ని దేశాలు భాగ్యవంతంగా ఉండి మిగిలిన దేశాలకు అనేక రూపాలలో ఆ సంపద, రవాణా కావాలి. ఇక దైవసంబంధ విషయాలలో భారతదేశం ఒక పవర్ హౌస్ వంటిది.

అన్ని దేశాలకు విద్యుత్ కేంద్రం వంటిది. గుండె, అన్ని అవయవాలకు రక్తాన్ని సరఫరా చేస్తున్నట్లు ఆధ్యాత్మిక శక్తిని మిగతా దేశాలకు అందీయగలదు. ఇది ధర్మ భూమిగా, కర్మభూమిగా ఉండాలని అతని సంకల్పం. అంతమాత్రంచే ఇతర దేశాలలో ఆరాధన ఉండకూడదని కాదు. శరీరంలో ఒక భాగానికి రోగం వస్తే కొన్ని మందులను పైపైన పూస్తాం కదా! అట్లాగే మిగతా దేశాలలోనూ పూజలు సాగవలసిందే! అయితే గుండె సరిగా ఉన్నపుడు ఏ రోగం శరీరానికి వచ్చినా కుదర్చడానికి వీలు పడుతుంది. అందువల్ల ఆరాధనా విధానాలలో అనేక నియమాలు, నిష్ఠలూ ఇక్కడున్నాయి. గుండె వంటి భారతదేశం రోగరహితంగా ఉంటే మిగతా అవయవాల వంటి మిగతా దేశాలూ బాగుంటాయి.

పూజలో ఒక క్రమపద్ధతి - భక్తితో పూజ

రెండు రకాల భక్తిలున్నాయి. ఒకటి వైధీభక్తి. రెండవది రాగభక్తి. శాస్త్రప్రకారం నియమ నిష్ఠలను పాటిస్తూ సాగేది వైధీభక్తి. రాగభక్తిలో భక్తుడు తన ఇష్టం వచ్చినట్లు భక్తితో కీర్తిస్తాడు.

దీనినే అనురాగ భక్తియని అంటారు. ఈనాడెట్టి నియమాలనూ పాటించరు కనుక తమకు రాగభక్తి ఉందని భావిస్తారు. ఇట్టిది రాగభక్తి కాదు. భగవంతుని గురించి ఊట మాదిరిగా పెల్లుబికే భక్తి కావాలి. భగవంతునకు సంపూర్ణ శరణాగతిని చూపించాలి. అన్ని బంధాలను త్రెంచుకొని, భగవంతుని పట్లనే కాదు, సమస్త జీవులపట్ల ప్రేమను చూపించగలగాలి.

శాస్త్రప్రకారం వైధీభక్తి కూడా ప్రేమతో కూడినదే. ఏదో యాంత్రికంగా సాగేది కాదు. కాని శాస్త్ర నియమాలను పాటించాలి. అందు ప్రధానంగా ప్రేమ ఉండాలి. ముందు ఆత్మ పూజ చేసుకుని తర్వాత విగ్రహాన్ని పూజించాలి. ఆత్మపూజ అంటే ఏమిటి? పూజ చేసేవాని శరీరమే దేవాలయం. పూజ

చేసేవాడు పూజించే భగవంతుడు వాడిన పుష్పాలను తీసివేసి కొత్త పుష్పాలతో పూజ చేయునట్లుగా అజ్ఞానమనే నిర్మల్యాన్ని తీసివేయాలి. అట్లాగే తాను పూజచేసేవాడినని పూజింపబడే వేరని అనే భేదభావనను తీసి వేయగలగాలి. పైవాడే నేను అనే సోఽహం భావనతో సాగాలి:

దేహోదేవాలయః ప్రోక్తో జీవో దేవః సనాతనః

త్యజేత్ అజ్ఞాన నిర్మాల్యం సోఽహంభావేన పూజయేత్

అతడే మనమౌతూ ఉండగా అతనిపట్ల ప్రేమరహితంగా ఉండగలమా? చాలామందితో సంబంధ బాంధవ్యాలు పెట్టుకుంటాం. అట్లాగే మనకు మనమే దగ్గరగా ఉండమా?

ఈ శ్లోకం చదువుతూ ఉన్నపుడు ఆ తక్కువ సమయంలో అతని పట్ల ప్రేమ కలిగి యుంటాం. అతడు మనమనే భావన కొంతకాలమే ఉంటుంది. మేమట్లా ఉండిపోగలమని ఎవరైనా బీరాలు పలికితే అవి వట్టి మాటలని భావించండి. ఇక నియమాలకు కట్టుబడనిది రాగభక్తిగా చెలామణి అవుతుంది.

కేవలం నాస్తికులు మినహా నూటికి 99 మంది భగవంతుని పట్ల ప్రేమ కలవారే. అట్టి ప్రేమ, నిష్ఫలం కాదు. ఈ రాగభక్తి అన్ని దేశాలలో అన్ని కాలాలలో మంచి ఫలితాన్ని ఈయకపోదు. కాని అది ఇచ్చే ఫలం కొద్దిగానే ఉంటుంది., మనం పెట్టిన పెట్టుబడి తక్కువగా ఉన్నపుడు రాబడి కూడా దానికి తగ్గట్లే అంతంతమాత్రమే ఉంటుంది.

కాని పూజా నియమాలు, మంత్రాలు, స్తోత్రాలు, కర్మకాండ, శారీరక పవిత్రత, ఆచారాలు మొదలైనవి అన్నీ భగవంతుని పట్ల ప్రేమ ఉన్నా లేకపోయినా పనిచేస్తాయి. ఇట్లా నియమాలను పాటించడం వల్ల ఈశ్వరుని పట్ల అనురాగం వృద్ధి పొందుతోంది.

ప్రాపంచిక, ఆధ్యాత్మిక సౌభాగ్యం వృద్ధి పొందాలంటే మనస్థితి గతులను బట్టి భగవత్ ప్రేమను చూపించాలి. తీవ్రమైన అనురాగ భక్తి కలవారి పట్ల

అతడు దయ చూపిస్తాడు. మిగిలిన వారు అనురాగాన్ని పెంపొందించు కోవడానికి కృషి చేయాలి. స్తోత్ర, మంత్ర పఠనాదులను ఎట్లా చేయాలో అట్టి నియమాలనూ పూర్వులందించారు.

ఇక వైదీభక్తిలో కొన్ని నియమాలు, పద్ధతులు భిన్న భిన్న దేశాలలో రకరకాలుగా ఉన్నాయి. అవి వారి మతానుసారంగా ఉంటాయి. వేదమంత్రాలను, దానిననుసరించి ఆగమ పూజకు అధికశక్తి యుంటుందని భగవత్ నిర్దేశముంది. మంత్ర పఠనాదుల ద్వారా క్రియా కలాపానికి భారతభూమి చాలా అనుకూలమని, మంచి ఫలితం ఉంటుందని భగవానుని అభిప్రాయము. ఎట్లా అందుకుందని అంటే ఏమీ చెప్పలేము. స్విట్జర్లాండును చక్కని వాతావరణంతో నింపి సహారా ఎడారిని భగభగా మండేటట్లు ఎందుకు చేసాడంటే ఏం చెప్పగలం? సమాధానం చెప్పలేకపోయినా ఉన్న పరిస్థితిని అంగీకరించక తప్పదు.

ఈ భూమి కర్మభూమిగా ప్రసిద్ధం. కర్మ అంటే శాస్త్ర కర్మమని, అందువల్ల మంత్రాలుంటాయని అర్థం. అందువల్లనే ఆత్మలింగం గాని; రంగనాథ విగ్రహం కాని భారతదేశంలోనే ఉండాలని వినాయకుడు తలిచాడు. లంకకే కాదు, అన్ని దేశాలకూ ఈ దేశంలో పూజించడం వల్ల లాభమని భావించాడు. అట్టి లీలలు చూపాడు.

ఉభయ కావేరుల మధ్యలో ముఖ్యమైన విష్ణు క్షేత్రాలున్నాయి. ప్రసిద్ధమైన శివ, విష్ణు ఆలయాలు కావేరీ తీరంలో చోళప్రాంతంలో ఉన్నాయి.

గణేశుని వల్ల సంస్కృతి యొక్క విస్తృతి

శైవతేవారంలో, వైష్ణవ దివ్య ప్రబంధాలలో దివ్యక్షేత్రాలు పేర్కొనబడ్డాయని చెప్పాను. అంతేకాదు, కావేరీ తీరంలో శైవ వైష్ణవ మహాత్ములతో సంబంధం లేని క్షేత్రాలు లెక్కకు మిక్కిలిగా ఉన్నాయి. తమిళనాడు, దివ్యదేశంగా

పేర్కొనబడింది. ఇది భక్తికి నిలయం. దానికంతటికీ కావేరీ తీరమే కారణం. ఆ కావేరిని ప్రవహింపజేసినవాడు గణపతి. ఈ దేశంలో అన్ని కళలకు, దైవత్వానికి సంబంధం గట్టిగా ఉంది. దీనికంతకూ గణపతియే కారణమని మరొక్కసారి నొక్కి చెబుతున్నా.

ఎక్కువ ఆలయాలున్నవాడు

మిగతా ప్రాంతాలలో ఉన్న మొత్తం గణపతి ఆలయాలు ఒక్క తమిళనాడులో ఉన్న సంఖ్యతో సరిపోవు. మహారాష్ట్ర ప్రాంతం, గాణపత్యానికి నెలవే. అయినా తమిళనాడులో ఉన్న సంఖ్యకంటె తక్కువగానే ఆలయాలుంటాయి.

వినాయకుడు - తమిళ భాష

సంస్కృతిలో భాషకు అధిక ప్రాధాన్యం ఉంది. భాషవల్లనే అనేక గ్రంథాలు, కథలు, కవిత్వం, నీతి శాస్త్రం, జ్ఞానం మొదలైన విషయాలను చెప్పేవి వెలువడతాయి. తమిళ భాషలో గణపతికి అధిక ప్రాధాన్యం ఉందని, ఏ చిన్న మాటను వ్రాయడానికి మొదలు పెట్టినా గణపతి చిహ్నాన్ని తమిళ భాషాక్షరంతో సూచించి వ్రాస్తారని లోగడ పేర్కొన్నాను. ఇట్టి మంగలారంభం ఎక్కడా కనబడదు. అట్టి అక్షరం తమిళభాష చేసుకొన్న అదృష్టం.

తిరుప్పుగళ్‌లో, అరుణగిరినాథుడు అనే సత్పురుషుడు, తమిళ సాహిత్యానికి, వ్యాకరణానికి, సంగీత నాటకాలకు వినాయకుడే మొదలని, ఇతడు మేరు పర్వతంపై అట్టి గ్రంథాలు వ్రాసేడని పేర్కొన్నాడు. అంటే వ్యాసుని భారతానికి వ్రాయసగానిగా ఉండడానికి ముందే తమిళ సాహిత్యాన్ని, వ్యాకరణాన్ని అందించాడని ఊహించవచ్చు.

అవ్వైయార్ ఉపదేశం లేకుండా, ఈ ప్రాంతంలో విద్యాభ్యాసమే లేదు. వినాయకుని పాదాలు పట్టుకుంటే మంచి హృదయం, మంచి మాట,

మహావిష్ణువు యొక్క ఆశీర్వచనాలు లభిస్తాయని ఏ శ్రమ లేకుండా ఇతణ్ణి పూజించవచ్చుని అవ్వైయార్ తన పాటలలో పాడింది. ఉపవాసాలు, హఠయోగం వంటివి అక్కర్లేదని చెప్పింది. కొన్ని పువ్వులుంచినా చాలని, అతడు పగడపు రంగులో ఉంటాడని, ఆ పిల్లవానికి తల్లి పోలిక యని పాడింది. కామాక్షి రంగు ఎరుపే!

మంచి మనస్సు, మాట ఇచ్చే దేవుడు

భగవానుడెన్నో రకాల ప్రాణివర్గాలను సృష్టించాడు. ఒక్క మానవునకే మాట్లాడే శక్తి ఉంది. మాట్లాడే శక్తినిచ్చేవాడు గణపయ్యయని అవ్వైయార్ కీర్తించింది. ఏది మంచి, ఏది చెడు అనే విచక్షణా జ్ఞానం మానవులకే ఉంది. అట్టి జ్ఞానాన్ని, మంచి మనస్సు, మంచి మార్గాన్ని ప్రసాదించేవాడూ గణపయ్యయని గట్టిగా చెప్పింది.

మన మనస్సు కరగాలన్నా, మంచి మాటలు మాట్లాడాలన్నా సన్మార్గమే అనుసరించాలి కదా. ఏది మంచి మార్గమో అవ్వైయార్ ఒక పుస్తకంలో చెప్పింది. పాలు, తేనె వంటి నాల్గింటిని నీకు అర్పిస్తామని, మూడింటిని అనగా తమిళంలోని మూడు శాఖలను ప్రసాదించుమని అడిగినట్లు లోగడ పేర్కొన్నాను.

మంచి మార్గాన్ని సద్గతి యని అంటారు. అంటే కేవలం మంచి జీవితాన్ని గడపడం కాదు. ఆ సద్గతి చివర వస్తుంది. అదే మోక్షమార్గమని అంటారు పెద్దలు.

పురుషార్థాలు ధర్మంతో మొదలిడి మోక్ష పదంతో ముగుస్తాయి. అట్టిది అవ్వైయార్ జీవితంలో స్పష్టంగా గోచరించింది. గణపతి తన తుండంతో ఈమె నెత్తి కైలాసంలో ఉంచాడు కదా!

సంస్కృతం - తమిళం

ప్రాచీనమైన తొల్‌కాప్పియం రచనా కాలం నుండి పూర్వులైన తమిళులు, సంస్కృత వాఙ్మయాన్ని ధారాళంగా వాడుకున్నారు. ఏదైనా క్రొత్త పదం యొక్క అవసరం వచ్చినపుడు కృత్రిమంగా దానిని సృష్టించకుండా సంస్కృతం నుండే గ్రహించేవారు. సంస్కృతాన్ని అందరి భారతీయుల సొత్తుగా పరిగణించేవారు. తమిళానికి పరాయి భాషగా సంస్కృతాన్ని లెక్కించలేదు.

తిరువళ్ళువర్ కంటె తమిళానికి సేవ చేసినవారు మరొకరు లేరు. ఇతని పద్యం రెండు వాక్యాలతో ఉంటుంది. అతడు వ్రాసిన కురల్‌లో మొదట్లో ఆది, భగవాన్, ఉలగు అనే మాటలున్నాయి. ఉలగు అనగా ప్రపంచం. సంస్కృతంలోని లోకం అనే శబ్దాన్నుండే ఉలగు అనే పదం వచ్చింది. లోక మనగా మనచే చూడబడేది. ఆంగ్లంలోని Look కూడా దీనినుండి పుట్టిందే. చూసే ఇంద్రియం పేరు లోచనం. అదీ దాని నుండే వచ్చింది. వీటికి తమిళంలో పదాలు దొరకకపోవు. అయినా ఈ పదాలను వాడి అతని ఉదారభావాన్ని ప్రకటించాడు. మొదటి పద్యమే ఇట్లా ఉందని గ్రహించండి.

సంస్కృత బంధం నుండి విడిపడాలని నేటి తమిళ సోదరులు, మహోద్యమం చేస్తున్నారు. వారు కృత్రిమ పదాలను తయారు చేసినా వాటి మూలాలు సంస్కృతంలోనే కన్పిస్తాయి. ఉదా: సంస్కృతంలో మంత్రి అనే పదానికి అమైచ్చార్ అని తమిళంలో వ్రాసినా అది సంస్కృతంలోని అమాత్య పదం నుండే వచ్చింది.

అభిమానాన్ని నేయంగా మార్చారు. అది సంస్కృతంలోని స్నేహానికి వికృతి.

ఒకాయన ఒక ముఖ్య రాజకీయ నాయకునికి విజ్ఞాపన్ అని వ్రాసేడు. ఆయన కోప్పడి విన్నప్పంగా మార్చాలన్నాడు. విజ్ఞాపనం విన్నపమైంది. ప్రాకృతంలో దీనిని విన్నాప్పం అంటారు. మూలం ఒక్కటే.

ఇట్లా ఎన్నెన్నో ఉదాహరణలను పేర్కొనవచ్చు. తమిళ పదాలనే వాదాలని పట్టుబట్టేవారిని తప్పు పట్టడం లేదు. వారు భాషకు దోహదం చేస్తున్నమాట సత్యమే. అయ్యా మీరు చేస్తున్నది సంస్కృతానికి వికృతులను కల్పిస్తున్నారని మృదువుగా వారికి చెప్పాలి. ఒప్పించగలగాలి. వాగ్దేవిని వారిలో ద్వేష భావంతో లేకుండా చూడమని ప్రార్థిద్దాం. అట్లే వ్యాస భారతాన్ని వ్రాసిన వినాయకుణ్ణి, తమిళ భాషకు మూలమైన గణపతిని మమ్మల్ని అందర్నీ దీవించుమని, మాలో ద్వేషాలు లేకుండా చూడమని తమిళాన్ని, సంస్కృతాన్ని సమానంగా గౌరవించునట్లు చేయుమని ప్రార్థిద్దాం.

భక్తి

భగవానుడు

మనమేదైనా ఒక ఇంటిని చూస్తే ఎవరో ఒకరు కట్టారని భావిస్తాం. ఒక బండిని చూస్తే తయారు చేసిన మనిషి గుర్తుకు వస్తాడు. నిర్మాణానికి ఒక లక్ష్యముంటుంది. దీనివెనుక ఒక ఆలోచన, బుద్ధి ఉంటుందని అనుకొంటాం కదా! ఒక వరుసలో కొన్ని వస్తువులను పెట్టగా ఈ క్రమానికి ఒక కారకుడుంటాడు.

ఈ విశ్వాన్ని తిలకించినపుడు ఒక పద్ధతిలో నిర్మించిన వాడొకడుండాలని ఊహిస్తాం కదా! మనకుపయోగించే వస్తువులు, ఉపకరణాలను ఏర్పాటు చేసిన వానికి ఎంతో తెలివి, శక్తి ఉండాలని భావిస్తాం.

ఈ ఇల్లు ఎవరు కట్టారంటే చటుక్కున ఫలానా వ్యక్తి పేరు చెబుతాం. ఈ అరటి చెట్టు ఎట్లా తయారయిందని అడిగితే ఆ నిర్మాతను గురించి చెప్పలేం. అయినా ఎవడో తయారు చేసియుండాలి. ఒక్కొక్క పొర మీద ఒక్కొక్క పొరతో ఉంటుంది. అందమైన దొప్పలెట్లా వచ్చాయి? ఏ సాధనం వల్ల ఇట్లా ఉన్నాయి! అట్లాగే ఈ నదీ నదాలు, పర్వతాలను చూసినపుడు వీటికి సృష్టికర్త ఎవరని ప్రశ్నిస్తే చూపించలేము కదా!

ఇవి ఏనాటి నుండో ఉన్నాయి, సృష్టికర్త గురించి అడుగుతారేమిటని తిరిగి ప్రశ్నించవచ్చు. అయితే ఇప్పుడే వికసించిన ఈ గులాబీకి ఎవరు కర్త? నిన్నటి వరకూ మొగ్గగా ఉంది. దీనిలో అనేక దళాలు, సుగంధం పుట్టుకు వచ్చాయి. మన కళ్ల ముందే వికసించింది కదా! అని అడిగితే దీనిని నిర్మించిన వానిని చూపించలేము.

మనిషే సమర్థుడని అతడన్ని పనులు చేయగలడని భావిస్తాం. మనమెట్లా ఈ ప్రపంచంలో ఉన్నామో అట్లాగే ఒక జంతువు అడవి నుండి నగరానికి వచ్చి వింతగా చూస్తోంది. ఇట్లా ఉండేమిటని అదీ ఆశ్చర్య పడుతోంది. అట్లా దానినుంచడానికి మనవంటి సమర్థుడొకడుండాలి.

గులాబీ పువ్వుల క్రమ వికాసానికి ఏ ధర్మం పనిచేస్తోందో అచలంగా పర్వతాలుండడానికి, గ్రహగతులకూ ఏదో ఒక ధర్మం ఉండనే ఉంది. ప్రపంచం అంతా కార్య కారణ సంబంధంతో ఉంది. విడిగా ఉన్నట్లు కనబడినా బంధించే ఒక సూత్రముంది. ప్రకృతి తన నియమం తప్పకుండా ఉండడానికి ఏదో ఒక మహత్తరమైన బుద్ధి ఉండాలి. బుద్ధిలేకుండా ఏ పని, ఎవ్వడూ చేయడు.

తాను సమర్థుడనని మానవుడు భావించినట్లుగానే మన కంటే పెద్ద సమర్థుడుండాలని, ఒక దయామూర్తి ఉండాలని భావించడంలో తప్పేముంది? సృష్టించడాన్ని, పాలించడాన్ని యాంత్రికంగా నిర్వహిస్తున్నాడా? దయతో నిర్వహిస్తున్నాడు. అతడిచ్చిన శక్తి సామర్థ్యాలతో అట్టి అనంత శక్తిమంతుని ప్రార్థించడం సబబుగా ఉండదా?

అతడే భగవానుడు. మనకున్న శక్తి నిచ్చువాడతడే. అడుగు జాడలను బట్టుకొని దొంగను వెదకునట్లుగా ఈ కనబడే ప్రకృతిని చూసి దీని కారకుణ్ణి అన్వేషించగలగాలి. మనం అడుగులు వేయడానికి గల శక్తినీ అతడిచ్చాడు. అట్టి మనకున్న శక్తియే ఒక అడుగువేయుట.

అరచేతిని చూడండి. పుట్టినప్పటినుండి గిట్టేవరకు గీతలుంటాయి. అతడు గీసినట్లు మనం గీయగలమా? ఒక ఆకునకు ఎన్ని ఈనెలుంటాయో! అవీ ఒక క్రమపద్ధతిలో ఉంటాయి. అందరి శక్తియుక్తులకు మించిన శక్తితో ఎంతో ఆశ్చర్యాన్ని కల్గిస్తున్నాడు. ఆ గొప్ప దొంగ మనకు తెలియకుండా ఎన్నో పనులు చేసాడు. ఆ గజదొంగ, కనబడడు. ఒక గుహలో దాగియుంటాడని వేదాలు కీర్తిస్తున్నాయి. అదే హృదయగుహ, మనలో దాగియుండి మనకు తెలియకుండా ఎన్నో వింత పనులు చేస్తున్నాడు. ఎవరని తహతహయే భక్తి. తేరిపార చూస్తాం, వెదుకుతాం, కాని కనబడడు.

స్వామి అంటే

స్వామి అంటే ఎవరు? స్వం అనగా అధీనము. ఆస్తి. స్వం అనే పదానికి

తెలుగులో సొమ్ము. స్వంతం అనే మాటలను కూడా వాడుతాం. అంటే మన ఆధీనంలో ఉందని. కేరళలో దేవాలయానికి చెందిన దానిని దేవస్వం అంటారు. అనగా దీని యజమాని, స్వామియైన భగవానుడే. స్వామిని తమిళంలో ఉడైయార్ అంటారు. ప్రాచీన కాలంలో తమిళనాడులో శాసనాలలో స్వామిని ఉడైయార్ అని చెక్కబడి యుంటుంది. ఉదా: తిరుచిత్రం బలముడైయార్, తిరువేంగడముడైయార్, తిరునాగేశ్వరముడైయార్ మొదలైనవి.

గురువు, భగవానుడూ ఒక్కరే గనుక వైష్ణవులు రామానుజులను ఉడైయార్ అని భక్తితో సంబోధిస్తారు.

స్వామి అంటే ఆస్తి కలవాడని. ఏమిటా ఆస్తి? సమస్త ప్రపంచమూ. మనమందులో ఉన్నాము కనుక, అతని ఆస్తిలో భాగమే. అన్నీ నీవేయని తాయుమానవార్ కీర్తించాడు. కాని మనమేమంటామంటే ఇది నా ఇల్లు, ఇది నా పొలమని అంటాం. కాని అసలు యజమాని అతడే. అతడే కనుక లేకపోతే ఈ ప్రపంచమే లేదు. అందు మనమూ ఉన్నాము, మనకు ఆస్తిహక్కు ఉండదు.

మనమొక ఇంటినో, వస్తువునో తయారు చేస్తాం. శాస్త్రజ్ఞులు క్రొత్తక్రొత్త యంత్రాలను తయారుచేస్తారు. ఎవరేది చేసినా ప్రపంచంలోని వస్తువులను ఆధారం చేసికొనే కదా! ఆ వస్తువుల నిర్మాత, భగవానుడే. మనమతని ఆస్తిని గ్రహించి క్రొత్త క్రొత్త రూపాల్ని చూపిస్తున్నాం. ఇంతకంటే మనం చేసేదేమీ లేదు. ఈ పంచభూతాలను సృష్టించండి, పోనీ, అణువులను నిర్మించండని ఎవరైనా అడిగితే చేయగలమా? మహామహా శాస్త్రజ్ఞుడే చేయలేడు కదా! శాస్త్రజ్ఞులొక ఆకును సృష్టించగలరా?

కనుక అన్నిటిని సృష్టించిన వానికే ఇదంతా చెందుతుంది. అందువల్ల అతడు ఉడైయార్. స్వామికి అన్నీ చెందాయి కనుక అన్నిటిని అతనికి విడిచిపెడితే మన బాధలేముంటాయి? నెత్తిపై బరువుంటుందా?

నేను, నేనని తెగ బాధపడిపోతున్నాం. ఈ నేను, నేను - వాడిదే అనే భావం కలిగినపుడు బాధలెక్కడ ఉంటాయి? ప్రేమ, ద్వేషాలకు తావులేదని గ్రహించినపుడు బాధలులేవు. అఖండ శాంతి. భగవానుని స్వామియని ఎప్పుడైతే సంబోధిస్తున్నామో వెంటనే ఏదీ నాది కాదు, నీదే అనే భావన తొంగి చూస్తుంది. అతడన్నింటిని పంచి పెట్టడానికి అతనికే అర్హత వస్తుంది. కనుక ఇట్టి గుర్తింపు మనలో ఉన్నపుడు భక్తి రాణిస్తుంది.

ప్రకృతిలో ఈశ్వర తత్వం

ప్రకృతిలో అనేక శక్తులు వెదజల్లబడియున్నాయి. ఒకటా? రెండా? అనేకం. వీటన్నింటిని మించిన శక్తి ఒకటుంది.

మనకు దేహశక్తి యుండడం వల్ల వస్తువుల నెత్తగల్గుతున్నాం. మనకంటె ఎద్దు, అధికమైన బరువు మోస్తుంది. దానికంటే ఒంటె; దానికంటే ఏనుగు ఎక్కువ బరువును మోస్తుంది.

ఇక మానసిక శక్తిని చూడండి. చెట్టుకంటే పురుగునకు ఎక్కువ మానసిక శక్తి ఉంటుంది. దానికంటే చీమకు, దానికంటే పశువునకు, అంతకంటే మానవునకు అట్టి శక్తి అధికంగా ఉంది.

అన్ని శక్తులకు ఒకటి మూలాధారమని గుర్తిస్తాం. అతడే స్వామి.

మన దేహ, మానసిక శక్తులనుపయోగించి ఒక ఇంటిని కట్టాం. తన కున్న శక్తితో పిచ్చుక గూడు కట్టింది. అట్టి అనంతశక్తులనుపయోగించే స్వామి, ఈ ప్రపంచాన్ని సృష్టిస్తున్నాడు. ఒక ప్రాణికి, మరొక ప్రాణికి శక్తులలో భేదాలున్నాయి. చిట్టచివరకు వెడితే అనంతశక్తి కలవాడొకడున్నాడని ఊహిస్తాం.

ప్రకృతిలో విరుద్ధమైన జంటలుంటాయి. చలి-ఎండ; రాత్రి-పగలు; మెత్తనిపువ్వులు- గ్రుచ్చుకొనే ముళ్ళు; తీపి-చేదు; ప్రేమ-పగ; ఇట్లా పరస్పర విరుద్ధంగా ప్రకృతి సాగుతోంది. ఇట్లా ఆలోచిస్తూ ఉంటే మన మనస్సునకు

విరుద్ధమైనది ఒకటుండవద్దా? మానవ మనస్సు ఏం చేస్తోంది! పిచ్చి పనులు చేసి దుఃఖపడుతోంది. తృప్తిలేదు. అసత్కార్యాలకు భిన్నంగా శాంతంగా, దుఃఖాతీతంగా, సుఖశాంతులతో కూడిన తత్వం ఒకటి ఉండాలి. అతడే స్వామి.

ప్రకృతిలో అన్నీ మార్పు చెందుతూ ఉంటాయి. క్షణక్షణమూ జరుగుతుంది. సముద్రాలు, పర్వతాలలో మార్పు లేదని మనం భావిస్తాం గాని వాటిలోనూ మార్పులున్నాయి. కాలానికి అన్నీ లోబడవలసిందే. ఏదీ శాశ్వతంగా ఉండదు. అది దాని ధర్మం. పై జంటలున్నట్లే శాశ్వతమైనది, అవ్యయమైనది ఒకటి ఉండాలి. అదే ఈశ్వరతత్వం.

సరే అతడున్నాడని అంగీకరిద్దాం. అయితే అతణ్ణి భజించి ఏం లాభం? మన మెప్పుడూ కోరికలతో ఉంటాం. ఆయనకు కోరికలే లేవు. మనకు పరిమిత శక్తి ఉంది. కోరికలు లేకపోయినా అధిక శక్తిమంతు డతడు. జ్ఞానంలోనో, శక్తిలోనో గొప్ప వాడే కాదు. దయాసముద్రుడు కూడా. మనలోని అగాధాలను పూడ్చుకోవాలంటే అతని కృపావర్షం మనపై పడాలి. కోరికలు తీరాలన్నా అతడు ప్రేమామృతాన్ని వర్షించాలి. అందుకే భజన.

మనకా కోరికలు లేకపోతే మనమూ పరిపూర్ణ స్వరూపులమే. పరమాత్మ, మన కోరికలను తీర్చి, ఇక కోరికలు అడుగని స్థితిని ప్రసాదిస్తాడు. మన అపూర్ణత్వాన్ని పూర్ణత్వంగా మార్చగలడు.

కర్మ - భక్తులు

ఆదిశంకరులు, కొద్ది క్షణాలలో ముక్తిని పొందుతారని తెలియగా, కొంతమంది శిష్యులు వారిని సమీపించి ఆచార్యా మీరెన్నో శాస్త్ర విషయాలను విశదీకరించారు. కాని మేము సులభంగా, సూటిగా ముక్తిని పొందే మార్గాన్ని ఉపదేశించండని శిష్యులు ప్రార్థించారు. ఐదు శ్లోకాలలో వారు దానిని వివరించారు.

దీనినే సోపాన పంచకమని అంటారు. వేదంలో చెప్పిన కర్మలను అనుష్ఠించండి, వాటిని ఈశ్వర పూజగా భావించి ఆచరించండి. కోరికల వలలో బడి ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించకుండా మీమీ ఆశ్రమ ధర్మాలను ఆచరిస్తే ప్రపంచానికి మంచి కల్గుతుందని ఉపదేశించారు.

ఇప్పటికే వేదంలో చెప్పబడిన వాటిని తు. చ. తప్పక పాటించే వారున్నారు. ఇక చాలా మంది పూజ, ఉత్సవాలు, భజనలు చేస్తున్నారు. ఎవరైనా కర్మానుష్ఠానం చేస్తే పాటించాలి అని గేలి చేసేవారూ ఉన్నారు. వీళ్ల చేసే పనులలో శ్రద్ధలేదు, గంటలు వాయిస్తూ, తాళాలు మ్రోగిస్తూ, భజనలు చేస్తే సరిపోతుందా అని కర్మానుష్ఠానపరులు భక్తులనుద్దేశించి గేలిచేస్తూ ఉంటారు.

సోపాన పంచకంలో కర్మను, ఈశ్వర ప్రీతికోసం చేయాలన్నారు. కర్మ చేయాలి, ఈశ్వరుణ్ణి మరువకూడదని సారాంశం. ఈశ్వరార్పణ బుద్ధియనుట ప్రధానం. ఇది ఉత్తమ తరగతికి చెందింది. సంగ రహితమైన కర్మానుష్ఠానం సామాన్యులకు సాధ్యం కాదు. కర్మ ఫలాలను విడిచిపెట్టి కర్మ చేస్తే అదే కర్మయోగం. సామాన్యులు పనులు చేస్తూ ఉన్నపుడు భగవానుని స్మరించడం తక్కువగా ఉంటుంది. అందువల్ల కర్మ విడిగా, భక్తి విడిగా నని తలుస్తూ ఉంటారు. పోనీ, అట్లా అవి విడిగా ఉన్నాయని భావించినా కొంత కాలానికి ఈశ్వరార్పణ బుద్ధి ఏర్పడుతుంది. లేదా పూజ చేయడమే కర్మగా మారవచ్చు. లేదా కర్మ, పూజ మాని వేసి, చివరగా బ్రహ్మానందాన్నీ అనుభవించే దశ వస్తుంది.

ఈ విషయం ప్రక్కన ఉంచుదాం. ప్రాథమిక దశలో కర్మను చేసే వాణ్ణి ప్రేమిస్తాడా? పూజచేసే వాణ్ణి భగవానుడు ప్రేమిస్తాడా? ఈ ప్రశ్న వేయండి. ఒక ధనవంతుని దగ్గర ఇద్దరు సేవకులున్నారు. ఒక సేవకుడు పనులు చేయకుండా యజమానిని స్తోత్రం చేస్తూ ఉంటాడు. మరొకడు యజమాని చూస్తున్నాడా? లేదా అనే భావన లేకుండా తనకప్పగించిన పనిని చేసికొని

పోతూ ఉంటాడు. యజమాని మూర్ఖుడైతే స్తోత్రం చేసేవాణ్ణి మెచ్చుకొంటాడు. అతడు తెలివైన వాడైతే తన కప్పగించిన పనులు చేసేవాణ్ణి మెచ్చుకొంటాడు. అయితే భగవానుడు మూర్ఖుడైన యజమాని కాదు. కేవలం భజనలు చేసేవాణ్ణే చేరదీస్తాడని భావించకండి. కర్మ చేసేవాణ్ణి ఆదరిస్తాడు. అయితే భక్తిలేని శుష్క కర్మ చేసేవాడు, అతని ప్రీతికి పాత్రుడు కాలేడు. ఈ కర్మ చేసే వానికీ పూర్తి తృప్తికలగదు.

చేసే పని సక్రమంగా ఉండాలి. ఈ విశ్వం భగవానునిచే సృష్టింపబడింది. అందరూ అతని సేవకులే. అందరికీ ఆయన ప్రభువే. అంతేకాదు బ్రహ్మాండాలలో ఉన్న జీవులు ఏకోదరులవంటివారు. అతడు ప్రభువే కాకుండా మన తల్లి, తండ్రి కూడా. కనుక అందరూ అతని సంతానమే. వేదధర్మం ఒక్కొక్కరికి ఒక్కొక్క ధర్మాన్ని విధించింది. దానికి తగ్గట్లు మన పని మనం నిర్వహిద్దాం. పరస్పరం ప్రేమతో, ఐకమత్యంతో ఉందాం. చేయవలసిన వాటిని కర్తవ్యంగా భావిద్దాం. ప్రపంచ కుటుంబానికి ఎట్టివిఘాతం లేకుండా ప్రవర్తిద్దాం. అట్టి భావనతో మనం ఉండగలిగితే పరమేశ్వరుని పట్ల భక్తి కల్గుతుంది. ప్రేమతో, భక్తితో కర్మ, మిళితమైతే అతని దయకు పాత్రులమౌతాము. ఆ స్థాయి వచ్చేవరకూ కర్మలను ఈశ్వరార్పణ బుద్ధితో కొనసాగించాలి. ఆ స్థితికి చేరుకొన్న తరువాత ఇక విడిగా పూజ, భజనలలో మునగవచ్చు.

ఆకారంతో - ఆకారం లేకుండా

పువ్వు యొక్క వాసన, కన్ను గ్రహించలేదు. ముక్కు మాత్రమే గ్రహిస్తుంది. బెల్లంగడ తీపి ముక్కునకు తెలియదు. నాల్కకే తెలుసు. సంగీతాన్ని నాల్క రుచి చూడలేదు. కేవలం చెవి మాత్రమే. చలి, వేడిని తెలుసుకొనేది చర్మం మాత్రమే. చెవులకు తెలియదు. పై నాల్గు కన్నులకు తెలియదు. కాని రంగులు, చెవులకు, ముక్కు, నోరు, చర్మానికి తెలియవు. ఒక్కొక్క దానిని ఒక్కొక్క

ఇంద్రియమే గ్రహిస్తుందని, అన్ని ఇంద్రియాలు అన్నిటిని గ్రహించలేవని చివరకు నాస్తికుడు కూడా అంగీకరిస్తాడు. నాల్గు ఇంద్రియాల ద్వారా వస్తువులను తెలిసికొనలేకపోయినా ఒక్క ఇంద్రియం ద్వారానైనా ఒకదాని ఉనికిని తెలిసికొంటాడు. చెవుల ద్వారా సంగీతాన్ని తెలిసికొంటున్నాం. దీనితో రుచి చూడడం, వాసన చూడడం, స్పృశించడం కుదరకపోయినా సంగీతం లేదని ఎవ్వడూ అనడు.

ఐదు ఇంద్రియాలకు అందనిది ఒకటుందని ఒక్క మాటు ఆలోచించి చూడండి. శాస్త్రజ్ఞులు, విద్యుదయస్కాంత తరంగాలున్నాయని అంటున్నారు. ఇవి విశ్వం అంతటా వ్యాపించాయని నిర్ధారించారు. కాని ఇవి ఇంద్రియగోచరాలు కావు. ఇవి విశ్వంలోనే కాదు, మన శరీరంలో, మెదడులోనూ వ్యాపించాయంటే నమ్ముతున్నాం. అట్లాగే ఒక సమష్టి మనస్సు (Cosmic Mind) గొప్పదైన బుద్ధి అనగా మహత్తు ఈ ఇంద్రియాలను, వస్తువులను నిర్మించి, ఒక క్రమ పద్ధతిలో ఉంచింది. దానినే భగవానుడంటున్నాం. అది విద్యుత్తు మాదిరిగా సర్వత్ర వ్యాపించింది. అది లోపలా ఉంది. దాని నుండి ఇంద్రియాలు వెలువడి విషయాలను గ్రహిస్తున్నాయి. అదే కార్య నిర్వహణ చేస్తూ ఉంది. ఒక్కొక్క ఇంద్రియానికి ఒక్కొక్క శక్తి మాత్రమే ఉంది. ఈ నియమాన్ని పరాశక్తి ఏర్పరచింది. ఇట్లా పరాశక్తి తన ఆధీనంలో వీటి నుంచింది కాని, ఈ ఇంద్రియాలకు లోబడి ఆశక్తి పని చేయడం లేదు. ఇవి ఆ శక్తిని నియమించలేవు. అందువల్లనే ఆ పరాశక్తిని చూడలేకపోతున్నాం. కనబడడం లేదు కనుక ఆ పరాశక్తియే లేదని కొట్టి పారవేస్తూ ఉంటాం.

అతడన్నింటికి అతీతుడైనా భక్తులతడున్నాడని అనుభవంలో తెలిసికొంటారు. వారి ఇంద్రియాల ద్వారా కూడా తెలిసికోగలరు, మాట్లాడగలరు, చూడగలరు కూడా. తాను లేనని వాదించేవానికి తానున్నానని వచ్చి ఋజువు చేయడు. ఒక రూపం ధరించి యున్నానని చూడండని చాటింపు వేయడు. కాని భక్తునకు,

రూపం లేని వాడు తానైనా రూపం ధరించి సాక్షాత్కరిస్తాడు. తీగలో ఉన్న విద్యుత్తు కంటికి కన్పిస్తోందా? అది ఒక బల్బుకు అనుసంధానం చేసినపుడు, ఆ బల్బులో ఫిలమెంటు (సన్నని తీగ) ఉంటే స్విచ్ వేసిన వానికి స్వచ్ఛమైన వెలుగు కనబడదం లేదా? అట్లాగే భక్తి యనే ఫిలమెంటు ఉంటే శ్రద్ధయనే బల్బు, స్విచ్చి ఉండగా ఆకారంలేని భగవంతుడనే విద్యుత్తు, కాంతి రూపంలో గోచరిస్తుంది. అట్లాగే భగవానుడు కూడా దివ్య మంగల స్వరూపునిగా గోచరిస్తాడు. సూర్యతాపం వల్ల సముద్రంలోని నీరు ఆవిరిగా మారుతోంది. ఆ ఆవిరి కంటికి కన్పిస్తోందా? అది చల్లబడి మేఘంగా మారినపుడు వర్షం వస్తోంది. ఆ నీరు ఇంకా చల్లబడితే మంచుగడ్డలు. అట్లాగే మన హృదయం, లేదా మనస్సు, ఎంత చల్లబడితే ధ్యానం చేయగలిగితే, ఆకారం లేని పరమాత్మ, ఆకారం ధరించి సాక్షాత్కరిస్తాడు.

ఈ ధ్యానము నిరంతరం సాగినపుడు, అన్ని కోరికలు విడిచినపుడు, తీవ్రమైన భక్తియున్నపుడు భగవదనుభవం కల్గుతుంది. ఎవరికైనా అట్టి భక్తి, జ్ఞానము కలిగితే మిగతా వారికి ఏమిటి లాభమని ప్రశ్నిస్తారు. కాని అట్టి వారిని ఒక్కమారు దర్శించినా ఏవో బాధలు పోయినట్లు, శాంతి లభించినట్లుంటుంది. కారణమేమనగా భగవదనుభూతిని సంపూర్ణంగా పొందారు కనుకనే. శాంతికంటే కావలసినది ఏముంది? అట్టి శాంతి ప్రదాతలే జ్ఞానులూ, భక్తులూ.

ఈశ్వరుడు

జ్ఞాని, స్వస్వరూపానికి మించిన దానిని చూడదు. అనగా స్వస్వరూపాను సంధానమే చేస్తాడు. ఒకే ఒక పరమాత్మ, అనేక రూపాలుగా కన్పిస్తాడని భావిస్తాడు. బాహ్యాకారాలు కనబడుటకు మాయ కారణమని, పరమాత్మ అన్నిటిలో ఉన్నాడని భావిస్తాడు. మాయా ప్రపంచంలో జ్ఞాని చేయవలసినది ఏదీ లేదు. చూచేవాడు, చూడబడేది, చూచేది, అన్నీ ఒకటైనపుడు పని ఏముంటుంది? బ్రహ్మముగానే అట్టి వాడుండి పోతాడని ఉపనిషత్తు చెప్పింది.

బ్రహ్మమునకు పని లేదు., మాయా ప్రపంచంలో చిక్కుకొని ఈశ్వరుని పూజిస్తూ తాము చేసే పనులలో సహకరించుమని భక్తులు ప్రార్థిస్తూ ఉంటారు. మంచి పనుల కోసం తోడ్పాటు కావాలని చిత్తశుద్ధితో ప్రార్థించినపుడు అవి జరిగేటట్లు స్వామి అనుగ్రహిస్తాడు. ఇట్లా చూసినపుడు, పనులు లేకుండా బ్రహ్మము లేదని భావించలేం. మనం ప్రార్థించినా, ప్రార్థించకపోయినా జగన్నిర్వహణను కొనసాగిస్తూనే ఉంటాడు. అందరిని పోషిస్తూ, పాలిస్తూ ఉంటాడు. కనుక అట్టి పెద్ద పని, అతనికుంది.

అయితే పనిలేని బ్రహ్మమొకడు, పనియున్న బ్రహ్మ ఒకడూ ఉంటారా అని సందేహం. ఇద్దరూ భిన్నులు కారు. జ్ఞాని కొలిచే బ్రహ్మమే (నిరాకారమే) ఈశ్వరునిగా జగన్నిర్వాహకునిగా ఉంటాడు.

శివుని దక్షిణామూర్తి స్వరూపము, బ్రహ్మమును తెలుపుతుంది. ఆ దశలో అతనికి క్రియలేదు. అది కేవలమూ నిశ్శబ్దము. పరమశివుడెన్నెన్ని పనులు చేయడం లేదు? చిదంబరంలో నృత్యం చేస్తూ ఉంటాడు. దారుకావనంలో భిక్షాటన మూర్తిగా ఉంటాడు. అందరినీ ఆకర్షిస్తాడు. దక్షయజ్ఞంలో సూర్యుని దంతాలనే ఊడగొట్టాడు.

లోలోపల అణగియుండి, నిర్వికారుడై బాహ్యంగా అనేక కృత్యాలు నిర్వహిస్తూ ఉన్నట్లుగా కనబడతాడు.

ప్రపంచమనే సరస్సులో సాధారణ జనులీదుతూ ఉంటారు. జ్ఞానులందులకు విరుద్ధము. తీరాన్ని దాటి యుంటారు. ఈ ఇద్దరి మధ్య ఒడ్డు. సరస్సులో మునిగిన వానికి బాహ్య తీరాలు కనబడవు. జ్ఞాని, ఈ సరస్సును చూడదు. భగవానుడు ఒడ్డు వంటివాడు. సరస్సును చూస్తాడు, అవతలి తీరాన్ని చూస్తాడు. ప్రపంచం, విలయమయిందని భావించే జ్ఞానినీ చూస్తాడు. సరస్సులో మునిగితేలే వానినీ చూస్తాడు. ఆ జ్ఞానిని పిలిచి సరస్సులో మునిగే వానిని ఉద్ధరించుమని చెబుతాడు. ఒడ్డునకు చేర్చుమని ఆదేశిస్తాడు.

తానన్నిటా వ్యాపించానని భగవానునికి తెలుసు. అయినా తనకంటే భిన్నుడని భావించే సామాన్యులకు భిన్నంగానే ఉన్నట్లు తోపింప చేస్తాడు. అది ఒక వినోదం.' ఈ సందర్భంలో నీలకంఠుల శ్లోక తాత్పర్యం వినండి.

పెరియపురాణంలో ఒక కథలో స్వామి, ఒక కూలి వానిగా వచ్చి ఒక మధుర పదార్థం తినడానికి నెత్తిమీద గంప పెట్టుకొని మట్టిని మోసే సందర్భమది. ఈ కూలీ సరిగా పనిచేయడం లేదని ఆనాటి పాండ్య రాజు ఒక కొరడా దెబ్బవేస్తాడు. ఆ దెబ్బ అందరికీ తగిలింది. కొట్టిన రాజునకు కూడా. అందువల్ల స్వామి, అన్ని ప్రాణులలోనూ ఉన్నట్లే కదా! అపుడు కవి ఇట్లా చమత్కరించాడు. దెబ్బ తినేటపుడు నీవు శివాద్వైతాన్ని చూపించావయ్యా! (అందరూ ఒకటే అని). కాని మధుర పదార్థం తినేటపుడు నీవొక్కడివే తిన్నావు. ఆ తింటున్నపుడు, అందరూ తింటున్నట్లు చేయలేక పోయావు. ఇట్లా ఉండడం బాగుందా అని ప్రశ్నించాడు.

దీని నుండి బ్రహ్మముగా అంతరంగా ఉన్నా ఈశ్వరునిగా ప్రకటింపబడుతూ కార్యాలను నిర్వహిస్తూ ఉంటాడని తేలింది. అతనివి పంచకృత్యాలు. సృష్టి, స్థితి, సంహారములు. ఇవి భ్రాంతితో కూడిన ప్రపంచానికి సంబంధించినవి. మిగిలినవి రెండున్నాయి. మాయ చేసే కృత్యం తిరోధానం. ఈ మాయ నుండి విడుదల చేయడం అనుగ్రహం. అద్వైతస్థితిని చేరుకోవడానికి ఇట్టి అనుగ్రహమే లభిస్తుంది. ఆ అనుగ్రహం కోసమే తపశ్చర్య. అట్లా చేయాలని అనిపించడమూ అతని అనుగ్రహమే. అట్టి నమ్మకంతో, ప్రేమతో కొలవడమే భక్తి.

విగ్రహారాధన - జ్ఞానము

ఒక అరటి పళ్ల అత్తాన్ని నా ముందుంచారు. ఇది పసుపు పచ్చగా ఉందని నేనంటే అవునని మీరు అంటారు. ఇందుకు సందేహం లేదు.ఇది ఎరుపుగా ఉందని ఒక పండును చూపిస్తూ అన్నాననుకోండి. ఎర్రగా

ఉందంటారేమిటని ప్రశ్నిస్తారు. కాదని అంటారు వెంటనే. నేను దీని రంగు ఫలానా అని చెప్పకుండా ఈ అరటిపండు ఎర్రగా ఉందని కాసేపు ఊహించండని అన్నాననుకోండి. నేనన్నది కాదన్నా ఎర్రదానిగా ఉన్నట్లు ఊహిస్తారు. మనస్సును సమాధానపరచుకొంటే అట్లా భావించవచ్చు.

పూజకూడా అట్టిదే. ఉపాసనామార్గాలు అనేకం ఉన్నాయి. పరమేశ్వరుడిట్లా ఉంటాడని, ఈ గుణాలతో ఉంటాడని భావించండని ఈ ప్రతిమలను దేవతలని భావించండని అంటారు. అట్లాగే అరటిపండు పసుపే. పరమాత్మ స్వభావమట్టిదే. అతడు నిర్గుణుడని అంటే ధ్యానం చేయడం సామాన్యులకు అలవికాని పని. మనకెందుకులే, మనకుచిక్కడులే అని నిరాదరణ చూపిస్తారు. అరటిపండు ఎర్రగా ఉందని చెప్పినపుడు మాత్రం, పరమాత్మ ఈ విగ్రహంలో ఉన్నాడనిపుడు ముందుగా మనసు కాదంటుంది. కనబడేది రాయికదా! దేవుడంటారేమిటని శంకిస్తారు. కాని దీనిని పరమాత్మగా భావించండని అనినపుడు, పచ్చని పండును ఎర్రగా ఉందని భావించండని అనినట్లు భావించడం మొదలుపెడతారు. ఏది ఎరుపో మనస్సు గుర్తించగలదు. కాని పరమాత్మ స్వభావం మనకు అర్థం కాదు. కనుక విగ్రహాన్ని విగ్రహంగానే చూస్తే దాని మీద మనస్సు లగ్నం కాదు. తెలిసిన వాటితో మనస్సు బంధింపబడి ఉంటుంది. ఆ విగ్రహం స్త్రీ మూర్తిగా అందంగా మలచబడగా అమ్మవారిట్లా వచ్చిందని ఊహించండని అంటే మనస్సు అంగీకరిస్తుంది. లగ్నమౌతుంది కూడా.

అంటే ఏం జరిగింది? ఆకారంలేని, గుణాలు లేని, అనంతమైన దానిని గుణాలున్నట్లుగా భావిస్తున్నాం. నిర్గుణుడైన పరమాత్మనుండే అన్ని రూపాలూ వచ్చాయి. ఒక్కొక్క గుణానికి ఒకొక్క రూపాన్ని పెట్టి ఒక్కొక్క దేవతగా ఆరాధిస్తున్నాం. మనకర్థమయ్యే రీతిలో, మనస్థాయికి తగ్గట్లుగా ఆ పరమాత్మ తత్వం అవతరిస్తే దానిని స్వీకరిస్తున్నాం, పూజిస్తున్నాం.

మనమే రూపంలో ధ్యానించినా అతడు దయను చూపిస్తాడు. మనస్థాయిని క్రమక్రమంగా పెంచుతాడు.

చిట్ట చివర దశలో మనస్సు దాటిన స్థితిని మనస్సునకు అనుగ్రహిస్తాడు. అనగా సంకల్ప వికల్పాలు లేని స్థితిని ప్రసాదిస్తాడన్న మాట. అట్టి నిర్వికల్ప స్థితిలో పరమాత్మను నిర్వికారునిగా, నిష్క్రియునిగా, నిర్వికల్పునిగా భావించగలం. మొదటి మెట్టులో మనముండగా అతడు అతీతుడని భావిస్తాం. అందుకై అతనికి కల్యాణ గుణాలున్నట్లు, ఒక ఆకారం ఉన్నట్లు భావిస్తాం. మన మనస్సు పరిపక్వమైన కొలదీ అతని అతీత స్థితిని అర్థం చేసికొనగలం. మనస్సుకి ఏ పని లేనపుడు పచ్చని పండు పచ్చగానే కన్పడినట్లు, మనస్సు అణగినపుడు, పరమాత్మను, పరమాత్మగానే దర్శిస్తాం. మంత్ర పఠనంలో, ఆచారాలలో, పూజావిధానంలో అనేక నియమాలుంటాయి. పరమాత్మను ఒక విధంగా ఊహించుకొని పూజించినపుడంతే. ఆ ఊహ అణగిన వానికి నియమము లేదు, క్రియ కూడ లేదు. పూజ, మనస్సుతో, క్రియతో సాగుతుంది కదా! కాని మనస్సు పరిపక్వమైనపుడు జ్ఞానమే ప్రకాశిస్తుంది. పూజాదులు లేవు. ఇట్టి జ్ఞానము మనకు మొదటి దశలోనే కల్గిందని భ్రాంతి పడకూడదు. జ్ఞాన సంపాదనకై పూజను అంగంగా భావిస్తారు. మన ఊహలకు తగ్గట్లు విగ్రహాలున్నాయనీ భావించవద్దు. ఋషులకు ఫలానా మూర్తులని, ఫలానా మంత్రాలని, ఫలానా నియమాలని పరమాత్మయే ముందు నిర్దేశించాడు. పరమాత్మయే మూర్తి, యంత్ర, మంత్ర, తంత్ర రూపంగా అవతరించాడని భావించి ఆ మార్గం గుండా భక్తితో, అంకిత భావంతో పయనించగా పయనించగా కృపావర్షం కురిపిస్తాడు. జ్ఞానోదయం కల్గుతుంది.

జ్ఞానం రానీ, రాకపోనీ, పూజచేస్తున్నామంటే ప్రేమతో సాగాలి. ఈ ప్రేమ, భక్తి మనకు అనంత తృప్తిని ప్రసాదిస్తాయి. దీనివల్ల అతని ప్రేమను పొందగలం. అదే గొప్ప ఆనందం. ఆపైన అతడద్వైత జ్ఞానాన్ని ప్రసాదిస్తాడో లేదో అతని ఇష్టం. అది రాలేదని బాధపడనవసరం లేదు. భక్తి అనుగ్రహం చాలు.

ఆలయాలలో పూజ

ఎవరైనా సాయంచేస్తే కృతజ్ఞత చెప్పడం మనవంతు. అట్లా ధన్యవాదాలందిస్తూ ఉంటాం. ఒక గడ్డి పరకను సృష్టించలేని మనకు,. కూడు, గుడ్డ, నీడనిచ్చినవానికి కృతజ్ఞత చెప్పకపోతే ఎలా? అందుకే మనం అన్నం వండుకొన్న తర్వాత అతనికి నివేదించి నైవేద్యంగా సమర్పించి భుజిస్తూ ఉంటాం. అట్లాగే వస్త్రాభరణాలను స్వామికి సమర్పిస్తున్నాం. వాటిని ధరిస్తున్నాం. అందరూ అన్నీ సమర్పించి పూజ చేయడం కుదరదు. అందువల్ల అందరికీ ఉపయోగపడే రీతిలో ఆలయాలేర్పడ్డాయి. అందరూ తమకు తోచినది అర్పించి కృతజ్ఞతా భావాన్ని ప్రకటిస్తారు.

అంతటా వ్యాపించిన మహాశక్తిని, తమ మంత్ర శక్తి ద్వారా ఒక చోట కేంద్రీకరింపచేసారు ఋషులు. విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ చేసారు. అట్లా ఆలయ వ్యవస్థ ఏర్పడింది.

అందరూ ఇంట్లో తమశక్తి కొలదీ పూజచేసికొని ఆలయానికి రోజూ వెళ్లి మ్రొక్కుతూ ఉంటే ఆలయంలో జరిగే పూజా విధులు సక్రమంగా జరుగుతాయి. ఏదైనా దేవాలయానికి వెడుతున్నానని నేనంటే నా కోసమైనా ఆలయాన్ని శుభ్రంగా ఉంచుతారు, దీపాలు వెలిగిస్తారు, అలంకరిస్తారు, చక్కని నైవేద్యాలు పెడతారు.

మనం సూక్ష్మధర్మాలను విస్మరించాం. అన్న ప్రదాతకు సరియైన నివేదన ఉండాలి. విగ్రహాన్ని అలంకరించిన వస్త్రాలు శుభ్రంగా ఉండాలి. ఇట్టి విషయాలను మనం పట్టించుకోం. మురికి బట్టలు కట్టుకొన్న వాడీ జగత్తులో ఎవడని ప్రశ్నిస్తే ఆలయంలో దేవుడే కన్పిస్తున్నాడు. అవి శుభ్రంగా ఉంటే మన మనస్సూ, శుభ్రంగా ఉంటుంది. ప్రతి రోజు ఆలయ సందర్శనం చేయాలని ఎన్నో నియమాలను విధించారు పూర్వులు. శివవిష్ణు ఆరాధన చేయాలన్నారు. ఇట్లా ప్రతి ఆలయంలోనూ నిత్యపూజలు జరుగుతున్నాయా లేదా అని చూడడం మన అందరి వంతు.

ఆలయ పూజా విధానంలో నేడు రకరకాల మార్పులు చేస్తున్నారు. పవర్ హౌస్ నుండి విద్యుత్తు ఎట్లా అన్ని చోట్లకు సరఫరా అవుతుందో అంతటా వ్యాపించిన వానిని ఒక చోట కేంద్రీకరించగా అవి ఆలయాలయ్యాయి. ఆగమాల ప్రకారంగానే పూజలు జరగాలి. చేతులున్నా-యని ప్రతివాడు విద్యుత్ పరికరాలను ముట్టుకుంటే ఎలా? అట్లాగే మన పరిమిత బుద్ధులనుపయోగించి మార్పులు చేసినా దుష్ఫలితమే మిగిలేది.

కొందరేమంటారంటే ఆలయంలో అర్చకుడు సరిగాలేడంటారు. అయినా ఆలయ పవిత్రతకు భంగం లేని రీతిలో మనమెందుకు నియమాలను మార్చకూడదని ప్రశ్నిస్తారు. వీళ్ల వల్ల స్వామియే గెంటివేయబడుతున్నాడు. ఆచారం కొంతలేకపోయినా ఆలయం వెంటనే పవిత్రతను కోల్పోదు. కాని ప్రతివాడు, కలుగచేసికొని అనాచారాన్ని వ్యాప్తి చేస్తే నష్టపోయేది మనమే. భగవంతునికి నష్టం లేదు. కనుక ఆగమశాస్త్రాలు విధించని వాటిని క్రొత్తగా ప్రవేశపెట్టవద్దు. మనం అందరం ఆచారాలకు కట్టుబడి భక్తిశ్రద్ధలతో ఆలయాలకు వెడుతూ ఉంటే మనలను చూసైనా పూజారి తన దోషాలను సరిదిద్దుకొంటాడు.

రాజకీయ నాయకులు చీటికీ మాటికీ మత విషయాలలో తలదూర్చడం మంచిది కాదు. మనం క్రొత్తగా ప్రవేశపెట్టేది స్థిరంగా ఉంటుందని చెప్పగలమా! నదులు పొంగిపొర్లేటప్పుడు ఒడ్లకు కొంత చేటువస్తుంది. అది వర్షకాలంలో సహజం. దానికై చింతించనవసరం లేదు.

క్రొత్త క్రొత్తగా వచ్చే తిరుగుబాటుభావాలు కలవారిని ఒప్పించవచ్చు. సంఘ సంస్కర్తలు ప్రాచీన శాస్త్రాలను చదవరు. అందువల్ల కొన్ని సందర్భాలలో కోపోద్రిక్తులౌతారు. వారిని చూసినపుడు కోపగించరాదు. ప్రతిపక్షాన్ని గౌరవించడమే మనవంతు. శాస్త్రీయమైన ఆచారాలను ప్రేమతో విశదీకరించాలి.

కొన్ని వందల సంవత్సరాల వెనుక రాజులచే ఇవి పోషింపబడ్డాయి. ముందు మన నడవడిక తిన్నగా ఉంటే భక్తి శ్రద్ధలుంటే ఎదురు తిరుగు భావాలు కలవారిని ఒప్పించవచ్చు.

ఆలయాల పవిత్రత

గ్రామగ్రామాన ఆలయాలు వెలుస్తున్నాయి. జీర్ణ దేవాలయోద్ధరణ జరుగుతోంది. కుంభాభిషేకాలు సరేసరి. నా దగ్గరకు వచ్చి కొంత మంది సలహాలడుగుతూ ఉంటారు. చాలా సంతోషంగానే ఉంది.

అదే సందర్భంలో కొంతమంది వచ్చి చెప్పే విషయాలు వింటూ ఉంటే బాధ కూడ కల్గుతోంది. వాళ్ళు మిగతా వాళ్ళతో చెప్పుకోవడం కంటే నాతో చెప్పుకోవడంలో కొంత తృప్తిని పొందుతున్నారు. ఇతరులు సలహాలు చెప్పడానికి జంకవచ్చుగాని, నేను నిర్భయంగా కొన్ని విషయాలు చెప్పాలి కదా! ఏది శాస్త్ర విరుద్ధమో ఏది సమ్మతమో స్పష్టంగా చెప్పాలిగదా! వినండి.

ఆలయాలు ప్రశాంతంగా, పవిత్రంగా ఉండాలి. భగవత్ చింతన తప్ప ఇతర ఆలోచనలను అక్కడ రానీయకూడదు. అయితే మనం చూస్తున్నదేమిటి? అనేక ఆలయాల చుట్టు ప్రక్కల కొట్లు కట్టి వ్యాపారం సాగిస్తున్నారు. టీ, సిగరెట్టు కొట్లుంటాయి. దేవాలయానికి ఆదాయం వస్తుందని అన్నింటిని ప్రోత్సహిస్తున్నారు. ఒక్క స్వామి ఉన్న ప్రాంతం తప్ప మిగిలిన ప్రదేశమంతా అద్దెకీయబడుతోంది. అట్టి గందరగోళ పరిస్థితిలో భగవత్ భావన కనుమరుగౌతోంది. కలుషిత వాతావరణంలో భక్తి సన్నగిల్లుతుంది.

కార్యాలయ భవనాలు, కుటీరాలు, ఫలాహార శాలలు మొదలగునవి ఎన్నో చుట్టు ప్రక్కల వెలుస్తున్నాయి. కైంకర్యానికి చెందని అనేక క్రియాకలాపాలు సాగుతున్నాయి. అభివృద్ధి పేరుతో అనాచారాన్ని ప్రోత్సహిస్తున్నారు.

ఒక్కొక్క ఆలయానికి ప్రత్యేకంగా పరిపాలన పద్ధతి ఉండక అంతా ప్రభుత్వాధీనంలో ఉండడం వల్ల ప్రజలు తమ గోడును వినిపించవలసి వస్తోంది. ఏదైనా మంచి పనిని ఉద్యోగులు మొదలుపెడితే పూర్తికాకుండానే బదిలీలు జరుగుతున్నాయి. రాజకీయ నాయకుల జోక్యం ఎక్కువైంది.

పవిత్రతకు ప్రాధాన్యం ఈయక పైపై కుంభాభిషేకాలు జరిగినా ఫలం శూన్యమే. భక్తులు ఈ విషయంపై దృష్టిని సారించి ఆలయం ఒక వ్యాపార స్థలంగా ఉండకుండా చూడాలి. ప్రజలలో సామూహికమైన చైతన్యం రావాలి.

అనాచారాలను పేర్కొనడం నా విధిగా భావిస్తున్నాను. ఏదో ఒక కళాశాల నుండో, పాఠశాల నుండో 50, 60 మంది విద్యార్థులు ఒక్క మారే వస్తూ ఉంటారు. అందు యుక్త వయస్సు వచ్చిన ఆడపిల్లలూ ఉంటారు. వారు నెలసరి (బహిష్టు) నియమాలను పాటించకుండా ఆలయంలో ప్రవేశిస్తూ ఉంటారు. ఇది తప్పని తెలియక వస్తూ ఉంటారు. పూర్వం ఇంట్లోనే ఆ రోజులలో దూరంగా ఉంచేవారు. వారు వచ్చినా స్వామి, మైలపడతాడా అని సంఘసంస్కర్తలు ప్రశ్నిస్తూ ఉంటారు. కొందరు స్వామి పవిత్రంగా అన్నిచోట్ల ఉంటాడని ఆలయాలకే రానవసరం లేదనీ వాదిస్తూ ఉంటారు. ఆలయాలు శాస్త్ర ప్రకారం నిర్మింపబడ్డాయి. నియమాలను పాటించకపోతే ఎలా? శాస్త్ర నియమాల ఉల్లంఘన వల్లనే యాత్రాస్థలాలలో ప్రమాదాలు, అనుకోని విపత్తులు సంభవిస్తున్నాయని భావిస్తున్నాను.

అంత గొప్ప క్షేత్రంలో ప్రమాదాలు జరగడమేమిటండి? స్వామి తన పవిత్రతను కోల్పోయాడా అని ప్రశిస్తూ ఉంటారు. నేను బాధపడుతూ స్వామి అక్కడ ఉన్నాడు కాబట్టే అనాచారాన్ని తట్టుకోలేక దయకలవాడైనా అప్పుడప్పుడు ప్రమాదాల రూపంలో శిక్షవేస్తున్నాడేమో అని అనిపిస్తోందని ఒకమాట అంటాను.

క్షేత్రాలు, విహారయాత్ర కేంద్రాలు కావు. భక్తి లక్ష్యమైనా పై పవిత్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు లేదు. అపచారాలతో క్షేత్రాలను నింపుతున్నాం.

ఇట్లా అనాచారాలు తెలిసి చెప్పకపోవడం నా ధర్మాన్ని విస్మరించినట్లౌతుందని చెప్పడం జరిగింది. భక్తులలో పరివర్తన తీసుకురావాలని వేంకటేశ్వరుని ప్రార్థిస్తున్నా.

ఆలయం - దైవకార్యాలు

రెండువేల సంవత్సరాల వెనుక మెగస్థనీసు మనదేశం వచ్చి ఆశ్చర్యపోయాడు. భారతీయులు అబద్ధమాడరని, వీథిలో డబ్బును విడిచినా ఎవ్వరూ దానిని తాకరని, న్యాయస్థానాలు లేవని ఇంకా ఏవేవో విషయాలను వ్రాసేడు. అట్లా మనం ఈనాడూ ఉండగలగాలి.

ఆనాటి సమాజం అట్లా ఉండడానికి కారణం ఏమైయుంటుంది? నేడీ పతనానికి కారణమేమిటి? ఆనాటి పవిత్ర వాతావరణం వల్లనే శీలవంతులుండేవారు. పూర్వకాలంలో ఆలయాలలో భారత ప్రవచనాలుండేవి. కథా కాలక్షేపాలు సరేసరి. ఇట్టి ప్రవచనాలు సాగడానికి ఆనాటి రాజులు కొన్ని మాన్యాల నిచ్చేవారు. ఏ నాటకం ఆడినా, ఏ కళను ప్రదర్శించినా భగవత్ సంబంధంతోనే ఉండేది. ఎవరి వృత్తులు వారు చేసికొంటూ విధిగా ఆలయాన్ని దర్శించేవారు.

ఈనాడు మానవుల చంచల మనః ప్రవృత్తికి అనేకం దోహదం చేస్తున్నాయి. చలనచిత్రాలు, నవలలు, శృంగార కథలు, శృంగార దృశ్యాలు మనిషిని క్రుంగదీస్తున్నాయి. వాటికి తోడు రాజకీయ పార్టీలు, కక్షలు, ఎన్నికల హడావిడి ఎక్కువగా ఉంది. ఎక్కడ చూసినా అసంతృప్తి, అవినీతి తాండవిస్తోంది.

ఆనాటి కథా కాలక్షేపాలులేవు. ఏ హరికథా కాలక్షేపం చేసేవాడో వచ్చి వెళ్లిపోవడమే జరుగుతోంది! తన తరంతోనే కళ అంతరిస్తుందని బాధపడుతున్నాడు. ముందు తరాల వారికి ప్రోత్సాహం లేదని, భద్రత లేదని వాపోతున్నాడు. విద్వాంసులకే కాదు, శిల్పులు మొదలగు వారికి

ఉద్యోగ భద్రత అనాదుండేది. జానపద కళలు క్రమక్రమంగా అంతరించిపోతున్నాయి. పొట్టగడవడమే వారికి కష్టంగా ఉంది. పొట్టకూటికై ఇతర వృత్తులను ఆశ్రయిస్తున్నారు. పిల్లలకు తమ కళలను తల్లిదండ్రులు నేర్పడం లేదు. ఆ నాటకాలు, ఆ తోలు బొమ్మలాటలు, కొయ్యబొమ్మలాటలు, ఆ హరికథా కాలక్షేపాలు, పురాణ ప్రవచనాలు ఈనాడు లేవు. ఆ శిల్ప నైపుణ్యం ఏది? జానపద కళలను ప్రోత్సహిస్తున్నామని ప్రభుత్వం ఏవో సభలు ఏర్పాటు చేయడం, మంత్రులు రావడం, ఉపన్యాసాలీయడం, ఫోటోలు, పత్రికలలో ప్రచారం మొదలగు ఆర్భాటంతో ముగుస్తోంది. తరతరాలు కాపాడుకొనే భద్రతను కల్పించలేకపోతున్నారు.

ఆలయాలు- కళలతో పెనవేసి కొన్న ఆనాటి వాతావరణాన్ని మెగస్థనీసు ప్రశంసించాడు. ప్రజలను కళల ద్వారా ఉత్తేజితుల్ని, సంస్కారవంతుల్ని చేసిన ఆనాటి వాతావరణాన్ని చూసి ముగ్ధుడైపోయాడు.

కనుక ప్రజలకు మానసిక తృప్తిని, ధార్మిక సంస్కారాన్ని ఇచ్చే ఆ నాటక కళల సంస్కృతి పునరుజ్జీవింపబడాలి. ప్రజలు, ప్రభుత్వమూ ప్రోత్సహించాలి.

ఇక ఆలయం కూడా ఆగమ శాస్త్ర నియమాలను తు, చ, తప్పక పాటిస్తూ, మంత్ర పఠనం వల్ల పవిత్రం చేస్తూ ఉండగా, అందు పురాణ ప్రవచనాదులు జరుపబడుతూ ఉంటే పూర్వవైభవం వస్తుంది. అర్చకులకు, శిల్పులకు, కళాకారులకు తగిన భృతి ఉన్నప్పుడు మాత్రమే అన్నీ సక్రమంగా జరుగుతాయి. దేవాలయ వ్యవస్థను పటిష్ఠం చేయగలిగితే దేశం సుభిక్షంగా ఉంటుంది.

ఆలయం - వైద్యాలయం

మానవ సేవయే మాధవసేవ కనుక ప్రత్యేకంగా మాధవుణ్ణి సేవించనవసరం లేదని కొందరంటారు. అంతేకాదు, ఆలయాలను వైద్యాలయాలుగా, విద్యాలయాలుగా మార్చండని కేకలు వేసేవారూ ఉన్నారు. రోగాలను కుదర్చడం, విద్యాబుద్ధులు నేర్పడం ప్రశంసింపదగినవే. అట్టి

సాంఘిక కార్యక్రమాలు భగవత్ కృపకు నోచుకొంటాయనడంలో సందేహం లేదు. మానవ సేవయే మాధవ సేవ అనడంలోనూ తప్పులేదు. మాధవుణ్ణి సేవించినా మానవులందరినీ సేవించినట్లే అంటున్నా. ఇది సంఘ సేవకంటే శాశ్వతమైన మంచిని ప్రసాదిస్తుందని అంటున్నా. ఎట్లా?

వైద్యాలయంలో రోగాలు కుదిర్చి ఇంటికి పంపుతున్నారు. తరువాత అతడు సక్రమ జీవితం గడుపుతాడని నమ్మకం ఉందా? రోగాలు కుదర్చబడిన వారు ఘోరకృత్యాలు చేస్తే మనం రోగం కుదర్చడం వల్ల ఫలమేమైనా వస్తుందా? ఎవరైనా మతిస్తిమితం లేని వాళ్లను దగ్గరకు తీసికొని వచ్చి రోగం కుదుర్చండని ప్రార్థేయపడుతూ ఉంటారు. పై విధంగా భావిస్తూ ఉంటాను. కుదిరినా సరిగా నడుచుకొంటాడా లేదా అని నేను వారిని ప్రశ్నిస్తే వారు బాధపడుతారు కదా! కనుక అట్లా పైకి అనను. ఇట్లా ఉంటుందని చెప్పడానికే ఇదంతా చెప్పాను. ఏదైనా తప్పు పని చేస్తే తగిన దుష్ఫలితం వస్తుందని భావించి, చేసినా పాపమే వస్తుంది. అయితే మతిస్తిమితం లేనివాడు తప్పు పని చేసినా వాడికి పాపం అంటదు. గత జన్మ పాపాలవల్ల ఇప్పుడీ రోగం వచ్చింది. ప్రస్తుతం అట్టి వానికి పాపం లేదు. అట్లా ఉండడానికి ఏది మూలకారణం? ఈ జన్మలో పాపాలు చేయకుండా ఉండాలన్నా, గత జన్మలోని పాపాల నివృత్తికి మార్గమేమిటి?

వైద్యాలయాలు కేవలం శారీరక అనారోగ్యాన్ని తొలగించగలవు. అంతకంటే మనుష్యులలో దుష్టభావాలు తలెత్తకుండా ఉండాలంటే ఏం చేయాలి? దాని కోసం పాఠశాలలను పెట్టి చదువు నేర్పిస్తున్నాం. వాళ్లు బాగా చదివి లోకంలో అడుగుబెట్టి నిజాయితీతో ఉండకపోతే ఆ చదువువల్ల ఏం ప్రయోజనం సిద్ధిస్తుంది? ఆ విద్యార్థిలో క్రమశిక్షణ, త్యాగబుద్ధి, దేశభక్తి, దైవభక్తి లేకపోతే వాడు బుద్ధిమంతుడైన కొద్దీ ఎట్లా మోసం చేయవచ్చో, నేరాన్నుండి ఎట్లా తప్పించుకోవచ్చో మొదలగువాటికి ఆ విద్య ఉపకరిస్తోంది కూడా. కనుక మానవ జీవితం వైద్య, విద్యాలయాలతోనే అంతం కాదు. వాటికి తోడు దేవాలయ వ్యవస్థ ఉండి తీరాలి. మనిషిని మహోత్తమ

మానవునిగా తీర్చి దిద్దాలంటే వానిలో ధ్యానం, పూజ, ప్రశాంత చిత్తత, వివేచన వినయ సంపద, క్రమశిక్షణ మొదలయిన సల్లక్షణాలుండవలసిందే. వీటికై ఉపయోగిస్తుంది దేవాలయం.

ఆరోగ్యం విద్య అందించడం కంటే భగవత్ సాన్నిధ్యాన్ని చేర్చే పద్ధతి ఉండాలి. విద్య వల్ల బుద్ధి మంతుడౌతాడు. ఆ బుద్ధి తనకు, సంఘానికి ఉపయోగపడినపుడే ఆ విద్యకు పరమార్థం. అంతకంటే జ్ఞానికావాలి. విచక్షణా జ్ఞానం ఉండాలి. (Knowledge వేరు Wisdom వేరు). ఈ జ్ఞానం పూజ ధ్యానాదుల వల్ల వస్తుంది. మంచి వ్యక్తులుగా మారినపుడు పై విద్యలు రాణిస్తాయి.

ఈ మంచిగా మారడానికి దేవాలయ సంరక్షణ జరగాలి. ముందుగా భక్తి భావం పొటమరించాలి. తనను తానేమిటో తెలిసికొనే వాతావరణాన్ని సృష్టించగలగాలి.

మంచిగా ఉండడానికి భక్తి అవసరం లేదని కొందరంటారు. నిజమాలోచిస్తే అనేక స్వార్థాలతో కూడిన జీవునికి శుద్ధి, భక్తి వల్లనే సాధ్యమౌతుంది. యుగయుగాల నుండి, పై వాడొకడున్నాడని, అతడన్నింటిని గమనిస్తున్నాడని, మనం చేసే మంచి చెడ్డలకు ఫలాన్నిస్తాడనీ నమ్మకంతో బ్రతికాం. అట్టి భావన ప్రజలకు ఆలంబనంగా, ఊరట నిచ్చేదిగా ఉంటుంది. ధర్మమార్గంలో నడవడానికి దోహదం చేసింది.

భక్తి యొక్క లక్ష్యం మనిషిని మంచిగా తీర్చిదిద్దడానికే. ఇక పరమార్థ జ్ఞానం పట్టుబడితే పైవాడికి తనకూ అభేదాన్ని గుర్తిస్తాడు. ఇక జనన మరణ ప్రవాహమూ ఉండదు. బాధా విముక్తి కల్గుతుంది. జ్ఞానం కలిగి ప్రవర్తిస్తే తనకూ, సంఘానికి సేవ చేసినట్లే. గుళ్ళు, గోపురాలు కట్టడం ఎందుకంటారు. అవి ఎంతో ఎత్తుగా ఉంటాయి. మనలనూ ఉన్నతంగా తీర్చిదిద్దడానికే అవి ఉన్నాయి. ఉన్నతంగా మనమున్న రంగాలలోనూ ఎదగాలని సూచిస్తున్నాయి.

ఐదు ఇంద్రియాలు - ఐదు ఉపచారాలు

మనిషిలో విషయాలననుభవించడానికి ఐదు ఇంద్రియాలున్నాయి. కన్ను, చెవి, ముక్కు, నోరు, చర్మం. వీటిని పంచేంద్రియాలంటారు. ఇవి శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలనే విషయాలను అనుభవిస్తున్నాయి. కన్ను రూపం చూస్తోంది. నాల్క రుచిని ఆస్వాదిస్తోంది. చర్మం వల్ల స్పర్శ జ్ఞానం కల్గుతోంది. ఈ ఇంద్రియాలు క్రొత్తగా వేటినీ సృష్టించడం లేదు. అవి ఉన్న వాటిని అనుభవిస్తున్నాయి. రేడియో, విద్యుదయస్కాంత తరంగాలను గ్రహిస్తున్నట్లుగా ఉన్న వాటినే మెదడునకు చేరుస్తున్నాయి. క్రొత్త వాటిని సృష్టించి ఈయవు. సృష్టిలో ఉన్నవాటిని చూసి, స్పృశించి బుద్ధికి విషయాన్ని చేరవేస్తాయి. వీటినే జ్ఞానేంద్రియాలంటారు. చేతులు, కాళ్లు మొదలైనవి పనులను చేస్తాయి, కనుక వాటిని కర్మేంద్రియాలంటారు. నాల్క రుచి చూడడంతో బాటు అనగా జ్ఞానేంద్రియమే కాకుండా మాట్లాడునపుడు నాదాన్ని పుట్టించి కర్మేంద్రియంగానూ ఉంటుంది.

పంచ భూతాలున్నాయి. అవే ఆకాశం, వాయువు, అగ్ని, నీరు, భూమి. ఇవి విశ్వశక్తులు. ఇవి జ్ఞానేంద్రియాలకు ఆధారం. నాదమే ఆకాశంలో ఉంటుంది. చాలా మంది ఒక చోట. గుమిగూడినపుడు రకరకాల ధ్వనులున్నా 'ఓ' అనేది సామూహికంగా వినిపిస్తుంది. సముద్ర ఘోషలోనూ 'ఓ' ఉంది. శంఖాన్ని చెవిదగ్గర పెట్టినపుడూ ఇట్టినాదం వినిపిస్తుంది. 'ఓ' కి చుక్కబెడితే దేవ నాగరలిపిలో ఓం. ఇట్లా ఈ నాదం వినబడుతూనే ఉంటుంది. గాలిలో ఈ నాదం వినబడడమే కాకుండా గాలికి స్పర్శ గుణం ఉంటుంది కూడా. గాలి మన మీద ప్రసరింప బడినపుడు అది ఉందని తెలిసికొంటాం కదా! దానికి తోడు అగ్నికి రూపం కూడా ఉంది. కళ్లతో చూస్తున్నాం. నీటికి పై వాటికి తోడు రుచి యుంది. నాల్కపై వేసికొని రుచి చూస్తున్నాం కదా! పై వాటికి తోడు భూమికి వాసన కూఢా ఉంది. ఇందన్నీ మొలకెత్తుతాయనీ తెలుసు. ఇట్లా చూడడం, వినడం, రుచి చూడడం, స్పృశించడం, వాసన చూడడం జరుగుతోంది.

ఇట్లా ఐదు ఇంద్రియాలూ మనం అన్నిటినీ అనుభవించడానికి కారణమౌతున్నాయి. మంచి ఆహారం, మధుర సంగీతం, సువాసన, చల్లని గాలి, అందమైన చంద్రోదయ దృశ్యం. అన్ని ఈ ఇంద్రియాల వల్లనే అనుభవిస్తున్నాం. వీటికి ఆధారాలైన పంచభూతాలను భగవానుడందించాడు. అతని దయవల్ల మనం భోగాలను అనుభవిస్తున్నాం. మనంతట మనం ఒక్క బియ్యపు గింజను సృష్టించలేం. అతని దృష్టిని తిలకించి పులకించండని ఐదు ఇంద్రియాలను ప్రసాదించాడు. వీటిని అనుభవించేటప్పుడు వీటి కారకుణ్ణి స్మరించడం మన కర్తవ్యం కదా!

ఈ విషయాలను ముందుగా భగవానునకు నివేదించి మరల స్వీకరించడం, దానిని ప్రసాదంగా భావించడం మన విధి. ఇట్టి భావనతో ఉంటే మన మనస్సునకు పరిపక్వత లభిస్తుంది. ఏదీ అర్పించకుండా స్వీకరించకూడదనే భావన మనలో నాటుకోవాలి.

అంటే పంచేంద్రియాల ద్వారా స్వామికి పంచోపచారాలు చేసి స్వీకరించాలన్న మాట. చాలా ఉపచారాలున్నా ఇంట్లోగాని, ఆలయంలోగాని కనీసం ఈ ఐదు ఉపచారాలను చేయాలి. అనగా స్వామికి గంధం అర్పించుట, పువ్వులతో పూజించుట, ధూపం చూపించుట, దీపారాధన, నైవేద్యాలు అర్పించాలి. ఇందు గంధం సమర్పించడాన్ని భూమికి; పువ్వు – ఆకాశానికి; ధూపం – వాయువునకు; దీపం – అగ్నికి; నైవేద్యం – నీటికి (అమృతానికి) గుర్తులు. ఇట్లా పంచభూతాలు, పంచోపచారాలలో దాగియున్నాయి. పంచ భూతాలనుండి అన్నీ వస్తున్నాయి. పంచేంద్రియాలు అనుభవిస్తున్నాయి. దీని వల్ల జీవుడు, దేవుడు, ప్రపంచం అన్నీ ఒక్క చోట కలుస్తున్నాయి.

భగవన్నామ మాహాత్మ్యం

ధ్యానం, జపం, పూజ, యజ్ఞం, తీర్థయాత్రలున్నట్లుగానే సామూహికంగా భజన చేయడమూ అనాదిగా ఉంది. పరమాత్మలో జీవాత్మను అనుసంధానం

చేయడం కోసమే అనేక ప్రక్రియలున్నాయి. భజన పద్ధతి కూడా అందొక భాగం. గ్రామాలలో భజనలకై కొన్ని స్థలాలుండడం వల్ల చాలా కాలం నుండి ఈ సంప్రదాయం అవిచ్ఛిన్నంగా సాగుతోంది. శనివారాలలోగాని, ఏకాదశి వంటి పర్వదినాలలోగాని చాలా మంది భజన చేస్తూ ఉంటారు.

ఆలయాలలో పూజ, ధ్యానాదులున్నా భజనలలో ఉచ్చ స్వరంతో గానం చేస్తారు. స్వామి గుణాలను, నామాలను కీర్తిస్తారు. అందరూ కలసి పాడుతారు. సంఘ దృష్టితో సామూహికంగా జరిగేదిది. ఎవరి ముక్తికై వారు ప్రయత్నం చేయడమే కాకుండా ఆలయాల ద్వారా, భజనల ద్వారా, ఉత్సవాల ద్వారా సామూహికంగా కూడా ఉంటుంది. భజనలలో తాళమృదంగాది వాద్య సహకారంతో వినసొంపుగా ఉంటుంది. మనస్సు ఏకాగ్ర మవడానికీ దోహదం చేస్తుంది. రఘుపతి రాఘవ రాజారాం, హరేరామ హరేరామ రామరామ హరేహరే అనే నామ స్మరణ ద్వారా భగవానుణ్ణి తలుచుకోవడం అప్రయత్నంగా సాగుతుంది.

ఒక చోట కూర్చొని చేయడమే కాకుండా నగర సంకీర్తన కూడా చేస్తూ ఉంటారు. పర్వదినంనాడు అందరూ కలసి అన్ని వీథులు తిరిగి సంకీర్తనం చేయడం చాలా మంచిది. ముఖ్యంగా మార్గశిర మాసంలో సంకీర్తనాలు ఉంటాయి.

ఇట్టి ఆచారాలు లోపించకుండా కొనసాగించడం మంచిది. నామ సంకీర్తన లేకుండా భజన మందిరాలు బోసిపోకూడదు. ఇటీవల కాలంలో దినదినాభివృద్ధి పొందడం చూస్తూ ఉంటే శుభసూచకంగా కన్పిస్తోంది. వేద, ఆగమ, ఆచారాలు క్రమక్రమంగా లోపించే సమయంలో కనీసం ఇట్టి సంప్రదాయమైనా బ్రతికి ఉండడం హర్షింపదగిందే. అట్లాగే సత్సంగాలు బాగా పనిచేస్తున్నాయి. అట్లా భజనలూ సాగడం మంచిది.

నామసంకీర్తన భక్తి పోషకమైనది. దీనిని వ్యాప్తిలోనికి తెచ్చిన ఘనత సద్గురు బోధేంద్ర స్వామి వారికి చెందుతుంది. ఆయన పరమాత్మ సచ్చిదానంద

రూపుడైనా జగత్కల్యాణం కోసం అవతార రూపంలో వచ్చాడని, ఈ మూర్తులే సరిపోవని, హరి, శివ నామాలను ధరించి వచ్చాడని అట్టి మంగళ రూపునకు జయమగుగాక యని కీర్తించారు. అనగా భగవన్నామాలు వట్టి నామాలు కావు. మూర్తితో బాటు అవీ భగవత్ స్వరూపములే అని అర్థం వస్తోంది కదా! భగవానునకు ఎట్టి శక్తి ఉందో నామానికీ అంత శక్తి ఉన్నట్లే కదా! మహాత్ములు గానం చేసి పుణ్యం సంపాదించిన పాటలను, పద్యాలను మనం పాడితే వారు భగవద్దర్శనాన్ని పొందినట్లుగానే మనకూ అట్టి భాగ్యం కల్గుతుంది. జయదేవుడు, నారాయణ తీర్థులు, రామదాసు, పురందరదాసు, త్యాగరాజు వ్రాసిన పాటలు, అట్లే తమిళ భక్తుల పాటలు, హిందీలోని భక్తి గీతాలు, మరాఠీలోని అభంగాలు – వీటినన్నిటినీ సంప్రదాయంగా వచ్చే భజన సంగీతంలో అమర్చినవాడు, మరుదానల్లూర్ సద్గురుస్వామి. డోలోత్సవం, వసంత కేళి మొదలగు ఉత్సవాలలో పాడేవీ ఉన్నాయి. ఎట్టి శ్రమలేకుండా సంగీత శాస్త్రాభ్యాసం లేకుండా ఆనందంగా అందరూ పాడేవి. కలియుగంలో తీవ్రసాధనలు చేయడం కష్టమని, నామసంకీర్తన వలనే ముక్తిని పొందవచ్చని భాగవత గ్రంథమే చెప్పింది: కలౌ సంకీర్త్యకేశవం:

సామూహికంగా పాడే భజన పద్ధతిని అట్లా ఉంచండి. ప్రతి గృహంలో ఇంట్లో ఉన్నవారందరూ కలిసి భజనలు చేయవచ్చు కదా! దానికి ఎక్కడకో వెళ్లాలనే కష్టమూ ఉండదు కదా! పూజా మందిరంలోగాని, విడిగా గాని అందరూ కలిసి ఒక దీపం వెలిగించి చూట్టూ చేరి కొంతసేపు, భజన చేయవచ్చు కదా! నామ సంకీర్తనం చేయడమేమిటని సిగ్గుపడకండి. సంగీత జ్ఞానం లేకపోయినా, గాత్ర మాధుర్యం లేకపోయినా భక్తి కలిగియుండడమే ప్రధానం. ఆడుకొనే పాపాయి అమ్మ అంటూ తల్లిదగ్గరకు వెళ్లడం లేదా? రాగయుక్తంగా ఆ మాటను పలుకుతున్నానా, అని ఆ పిల్ల ఆలోచిస్తోందా? అట్లాగే మనమూ

లోకమాతను పిలవాలి. ఎన్ని పనులు చేస్తున్నా రామాది నామాలను కీర్తించాలి. అదే మన అసలైన సంపద. అందువల్ల సుఖశాంతులు కల్గుతాయి.

నమస్కారం

పరమేశ్వరుని ఉద్దేశించి ఒక చక్కని శ్లోకం ఉంది. దానిని వ్రాసినవాడు గొప్ప భక్తుడు, గొప్ప విద్వాంసుడైన అప్పయ్య దీక్షితులు.

ఓ త్రిపుర సంహార! నేను రెండు తప్పులు చేసినందులకు క్షమించుమయ్యా! ఏమిటో తప్పులంటావా? గత జన్మలో నీకు నమస్కారం పెట్టియుండను. వచ్చే జన్మలో పెట్టే అవకాశమూ లేదు. నేను గత జన్మలో నమస్కారం పెట్టలేదని నాకెట్లా తెలిసిందంటావా? నమస్కారం పెట్టకపోవడం వల్లనే నాకీ జన్మ వచ్చింది కదయ్యా! గత జన్మలో పెట్టియుంటే ఏనాడో ముక్తి లభించియుండేది. ఈ జన్మే వచ్చి యుండేది కాదు. వచ్చే జన్మలో చేయలేనని అన్నాను. ఎందుకంటావా? ఈ జన్మలో నీకు నమస్కరించేను కదయ్యా! కనుక ఇక జన్మ ఉండదు. ఇక జన్మే లేనపుడు నమస్కారం పెట్టడం కుదరదు కదా! కనుక గత జన్మలో పెట్టనందులకు, రాబోవు జన్మలో ఆ అవకాశం లేనందులకు ఈ రెండు తప్పులను క్షమించు తండ్రీ! అని వేడుకొన్నారు.

ఏ సందేశమిచ్చింది ఈ శ్లోకం? భగవానునకు హృదయపూర్వకంగా నమస్కారం పెట్టాలనే. అపుడే జననమరణ ప్రవాహం నుండి అతడు తప్పిస్తాడు. ఇదేదో కవితా చమత్కారం కోసం వ్రాసేదని భావించకండి. భక్తిలో మునిగి వ్రాసిన శ్లోకమిది. కనుక శరణాగతిని పొంది హృదయపూర్వకంగా నమస్కరించాలి. సద్గతి తప్పక కల్గుతుంది. సందేహించనవసరం లేదు.

(ఈ దిగువ విషయం 'నమోనమః'లో స్వామివారు చర్చించారు. చూ. అమృతవాణి-2)

నమస్కారం ఎట్లా చేయాలి? దండ నమస్కారం చేయాలి. చేతి నుండి జారిన దండం, చేతిని విడిచి నేలమీద పడిపోతుంది. అట్లాగే ఈ శరీరం నాది కాదు, ఇది భగవానునిదే అనే భావనతో నేల మీద పడడమే దండ నమస్కారం. మన శరీరం కర్ర వంటిదే. దీనిని ఎత్తడం, నిటారుగా నిలబడడం చేసేది లోనున్న శక్తియే. నేను దీనిని నిలుపుతున్నానని, దీనితో పనులు నిర్వహిస్తున్నాననే అహంకారాన్ని విడిచి దండం మాదిరిగా నేల మీద పడాలన్న మాట. అదే దండ నమస్కారం. జ్వరంలో మన శరీరం నిలబడలేదు, నడవలేదు. అసలు పుట్టుకే ఒక పెద్ద జ్వరం. ఇట్టి జ్వరం ఎందుకు వచ్చిందో తెలిసికొని, ఇది మరల రాకుండా ఉండడం కోసం దండం మాదిరిగా భగవానుని ముందు మోకరిల్లాలి.

నేను చేస్తున్నాననే అహంకారం పోయినపుడు అదే సరియైన నమస్కారం. అది అన్నివేళల చేయవలసిన నమస్కారం. ఆ అనుభవం చటుక్కున రాదు. అయినా ఆలయంలోనైనా వినయంతో నమస్కారం చేయగలగాలి. అది దేనిని సూచిస్తుంది. నేను నా బాధ్యతనంతా నీ మీద నుంచాననే. కొంత బాధ్యత మనకుందని ఎప్పుడైతే భావించామో అపుడు భగవానుడు తన బాధ్యతను తగ్గించుకొంటాడు. ఇక్కడ అసంపూర్ణత్వం కన్పిస్తోంది కదా! కనుక అంతా నీ బాధ్యతే అనగలగాలి. మంచి జరిగినా, చెడు జరిగినా అంతా నీ సంకల్పాన్ని అనుసరించే జరుగుతుందని భావించగలిగితే సర్వార్పణ భావంతో ఉండగలిగితే అపుడతడు మనపై దయ చూపిస్తాడు. మన భారాన్నంతటినీ తానే స్వీకరిస్తాడు. ఇక మన నెత్తిమీద బరువుండదు.

భక్తి

ఒకానొక మహాశక్తి యొక్క తెలివే (మహత్తు) ఈ విశ్వం, సమస్త జీవులుగా కన్పిస్తోంది. ఈ కన్పించడం ఎప్పుడైతే పోయిందో మిగిలేది మహత్తే, ఆ సమష్టి బుద్ధియే. ఆ స్థితిలో ఏ క్రియలేదు. విశ్వంగా కనబడడం వల్లనే,

ప్రాణులుగా కన్పించడం వల్లనే క్రియలన్నీ ఉన్నాయి. వీటిని దాట గలిగితే ఆ మహత్తుతో ఐక్యం కావచ్చు. అదే బ్రహ్మ సాక్షాత్కారం. అదే అపరోక్ష సాక్షాత్కారం. అదే జీవాత్మ యొక్క సహజమైన, మార్పులేని స్థితి.

ఇట్లా గుర్తించకుండా ఈ విశ్వం అంతా ఈ జీవులందరూ నిజమని భ్రమిస్తూ ఉంటాం. ఇట్లా భావించడాన్ని మాయయని అంటారు. ఈ మాయా ప్రపంచం రకరకాల చమత్కారాలను చేస్తూ ఉంటుంది. ఇది నడవడానికీ కొన్ని నియమాలున్నాయి. వాటి ప్రకారం ఇది నడుస్తూ ఉంటుంది. నిష్క్రియమైన బ్రహ్మము మాయవల్ల విశ్వంగా కనబడి సృష్టి స్థితి సంహారాలను చేస్తున్నట్లుగా ఉంటుంది. ఏ పని లేనపుడు బ్రహ్మమని, పనులున్నపుడు ఈశ్వరుడని అంటాం. నిష్క్రియ నిర్గుణ స్థితినే బ్రహ్మమని, క్రియా సహితమైనపుడు ఈశ్వరుడని, భగవానుడని, స్వామియని ఎవరిని అంటామో అది అంతా సగుణ బ్రహ్మానుద్దేశించినదే.

మనం నిరంతరం ఏవో పనులు చేస్తూ ఉంటాం. ఏ పని చేయకపోయినా మనస్సుతోనైనా ఆలోచించకుండా ఉండలేం. ఈ ఆలోచన కూడా ఒక పనే. మనస్సులో భావాలెప్పుడుదయించవో అనగా భావాతీత స్థితియే బ్రహ్మము. కాని క్షణకాలం భావాలు లేకుండా చేయలేం. ఎట్లా ఈ మనస్సును ఆపడం?

ఈ అభ్యాసం భక్తివల్లనే సాధ్యం. క్రియా రహితమైన స్థితిలోనే బ్రహ్మానుభవం కల్గుతుంది. ఆ బ్రహ్మమే ఈశ్వరుడై అన్ని పనులూ చక్కబెడుతున్నాడు కదా! కనుక అన్ని పనులను ఆ ఈశ్వరునివైపు మళ్లించగలగాలి.

నమస్కరించుట, పూజ మొదలైనవి శరీరంతో; స్తోత్రపఠనం నాల్కతో; ధ్యానం మనస్సుతో ఇట్లా అన్ని పనులను అతనివైపే మళ్లించగలగాలి. వీటిని అట్లా మళ్లించితే, ఈశ్వరుడంగీకరిస్తాడు. బ్రహ్మ జ్ఞానం మనలో కల్గిస్తాడు. ఇట్లా ఏ పని చేసినా వానికి చెందిందే అని, వానికై చేయడాన్ని భక్తియని అంటారు. ఇది అవిచ్ఛిన్నంగా సాగాలి. అనగా నిరంతరంగా ప్రేమతో ఇట్లా పనులు చేయడమే భక్తి.

ప్రపంచంలో మంచి-చెడు; అందం-అందవికారం; సంతోషం-దుఃఖం అన్నీ బ్రహ్మము నుండి వచ్చినవే. ఎప్పుడైతే జీవాత్మ, పరమాత్మతో ఐక్యమయ్యిందో పై ద్వంద్వాలలో తేడా ఏమీ కనబడదు.

మనమున్న పరిస్థితులలో అట్టి స్థితి పట్టుబడడం కష్టమే. ఈ దశలో ఈశ్వరుని బహు సుందరమూర్తిగా, ఆనంద స్వరూపునిగా భావించి ప్రేమించ గలగాలి. ఈ దశలో నిర్గుణుడైన పరమాత్మను ధ్యానించలేం. కాని అన్ని గుణాలూ గుణరహితుడైన బ్రహ్మమునుండే వచ్చాయి. రంగులేని సూర్యకాంతి, ఒక ఫలకం గుండా అనగా చదునైన ప్రక్కలు గల కడ్డీ (Prism) గుండా ప్రసరించినపుడు ప్రతిబింబం ద్వారా భిన్నమైన రంగులను చూడడం లేదా; అట్లాగే మాయ అనే అద్దం గుండా నిర్గుణ బ్రహ్మం ఈశ్వరుడవుచున్నాడు. గుణాలు కలిగిన వానిగా కన్పిస్తున్నాడు. గుణ రహితమైనది ప్రాథమిక దశలో పట్టుబడదని చెప్పాను. కాని గుణాలు కలిగినవానిని చింతించగలము. చెడ్డ గుణాలను భావిస్తే అధోగతే. ప్రపంచంలో మునిగిపోతాం. కనుక మంచి గుణాలనే భావించగలగాలి. కనుక పరమేశ్వరునకు ఒక రూపం ఉందని, జీవం ఉందని, కల్యాణ గుణాలతో ఉంటాడని భావించాలి. అట్లా భావిస్తే అతనికున్న కల్యాణ గుణాలూ మనకు సంక్రమిస్తాయి. అంతా భావనయే.

మనం నిరంతరంగా, తీవ్రంగా దేనిని భావించినా అదే మనమౌతాం. దీనిని మనస్తత్వ శాస్త్రజ్ఞులూ అంగీకరించారు. కనుక దోషాలులేని, దయా సముద్రుని నిరంతరం చింతించగలిగితే మనమూ ప్రేమమూర్తులం కాగలం. అంతా ప్రేమమయమై చెడ్డ పనులు చేయడానికే అవకాశం ఉండదు. పాపకృత్యాలు పాపచింతనలు లేకుండా ఉండాలంటే భక్తికి మించిది లేదు. ఇందువల్ల భక్తి సామ్రాజ్యంలోనే అడుగుపెట్టమనీ అనడం లేదు. ఇట్టి భావన మన సహజస్థితికి తీసికొని వస్తుంది. అదే మన లక్ష్యం. మనస్సు ఎప్పుడైతే ఆగిపోయిందో ఆత్మకాంతి ప్రస్ఫుటమై మనస్సులోని సమస్త కర్మవాసనలూ

మటుమాయమై పోతాయి. కనుక పాపాన్ని సమూలంగా పెకలించడానికీ భక్తి యొక్క అవసరం ఎంతైనా ఉంది.

భక్తి, దేని కోసం?

ప్రతి కార్యానికి ఒక కారణం ఉంటుంది. నేటి భౌతిక శాస్త్రమూ దీనినంగీకరిస్తుంది. ప్రపంచం అంతా ఒక క్రమ పద్ధతిలో నడుస్తోంది. ఇట్లా నడవడానికి ఒక సమష్టి మనస్సు (Cosmic Mind) కారణం. అతని చేతిలో నియమాలున్నాయి. మనమూ మామూలు జీవితంలో కార్యకారణ సంబంధాన్ని అడుగడుగునా చూస్తున్నాం. ఏ పని చేసినా తగిన ఫలం వస్తోంది. మంచి పనులు చేస్తే మంచి ఫలం, చెడ్డ పనులు చేస్తే చెడ్డ ఫలాలూ సిద్ధిస్తున్నాయి. భావానుగుణంగా ఫలప్రాప్తి. ఈ మంచి చెడ్డ ఫలాల నిచ్చేవాడొకడుండాలి. అనగా ఫలదాత. అతడే తన మహాశక్తి ద్వారా జగన్నిర్వహణను కొనసాగిస్తున్నాడు. అతణ్ణి ఏ పేరుతో పిలిచినా సరే!

మనలో మనస్సెంత వరకూ ఉందో అంతవరకూ ఆందోళనలు తప్పవు. మంచిచెడులు రెండూ ప్రాప్తిస్తూ ఉంటాయి. పుణ్యపాపాలను రెంటినీ చేస్తున్నాం. పాపాలవల్ల బాధలు కల్గిస్తాడు. సాధారణంగా ఈ బాధల నుండి విముక్తికై ప్రార్థిస్తూ ఉంటాం. ఇట్లా భావించడమే భక్తియని సాధారణంగా భావిస్తూ ఉంటారు. భగవానుడు కోరితే బాధలు మనకుండవనే మాట వాస్తవం. కాని అతడట్లా కోరడానికి మనకున్న అర్హత ఏమిటి? అందువల్లనే మంచి చెడులకు తగిన ఫలాలనందిస్తాడు. అంటే మన కర్మలను బట్టే. కనుక మనకెట్టి మానసిక స్థితి ఉండాలి? కష్టాలు వచ్చినా తట్టుకొనే స్థితినిమ్మని ప్రార్థించాలి. అయినా ఇట్టి వేడికోలూ సరియైన భక్తియని అనిపించుకోదు.

మనం, మన బాధలను అతని ముందు ఏకరవు పెడుతున్నామంటే అతనికి ఇవి తెలియవని అనుకొంటాం. కాని అవి అతనికి తెలియవా? ఈ కష్టాలను తొలగించు, నా మానసిక స్థితిని మార్చు, అని అడిగినా అవి అతనికి తెలియవనే

గట్టి నమ్మకంతో ఉంటాం. అంటే అతని దయను తక్కువ చేసి చూపిస్తున్నాం. ఇది భక్తి అవుతుందా?

అయితే అట్లా విన్నవించుకోవడం వల్ల మన బాధలను కొంత ఉపశమనం కలిగి, కొంత బరువు తీరినట్లుగా కనిపిస్తోంది కదా! ఏదో కొద్దిపాటి శాంతి లభిస్తోంది. కొంత వినయం కల్గుతోంది. అదైనా కొంతవరకు చాలు. మనం అతణ్ణి తక్కువగా అంచనా వేయడాన్ని క్షమిస్తాడు. మన కర్మల భారాన్ని తొలగించగలడు. కాని, ఈ మానవ జీవితంలో ఒక సమస్య తీరినా అంతటితో ఆగిపోతోందా? మరొకటి పొంచి యుంటుంది. దీనికి అంతం అంటూ ఉందా?

కనుక భక్తి అంటే శరణాగతియే. జరిగేవి జరుగుతాయనే దృఢసంకల్పం ఉండాలి. తనకోసం తానేమీ కోరకుండా ఉండగలిగితే దుమ్ములేని అద్దంలా అతని మనస్సు ప్రకాశిస్తుంది. అప్పుడే శాంతి, నా కోసం నేనేమి అడగనంటూ ఒకరికి ఒకరు శరణాగతిని పొందినా బాధలుండవు. అది భార్య, భర్తకైనా; శిష్యుడు గురువుకైనా సరే అట్టి అంకిత భావం, సర్వార్పణ భావం మోక్షానికి దారి చూపిస్తుంది. పురాణాలలో భార్య, భర్తకు; శిష్యుడు గురువునకు అంకితమైన ఘట్టాలున్నా, నిత్య జీవితంలో లోపాలున్న వారిపట్ల శరణాగతి కుదురుతుందా? మనలోపాలూ వారిలో కన్పిస్తున్నాయి కదా! సరియైన సద్గురువులభిస్తే అట్టిపై శరణాగతి చూపించగలిగితే, అన్నీ నీవే, అంతా నీవే, ఏదీ నాది కాదు అని త్రికరణ శుద్ధిగా భావించగలిగితే శాంతి లభిస్తుంది.

భక్తినెందుకు చూపించాలో మరొక మాట చెబుతాను. జీవితంలో ప్రేమ లేకుండా ఉంటే మనకు శాంతి ఎక్కడ? అయితే ఈ ప్రేమ ఫలం కనబడడం లేదు. మనం ఎవరిని ప్రేమించినా ఏదో ఒకనాడు వియోగం కల్గుతోంది. ఏ ప్రేమ సంతోషాన్ని ఇంతకు ముందు ఇచ్చిందో అదే దుఃఖాన్నిస్తోంది. ఈశ్వరుడు ఒక్కడే శాశ్వతుడు. కనుక మన ప్రేమను అతని వైపు మళ్ళించ గలిగితే అతడు శాశ్వత సుఖాన్నిస్తాడు. నిష్కలంకమైన ప్రేమను చూపగలిగితే అంతా అతనిగానే

కన్పిస్తుంది. అట్లా కాకుండా ఒకని పట్ల ప్రేమ చూపించితే, అది ద్వేషంగా కాలాంతరంలో మారవచ్చు. కనుక అంతటా నిండిన వానిపట్ల ప్రేమ చూపించగలగాలి. అంతటా నిండిన వాడని ఎప్పుడైతే భావించామో ఇక ఎక్కువ తక్కువలు కనబడవు. కనుక ప్రేమలేని జీవితం నిష్ఫలం.

భక్తివల్ల ప్రపంచ సమస్యలు క్రమక్రమంగా తొలగిపోతాయి. మన బుద్ధి వికసించి, ఏ సమస్యలను పట్టించుకోని స్థితి ఏర్పడుతుంది. అటూ ఇటూ తిరిగే మనస్సును కట్టగలం. ఏకాగ్రత లభిస్తుంది. తద్వారా సుఖశాంతులు వర్ధిల్లుతాయి. ఇట్లా శాశ్వతమైన అఖండమైన ప్రేమను పరమేశ్వరుని పట్ల చూపించగలిగితే మన కర్మలూ క్రమక్రమంగా క్షీణిస్తాయి. జనన మరణ భ్రమణం నుండి స్వామి, మనలను తప్పిస్తాడు. అతడే నేనయ్యాననే పరిపక్వమైన బుద్ధి మనకు కలిగినపుడు అట్టి మానసిక స్థితిని గమనిస్తాడు. అప్పుడు అనుగ్రహవర్షాన్ని కురిపిస్తాడు. ఇట్లా అనేక కారణాల వల్ల భక్తిని అభ్యసించాలి.

ఏ కారణమూ లేని భక్తిని గురించి ఆలోచించండి.

కారణం లేకుండా భక్తిని అభ్యసించుట

అనేక కారణాల వల్ల భక్తినభ్యసించినా ముక్తి కోసం భక్తియనుట ఉత్తమమైనది. ఆదిశంకరుల అభిప్రాయం ప్రకారం జ్ఞానం వల్లనే తిన్నగా మోక్షం లభిస్తుంది. కేవలం ఈశ్వరారాధన వల్ల కాదని సిద్ధాంతం. ముక్తి అంటే ఏమిటి? విడుదల కావడం. దీనినే తమిళంలో వీడు అంటారు. దేని నుండి విడుదల? ప్రపంచ జీవితం నుండి విముక్తి. అనగా పుట్టుకలు, చావుల నుండి, సహజ రూపాన్ని గుర్తించడం ముక్తి. మనస్సున్నంత వరకూ సంసార బంధంలో చిక్కుకోవడం తప్పదు. మనస్సు అణగినపుడు మాత్రమే ఇది సిద్ధిస్తుంది. ఎంతవరకూ నామ రూపాలున్నాయో అంతవరకూ మనస్సు ఆకర్షింపబడుతూ ఉంటుంది. మనం భక్తిని అభ్యసిస్తే ఈశ్వరుని రూపం,

ఈశ్వర గుణాలే కన్పిస్తాయి. అట్టి భక్తిలో కూడా సంయోగం, వియోగాలుంటాయి. ఎప్పుడు మనస్సు పూర్తిగా లీనమై పోయిందో అప్పుడట్టివి అనుభవంలోకి రావు. అనగా మార్పులేని ఆనంద స్థితి రావాలన్న మాట. అఖండ శాంత స్థితి. ఏది ఆత్మ, ఏది మనస్సునకు అధారమని అన్వేషించేది జ్ఞాన మార్గంలోనే. ఇట్లా అన్వేషణలో మనస్సు లీనమైనప్పుడు చివరగా ఈశ్వరకృప వల్ల మనస్సు మటుమాయమైపోతుంది. ఆత్మస్వరూపం అవగతమౌతుంది. దానినే ముక్తియని అంటారు.

భక్తిని అభ్యసించిన కొలదీ, ముక్తికి చేరువౌతావని, ముక్తి లభిస్తుందని గోపాలకృష్ణ భారతి కీర్తించాడు. అంటే ఇతరులన్నట్లు ఏ కైలాసానికో, ఏ వైకుంఠానికో వెడతావని అనలేదు. మనమే మనుకొంటాం? ఏ దేవతను ఉపాసిస్తే అతదుండే కైలాసానికో, వైకుంఠానికో వెడతామని భావిస్తాం. దీనినే ద్వైత విశిష్టాద్వైతులు నొక్కి చెప్పారు. అయినా ఆలోకాలలో కూడా భక్తుడు వేరు, భగవానుడు వేరనే భావన ఉండనే ఉంటుంది. ఈశ్వరానుభవమని, తాను భవిస్తున్నానని, తన కంటే మరొకడున్నాడనే భావనలు అక్కడా ఉంటాయి.

కాని అద్వైతముక్తి పై దానికి భిన్నం. గోపాలకృష్ణ భారతి, అద్వైతి. శంకరులు కూడా జ్ఞానమే ముక్తినొసగేదని అన్నారు. అట్లా చెప్పినా ఆ శంకరులే అనేక స్తోత్రాలను వ్రాసేరు. అనేక క్షేత్రాలను దర్శించారు. అనేక తీర్థాలలో మునిగారు. షణ్మతస్థాపన చేశారు. ఈ మఠంలోనూ గంటల కొద్దీ పూజ జరుగుతూ ఉంటుంది.

ఆత్మ స్వరూపం మనస్సునకు అవగతం కాదు. అసలు మనస్సే ఆత్మ నుండి వచ్చింది. అట్టిది ఆత్మను కొలవడమేమిటి? మనస్సు పోయినప్పుడే కదా ఆత్మ ప్రకాశం. అయితే మనస్సు నానా తిరుగుళ్లు తిరుగుతోంది. దీనిని తిరగకుండా చేయాలి. అందువల్ల భక్తిని ఒక సాధనంగా ఇక్కడ చెప్పారు. ఈశ్వరునిపై ఎప్పుడు లగ్నమైందో మనస్సు అతనితో కలుస్తుంది. ఆ లగ్నం

కావడం ఎప్పుడు? ఒక కుండలో నూనెపోసి దానికొక చిల్లుపెడితే నిరంతరం ప్రవహించునట్లుగా సంతత ధార ఉండాలి. (తైలధారవత్ అవిచ్ఛిన్న ధారా ప్రవాహమని విద్యారణ్యులు, పంచదశిలో అన్నారు). ఎప్పుడట్టి ఏకాగ్రత సిద్ధించిందో మనస్సు తెరమరుగౌతుంది. ఇట్లా భక్తి, జ్ఞానానికి దోహదం చేస్తుంది. కనుక భక్తిని ఒక మెట్టుగా శంకరులు భావించారు.

ఆత్మసాక్షాత్కారమనేది శరీరం పోయినపుడు లభించేదికాదు. ఆత్మ ఎప్పుడూ ఉండేదే. అది లేకపోతే మన జీవితయాత్ర సాగుతుందా? కనుక అట్టి ముక్తస్థితిని శరీరం ఉండగానే సాధించాలి. ఇట్లా సాక్షాత్కరించుకొని మన మధ్యలో తిరిగే వానిని జీవన్ముక్తుడని అంటాం.

అట్టి బ్రహ్మజ్ఞానులలో కూడా ఎందరో భక్తులున్నారు. అంటేవారు ఒక దేవత రూపంలో ఉన్న బ్రహ్మమును అధికంగా ప్రేమిస్తారు. అట్టి వారి భక్తికి హేతువంటూ కనబడదు. అట్టి భక్తిని అభ్యసించడం వల్ల వారు పొందేది ప్రత్యేకంగా ఏదీ ఉండదు. ఎందుకంటే వారేనాడో ముక్తస్థితిలో ఉన్నారు. అతీతమైన దానిని అందుకొన్న తర్వాత,ఇంకా అందుకోవలసిందే ముంటుంది? అయినా బ్రహ్మ యొక్క లీలలను పరికిస్తూ ఉంటారు. ఆనందిస్తారు. ఏదీ కోరకుండా ప్రేమను చూపిస్తారు. జీవన్ముక్తుడు, ప్రత్యేకంగా ముక్తి కావాలని కోరడు. ఇదే అహైతుకీభక్తి. శుకుడట్టి బ్రహ్మజ్ఞాని బ్రహ్మనిష్ఠుడు. హేతువంటే కారణం. కారణంలేనిది అహేతుకం. అదే ముక్తికి సోపానం.

ముక్తికి ముందు భక్తి ఎట్లా ఉంటుంది?

ఒక తండ్రియున్నాడు. అతనికొక ఆడపిల్ల. ఆమెకు యుక్త వయస్సు వచ్చింది. ఆమెను ఒక అయ్య చేతిలో పెట్టాలి. వరుడు దొరికాడు. వివాహం నిశ్చయమైంది. వివాహమైన తరువాత అల్లుడు ఈమెను తన ఇంటికి తీసికొని వెళ్లబోతున్నాడు. కన్యాదానం చేసే సమయంలో తండ్రి మనస్సు ఎట్లా

ఉంటుంది? మంచి సంబంధం దొరికిందని ఒక మూల సంతోషిస్తాడు. ఆ సంతోషాన్ని అణచుకొని ఆమె అత్తింటికి వెడుతున్నపుడు బావురుమంటాడు. సంబంధం వెదికినవాడు, పెళ్లి చేసినవాడూ ఇతడే. అప్పులు చేసైనా వివాహం చేసాడు. అయినా వెళ్లిపోతోందని బాధ.

ముక్తికై అన్వేషించే వానిని ముముక్షువని అంటాం. ఈ స్థితి భక్తివల్లనే. అతనికి కొద్దికాలంలో ముక్తస్థితి రాబోతుంది. అట్టి పరిస్థితిలో ఒక ధర్మసంకటానికి లోనౌతాడు. అది కన్యాదానం చేసే తండ్రి స్థితి వంటిది. తండ్రి వివాహ ప్రయత్నాలు చేసినట్లుగా ముక్తికై ధర్మకృత్యాలను లోగడ చేసాడు. భక్తి మార్గాన్ని అనుసరించాడు. దానివల్ల చిత్త శుద్ధి ఏర్పడింది. ఇక పరమాత్మలో లీనమయ్యే స్థితి ఏర్పడింది. ఎప్పుడైతే అతని మనస్సు లీనమైందో ఇక భగవంతుడూ లేదు, భక్తి లేదు. కన్యాదానం చేసేటపుడు తండ్రి కన్నీళ్లు పెట్టుకొన్నట్లుగా ముముక్షువు కూడా తన మనస్సును అర్పించేటపుడు దుఃఖపడతాడు. ఈ బాధనొక కవి అందంగా వివరించాడు.

"భస్మో ద్ధూళన భద్రమస్తు భవతే"

అనగా పరమేశ్వరుడు నా భక్తికి సంతోషించి అతనిలో కలుపుకొన బోతున్నాడు. ఇక నుండి విభూతిని పూసుకోనవసరం లేదుకదా! రుద్రాక్షలు ధరించడం ఉండదు కదా! మీరు వెళ్లిరండి, మీకు మంగలమగుగాక! ఓ భక్తి మార్గమా? నీకూ వీడ్కోలు చెబుతున్నా. నేను మోక్షమనే మహామోహంలో కూరుకొని పోయాను. ఆమోహం మిమ్ములనన్నిటినీ దూరంగా ఉంచేది. ఇంత వరకూ భక్తినాకానందాన్నిచ్చింది చాలు.

మోక్షం, మోహాన్ని పోగొట్టేది. కాని ఇట్టి వానికి మోక్షమే మోహంలా కనబడింది. భక్తి మొదలగు వాటిని విసర్జిస్తున్నాడు. అట్లాగే కృష్ణ కర్ణామృతంలోనూ ఉంది. భక్తి పరిపక్వమైతే కర్మమార్గం నుండి దూరమై పోతాడు.

"సంధ్యావందన భద్రమస్తు భవతే..." అని కీర్తించాడు.

లీలాశుకుణ్ణి కృష్ణభక్తి ఆవరించి సంధ్యావందనం, పితృతర్పణం వంటి చేయవలసిన కర్మల నుండి దూరం చేసింది. వాటికి మంగలం పలుకుతున్నాడు.

ముందుగా వైదిక కర్మలను చేసేటప్పుడు వీటికి ఫలం ఉంటుందా? ఉండదా? అనే భావం లేకుండా చేసి తీరాలి. ఇట్లా చేస్తే చిత్తశుద్ధి ఏర్పడుతుంది. మురికి ఎప్పుడైతే పోయిందో భగవానుని వైపు మనస్సు మళ్లుతుంది. ఇట్టి భక్తి రెండవ మెట్టు. భక్తి పరిపక్వమైతే జ్ఞానం లభిస్తుంది. ఇది చివరి మెట్టు.

కాని మనంతటమనం కర్మ, భక్తులను విడిచి పెట్టకూడదు. పండిన పండు తొడిమ నుండి రాలేటంత వరకూ అనగా జ్ఞానోదయ పర్యంతమూ వీటిని మానరాదు. ఆ భక్తి, కర్మలు వాటంతట అవే మనలను విడిచిపెట్టే యాలి.

భక్తిని విడిచి ముక్తికై సాధన చేయకూడదు కూడా. భక్తిని అనుసరిస్తే అదే మార్గాన్ని చూపిస్తుంది. ముక్తికి బాటలు వేస్తుంది. కనుక ముక్తికై ఆరాటపడడానికి ముందు భక్తినే ఆశ్రయించాలి. భక్తినిమ్మని ప్రార్థించాలి కూడా. భక్తి మార్గంలో పయనిస్తున్న కొద్దీ ముక్తి అదే వస్తుందనే పై గోపాలకృష్ణ భాగవతార్ గారి మాటలు శిరోధార్యం.

నాది నాకిమ్ము

ఒక భక్తుడు పూజ చేద్దామని కూర్చున్నాడు. అతనికొక సందేహం వచ్చింది. ఈశ్వరుణ్ణి ఇట్లా అడగడం మొదలుపెట్టాడు. స్వామీ! నేనేమో పూజ చేద్దామని కూర్చున్నా. అయినా ఏదో తప్పు చేస్తున్నట్లనిపించిందయ్యా! నేను నీకు ఉద్ధరణి నీళ్లతో అర్ఘ్యమియ్యడమా? ముల్లోకాలను ఆక్రమించిన పాదాలకా? నేనీ వస్త్రాన్ని అర్పించడమా? దిగంబరునకు, అనగా అన్ని దిక్కులా వ్యాపించిన నిన్ను వస్త్రంతో కప్పడమా? పోనీ, నీకు సాష్టాంగ నమస్కారం చేద్దామంటే

అక్కడా లోపం కన్పిస్తోందయ్యా! ఒక వైపు తిరిగి నమస్కరిస్తే మరొక వైపున కాళ్లను చూపించినట్లౌతుంది. ఏ దిక్కున నీవు లేవు? ఏవో పువ్వులతో పూజ చేద్దామంటే సర్వాంతర్యామినెట్లా పూజించేది? ఎక్కడో ఒక్క చోటే ఉండవు. ఏదైనా ఫలానాది అడుగుదామంటే నేను అడుగబోయేది ఇంతకు ముందు నీకు తెలియదని అనడం వంటిదే. నా ప్రార్థన, నీ అనంత శక్తిని శంకించినట్లే. నీవే నేనయ్యానని తెలియక, పొగడడం వల్ల నిన్ను తక్కువ చేసినట్లౌతుంది కదా! అంతటా ఉన్నవానిని, అన్నీ తెలిసినవానిని ఏమని, ఎంతని అడగడం ఏమిటి? నీవు సచ్చిదానందరూపుడవు. నీకంటె వేరైనది ఏదీ లేదని వేదాలు ఘోషిస్తున్నాయి. అయినా ఏవో లోపాలతో ఉంటున్నా. నీవూ, నేనూ ఒకటని వేదాలు చెప్పినా ఏవో లోపాలు తరుముతున్నాయి నన్ను. నేను నీవంటే భిన్నుడనే భావనను తొలగించు. తొలగించగలిగితే నీవు, అన్నీయని, నీవే నేననే భావన కల్గుతుంది నాలో. అనగా అన్నీ నేననే భావన రానీ! ఏవో అవి కావాలని, ఇవి కావాలని నిన్ను అడగడంలేదు. నాది నాకిమ్ము. (స్వ స్వరూపాన్ని ప్రసాదించు) అని ప్రార్థించాలి. అందుకే సదాశివ బ్రహ్మేంద్రులు శివమానసిక పూజా స్తోత్రంలో:

మహ్యందేహి చ భగవాన్

మదీయమేవ స్వరూపమానందం

అనగా సహజ రూపమైన ఆనందాన్ని ప్రసాదించుమని అన్నారు.

మనమేం చేస్తున్నాం? నిజరూపాన్ని విస్మరించాం. ముసుగుతో కూడియున్నాం. మనకు దగ్గరవారిని విడిచినపుడు ఎంతో బాధపడతాం. కాని స్వరూపాన్నే మనం విస్మరించడం వల్ల ఎంత బాధపడాలో ఆలోచించండి. మన నిజమైన ఆనందంలో ఎప్పుడు లీనమౌతామని తహతహలాడగలగాలి. పరమాత్మతో కూడాలనే ఆందోళన ఉన్నప్పుడే నిజమైన ప్రేమ పెల్లుబుకుతుంది. అట్టి ప్రేమనే భక్తియని యంటారు.

దీనికై పూజ, ఆలయాల సందర్శనం మొదలు మొట్టమొదట సాగాలి. ప్రపంచ వ్యవహారాలలో మునిగి తేలేవారికి పరమాత్మను చింతించడానికై తప్పక ఉపకరిస్తాయి. ఇట్టి స్థితిలో స్వామి ఆలయంలోనే ఉండడు, అంతటా ఉంటాడనే భావన గాని యుండకపోవచ్చు. అతడు మూల విగ్రహంలో ఉన్నాడని ఇట్టి దశలో భావించినా తప్పులేదు. ప్రసాదం తినివేసి ఏ స్తంభాలకో చేతులను పులుముతూ ఉంటారు. అరెరె! స్వామి లోపల ఉన్నాడు, మనమీ పనిని చేస్తున్నామేమిటని భయం పుడుతుంది. కనుక దేవుడులేదని అనడం కంటే ఆ మాత్రం భయమున్నా చాలు. అట్టి భయభక్తులే మనలను క్రమక్రమంగా ఉన్నతులుగా తీర్చిదిద్దుతాయి. రానురాను అంతటా స్వామి ఉన్నాడనే భావన కల్గుతుంది. రానురాను అనుభవం పాకాన పడిన కొద్దీ నాది నాకిమ్ము అని అడుగుతాం. అనగా స్వస్వరూపాన్ని గుర్తించేటట్లు అనుగ్రహించుమని ప్రార్థిస్తాం. జ్ఞానాంబిక అట్టి అనుగ్రహాన్ని భక్తులపై ప్రసరించుగాక!

శంకరుల అభిప్రాయం - భక్తి లక్షణాలు

ఈశ్వరుణ్ణి భక్తితో సేవించి, ఇద్దరూ ఒక్కటే అని చింతిస్తూ, అభిన్నులని గాఢంగా భావిస్తూ ఉండే అద్వైత జ్ఞానులెందరో ఉన్నారు. మధుసూదన సరస్వతి, అప్పయ్య దీక్షితులు, సదాశివ బ్రహ్మేంద్రులు, భగవన్నామ బోధేంద్రులు మొదలైనవారు జ్ఞానులై యుండి భక్తి సామ్రాజ్యంలో ఓలలాడేవారు. నిర్గుణ బ్రహ్మమునకు, కల్యాణ గుణాలతో ఉన్న సగుణ బ్రహ్మకు భేదాన్ని చూడలేదు. మధుసూదన సరస్వతి ఇట్లా అంటారు: ఏది నిర్గుణము, ఏది నిష్కలమో దోషరహితమో దానిని యోగులు ధ్యానించనీయండి. కాని నేను నీలమేఘశ్యాముడైన, యమునా నదీ సైకతాలలో విహరించే గోపాలకృష్ణుని ధ్యానిస్తాను. అన్ని రూపాలూ పరమేశ్వరుని రూపాలే, అంతా ఒక్కటే అని జ్ఞానులు భావిస్తారు. వారు జ్ఞాన నిష్ఠులైనా ఏదో ఒక మూర్తిపై

మక్కువ కలిగియుంటారు. అనగా భక్తి తాత్పర్యంతో కూడి యుంటారు. చిన్నతనంలోనే వారి కట్టి ప్రీతి ఉదయించి యుండవచ్చు.

శంకరులే దేవతను నుతించినా అందరినీ బ్రహ్మముగానే భావించి స్తోత్రాలు చేసారు. శివానందలహరిలో చాలా అందంగా భక్తిని నిర్వచించారు:

అంకోలం నిజబీజసంతతి రయస్కాంతోపలం సూచికా

సాధ్వీనైజవిభుం లతాక్షితిరుహం సింధుస్సరిద్వల్లభం

ప్రాప్నోతీహ యథాతథా పశుపతేః పాదారవిందద్వయం

చేతోవృత్తి రుపేత్య తిష్ఠతి సదా సాభక్తిరిత్యుచ్యతే

అనగా ఊడుగు గింజలు, వాని యంతట అవే ఆ చెట్టు మొదలునెట్లు పట్టుకొంటాయో, సూదంటు ఱాయిని సూది ఎంత గట్టిగా పట్టుకొనియుంటుందో, పతివ్రత తన విభుణ్ణి ఎడబాయకుండా అనుసరిస్తూ ఉంటుందో, తీగ తనంతట తానే చెట్టును పెనవేసికొని యుంటుందో, నదులు తమంతట తామే సముద్రంలో ఎట్లా కలుస్తున్నాయో అట్లాగే మనస్సు అన్నివేళలా పరమేశ్వరుని పాదారవిందాలను పట్టుకొని అక్కడినుండి తొలగకుండా ఉండడమే భక్తియని పెద్దలంటారు.

ఊడుగు చెట్టని ఒక చెట్టుంది. పక్వంకాని పండు నేల మీద పడితే అది బ్రద్దలౌతుంది. వెంటనే అందలి గింజలు ఏదో శక్తి తీసికొని, వెళ్లినట్లుగా చెట్టు మొదట్లో చేరుతాయి. చెట్టును పట్టుకొని గింజ మాయమవుతుందట. ఎక్కడి నుంచి వచ్చిందో అక్కడకు చేరుతుందట. అంటే చెట్టులోనే ప్రవేశిస్తుంది. అట్లాగే భగవానుని నుండి వచ్చిన మనము అతని వైపు పయనించి అతణ్ణి పట్టుకొని అతనిలో ప్రవేశించాలి, ఏకం కావాలి. రెండవ ఉదాహరణ – సూది, సూదంటు ఱాయికి ఆకర్షింపబడడమే కాకుండా, చివరకు అట్టి సూదికీ ఆకర్షించే లక్షణం వస్తుంది. ఆ సూది కూడా ఇతర ఇనుప పదార్థాలను ఆకర్షించగలదు. అనగా భక్తునకు భగవల్లక్షణాలు సంక్రమిస్తాయి. శక్తి వస్తుంది.

మూడవది, పతివ్రత – భర్త గురించి. పతివ్రత యొక్క సంభాషణ, పనులు, తలపులు అన్నీ భర్తను గురించే. అట్లాగే భక్తుడు తన మనస్సును, వాక్కును, క్రియను భగవంతుని గురించే యుండాలని సూచిస్తున్నాడు. మూల శ్లోకంలో 'పతి' అని లేదు. విభుడని ఉంది. అనగా భగవంతుణ్ణి ఒక్కచోటనే ఉన్నాడని భావించకుండా అన్ని చోట్ల ఉన్నాడని (విభువని) భావించాలని సూచించారు. తరువాత లతలు. చెట్టు నుండి విడదీసినా కొంత సేపటికి లత, ఆ చెట్టును చుట్టుకొంటుంది. అట్లాగే మనకు ఎన్ని కష్టాలు వచ్చినా మన మనస్సు, భావాలూ అతనివైపే ప్రసరించాలని సూచించారు. ఈశ్వరుడే లక్ష్యమన్న మాట. చివరగా నదులు – సముద్రము. ఇదే అద్వైత భావన, సముద్రం నుండే వర్షం వస్తోంది. (సూర్య కిరణాలు – ఆవిరి – మేఘంగా మారుట – వర్షం) అది నది అవుతోంది. కనుక సముద్రానికి, నదికి భేదం లేదు. నది కొండకొమ్ముపై పుట్టి సంతత గమనంతో చివరకు సముద్రాన్ని చేరుతోంది. తన అస్తిత్వాన్ని కోల్పోతోంది. అనగా దాని ఊరు, పేరు పోగొట్టుకుంటోంది. సముద్రం ఎదురేగి స్వాగతం పల్కుతోంది. అందువల్లనే నదులు, సముద్రంలో కలిసే చోటునకు ముందుగా నది నీరు కూడా ఉప్పగా ఉంటోంది. అట్లాగే నిజమైన భక్తిని చూపిస్తే భగవానుడు దయతో చేతులు చాస్తాడు. కౌగలించుకొంటాడని సూచన.

మొట్టమొదట భక్తి, వ్యాపారధోరణిలో సాగినా, డబ్బు కీర్తిరావాలని భక్తుడు తహతహలాడినా, భగవానుని కల్యాణ గుణాలను చింతించిన కొలదీ ఏ కోరిక లేక అతణ్ణే కోరుతాం. చివరకు నిర్గుణ బ్రహ్మానుభవం సిద్ధిస్తుంది. అతనిలో లీనమైపోతాము. అతడేయైపోతాం.

ప్రపంచ జీవితాన్ని సరిగా నడపాలన్నా, ద్వైత, విశిష్టాద్వైత, అద్వైతానుభవం రావాలన్నా భక్తి, తప్పనిసరి, మోక్ష సాధన సామగ్రిలో భక్తి శ్రేష్ఠమైనదని శంకరులన్నారు. అట్లా అంటూ తనను తానగుట (స్వ స్వరూపానుసంధానం) భక్తియని సెలవిచ్చారు కూడా.

మోక్షసాధనసామగ్ర్యాం భక్తిరేవ గరీయసీ

స్వ స్వరూపాను సంధానం భక్తి రిత్యభిధీయతే

ఇష్టదేవత

ప్రజలు భిన్నభిన్న మనః ప్రవృత్తులు కలిగియుంటారు. ఒక్కొక్కరికి ఒక్కొక్క దేవత, ఇష్టంగా ఉంటుంది. అందరిలోను భక్తిని, చిత్తశుద్ధిని కల్గించడం కోసం, ఏకాగ్రతను సిద్ధింపచేయడం కోసం, పరమాత్మయే భిన్న దేవతా మూర్తులను ధరించి అవతరించాడు.

ఈ హిందువులకు కోట్ల మంది దేవతలున్నారేమిటని పాశ్చాత్యులు వేళాకోళం చేస్తారు. కాని ఉన్నది ఒక్క స్వామియే అని సగటు హిందువు భావిస్తాడు. పెక్కు మంది దేవతలున్నారని భావించడు. ఉన్నది ఒక్క దేవతయే యని వైదిక మతం చెప్పడమే కాదు. జీవుడే పరమాత్మయని చెబుతుంది. ఇట్టి సిద్ధాంతాన్ని ఇతర మతాలు చెప్పవు. ఒక స్వామి, సర్వ నియామకుడని భావించని హిందువంటూ లేడు. ఆ ఒక్కడే అనేక రూపాలను ధరిస్తాడని అతడు దయామూర్తియేయని భావిస్తాడు.

ఆ స్వామియే ఈ భరత భూమిలో భిన్న ఆకారాలలో మహాత్ములకు కన్పిస్తాడు. వారే మంత్రాలనందించారు. ప్రతి దేవతామూర్తికి ప్రత్యేక పూజా విధానాన్ని అందించారు. వారు నిర్దేశించిన మార్గంలో పయనిస్తే తమ ఇష్టదేవత యొక్క కృపకు భక్తులు నోచుకుంటారు. ఏ దేవత, ఏ ఆకారంలో ఉన్నా అంతిమ లక్ష్యం పరమాత్మను చేరుకోవడమే. అందువల్ల సందేహం లేకుండా భక్తిని అంకిత భావంతో అభ్యసిస్తూ ఉంటాం. అతడే సంసారవిముక్తిని ప్రసాదిస్తాడని నమ్ముతాం. బంధవిముక్తికి అర్హత సంపాదించేటంత వరకు మన కోరికలను స్వామి తీరుస్తాడు.

తమ తమ మనఃప్రవృత్తులకు, ప్రీతికి అనుగుణంగా ఒక్కొక్క దేవతా మూర్తిని ఇష్టపడుతూ ఉంటారు. ఒక పిల్లవాడు, తల్లిని సమీపించినట్లుగా

ఒక భక్తుడు అమ్మవారిగా చింతిస్తాడు. పరమశాంతి కావాలని కోరుకొనేవాడు దక్షిణామూర్తిని ధ్యానిస్తాడు. నృత్యగీతాలతో దేవుడిని సంతృప్తి పరచాలని ఒకడు భావిస్తే అతడిని కృష్ణునిగా కొలుస్తాడు. కనుక తమ ఇష్టాన్ని అనుసరించి, ఒక మహాశక్తిని ఒక్కొక్కమూర్తిలో భావిస్తాడు. ఆ మూర్తి జీవంతో, దయతో తొణికిసలాడుతున్నట్లుగా భావిస్తాం. ఇష్టమైన రూపంతో ఉన్నాడని భావించం. ఇట్లా మన మనఃప్రీతిని బట్టి ఆరాధన సాగుతోంది. అందరినీ ఒక దేవతనే పూజించండని మన మతం చెప్పదు. అందొక స్వేచ్ఛ దాగియుంది. మొదట మన ఇష్టదేవతను భజించినా మనకీ ప్రత్యేక మనఃప్రవృత్తి ఉందేమిటని ప్రశ్నించుకొని అన్నిటిని పరమాత్మగా భావించే మనఃప్రవృత్తిని ఆ మూర్తియే మనలో కల్గిస్తాడు.

మనమొక దేవతను ఇష్టపడి ఎట్లా ఆరాధిస్తున్నామో, ఇతరులు కూడా వారి వారి ఇష్టాలననుసరించి పూజిస్తున్నారు. కనుక ఇతర దేవతలు తక్కువ వారని, మన దేవతయే ఎక్కువని భావించకూడదు. మనకెట్లా మన మూర్తి కోరికలను తీరుస్తున్నాడో వారికీ వారి మూర్తులు అనుగ్రహం చూపిస్తున్నారని భావించాలి. అయితే ఒక సందేహాన్ని కొందరు వెలిబుచ్చుతూ ఉంటారు. ఏమిటనగా పురాణాలలో ఫలానా దేవత ముఖ్యుడని, ఇతర దేవతలు తక్కువ వారనీ ఉంది. ఈ దేవత చేతిలో మిగతా దేవతలు ఓడింపబడినట్లుంది కదా అని ప్రశ్నిస్తారు. దీని నెట్లా అర్థం చేసికోవాలి? సంస్కృతంలో నహినిందా న్యాయమని ఒకటుంది.

పురాణకర్తల తాత్పర్యం, ఇతర దేవతలను నిందించడం కాదు, తానిష్టపడిన దేవతను ప్రశంసించడమే. ఎందుకిట్లా ఉంది? తానిష్టపడే మూర్తి పట్ల అచంచల విశ్వాసం కలగడం కోసం, ఏకాగ్రత సిద్ధింప చేయడం కోసం, నిందా వాక్యాలున్నట్లు కన్పిస్తాయి. అభీష్టపడే మూర్తి శక్తిమంతుడని, అట్టి శక్తి ఇతరదేవతలకు లేదని చెప్పడం అందుకే.

పూర్వకాలంలో ప్రసిద్ధులైన వ్యక్తులు సమస్త దేవతలను ఒకే విధంగా భావించారు! కాళిదాసు, బాణుడు వంటి కవులు ఒకే మూర్తి భిన్న భిన్నంగా అవతరించిందనే వ్రాసారు.

భక్తుల మనఃప్రవృత్తులను అనుగుణంగా భిన్న భిన్న ఆకారాలలో కనపడడమే కాదు, ఆ దేవతలు చేసే పనులూ ఒక్కొక్క గుణాన్ని ఆధారంగా చేసికొని యుంటాయి. సృష్టించేటపుడు బ్రహ్మ, రజోగుణాన్ని ఆధారంగా చేసికొన్నాడు. సత్త్వ గుణంతో ఉన్నపుడు విష్ణువుగా కన్పిస్తాడు. సంహరించే సమయంలో తమో గుణాన్ని శివుడు స్వీకరిస్తాడు. లేదా ఆశ్రయిస్తాడు. ఒకే ఒక శక్తి, త్రిమూర్తులుగా కన్పిస్తోందని కాళిదాస కవి అన్నాడు. ఈ ముగ్గురికీ ఏది నప్పుతుందో మిగతా దేవతామూర్తులకూ ఇదే అనువర్తిస్తుంది.

కనుక ఒక దేవత గొప్ప, ఒక దేవత తక్కువ అని కీచులాడడం తగదు. అయినా మానవ మనఃప్రవృత్తుల వికారాల వల్ల వీరశైవులూ, వీరవైష్ణవులూ గత కాలంలో పోట్లాడుకొన్నారు. ఆ మహావిష్ణువు, ఆ మహాదేవుడైన శివుడు ఒక్కరే కదా!

హనుమ

ముందుమాట

బుద్ధిర్బలం యశోధైర్యం నిర్భయత్వమరోగతా

అజాడ్యం, వాక్పటుత్వంచ హనుమత్ స్మరణాద్భవేత్

ఈ శ్లోకాన్ని బట్టి హనుమానుణ్ణి స్మరించే భక్తులపై అతడెట్టి అనుగ్రహం చూపిస్తాడో తెలుస్తుంది. బుద్ధిని, బలాన్ని, కీర్తిని, ధైర్యాన్ని, నిర్భయత్వాన్ని, ఆరోగ్యాన్ని, జడత్వం లేకపోవడాన్ని, వాక్పటుత్వాన్ని ప్రసాదిస్తాడని అర్థం.

ఇట్లా అన్ని గుణాలూ ఒక్కనిలో ఉండవు. ఎంత బుద్ధిమంతునకైనా ఏదో లోటుంటుంది. బలవంతుడు, మూర్ఖుడు కావచ్చు. పై రెండు ఉన్నా పిరికివాడు కావచ్చు, భయపడవచ్చు. ఎంత సామర్థ్యమున్నా చురుకుగా ఉండకపోవచ్చు. సోమరి పోతుగా ఉండవచ్చు. పండితుడైనా కొందరికి వక్తృత్వం ఉండకపోవచ్చు. కాని అన్ని సలక్షణాలను ప్రసాదించేది ఆంజనేయ స్వామియే.

సాధారణంగా మనుష్యులలో అన్నీ ఉండకపోయినా విరుద్ధ భావాలుంటాయి కూడా. బలవంతునకు బుద్ధి సంపదలేక పోయినా; బుద్ధిమంతునకు అహంకారంలేని భక్తి లేకపోయినా రాణించదు. కాని ఆంజనేయునిలో అన్ని లక్షణాలున్నాయి. అతడెన్ని విధాల బలవంతుడైనా తనకున్న శక్తి, రాముడనుగ్రహించినదే అని వినయం చూపిస్తూ ఎల్లపుడూ రామదాసుగానే ఉండాలని భావిస్తాడు. సేవకునిగా ఉంటే అతనిలో సంపూర్ణత్వం ఉంది. ఎవరికైనా భక్తియున్నా అది ఎందుకో స్పష్టంగా లేకుండా అనగా జ్ఞానసహితమైనది కాకుండా మూఢభక్తితో ఉంటారు. ఇక అట్టివారు భక్తి జ్ఞానాలు ఒకదానితో ఒకటి పడవనీ భావిస్తారు. రామునకెంత భక్తుడో

అంతటి సుజ్ఞాని. వైదేహీ సహితం.... సనకాది ఋషులకు దక్షిణామూర్తి ఉపదేశించినట్లు ఆంజనేయునకు రాముడు తత్త్వోపదేశం చేసాడు. అర్జునుని కేతనం మీద ఉంటూ కృష్ణుడు చెప్పిన గీతను అర్జునునితో బాటు విన్నాడు. పైశాచీ భాషలో ఒక గీతా వ్యాఖ్యానం ఉందని, తత్వంతో నిండియుంటుందని దానిని ఆంజనేయుడే వ్రాసాడని అంటారు. రాముడే మొట్టమొదట సమావేశంలో ఇతణ్ణి నవవ్యాకరణ వేత్తయని కొనియాడాడు. అతడెంత బుద్ధిమంతుడైనా పండితుడైనా, వినయభరితుడై భక్తి ఇచ్చే ఆనందంలో మునిగియుండేవాడు.

భక్తియుంది కదాయని ప్రపంచ వ్యవహారాలను పట్టించుకోలేదని భావించకండి. ఆర్తులను, బలహీనులను కాపాడుటలో ఇతణ్ణి మించిన వారెవ్వరూ లేరు. లోకసేవా ధురంధరుడు.

జ్ఞానం యొక్క పరకాష్ఠను, బలపరాక్రమాల అవధిని, భక్తి సామ్రాజ్య విస్తరణను, కీర్తి పతాకాలను, అపరిమిత సేవను, అగణనీయ వినయ సంపదను అన్నిటిని ఒక్కచోట చూడదలచుకొంటే స్వామినే స్మరించాలి.

అంతకంటే ఇతని అఖండ బ్రహ్మచర్యాన్ని ముందుగా పరిగణించవలసి వస్తుంది. కామవాసన అణుమాత్రం లేని అస్ఖలిత బ్రహ్మచారి. తన కోసం తానేమీ ప్రయత్నం చేయలేదు. కామరాహిత్యం, రామసేవ వల్లనే పరిపూర్ణత్వం సిద్ధించింది.

హనుమాన్ అని తమిళులంటే కర్ణాటకలో హనుమంతప్పయని, ఆంధ్రప్రదేశంలో ఆంజనేయుడని, మహారాష్ట్రలో మారుతియని, ఉత్తరదేశంలో మహావీరుడని పిలుస్తారు.

ఆయనను స్మరిస్తేనే మనలో ధైర్యం పొటమరిస్తుంది. జ్ఞానోదయం, కోరికలు తీరుట, జరుగుతుంది. అతని మాదిరిగా వినయంతో భగవత్ కైంకర్యం చేద్దాం.

ఎక్కడ రామనామం వినబడినా, ఎక్కడ రామాయణ ప్రవచనమున్నా, మనకంటికి కనబడకపోయినా అక్కడ సాక్షాత్కరిస్తాడు. కథలో, నామంలో మునిగి ఆనందాశ్రువులను రాలుస్తాడు.

మిగతా లక్షణాల కంటే ఈ కాలంలో వినయం యొక్క ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఎంత ఉన్నా, ఎంత సంపాదించినా, ఇంకా ఏవో కావాలని ఆరాటపడుతూ ఉంటాం. అంతం కనబడదం లేదు. మనకు వినయ సంపద ఉన్నప్పుడు మాత్రమే ఈశ్వరానుగ్రహం పొందగలం. అదే తృప్తిని, సంపూర్ణత్వాన్ని ప్రసాదిస్తుంది. ఆ సంపూర్ణ తృప్తిని ఆంజనేయుడు అనుగ్రహించుగాక.

నిజంగా అతణ్ణి కొలిచిన వానికి, కోరదగిందంటూ ఏదీ ఉండదు. అతని వల్లనే రావణ సంహారం జరగడం, రామరాజ్య స్థాపనం జరిగింది. అతడు అర్జునుని జెండాపై ఉండడం వల్లనే యుద్ధానంతరం ధర్మరాజ్యం స్థాపింపబడింది. కొంతకాలం వెనుక మనధర్మానికి విఘాతం కలుగగా సమర్థ రామదాస స్వామి అవతరించి శివాజీ ద్వారా ధర్మస్థాపన చేయించాడు. రామదాస స్వామి ఆంజనేయుని అవతారమే. ఈనాడు, అట్టి సంకట పరిస్థితులు లేకుండా ఉండాలంటే, ధర్మ, భక్తులు వర్ధిల్లాలంటే ఆంజనేయ అనుగ్రహం కావాలి. శుద్ధమైన మనస్సుతో అతణ్ణి సేవిస్తే అన్నిటినీ ఇస్తాడు.

సరస్వతి - శంకర - హనుమ విగ్రహాలు

రామేశ్వరంలోని, అగ్ని తీర్థకరై ప్రాంతంలో శంకరమంటపం ముఖ్య స్తంభం మధ్యలో ఆదిశంకరుల విగ్రహముంది. దాని వెనుక సరస్వతీ మహల్ ఉంది. అందు సరస్వతీ విగ్రహముంది.

శంకరుల వెనుక భాగంలో సరస్వతీ విగ్రహ ముండవచ్చా అని ఎవరైనా సందేహిస్తారు. దీనికి సంబంధించిన కథ ఉంది. మందన మిశ్రులతో వాదంలో

శంకరులు జయించారు. బ్రహ్మ యొక్క అవతారమే మండనమిశ్రులు. అతని భార్యను కూడా ఓడించారు శంకరులు. ఆమె పేరు సరసవాణి. ఆమె సరస్వతి అవతారమే. మండనులు వెంటనే సన్యాసం స్వీకరించి సురేశ్వరాచార్యులనే ఆశ్రమ నామం స్వీకరించారు. సరసవాణి, సరస్వతిగా మారి బ్రహ్మలోకానికి వెళ్లాలనుకొంది. ఆమెను ఈ లోకంలోనే ఉంచాలని ఆమె దయవల్ల భూలోకవాసులకు విద్యాప్రకాశం కల్గుతుందని శంకరులు భావించారు. వనదుర్గా మంత్రంచే ఆమెను కదలకుండా చేసారు.

అమ్మా! నేను దేశ పర్యాటనను చేద్దామనుకుంటున్నాను, నాతో నీవు కూడా రా అని ఆమెతో అన్నారు. నిన్ను సరియైన స్థలంలో శారదాపీఠంలో స్థాపిస్తాను. తద్వారా ప్రజలను అనుగ్రహింపుమని వేడుకొన్నారు.

సరస్వతి, ఒక షరతు పెట్టి అంగీకరించింది. నీవు వెడుతూ ఉండగా నన్ను చూడడానికి వెనుదిరిగి చూడకూడదు సుమా! ఒకవేళ చూస్తే అక్కడే ఉండిపోతానని శంకరులతో చెప్పింది.

శంకరులు ప్రయాణం మొదలుపెట్టారు. ఆమె కూడా అనుసరించింది. ఆమె అందెల రవళి వింటూ ఉండడం వల్ల అనుసరిస్తోందని భావిస్తూ ఉండేవారు. వెనుదిరిగి చూడలేదు.

శంకరులు జ్ఞాన దృష్టిచే అన్నిటిని గ్రహించగలరు కదా! అవతార పురుషులైనా మానవ ధర్మాన్ని అనుసరించి మానవునిగానే ఒక్కొక్కప్పుడు ప్రవర్తిస్తూ ఉంటారు.

వస్తూ ఉండగా తుంగభద్రా నదీ తీరంలో శృంగేరిలో ఒక వింత జరిగింది. కప్ప ప్రసవిస్తూ ఉండగా ఎండపడకుండా తన పడగను పాము కప్పే దృశ్యాన్ని చూసారు. పాము, కప్పను మ్రింగడం లోక సహజం. కాని ఇక్కడ సహజ శత్రుత్వం లేదు, సరికదా మిత్రత్వమూ కన్పించింది. ఇట్టి పవిత్ర ప్రదేశంలో

అమ్మవారిని ప్రతిష్ఠిస్తే మంచిదని భావించారు. అందెల చప్పుడు వినబడడం లేదు. తుంగభద్రానదీ తీరం వెంట వస్తున్నారు. ఆ ఇసుక తిన్నెలలో ఆమె పాదాలు కూరుకొనిపోయి యుండవచ్చని భావించి వెను దిరిగి చూసారు. అక్కడే శారదా పీఠాన్ని స్థాపించారు.

నీ వెనుక వస్తానని సరస్వతి, లోగడ చెప్పింది కదా! తదనుగుణంగా ఈ రామేశ్వరంలో శంకరమంటపంలో సరస్వతీ విగ్రహం, శంకరుల విగ్రహం వెనుకనే ఉండడం పై కథను గుర్తుకుతెస్తుంది.

ఎవరైనా ఏదైనా పుస్తకం వ్రాసేటపుడు గురువందనం, తరువాత గణపతిని స్తుతి చేస్తారు. తరువాత సరస్వతీ స్తుతి ఉంటుంది. ఆ ఆచారం ప్రకారం కూడా శంకరుల వెనుక సరస్వతి యుండడానికి కారణం కావచ్చు.

ఆంజనేయుణ్ణి చివర స్మరిస్తారు కదా! కాని ఆయన విగ్రహం, శంకరుల విగ్రహం ముందు, ప్రవేశంలోనే ఉందేమిటి? ఎట్లా సబబు?

ఈ ఆంజనేయస్వామి, ఏనాడో తనంతట తాను వచ్చాడు. అతని విగ్రహం క్రొత్తగా ప్రతిష్ఠింపబడలేదు. స్వామి, తరువాతనే శంకరులు అడుగుపెట్టారు.

రుద్రనమక మంత్రాన్ని ఘనలో వల్లిస్తున్నపుడు అందులో ఉన్న శంకర పదం 13 సార్లు వస్తుంది. సాధారణంగా ఈ 13 అంకెలు శ్రేష్ఠం కాదంటారు. అందరికీ సుఖాన్ని కల్గిస్తుందని అర్థం ఇచ్చే శంకర పదం 13 సార్లు వస్తుంది.

ఆంజనేయుడు రుద్రాంశతో పుట్టినవాడు. అతడెప్పుడూ శ్రీరామ జయరామ జయ జయ రామ అని కీర్తిస్తూ ఉంటాడు. ఈ మంత్రంలోనూ 13 అక్షరాలున్నాయి. 13 అంకెను ఉత్తర ప్రాంతంలో ప్రత్యేకంగా భావించి "తేరాక్షర్" అంటారు. ఆ హనుమ, సమర్థ రామదాస స్వామిగా అవతరించినపుడు ఈ త్రయోదశాక్షరి మంత్రాన్నే జపిస్తూ ఉండేవాడు. ఆ మంత్రబలం వల్లనే శివాజీకి మార్గదర్శకుడయ్యాడు. హిందూ సామ్రాజ్యాన్ని శివాజీ స్థాపించగలిగాడు.

ఘనలో శంకరపదం 13 సార్లు వస్తుందని చెప్పాను. శంకరుల విగ్రహం ముందున్న ఆంజనేయస్వామి 13 అక్షరాల మంత్రాన్నే జపిస్తాడు. సబబుగా లేదా?

అట్టి ఆంజనేయప్రతిమ వెనుక ఉండకూడదు. కనుక ముందే ఉంటుంది.

ఎట్లా కనిపిస్తున్నాడు? ఒక చేతిని పైకెత్తి చేయి చాచి యుంటుంది. అది అభయహస్తం. భయపడకండని సూచిస్తుంది. అంతేకాదు. ఆగండని మనకు ఆజ్ఞాపిస్తూ ఉంటుంది కూడా. ఒక పెద్ద సముద్రం ముందుంది కదా! రామేశ్వరంలో సముద్రం పెద్ద అలలు లేకుండా ఉంటుంది. ఆగు, ముందుకు రాకు అని సముద్రాన్ని ఆజ్ఞాపించాడు హనుమ. వేల సంవత్సరాల నుండి అతని ఆజ్ఞను సముద్రం పాటిస్తూనే ఉంది.

కనుక అతడు సముద్రానికి అభిముఖంగా ఉంటాడు. అతనికి, సముద్రానికి మధ్యలో ఏ విగ్రహమూ ఉండదు. శంకరుల కంటే ముందు వచ్చిన వానికి అట్టి గౌరవ స్థానం ఉండడం సబబే కదా!

సరస్వతి, నిన్ను అనుసరిస్తానని అంది కాబట్టి ఆమె విగ్రహము, శంకరుల విగ్రహానికి వెనుక ఉండడం కూడా సబబే.

శంకరులు, నా ముందు సాక్షాత్కరించుమని ప్రార్థించడం వల్ల హనుమ ముందున్నాడు. శంకరులు హనుమత్ పంచరత్నం వ్రాసేరు. అనగా ఐదు శ్లోకాలు. రుద్రాంశ సంభూతుడు ఇక్కడ ప్రార్థింపబడ్డాడు. ప్రశంసించిన వ్యక్తి అయిన శంకరులు, శంకరుని అవతారం. ఇద్దరూ ఒక్కటే. ఇద్దరూ వినయ మూర్తులే. ఇద్దరూ బుద్ధిమంతులైనా వినయవంతులే. శంకరులెంత వినయంతో ప్రార్థిస్తారో గమనించండి:

పురతో మమపాతు హనుమతో మూర్తిః

నాముందు ఆంజనేయస్వామి ప్రకాశించుగాక. రక్షించుగాక. కనుక శంకరుల ముందు ఈ స్వామి మూర్తి ఉండడం సబబే. అట్లా ఉంటేనే శంకరులకిష్టం.

ఆది, అంతమూ రెండూ ఒక్కటే. అద్వైత సత్యం. నేనుతో ఆరంభమై నేనుతో అంతమౌతుంది. (జీవాహంకారం నుండి మొదలై పూర్ణాహంకారంతో ముగుస్తుంది). చివర రావలసిన ఆంజనేయుడు. గురువు కంటే ముందే రావడం అద్వైతాన్ని వివరిస్తోంది. దాసోహం అని తనను తాను రామచంద్రునికి అర్పించుకొనగా సోహం స్థితికి చేరుకొన్నాడు. అనగా వాడే నేను అనే స్థితి. నేను, పరమాత్మనే అనేస్థితి. అదే అద్వైతభావం. కనుక ఆది,అంతమూ అతడే.

ఆంజనేయుని ఆజ్ఞననుసరించి సముద్రం అణగియుంది. మనమేమో సంసార సాగరంలో చిక్కుకొన్నాం. సముద్రంలోని అలలు మాదిరిగా మనభావాలు అల్లకల్లోలంగా ఉంటాయి. కాని ఆంజనేయుడు మనోనిగ్రహం కలవాడు. ఇంద్రియాలను జయించినవాడు.

జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠం

అట్టి అభయాంజనేయ మూర్తిని దర్శిస్తే, ధ్యానిస్తే మన భయాలను తరుమడమే కాకుండా శాంతి సౌభాగ్యాలను అందిస్తాడు. సంసార సాగరాన్ని అల్లకల్లోలం లేకుండా చేయగలడు.

బలప్రదాత

బలహీనులకు బలాన్నిచ్చేవాడు, రామచంద్రమూర్తి. నిర్బల్ కే బల్ రామ్ అని హిందీలోని మాట. ప్రమాదంలో చిక్కుకొన్నపుడు రక్షించేవాడు రాముని

కంటే మరెవ్వరు? ఆపదామ్ అపహర్తారం అని కీర్తిస్తాం. మనకు ముందు, వెనుక, ప్రక్కల, అన్ని వైపుల రక్షించేవాడు రాముదని కీర్తిస్తాం.

అగ్రతఃపురతశ్చైవ పార్శ్వే ఏవ మహాబలౌ.

మనలను రక్షించడానికి ధనుర్బాణాలతో రాముడు సిద్ధంగా ఉంటాడు. ఎప్పుడూ రాముని విడువని లక్ష్మణుడున్నాడు.

ఆ కర్ణపూర్ణ తన్వానౌ రక్షేతాం రామలక్ష్మణౌ

అంతటి విజయరాఘవుడు, వీర రాఘవుడు తాను సాధించినది హనుమ వల్లనే అని లోకానికి చూపిస్తాడు.

రాముడు మానవునిలా ప్రవర్తించాడు. రావణుడు, సీతనెక్కడ దాచాడో తెలియనట్లే ప్రవర్తించాడు. మానవునిగా నుండి దుఃఖంలో మునిగియుండగా హనుమ, సీతను వెదికి, రామునకు ఉత్సాహాన్ని, బలాన్ని కల్గించాడు.

సీతనుండి కేవలం వియోగం కంటే వియోగబాధ, కొన్నివేల రెట్లు ఎక్కువగా అనుభవించాడు. తన ప్రక్క లేకుండా ఆమె ఎట్టి కష్టాలను అనుభవిస్తోందో అని బాధపడ్డాడు. ఆమెకు అదనంగా మరొక బాధ ఉంది. అది రావణుని చెరలో ఉండుటయే. స్త్రీని అబలయని అంటారు. మహాలక్ష్మి సీతగా అవతరించి అశోకవనంలో బాధపడింది. మామూలు స్త్రీ కంటే ఎక్కువగా బాధపడి, ఉరిపోసికొందామని భావించింది కూడా. ఆంజనేయుడు ఆమెకు ధైర్యాన్ని, బలాన్ని, ఉత్సాహాన్ని కల్గించాడు.

అతడు చేసిన ఆశ్చర్యకర సంఘటనలు ఒకటా, రెండా? అగణనీయం. అన్నిటి కంటే జీవితాన్ని త్యజించాలనే సీత యొక్క శోకాన్ని పోగొట్టడం గొప్పది.

జానకీశోకనాశనం

అంజనానందనం వీరం జానకీ శోకనాశనం

అంజన అనే వానర స్త్రీకి పుట్టాడు. జన్మించి తల్లికి ఆనందాన్ని కల్గించాడు. అదేమంత గొప్పది కాదు. అందుకే కొడుకును నందనుడని పిలుస్తారు. ఆంజనేయుడు, అంజనా నందనుడు. దశరథనందనుడన్నట్లు, దేవకీనందను డన్నట్లుగా మన స్వామి, ఒక్క తల్లికేకాదు, తల్లులందరికీ తల్లియైన సీతమ్మ యొక్క శోకాన్ని పోగొట్టాడు. అందుకే అతణ్ణి కీర్తిస్తాం.

దుఃఖాగ్నిచే సీత, దహింపబడుతోంది. హనుమతోకను, రావణుడు నిప్పుపెట్టించాడని వింది. అసలు అగ్ని, లంకను కాల్చిందా? ఆ అగ్నికి మరొక అగ్నిని జోడించాడు హనుమ. అదే సీత యొక్క శోకాగ్ని. (శోకాగ్నికే మామూలు అగ్నిని చేర్చాడందాం)

యఃశోకవహ్నిం జనకాత్మజాయాః

ఆదాయతేనైవ దదాహ లంకాం

జనకాత్మజయనగా జానకి. శోకమనే నిప్పుతో ఉంది. 'శోకవహ్నిం'. ఆమె ఉంచబడినది, అశోకవనం లోపల. ఆమె లోపల ఉంది శోకవహ్ని. తేనైవ=దానివల్ల; లంకాందదాహ = శోకాగ్నిచే లంకను కాల్చెను.

తోకకు నిప్పంటించినా తోక కాలలేదు. సీతానుగ్రహం వల్లనే అది కాలలేదు. అయితే లంక అంతా కాలడానికి సీతా శోకాగ్ని కారణమైనా, హనుమతోక చివరగానున్న అగ్నియే కాల్చిందని రావణుడు భ్రాంతి పడ్డాడు. తోకకు నిప్పంటించాలనే ఊహ రావణునకెట్లా వచ్చింది? ఈ ఊహ రావడానికి ముందే సీత యొక్క శోకాగ్ని చల్లారక అందువల్ల ఆమె బాధపడుతూ ఉంటే ప్రపంచమే భరించలేకపోయింది. అట్టిది కొంత ఖర్చుపెట్టబడాలి. ఎవరో ఒకరు ఆ శోకాగ్ని యొక్క తీవ్రతను సహించవలసి వస్తుంది. ఎవరు భరించగలరు? ఆంజనేయుడు తప్ప ఇతరులెవ్వరూ ఆ అగ్ని తీవ్రతను తట్టుకోలేరు. రావణుడితనిని శిక్షించాలని అనుకొన్నప్పుడు ఈ ఊహ తట్టి

తోకకు నిప్పు పెట్టండని అన్నాడు. అదీ ఈశ్వర సంకల్పమే. అందువల్ల సీత యొక్క శోకాగ్నిని గ్రహించి దానితో లంకను కాల్చాడు. అది దుష్టులను కాల్చింది కాని శిష్టులను కాల్చలేదని గుర్తించండి. అందువల్లనే శోకాగ్ని, హనుమను కాల్చలేదు.

సీత ఎక్కడుందో రామునికి చెప్పడమే హనుమ చేసిన ఉపకారం. సీత ప్రాణత్యాగం చేసే సమయంలో రక్షించాడు. వారి వారి శక్తులను పోగొట్టుకొనే దశలో తిరిగి వారి వారి శక్తిని ప్రసాదించాడు.

ఇట్లా రెండు పనులెట్లా చేయగలిగాడు? ఇది రామనామ బలం వల్లనే.

ఎట్లా సముద్రాన్ని దాటగలిగాడు? రామనామం వల్లనే. సీతనెట్లా రక్షించగలిగాడు? ప్రాణత్యాగం చేసే సమయంలో ఆమె కాళ్ల మీదపడి, చేయవద్దని బ్రతిమాలాడితే మానివేస్తుందా? రావణుడే, ఈ వేషంలో వచ్చాడని భావించదా? మారీచుని నడవడికను చూసిన తరువాత అంతా రాక్షస మయంగా కన్పిస్తోంది కదా! ఆంజనేయుడు, బ్రహ్మచారి కావడంచే ఇతరుల మనస్సులను గ్రహించగలడు. ఆ దశలో ఏం చేసాడు? అపుడు రామనామాన్ని జపించాడు. రామనామం ఉచ్చరించిన వెంటనే రాక్షసమాయ, మటుమాయం కాదా? ఆమె శోకాగ్నిని రామ నామ ఉచ్చారణవల్ల కొంత తగ్గించగలిగాడు. అందువల్లనే ఆమె కరుణించడం వల్ల అగ్ని ఏమీ చేయలేకపోయింది ఇతనిని.

మేము ఆంజనేయుని ద్వారా రక్షింపబడినామని సీతారాములిద్దరూ అన్నారు. సంజీవనిని తీసికొని రావడం వల్ల లక్ష్మణుని ప్రాణమూ రక్షింపబడిందని అన్నారు. ఏ విధంగా ఇతని ఋణాన్ని తీర్చుకోగలనని సీతమ్మ నిరంతరం చింతిస్తూ ఉండేది.

అయితే వారేమిచేసారో చూద్దాం. అయోధ్యలో రామపట్టాభిషేకం జరిగే సందర్భంలో రాముడెందరికో కానుకలనిచ్చాడు. సీతకు ముత్యాలహారమిచ్చాడు.

సీత అది గ్రహించి చేతిలో పెట్టుకొని రాముని వైపు చూసింది. వారి శరీరాలు భిన్నంగా ఉన్నా ఆలోచన ఒకటే కదా! ఆంజనేయుణ్ణి సత్కరించాలని భావించారు.

సీత యొక్క చూపుతోనే రాముడు గ్రహించి ఈ హారాన్ని హనుమకిద్దామని భావించాడు. బుద్ధి, వినయం, సాహసం, కలిగిన వానికి ఇమ్మన్నాడు. పేరు చెప్పలేదు. సీత గ్రహించి, హనుమకిచ్చింది.

ఇద్దరూ కలిసి ఈ సత్కారం చేసారు. ఆహారం హనుమ శరీరంపై మేఘాలు చంద్రకాంతితో పర్వతాన్ని ఆక్రమించినట్లుందిట.

ఋష్యమూక పర్వతంలో మొదటిసారి రాముడు హనుమను చూసినపుడు మిగిలిన కథనంతా హనుమయే నిర్వహిస్తాడని భావించాడు. హనుమంతుని సాయమున్నా సుగ్రీవుని భార్యను వాలి అపహరించుకొని పోయిన కాలమది. వాలిని ఓడించడానికి తగిన సాహాయ్య సంపత్తి రామునకుందో లేదో పరీక్షించి చూడుమని హనుమను దూతగా పంపాడు సుగ్రీవుడు. ఆ సందర్భంలో హనుమ, తనకుపకరిస్తాడని రాముడు భావించాడు. ఈ నాటకాన్ని నడిపేవాడు రాముడే కదా!

మీరెవరని తెలిసికొనే సందర్భంలోని మాటలను బట్టి హనుమ యొక్క గొప్పదనాన్ని ఊహించాడు. ఇతడు మహావిద్వాంసుడు, గొప్ప వక్తయని గ్రహించాడు. బాగా మాట్లాడడమే కాదు, అనంత శక్తి సంపన్నుడని గ్రహించాడు. ప్రపంచం ఒక రథమైతే ఇతడు దానికి ఇరుసువంటి వాడని ఒకనాడు తెలిసికొంటామని రాముడే అన్నాడు.

ఋషిశాపం వల్ల హనుమకు తన శక్తి తెలియని కాలమది. అందువల్లనే ఇతని సాయమున్నా రాజ్యాన్ని, సుగ్రీవుడు భార్యను పోగొట్టుకొన్నాడు. అనతికాలంలో జాంబవంతుడు ఈ లోపాన్ని గుర్తించి హనుమకు తన శక్తిని

తెలుసుకొనే వానిగా తీర్చిదిద్దుతాడని, హనుమ సముద్రాన్ని దాటుతాడని, లంకను దహిస్తాడని రామునకు తెలుసు. కొంతకాలం తరువాత ఇతని శక్తియుక్తులను తెలిసికొంటారని లక్ష్మణునితో అన్నాడు రాముడు.

రామాయణమే ఒక ప్రపంచం వంటిది. ఏడు కాండలతోనున్న రామాయణ రథం ఆగే సందర్భంలో సీతాపహరణం, ఆమె ఎక్కడుందో తెలియక పోవడం జరిగింది. హనుమను చూడడంతోటే రామాయణ రథానికి అతణ్ణి ఇరుసుగా భావించాడు. మరల రథం తిరగడం మొదలుపెట్టింది. సుగ్రీవుడు, వాలితో యుద్ధానికి సిద్ధమయ్యాడు. తరువాత వాలి సంహారం, వానరులు సీతాన్వేషణకు బయలుదేరటం, సేతు నిర్మాణం, రామరావణ యుద్ధం, తరువాత పట్టాభిషేకం చకచకా సాగిపోయాయి. అన్నింటిలో హనుమపాత్ర గణనీయం.

రామాయణం సగం పూర్తయ్యే వరకూ హనుమ ఎవ్వరో తెలియదు. కిష్కింధకాండలో వస్తాడు. అప్పటినుండి నాయకుని కంటే ఇతనికే అధిక ప్రాధాన్యం వచ్చింది. తరువాత సుందరకాండ అంతా ఇతని వీర విహారమే. పారాయణ చేయవలసి వస్తే దానినే చేస్తారుగాని మిగతా కాండలను చేయరు కదా! రామాయణ రథాన్ని నడుపుమని రాముడు, హనుమతో అన్నాడు. సీతా సమక్షంలో రామనామాన్ని జపించడం వల్ల సీత రక్షింపబడింది. రామనామం వల్లనే సముద్రాన్ని దాటగలిగాడు. లంకకు వెళ్లడం కష్టం కాబట్టి సేతువును కట్టవలసి వచ్చింది.

ఏది చేసినా తాను చేసానని హనుమ, ఎన్నడూ భావించలేదు. ఇదంతా సీతారాముల కరుణ వల్లనే అనేవాడు. సముద్రం దాటడాన్ని లోకం ప్రశంసించింది. కాని తారక నామం వల్లనే కదా! ఆమె శోకాగ్ని లంకను దహించలేదా? అని భావించాడు. వాళ్ల పనులు తాను చేసినా వారి నామ ప్రభావం వల్లనే చేయగలిగానని మనసా భావించే వాడు. వారి ఋణం తాను తీర్చుకోలేనని బాధపడ్డాడు. చూసారా? అతని వినయాన్ని.

మన మానసిక స్థితి ఎట్లా ఉంటుంది? ఎంతో ఉపకారం చేసాం. ఒక్కదూ కన్నెత్తి చూడదు, పన్నెత్తి మాట్లాడదని అనుకొంటాం. కాని సీతారాములు హనుమవల్ల; హనుమ సీతారాముల వల్ల బలాన్ని పుంజుకొన్నానని భావించడాన్ని గమనించారా? అంజనేయుని ఋణం తీర్చుకోలేకపోయామనే బాధపడ్డారు, సీతారాములు.

రామాయణం నుండి నేర్చుకోవలసిన నీతి ఇది. తనకు బలం రామునివల్ల అని హనుమ భావించగా అతనికి వినయమే అతనికి బలాన్నిచ్చింది. బలం, వినయం సాధారణంగా కలిసియుండవు, రెండూ ఇతనిలో ఉన్నాయి. మనలో రెండూ లేవు సరికదా, మాటి మాటికీ అహంకరిస్తూ ఉంటాం కూడా. హనుమ అట్టి వాటిని ప్రసాదించుగాక.

మారుతి గొప్పదనం

'కోతి బుద్ధిరా' అంటూ ఉంటాం. కోతి ఒక కొమ్మ నుండి మరొక కొమ్మపై దుముకుతుంది. కొద్ది క్షణాలు కూడా నిలకడగా ఉండలేదు. అట్లాగే అస్థిమితమైన మనస్సు కలవారిని అట్లా అంటాం.

హృదయకపిమత్యంత చపలం అని శంకరులన్నారు. పరమేశ్వరా! చంచలమైన ఈ కోతిని భక్తియనే త్రాటితో కట్టవయ్యా అని అన్నారు. దానిని తీసికొని పోయి ఆటలాడించి పొట్టపోసికో అని సరదాగా అన్నారు. చేతిలో కపాలం ధరించి బిచ్చమెత్తుకోవడం కంటే ఈ కోతితో ఆటలాడించి పొట్టపోసుకోవయ్యా, అంటూ 'హృదయ కపి'యని వాదారు.

పాశ్చాత్యులు కూడా మంకీ మైండ్ అంటారు. కోతి శరీరం, బుద్ధి, నిరంతరం కదులుతూనే ఉంటాయి.

ఆవుగాని, ఏనుగుగాని మాంసం తినకపోవడంలో ఆశ్చర్యం లేదు. ఆకలితో నున్న పులిగడ్డి మేయదని అంటారు. ఒకవేళ అది శాకాహారంతో ఉంటే ఆశ్చర్యపోతాం.

ఆంజనేయుడు కపియై చంచల మనస్సుతో నున్న శరీరాన్ని ధరించాడు. కాని అతడింద్రియాలను, మనస్సునూ నిగ్రహించాడు. తన శరీరాన్ని, మనస్సును రామునకర్పించాడు. అక్కడే అతని గొప్పదనం దాగియుంది.

అయితే మనస్సును, ఇంద్రియాలను నిగ్రహించడానికి ఏ అరణ్యంలోనో తపస్సు చేసికొంటూకాలం గడిపాడా? ఎవరైనా ఏకాంతస్థలానికి వెళ్లి మనస్సును నియమించడానికి ప్రయత్నం చేయవచ్చు. అట్లాచేయక అందరి మధ్య ఉంటూ అన్ని పనులనూ చక్కబెట్టాడు. అసాధ్యసాధకుడయ్యాడు. సముద్రాన్ని దాటడం, సంజీవనీ పర్వతాన్ని తేవడం, లంకాదహనం మొదలైనవన్నీ మామూలు వ్యక్తులు చేయగలరా?

అయితే అతని మనస్సును ఎక్కడ ఉంచాడు? రాముని పాదపద్మాలపై. అయినా చేతులతో అనేక ఘనకార్యాలు చేసాడు. రామధ్యానంలో మనస్సు నిశ్చలంగా ఉంటుంది. రామకార్యాలపై శరీరం చురుకుగా పనిచేస్తుంది.

ఎట్లా? వాయువేగ, మనోవేగాలతో వెడతాడు. పంచభూతాలలో వేగంగా కదిలేది గాలి. ఇంద్రియాలలో మనస్సుకంటే వేగంగా వెళ్లేది ఏదీ లేదు.

నా మనస్సు గాలి మాదిరిగా చంచలంగా ఉంది, కృష్ణా, గాలినెట్లా బంధించలేమో దీనినీ అట్లా బంధించలేకపోతున్నానని వాపోయాడు అర్జునుడు:

చంచలంహి మనఃకృష్ణ వాయోరివ సుదుష్కరం

గాలిలేని చోట దీపం ఎట్లా నిశ్చలంగా ఉంటుందో యోగి మనస్సు అట్లా ఉంటుందని గీతలో అన్నాడు.

యథాదీపో నివాతస్థో నేంగతే సోపమా

నివాతం అనగా గాలి లేక పోవుట. వాతమనగా గాలి. వాతం, వాయువు ఒక్కటే. వాతరోగం అని అంటాం వాడుకలో.

ఎవరీ ఆంజనేయస్వామి? ఒక కపి, వాయునందనుడు కూడా. వాయు కుమారుడగుటచే వాతాత్మజుడు.

వాతాత్మజం వానరయూధముఖ్యం

శ్రీరామ దూతం శిరసా నమామి.

యూధమనగా గుంపు. వానరుల గుంపునకు ముఖ్యుడగుటచే వానరయూధ ముఖ్యుడయ్యాడు.

శ్లోకంలో ముందుభాగమేమిటి? అందేముంది? వాయువేగం, మనోవేగమని చెప్పాడు. ఈ రెంటి వేగాలున్నవాడు. అంటే ఇతని ఇంద్రియాలు, మనస్సు వేగంగా తిరుగుతున్నాయని కాదు.

మనోజవం మారుత తుల్యవేగం

జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠం.

ఇతనిలో మనోజవం, మారుతతుల్యవేగం రెండూ ఉన్నాయి. జవం అనగా వేగం. మారుతం= గాలి. మంద మారుతం అంటాం. మారుతం యొక్క కుమారుడు మారుతి. భజనలలో వీరమారుతి, గంభీర మారుతి అని భజన చేస్తాం కదా.

కదిలే మనస్సు, కదిలే వాయువు వంటి వేగ సంపన్నుడైనా వాయు తనయుడే. వాతాత్మజుడే. ఆపైన వానర యూధ ముఖ్యుడు కూడా. ఇంకా ఏమని నుతిస్తున్నాం?

జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠం

అంటే ఇంద్రియాలను జయించినవాడు. అంతేకాదు, ఆరవ ఇంద్రియమైన మనస్సునూ జయించినవాడు. అనగా కదిలే దానినీ.

అందువల్ల బుద్ధిమంతుడయ్యాడు. బుద్ధిమంతులలో శ్రేష్ఠుడయ్యాడని 'బుద్ధిమతాం వరిష్ఠం'. బుద్ధి, మనస్సునకు లంగరు వేస్తుంది. మనస్సునకు పైన ఉండేది, నియమించేది బుద్ధి. అందువల్ల జితేంద్రియుడై బుద్ధిమతాం వరిష్ఠుడయ్యాడు.

బుద్ధిమంతుడంటే సరిపోదు. అతని కంటే పైవాడు, బుద్ధిమతాం వర. అంతకంటే గొప్పవాడు బుద్ధి మతాం వరిష్ఠుడు. ఇద్దరుంటే అందొకర్ని వరీయ అంటాం. ఇంతకంటే గొప్పవాడు లేడన్నపుడు బుద్ధిమతాం వరిష్ఠుడని అంటాం. అంటే అతనితో ఎవ్వర్నీ పోల్చలేమన్నమాట.

జ్ఞానులలో బ్రహ్మవిత్, బ్రహ్మ విద్వర, బ్రహ్మవిద్వరీయ. బ్రహ్మవిద్వరిష్ఠుడని అంటాం. అట్లా ఇతడు బుద్ధిమతాంవరిష్ఠుడు.

ఎంత బుద్ధిమంతుడైనా, ఎంతగా ఇంద్రియాలను జయించినా అంతకంటే అతడు రామభక్తునిగా, రామదాసుగా ప్రసిద్ధుడు. భక్తిమంతులలోనూ వరిష్ఠుడే. దూతకు అన్ని లక్షణాలూ ఉండాలి. అందుకే అప్పజెప్పిన పనిని ఆనందంతో నిర్వహించి సీతారాముల దుఃఖాన్ని పోగొట్టాడు. శ్రీ రామదూతం శిరసానమామి.

మనోజవం మారుత తుల్యవేగం
జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠం
వాతాత్మజం వానర యూథ ముఖ్యం
శ్రీరామదూతం శిరసా నమామి

అంజనానందనుడు అజాడ్యాన్ని ప్రసాదించుగాక

బుద్ధిర్బలం యశోధైర్యం నిర్భయత్వం అరోగతా
అజాడ్యం వాక్పటుత్వంచ హనుమత్స్మరణాత్ భవేత్

ఎందుకు హనుమను ప్రార్థించాలో పై శ్లోకం వివరిస్తోంది. దేనికైనా ముందు బుద్ధి కావాలి కదా! బలమనగా శారీరక బలం కావాలి. తరువాత వచ్చేది కీర్తి. ధైర్యం నిర్భయత్వం = భయంలేకపోవుట. నిర్భయత్వంలోనే ధైర్యం ఇమిడియుంది. నిర్భయత్వమని విడిగా ఎందుకన్నారు? ధైర్యానికి చాలా అర్థాలున్నాయి. నిశ్చయం, శాంతమనస్కత, మొదలైనవి కూడా ధైర్యంలోకి వస్తాయి. ఆంజనేయుణ్ణి కొలవడం వల్ల ధైర్యం వస్తుంది. ఇతరులితనిని చూసి భయపడకుండుట నిర్భయత్వం. అభయత్వం. ఇది సన్యాసి దీక్ష తీసికొనేటపుడు ఉంటుంది. అరోగతా = రోగం లేకపోవుట; అజాడ్యం = జడత్వం లేకపోవుట. వాక్పటుత్వం = బాగా మాట్లాడు నేర్పు. వాల్మీకి, కంబడు ఇతని వక్తృత్వాన్ని మెచ్చుకొన్నారు.

అనగా ఈ ఏడు కావాలి. మనకెవ్వరూ చెప్పకుండా మనం వీటిని కోరాలి. ఎనిమిదవది అజాడ్యం. శ్లోకంలో ఇది ఏడవది. దీనికై ఎందుకు ప్రార్థించాలి? పనులు చక్కబెట్టుకోవాలంటే జడత్వం పనికిరాదు. కనుక అజాడ్యమన్నారు. అంటే అర్థమేమిటి?

ఒక్కొక్కమాటు మనమనస్సు చాలా సోమరిపోతుతనంతో, ఉత్సాహం లేకుండా ఉంటుంది కదా. శక్తి – పదార్థాలలో శక్తి–చైతన్యం. చిత్ నుండి చైతన్యం. అదే జీవనం; అదే బుద్ధి. జడం నుండి జాడ్యం. మానవ జీవితం చిత్–జడాలతో ఉంటుంది. (చిత్–జడగ్రంథి). ఇందు జీవం లేకపోతే (శివం) శవమే. ఈ జడమైన శరీరం, జీవంతో కలిసినపుడు జీవాత్మయని పిలువబడుతున్నాడు. అదే చిత్–జడగ్రంథి, శరీర భావన ఎప్పుడైతే అంతరించిందో అపుడు చిన్మయమే.

జడమైన శరీరంతో ఇది పనులలో ఎట్లా నిమగ్నం కావాలో చూద్దాం. పనులు చేసేటపుడు చురుకుగా ఉంటాం. జడంగా ఉండం. రాజకీయాలు,

సినిమాలు, పిచ్చాపాటీ కబుర్లు, నవలలు, ఫలాహారశాలలు మొదలగు వాటి వల్ల మనకున్న శక్తిని ఖర్చుపెట్టడం వల్ల వృథా అయిపోయి సోమరిపోతులుగా మిగిలిపోతున్నాం. ఎవరైనా సైన్సు, ఆధునికమైన సదుపాయాలు సమకూర్చుకోవడం, సంఘసంస్కరణలు, హేతువాదం, విప్లవాలు మొదలగు వాటిని చర్చించేటప్పుడు చురుకుగానే ఉంటాం. కాని ధర్మం క్షీణించడాన్ని చూసి కూడా వాటిని పట్టించుకోము. అర్జునుడంత వానికే ఈ జాడ్యం పట్టుకొనినపుడు నపుంసకునిగా ప్రవర్తించవద్దని కృష్ణుడు హెచ్చరించాడు. క్లైబ్యం మాస్మగమః పార్థ అన్నాడు. ఇట్లా ధార్మిక కృత్యాల పట్ల జాడ్యం లేకుండా చేయుమని ప్రార్థిద్దాం.

మనదేశంలో 64 కళలున్నాయి. సాంకేతిక విద్య మొదలైన వాటికి చెందినవీ ఉన్నాయి. అట్టివి ఈనాడు ఆచరణలో లేకపోయినా కనీసం వాటిని రక్షించుకోవాలనే తపన లేని కాలంలో ఉన్నాం. ఇదే జాడ్యం. అనేక గ్రంథాలు కాలగర్భంలో కలిసిపోయాయి. ఉన్నవాటినీ రక్షించుకోవాలనే తపన లేని కాలంలో ఉన్నాం. ఈ సందర్భంలో స్వామి మనకు అజాడ్యాన్ని కల్గించుగాక.

ఆయన బుద్ధి, బలం కలబోసిన మూర్తి కదా! ఎప్పుడూ ఉత్సాహవంతుడే. కార్యనిమగ్నుడే. అతని విగ్రహాలనుగాని, చిత్రపటాలనుగాని చూస్తే తేటతెల్లమౌతుంది. పర్వతాన్ని మోసినట్లు, ఆకాశంలో సంచరిస్తున్నట్లు కనబడతాడు. సోమరితనం సున్న. అలసటలేదు. ధర్మంకోసం తపన. ఏ ఆటంకము వచ్చినా దాటుతూ ఉంటాడు. నెరవేరవలసినదానిని ఏమరుపాటు లేకుండా నిర్వహిస్తూనే ఉంటాడు.

అట్లాగే మనం మంచి పనులు చేయుటకు ఉద్యుక్తులం కావాలి. ఆటంకాలు వచ్చేటప్పుడు, అంతా కలియుగమని, కలిపురుషుడు తాండవిస్తున్నాడని అంటాం. ఒంటబట్టని అద్వైతాన్ని, మాయాప్రభావాన్ని నిరాఘాటంగా

వ్యక్తీకరిస్తూ ఉంటాం. శంకరులిట్లా మాటిమాటికీ కలి ప్రభావం గురించి మాట్లాడారా? ప్రతిక్షణాన్ని సద్వినియోగం చేసికొన్నారు. తీర్థయాత్రలు, గ్రంథ రచనలు, వాదాలు మొదలైన వెన్నో చేసారు. క్రియాశీలురెవరంటే ఒకడు ఆంజనేయుడు, మరొకరు శంకరులు. చిట్టచివర దశలో క్రియారాహిత్యమే, అచలత్వమే ఉండాలి. మన లక్ష్యం మనస్సు చంచలంగా లేకపోవడం, సంకల్పరహిత స్థితి. కాని మనం శరీరాన్ని మంచి వాటికై కదపడం లేదు. అందువల్ల మనస్సు నానాతిరుగుళ్లు తిరుగుతోంది. అలసిపోయి నిద్రలోకి జారుకొంటున్నాం. సద్వినియోగం లేదు.

చాలా మంది పారాయణలు, భజనలు, ఉపవాసాలు, దేవాలయ సందర్శనాలు మొదలుపెడతారు. క్రమక్రమంగా వీటిపట్ల మోజు సన్నగిల్లుతూ ఉంటుంది. ఒక ప్రణాళికను రూపొందించడం వల్ల ఒకనాడు సామూహిక పూజా విధానాలుండేవి. అవి నేడు మచ్చుకు కనబడడం లేదు. అయితే ఒక క్లబ్బును స్థాపిస్తే అది దినదిన ప్రవర్ధమానమౌతుంది. ఇట్లా అన్నిటిలో అజాడ్యం.

ఎన్ని ఆటంకాలు వచ్చినా ఆంజనేయుడు డీలా పడ్డాడా? పుట్టీ పుట్టగానే పండనుకొని సూర్యుని దగ్గరకే వెళ్లాడు. అక్కడ ఇంద్రుడు అడ్డుకొనడం, వజ్రాయుధం ప్రయోగించడం, తుదకితని హనువు చిట్లింది. అందువల్ల హనుమ అయ్యాడు. అంతమాత్రంచే నిరుత్సాహపడ్డాడా? ఆ సూర్యుని దగ్గరే నవవ్యాకరణాలను అభ్యసించాడు. ఉదయాద్రి నుండి అస్తాద్రికి పయనించే సూర్యునికి అభిముఖంగా ఉండి నేర్చుకోలేదా? చిన్నపుడే ఋషుల ఆశ్రమాల దగ్గరకు వెళ్లి చిల్లరమల్లర పనులు చేసాడు. వారు తట్టుకోలేక నీ శక్తి, నీకు తెలియకుండా ఉండుగాక అని శపించారు. రామ కార్యం వచ్చినపుడే నీ శక్తి, నీకు తెలుస్తుందని శాపానుగ్రహం ప్రసాదించారు. సుగ్రీవుని దగ్గరకు చేరాడు.

ఇక్కడా ఆటంకాలే. వాలి సుగ్రీవునిపై దండెత్తాడు. ఇతడూరుకోక, వాలి రాలేని ప్రదేశంలో సుగ్రీవుణ్ణి ఉంచాడు. రాముడు రాగానే తన శక్తిని గుర్తించాడు. సముద్ర తరణం – పర్వతాన్ని పెకలించడం – లంకాదహనం – ఒకటేమిటి ఎన్నో పనులను నిర్వహించాడు.

సముద్రాన్ని దాటేటపుడు సురస, సింహిక, లంకిణులు అడ్డుకోలేదా? సురసనోరు తెరవగా అందు చిన్న ప్రాణిలా ప్రవేశించి చెవి నుండి బయటకు రాలేదా? ఆమెను చంపగలడు. కాని స్వామికార్యం తొందర పెట్టడం వల్ల అది చేయలేదు. అది అజాడ్యం అంటే. దానికెంతో నిబ్బరముండాలి.

మైనాకుడు సముద్రం నుండి లేచి విశ్రాంతి తీసికోవయ్యా అని ప్రార్థించినపుడు ముందు రామకార్యం చేయాలి, తరువాత చూద్దాంలే అనలేదా! ఇతని తోకకు నిప్పంటించినా పనిని మానాడా? ఎన్నో ఆటంకాలను గెంటివేసాడు.

ఇట్లా తన బుద్ధిని, బలాన్ని, ధైర్యాన్ని అజాడ్యాన్ని తన కోసం కాకుండా రామునికై వెచ్చించాడు.

అతడు బ్రహ్మచారి. సంసార బంధాలు లేవు. ముందు సుగ్రీవుణ్ణి, తరువాత రాముణ్ణి సేవించాడు. అతని నిస్స్వార్థబుద్ధి వల్లనే అతని గుణాలు రాణించాయి. చివరకు యశస్సు అనగా కీర్తి దక్కింది.

యశస్సు మినహాయించి మిగిలిన ఇతర లక్షణాలన్నీ రావణునకు, హిట్లరుకూ ఉన్నాయి. వారు మంచిపనులు చేసారని యశస్సు లభించిందా? కనుక బలాదుల వల్ల యశస్సు రాదని గుర్తించండి. సంఘసేవలోనే యశస్సు.

సీతారాములిద్దరూ జ్ఞానోపదేశం చేసారు. సీతమ్మ ఏ ఉపదేశం ఇచ్చింది? ఎవరామె? సాక్షాత్తు పరదేవతయే కదా! ప్రేమతో ఉపదేశమిచ్చింది. రావణ

వధానంతరం ఒక గంతువేసి సీతమ్మను బాధపెట్టిన రాక్షసస్త్రీలనందరినీ చంపుతానన్నాడు. అపరాధం చేయని వాడెవడైనా ఉన్నాడా? కావలసింది దయ. వారందరూ రాజాజ్ఞకు లోబడి అట్లా క్రూరంగా నాపట్ల ప్రవర్తించారు, వారి తప్పే ముంది? అని హనుమను సీతమ్మ వారించింది. విభీషణుడు రాజైతే వారే నాకు తిరిగి నమస్కరించరా అని పల్కింది.

అప్పటినుండి హనుమ దయామూర్తి అయ్యాడు. అయితే ఏదైనా చెడ్డపని జరిగినపుడు మాట్లాడకుండా ఉన్నాడని భావించకండి. పైపైన భీషణ వాక్యాలు పలికినా లోలోన ప్రేమ, దయలు తొణికిసలాడాయి.

ప్రేమ, శాంతులే ఎల్లెడలా వెల్లివిరియాలని భావించాడు. మంచివి, నాశనమైపోతూ ఉంటే మనం నిర్లిప్తులమై ఉండడాన్ని అతడు సహిస్తాడా? ప్రేమతో, ఉత్సాహంతో చేసే పనులన్నిటినీ హర్షిస్తాడు. అనుగ్రహిస్తాడు.

అతడు, అజాడ్యాన్ని మనపై కురిపించుగాక.

అమరుడైన ఆంజనేయుడు

అతణ్ణి చిరంజీవిగా కీర్తిస్తాం. అయితే పాపపుపనులు చేస్తూ చాలాకాలం బ్రతికిన వాణ్ణి పాపీ చిరాయుః అని అంటాం కదా! ఇట్టివాడు బ్రతికిన కొద్దీ వయోభారంచే అనేక రోగాలు, ఇతరులపై ఆధారపడడం, తన కళ్లముందే తనకంటే చిన్నవారు చనిపోవడం చూస్తాడు.

అయితే చిరంజీవియైన హనుమను, రాముడు తనతో బాటు తీసికొని పోయాడా? పరమపదానికి తీసికొనిపోక ఈ లోకంలోనే ఎందుకుంచాడు? అయోధ్యా నగరవాసులందరూ రాముణ్ణి అనుగమించారు కదా. హనుమను పక్షపాతధోరణిలో చూడడమేమిటి?

అది శిక్షకాదు. అనుగ్రహమే. అతణ్ణి చిరంజీవిగా ఉంచడం, మనలను అనుగ్రహించడమే.

శంకరులితనిని అంజనాభాగ్యం అన్నారు హనుమత్ పంచరత్నంలో. అనగా ఇట్టి వాణ్ణి కన్న తల్లి అదృష్టవంతురాలని. అది మన భాగ్యం కూడా.

అతడెట్టి పవిత్రుడో కదా! కామస్పర్శలేని పవిత్రత. ఎవనికైనా అతనికున్న భక్తి, జ్ఞాన, పరాక్రమాదులున్నాయా? అన్ని గుణాలున్నా వినయం ఉట్టిపడే వాడు. స్వార్థం అణుమాత్రం ఉందా? అతని గుణాలు వింటేనే మనలో భక్తి పొటమరిస్తుంది కదా!

రాముడితణ్ణి ఇక్కడ ఉంచడం వల్ల కలిలో మంచి కూడా జరుగుతుందని ఉంచాడేమో! మన కంటికి హనుమ కనబడకపోవచ్చు. అతడంతటా వ్యాపించియే యున్నాడు. గరుడుడు, ఆదిశేషుడు, నంది, చండికేశ్వరుల వంటి భక్తులెందరో ఉన్నా హనుమను స్మరిస్తూ ఉంటాం.

అయితే ఎందుకూ పనికి రాని మన మధ్యలో ఉండడమా? అని ప్రశ్న. అక్కడే అతని గొప్పదనం దాగియుంది. ఇదంతా రాముడాడించే నాటకమని అతడు భావిస్తాడు. అధర్మాన్ని పోగొట్టి ధర్మాన్ని స్థాపించడమే అతడు చేసే పని. ఇదంతా రాముడే తనచేత చేయిస్తున్నాడని భావిస్తాడు. నాటకంలో వీర, ప్రతివీరులిద్దరూ కొట్టుకొంటున్నట్లు కన్పిస్తారు. నిజంగా కొట్టుకొంటున్నారా? అట్లా అధర్మంపై యుద్ధం చేసాడు.

అంతారామమయమని భావిస్తే జీవితం కష్టమయంగా ఉండదు. అతడు సర్వాత్మనా ఉన్నాడని గట్టిగా భావిస్తే అదే మోక్షానికి దారి చూపిస్తుంది.

చిరంజీవిగా ఉండడం శిక్షగా భావించకుండా గౌరవంగా ఎందుకు భావించాడు? అంతా రామమయమని అద్వైత భావనతో ఉన్నాడు. అద్వైత

సుఖానికి మించిన రామనామాన్ని రాముడిచ్చాడు. నిరంతర నామోచ్చారణ వల్ల ఆ నామమే తానయ్యాడు. అతని నుండి భక్తికాంతులు వెలువడ్డాయి. కిరణాలు చీకటిని పోగొట్టినట్లు మనలోని అజ్ఞానం పటాపంచలౌతోంది. భజనలు వింటూ ఉంటే సంతోషంతో పొంగిపోతూ ఉంటాడు. పరమపదంలో (వైకుంఠం) భజనలున్నా పెద్ద కాంతి ముందు చిన్న దీపం వెలిగించినట్లు వెలవెల బోతుంది. కాని ఈ లోకంలో ఉన్న చీకటిలో దీపం వెలిగిస్తే దీపకాంతి స్పష్టంగా ఉంటుంది. అంటే చీకటిలో దీపకాంతి స్ఫుటంగా ఉంటుంది. నామమనే దీపాన్ని వెలుగునట్లు చేస్తాడు.

పరమపదంలో అతడు చేసేది ఏమీ లేదు. ఇక్కడ ఉండి అతడు రామదాసుడై రామకార్యానికి తనవంతు సాయం చేస్తాడు. భక్తి ధర్మాలను వ్యాప్తిలోనికి తీసికొని రావడానికే ఉన్నాడు. పొడిగా నున్న ప్రాంతం వర్షాన్ని కోరుతుంది. అట్లాగే ఇక్కడ ఉండడం అనుగ్రహమే అని భావిస్తాడు.

మహాత్ములు తమ కష్టాలు మరణించినా బాధపడరు. ఇదంతా నాటకమని భావించడం వల్ల దుఃఖించరు. నాటకంలో అనేక పాత్రలు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. అన్ని పాత్రలూ ఒకేసారి రావు. లంకలో వానరులు చనిపోయారు. వారికై ఇతడు బాధపడలేదు. రామలక్ష్మణులకోసం సంజీవ పర్వతాన్ని తీసికొని వచ్చినపుడు వానరులూ బ్రతికారు. అప్రయత్నంగా వారు బ్రతకడం జరిగింది. బ్రతికారని సంతోషించలేదు.

ఇతనికి ముసలితనం బాధలేదు. ఉక్కు వంటి శరీరం. ఉత్తరదేశంలో ఇతణ్ణి బజరంగబలియని కొలుస్తారు. (వజ్రశరీరం). ఒకవేళ అతనికేమైనా రోగం వచ్చినా అది రామప్రసాదంగా భావిస్తాడని నేననుకొంటున్నా. ఈ జగన్నాటకంలో ధృతరాష్ట్రుడు, సూర్‌దాస్ వంటివారు గ్రుడ్డివారుగా పుట్ట లేదా? మనవల్ల ఇతరులకు ఇబ్బంది కల్గించినా వారి కర్మను కొంత

తొలగించామని భావించగలగాలి. వారు మనలను సరిగా చూడకపోతే మనకర్మను మనం పోగొట్టుకొంటున్నామని భావించగలగాలి. అట్లాగే అతడూ భావిస్తాడు. అంటే రోగం లేని హనుమకు రోగం వచ్చినా అట్లాగే తలంచే స్థితిలో ఉంటాడు.

ఇంతకూ సారాంశమేమిటి? ఇదంతా పైవాడు ఆడించే నాటకమని భావిస్తే అంతా సంతోషమయంగా ఉంటుంది. సంతోషంగానే స్వీకరించగలగాలి. అట్టి మానసిక స్థితిని సంపాదిస్తే కష్టాలేమీ మనలను బాధించవు. నాటకాన్ని చూసి వినోదించునట్లుగా జీవితాన్ని అట్లా చూడగలగాలి. పరమపదంలోని సౌఖ్యం కంటే ఇట్టి భావన వల్ల కలిగిన ఆనందమే గొప్పగా ఉంటుంది. పరమపదంలో నవరసాలుండవు. ఈ లోకమే నవరసభరితం. ఇక్కడే చమత్కారం. భగవానుడెన్నో వేషాలు ధరిస్తున్నాడు కదా! అతడు కష్టాలు కల్గిస్తున్నాడా అని ప్రశ్నించుకోకుండా ఈ నవరస నాటకాన్ని చూసి సంతోషిద్దాం. ఇట్టి భావన మనలో పాదుకొలిపేటట్లు ప్రార్థిద్దాం.

అతనిలా మనం ఉండగలగాలి. ఎవరైనా మనకు నమస్కరిస్తే అతని మాదిరిగా చిరంజీవిగా ఉండాలని దీర్ఘాయుష్మాన్ భవ సౌమ్య అనాలి.

అతడు జ్ఞాని, జ్ఞాన గురువు కూడా

అతులిత బలధామం స్వర్ణశైలాభదేహం
దనుజవనకృశానుం జ్ఞానినామగ్రగణ్యం
సకలగుణనిధానం వానరాణామధీశం
రఘుపతి వరదూతం వాతజాతం నమామి

ఇది ఆంజనేయ స్వామికి సంబంధించిన శ్లోకం. తులసీదాస్ వ్రాసిన రామచరిత మానస్, ఉత్తర దేశంలో ప్రసిద్ధిని పొందింది. తమిళదేశంలో కంబ రామాయణం కంటే ఉత్తరదేశస్థులు తులసీరామాయణాన్ని భక్తి శ్రద్ధలతో పూజచేసి, పారాయణ చేస్తూ ఉంటారు. 400 సంవత్సరాల వెనుక వ్రాయబడిన గ్రంథమది.

తమిళ భాష మాదిరిగా హిందీ భాష ప్రాచీన మైనదికాదు. కాని ఈ రామాయణం వల్ల ఆ భాష వినుతికెక్కింది. సారస్వత స్థాయి ఎక్కువగా ఉన్నా ఇది విద్వాంసులు గణించే భాషలో వ్రాయబడలేదు. సామాన్య జనులు చదివి, విని, అర్థం చేసికొనే రీతిలో వ్రాసాడు. కనుక కంబరామాయణం కంటె ఎక్కువ ప్రాచుర్యాన్ని పొందింది. ఇందు భక్తి, కవితా సౌందర్యమున్నా, కేవల భక్తి వల్లనే ప్రజలమన్ననలను పొందింది.

హిందువులు బలవంతంగా మహమ్మదీయ మతంలోకి మార్చబడే దశలో తులసీదాసు ఇది వ్రాసాడు. అనేకులు ఇతర మతంలోకి ప్రవేశించకుండా ఉండడానికి కారణం ఇతని రామాయణ రచనయే. ఒత్తిళ్ళకు లొంగిపోగూడదనే భావన ప్రజలలో పాతుకొని పోవడానికి ఇదే కారణం. 40 చరణాలతో విడిగా హనుమాన్ చాలీసా కూడా వ్రాసేడు. ఇది హనుమ, కవచంగా వ్రాసి ఉంటాడని తెలియ చేస్తోంది. ఎవరు దీనిని చదివినా వెంటనే ఆకర్షింప బడతారు. బలహీనుడు చదివి బలాన్ని పుంజుకొంటాడు. ఇది తులసీదాసు కాలంలోనే ప్రసిద్ధిని పొందింది. మతం మార్పిడికి కంచెలా రక్షించింది.

ఇతడు కేవలం కల్పనలతో, ఊహలతో వ్రాసాడా? కేవలం స్వామి పట్ల భక్తితో వ్రాసేడు. స్వామితో ప్రత్యక్ష సంబంధమున్న అతని చరిత్ర చెబుతోంది. స్వామి యొక్క అంశతో పుట్టాడు. స్వామి నక్షత్రమైన మూలా నక్షత్రంలో ఇతడు జన్మించాడు.

పైన పేర్కొన్న శ్లోకం తులసీదాసు వ్రాసినదే. అది సుందరకాండకు మంగల శ్లోకం. రామాయణం ప్రాంతీయ భాషలో ఉన్నా మంగల శ్లోకాలు సంస్కృతంలోనే ఉంటాయి.

వాతజాతం నమామితో శ్లోకం ముగిసింది అనగా వాయుపుత్రుడని, వాతాత్మజుడని.

ఎందుకీ శ్లోకాన్ని పేర్కొన్నానో వివరిస్తాను ఇందు జ్ఞానినామ గ్రగణ్యం. అనగా జ్ఞానులలో శ్రేష్ఠుడని, అనగా బ్రహ్మజ్ఞానులలో, ఆత్మజ్ఞానులలో మొదటి స్థానం ఆక్రమించాడని అర్థం.

అతనికి బలం, ధైర్యం, నేర్పు, బుద్ధి, పాండిత్యం, అఖండ బ్రహ్మచర్యం ఉన్నవని తెలుసు. కాని అన్ని సుగుణాలను ధర్మకార్యాలలో వెచ్చించాడు. రామప్రీతి కోసమే. రామభక్తి సామ్రాజ్యంలో మునిగిపోయాడు. అట్లా కర్మఫలాన్ని ఆశించకుండా కర్మయోగిలా ప్రవర్తించాడు. అతడు భక్తియోగి కూడా. అయితే అతడు జ్ఞానయోగియని చాలా మందికి తెలియదు.

అతడు బుద్ధిమంతుడు కనుకనే బుద్ధిమతాం వరిష్ఠుడయ్యాడు. జ్ఞానం కంటే బుద్ధి, విలక్షణమైనది. అనేక రంగాలలో ఎందరో మేధావులను చూస్తాం. కాని అందర్నీ జ్ఞానులని అంటామా? బ్రహ్మ జ్ఞానం కలవానిని బ్రహ్మజ్ఞాని అంటాం. అతడు పరమాత్మ, జీవాత్మలు ఒక్కటే అనే జ్ఞానంతో ఉంటాడు. అట్టి జ్ఞానం కలగడానికి ఎన్నో శాస్త్రాలు చదవాలి. శాస్త్రాలను అర్థం చేసికోవడానికి బుద్ధి ఉపయోగిస్తుంది. అయితే ఆ బుద్ధి, అధ్యాత్మ జ్ఞానాన్ని సంపాదించడానికే వినియోగపడాలి. చాలా మంది మేధావులు ఇట్లా ఈ విషయంలో వినియోగించకుండా వారి వారి ప్రత్యేక రంగాలలో వినియోగిస్తారు. ఒకవేళ వేదాంత శాస్త్రంలో ప్రవేశపెట్టినా అది బౌద్ధికమైన

చర్చకే పరిమితమౌతుంది. దానిని అనుభూతికై వినియోగించరు. అటువంటప్పుడు దానిని జ్ఞానమనలేము. అతడెంతో మేధావి కావచ్చు, నిజమైన అధ్యాత్మ జ్ఞానికాడు.

ఇతర మేధావులకంటే ఆంజనేయ స్వామి భిన్నుడు. వేదాంత శాస్త్రాన్ని జీర్ణం చేసికొన్నవాడు. అనుభవించినవాడు. స్వామితో ముఖాముఖి పరిచయమున్న తులసీదాసు అందుకే జ్ఞానినామగ్రగణ్యం అన్నాడు.

ఏమిటీ గొప్పలక్షణాలు? శ్లోకంలో, అతులితబలధామమ్= సాటి లేని బల పరాక్రమం కలవాడు; స్వర్ణశైలాభదేహం = బంగారు మేరు పర్వతంలా ధగధగా మెరిసే దేహం, శరీరానికి ఈ కాంతి, బ్రహ్మచర్యం వల్లనే. తరువాత దనుజవన కృశానుం = రాక్షసులనే అరణ్యానికి అగ్నివంటివాడు. తరువాత జ్ఞానినామగ్రగణ్యం అన్నాడు.

తరువాత అతని మనస్సు యొక్క ప్రత్యేకతను వివరిస్తున్నాడు. సకల గుణనిధానం = అన్ని మంచి గుణాలకు నిలయమైనవాడు. అందు తీక్షమైన బుద్ధి యొకటి. తరువాత వానరాణాం అధీశం = చంచలమైన కోతులను నియమించువాడు. జితేంద్రియ బ్రహ్మచారిగా. మనస్సనే కోతిని నియమించిన వాడనే అర్థంతో అలంకారికంగా తులసీదాసు పేర్కొన్నాడు.

ఇక రఘుపతి వరదూతం = రాఘవునిదూత. వరదూతకు బదులు ప్రియభక్త అనే పాఠాంతరం ఉంది. ఈ మాటకు రెండర్థాలు చెప్పవచ్చు. రఘుపతి యొక్క ప్రేమను పొందినవాడని లేదా రఘుపతి ప్రీతిని కల్గినవాడనీ అర్థం.

చివరగా వాతజాతం = వాయునందనుడు. అనగానే మన మెవరికి నమస్కరిస్తామో అతణ్ణి పేరునుబట్టి గుర్తిస్తాం కదా! నమామి = నమస్కరిస్తున్నా

ముందుగా ఎందుకు పూజించాలి? బ్రహ్మజ్ఞానులలో శ్రేష్ఠుడు కనుక. ఈ మాట శ్లోకంలో మధ్యలో ఉంది. నాయకమణిలా.

అయితే ఒక సందేహం కల్గుతుంది. ఎవరికైనా బ్రహ్మజ్ఞానం కల్గిందంటే తనంతట తాను పొందలేడు. గురూపదేశాన్ని అనుసరించడం వల్ల అట్టివాడవుతాడు. ఉపదేశం పొందినంత మాత్రంచే సిద్ధి పొందలేడు. శ్రవణ-మనన-నిదిధ్యాసలున్నాయి. శ్రవణం అనగా గురువు నుండి ఉపదేశమును వినుట; మననమనగా దానిని గుర్తుపెట్టుకొనుట. నిదిధ్యాసమనగా ఆ తాత్పర్యము నందు లీనమై, ధ్యానమగ్నుడై, వినినదానిని అనుభవంలోకి తెచ్చుకొనుట. జ్ఞానం పొందాడంటే ఎవరినుండి విన్నాడని సందేహం కల్గుతుంది. అనగా ఎవరు గురువు?

మనం అనేక కథలనితని గురించివిన్నాం. చిన్నపుడు సూర్యభగవానుడే ఉపదేశించాడు. పాఠాలను నేర్చుకొన్నాడు. అది అంతాజ్ఞానం కాదు. ఇవన్నీ ఆత్మ జ్ఞానాన్ని బోధించేవి కావు. బుద్ధితో శాస్త్రాలను అభ్యసించాడు. నవవ్యాకరణాలను నేర్చుకొన్నాడు. బుద్ధి పదునెక్కింది. అందువల్ల బుద్ధిమతాంవరిష్ఠుడయ్యాడు. బుద్ధికంటే జ్ఞానం గొప్పదని అన్నాం. అతణ్ణి జ్ఞానిగా తీర్చిదిద్దిన వాడెవ్వడు?

ఆత్మజ్ఞానమే పరావిద్య. అన్ని శాస్త్రాలూ అపరావిద్యకు చెందినవి. పరాయనగా శ్రేష్ఠము. అపరయనగా తక్కువది. రామాయణ కథ అంతా ముగిసిన తరువాత, పట్టాభిషేకం పూర్తియైన తరువాత ఇతనికి జ్ఞానోపదేశమైంది.

రామసేవలోనే ఆంజనేయ ప్రభావం అంతా కన్పిస్తుంది. రామునకంతగా కైంకర్యం చేసినపుడు జ్ఞానోపదేశాన్ని పొందాడు. రామావతారం పూర్తి అయ్యే

వరకూ రామునితో ఉన్నవాడు మరొకరి దగ్గరకు వెళ్లి ఉపదేశం పొందడం కుదురుతుందా? కనుక రాముడే ఉపదేష్ట.

రామ-హనుమల మధ్య ప్రభు-సేవకభావం భగవానుడు - భక్తుల అనుబంధం ఉన్నట్లు అనుకొంటాం కదా! కాని చివరగా గురు-శిష్య సంబంధమూ ఉంది. సద్గురు - సత్ శిష్య సంబంధం కంటే మించినది లేదు. ఇతడు సత్పురుషుడు - రాముడు సచ్చిదానందరూపుడే. ఇట్లా గురుశిష్యులుగా భావించడమూ పుణ్యమే.

ఒక్క ప్రక్క రాముడు చక్రవర్తి. ధర్మప్రకారం పాలించినవాడు. మరొక ప్రక్క జ్ఞాన రాజు కూడా. ఆత్మోపదేశం ఇచ్చే జ్ఞానగురువు. జనకుడట్టివాడు. అతడు రాజు, రాజర్షి కూడా, రాజైవేదాంత చర్చలు చేసేవాడు.

రాముడు, ఆంజనేయునకే కాదు, ఋషులందరికీ ఉపదేశించాడు. రాముడు, నారాయణావతారమని ఋషులకు తెలుసు. రాక్షస సంహారం కోసం అవతరించాడనీ తెలుసు. ఆ పని పూర్తియై రాజ్యాన్ని ఏలుతున్నాడు. ధర్మం, ఆచరణలో ఉంటుందని ఆచరించి చూపిస్తున్నాడు. అదే అవతార లక్ష్యం. మూడవ పనిని చూడబోతున్నారు ఋషులు.

దేనికైనా పూర్వాంగం, ఉత్తరాంగం ఉంటుంది. ముందు చేయవలసినది పూర్వాంగం. తరువాత ఉత్తరాంగం. వైదిక సంప్రదాయంలో ధార్మిక కర్మలు చేసి నడవడికను తీర్చిదిద్దుకొని తరువాత బ్రహ్మమునకై విచారించాలి. ఆ బ్రహ్మము, ధర్మాధర్మములకతీతము. మనకున్న షట్ దర్శనాలలో పూర్వమీమాంస ఒకటి. ధర్మాన్ని తెలిసికోవాలని ధర్మజిజ్ఞాసతో మొదలౌతుంది. ఉత్తరమీమాంస బ్రహ్మ జిజ్ఞాసతో ఆరంభమౌతుంది. దానినే వేదాంతమంటారు. ఏయే వైదిక కర్మలు చేయాలో చెప్పేది పూర్వ మీమాంస. బ్రహ్మను తెలిసికొనుటకు సాధన సంపత్తిని, మార్గాన్ని చూపేది ఉత్తర మీమాంస.

అవతారం యొక్క మొదటి ప్రయోజనం పూర్తికాగా రాముడు, చక్రవర్తియై వైదిక కర్మానుష్ఠానం ఎట్లాచేయాలో తన నడవడిక ద్వారా చూపించాడు. జ్ఞాన మార్గాన్ని అన్వేషించే ఋషులు వచ్చారు.

రాముడు జ్ఞాన స్వరూపుడని ఋషులకు తెలియనిది కాదు. వారితరుల మనస్సును పసికట్టగలరు. వారింతకు ముందు ఉపదేశం పొందినవారైనా, జ్ఞానులైనా సాక్షాత్తు జ్ఞాన స్వరూపుడైన రాముని నుండే తత్త్వోపదేశం పొందితే గట్టిపడడమే కాదు, జీవన్ముక్తులౌతారు కూడా.

ఉపదేశించడానికి రాముడూ ఇష్టపడ్డాడు. బ్రహ్మవిద్య గురించి ఆనందించేవారు, ఇతరులతో ఆ ఆనందాన్ని పంచుకోరా? రాముడెవరినుండి నేర్చుకోనవసరం లేదు. మానవునిగా అవతరించాడు కనుక ఇతరులకు ఆదర్శంగా ఉండడం కోసం తాను గురువును సేవించాడు. వసిష్ఠుని నుండి ధనుర్విద్య మొదలైన వాటితో బాటు వేదాంతాన్ని అభ్యసించాడు. ఆ గురు-శిష్యుల ఉపదేశానికి చెందిందే యోగ వాసిష్ఠమనే గ్రంథం. దానిని జ్ఞానవాసిష్ఠమని అనడం సబబు. అన్ని సాధనమార్గాలూ యోగమార్గానికి చెందినవి. కర్మయోగ, భక్తియోగ, జ్ఞానయోగాలు. కాని యోగం అంటే ప్రసిద్ధమైన పాతంజల యోగశాస్త్రమని తలుస్తాం. కాని మన గ్రంథము, అద్వైతజ్ఞానానికి చెందింది.

తాను నేర్చుకొన్నది ఇతరులకందించాలి. దానివల్ల ఉపదేశించే వానికీ తృప్తికల్గుతుంది. రామునకూ అందించాలనే ఉత్సాహముంది. రావణ వధానంతరము వీలుచిక్కింది. అపుడు ఋషులు వచ్చారు. అయినా వినయ భరితుడైయున్నాడు. తాను క్షత్రియుడు, బ్రాహ్మణ ఋషులకు ఉపదేశించడమా అని సందేహించాడు. ఆపైన వయస్సులో ఋషులు

పెద్దవారై యున్నారు. బ్రహ్మవిద్య చెప్పాలని ఉన్నా తిన్నగా మాత్రం వారికి ఉపదేశించలేదు.

అపుడిట్లా భావించాడు. ఇంద్రియాలను పూర్తిగా జయించిన అంజనేయుడిక్కడ ఉన్నాడు కదా! జ్ఞానం గురించి అతనికి తెలియకపోయినా అతనికి మోక్షప్రాప్తి ఖాయమని తెలుసు. అయినా జ్ఞాన మార్గాన్ని అందించాలని ఉపక్రమించాడు. ఇంత కంటే మరొక శిష్యుడు దొరుకుతాడా? కనుక ఇతణ్ణి ముందు పెట్టుకొని తత్త్వోపదేశం చేయాలనుకొన్నాడు. ఇక్కడున్న ఋషులూ వినవచ్చు అని భావించాడు.

ఇక రాఘవుడు పరావిద్యనుబోధిస్తున్నాడు. ఇంతకు మందు ఆంజనేయుడు సూర్యుని నుండి నేర్చుకొన్నది అపరావిద్య. విష్ణువైన రాముడే సూర్యభగవానునకు పరావిద్యను బోధించినట్లు గీతలో ఉంది.

ఇమంవైవస్వతం యోగం ప్రోక్తవానహం అవ్యయం

అనగానేను నీకందించబోయే ఉపదేశాన్ని ఏనాడో సూర్యునకిచ్చానని అన్నాడు అర్జునునితో కృష్ణుడు.

ఆవు ఎందరికో పాలనిస్తుంది. పాలు చేపడానికి ముందు దూడ ఉండాలి కదా! అట్టిదే ఉపదేశమనే క్షీరం. ఉపదేశం పొందడానికి అర్హులైన వారెందరో ఉన్నా ఉపదేశాన్ని శిష్యునకే అందిస్తాడు. గీతలో ధ్యాన శ్లోకం ఇట్లానే చెబుతుంది. గోపాలుడైన కృష్ణుడు ఉపనిషత్తులనే గోవును పిదికి గీతామృతాన్ని అందించాడు. అర్హులైన వారు దానిని త్రాగవచ్చు. వారి ప్రతినిధిగా అర్జునుని దూడగా గ్రహించదాని ఉంది.

సర్వోపనిషదోగావో దోగ్ధా గోపాలనందనః

పార్థోవత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్.

కృష్ణుడు జ్ఞానాచార్యుడు కాగా అర్జునుడు శిష్యుడయ్యాడు. రామునకు హనుమయే శిష్యుడు. ఆ హనుమయే అర్జునుని పతాకంపై ఉన్నవాడు. అట్లా ఉండడం వల్ల అర్జునుడు విజయుడైనాడు.

దక్షిణామూర్తి మాదిరిగా రాముడు చిన్ముద్రనుపట్టాడు. ఒక కాలును మడిచి మరొక కాలిపై వేసుకొని ఒకటి వ్రేలాడుతూ ఉండగా అనగా వీరాసనంలో ఉండి ఉపదేశించాడు. ధ్యాన శ్లోకం చూడండి:

కాలాంభోధరకాంతి కాంతమనిశం వీరాసనాధ్యాసినం

ముద్రాం జ్ఞానమయీం దధానమపరం హస్తాంబుజం జానుని

అనగా వర్షాన్ని కురిపించే మేఘం యొక్క రంగుతో వీరాసనంలో ఉండి, చిన్ముద్ర ధరించినవాడై ఒకచేతిని మోకాలిపై ఉంచినవాడై యున్నాడు.

మరొక ధ్యాన శ్లోకమూ ఉంది. దీనిని రామాయణ పారాయణానికి ముందు చదువుతారు. ఇందూ వీరాసనంలో ఉన్నట్లుంది. ఇందు చిన్ముద్ర ప్రస్తావన లేదు. ఇందు ఋషుల సమక్షంలో ఆంజనేయునకు ఉపదేశించినట్లుంది:

వైదేహీ సహితం సురద్రుమతలే హైమే మహామంటపే

మధ్యే పుష్పకమాసనే మణిమయే వీరాసనే సంస్థితం

అగ్రేవాచయతి ప్రభంజనసుతే తత్త్వం మునిభ్యః పరం

వ్యాఖ్యాంతం భరతాదిభిః పరివృతం రామం భజేశ్యామలం

దక్షిణామూర్తిలా వీరాసనంలో కూర్చొని యున్నా వేదాంతోపదేశం చేస్తున్నా దక్షిణామూర్తిలా ఒక్కడేలేదు. రాముడు రాజు, ఋషి కూడా. అనగా కర్మయోగాన్ని, జ్ఞాన యోగాన్ని కలిగిన వాడు. అతడు బంగారు మంటంపై

భార్యతో కూడియున్నాడు. అందువల్ల వైదేహీ సహితం. విదేహరాజ్యంలో జన్మించింది. కనుక వైదేహి. రాముడిక్కడ జ్ఞానాచార్యునిగా ఉన్నాడు కనుక అతని భార్యను సీతయని గాని, జానకియనిగాని అనలేదు. వైదేహి అనే ఉంది. అనగా శరీర భావన లేనిది. ఆత్మస్వరూపురాలన్నమాట. కనుక ఆమె తత్త్వరూపిణియే. అట్టి స్త్రీ తన ఎడమ ప్రక్కన ఉండగా ఉపదేశిస్తున్నాడు. నిజంగా చెప్పాలంటే ఆమె తత్త్వాన్నే ఉపదేశిస్తున్నాడు. ప్రక్కన భరతాదులున్నారు. భరతాదిభిః పరివృతం రామంభజే శ్యామలం, అని ఉంది.

సోదరులు తిన్నగా ఉన్నా వారికి ఉపదేశించడం లేదు. ఆంజనేయునకే, ప్రత్యక్ష శిష్యునకే ఉపదేశించాడు. మిగిలినవారు విన్నారు. అందుకే

అగ్రేవాచయతి ప్రభంజన సుతే తత్త్వం

అనగా ఆంజనేయుడు వినయ భరితుడై వింటున్నాడు. అతనికి తిన్నగా అందిస్తున్నా ఋషులందరూ అతని మనస్సులో ఉన్నారు. అందుకే తత్త్వం మునిభ్యః పరం. అనగా ఋషులకు పరావిద్యనిచ్చాడు.

సీతారామాంజనేయ సంవాదమని తెలుగులో ఒక ప్రత్యేక గ్రంథం ఉంది. ఇందు రాముడే కాదు, సీత కూడా ఉపదేశించినట్లుంది. అద్వైతం గురించి మౌలిక గ్రంథాలు ప్రాంతీయ భాషలలో ఉండవు. అవి సంస్కృత గ్రంథాలకు అనువాదాలే. కాని ఈ గ్రంథం ప్రత్యేకతను సంతరించుకొంది. ఇందు సీత ముందుగా రామతారక మంత్రాన్ని హనుమకు ఉపదేశించినట్లుంది. ప్రాణసమానురాలైన సీత నుండి రామమంత్రం రావడం గొప్ప కదా! తరువాత రాముడు, సాంఖ్యయోగాన్ని, అమనస్కయోగాన్ని ఉపదేశిస్తాడు. అనగా అద్వైతాన్ని. అదంతా విపులంగా ఉంటుంది ఈ గ్రంథంలో.

సీతారాములు హనుమకు ఏదిచ్చినా తృప్తి పడరు. ఆంజనేయుడు కోరేదీ ఏమీ లేదు. వారిని సేవించడంలోనే తృప్తిని పొందుతాడు. కాని సీతారాములకు తృప్తి కలగడం లేదు. అందువల్ల జ్ఞాన సంపదనీయాలను కొన్నారు. అది తరిగే సంపద కాదు. అందువల్ల ఉపదేశమిచ్చారు. వారు జగత్తునకే తల్లిదండ్రులు కదా! ఆంజనేయునకు గురువులైనారు. వారే తల్లి, తండ్రి, గురువు దైవమయ్యారు. వేదానికి శిరోభాగం ఉపనిషత్తులు. 108 ఉపనిషత్తులలో ముక్తికోపనిషత్తు ఒకటి. ఇందు రాముడు, ఆంజనేయునకు ఉపదేశించినట్లుంది. ఆ పేరే అద్వైత సారం అందిస్తోందని తెలివిడి చేస్తోంది.

ఈ ఉపనిషత్తులో ఋషుల సమక్షంలో ఆంజనేయునకు తిన్నగా ఉపదేశించినట్లుంది. దక్షిణామూర్తి నుండి వినిన సనకాదులందున్నట్లు చెప్పబడింది.

ఇందు ఆంజనేయుడు, ఎన్నో ప్రశ్నలు వేసి జ్ఞాన క్షీరాన్ని పొందినట్లుంది. నీ తత్త్వ స్వరూపం చెప్పు రామా అని అడిగినట్లు ముక్తావస్థను ప్రసాదింపుమని అడిగినట్లుంది.

ఇందులో 108 ఉపనిషత్తుల పేర్లూ ఉన్నాయి. ఏ ఉపనిషత్తు, ఏ వేదానికి చెందిందో కూడా ఉంది. ఏ శాంతి మంత్రాన్ని, ఏ ఉపనిషత్తు ముందు పఠించాలో కూడా ఉంది. ఇందు వేద శాఖల ప్రస్తావన ఉంది.

రాముడొక్కడే మర్యాద పురుషోత్తముడు కాదు. ఆంజనేయుడూ అట్టివాడే. అందుకే అతడు సమస్త సద్గుణ సంపన్నుడని తులసీదాసు కీర్తించాడు. సకల గుణ నిధానం అన్నాడు. అన్ని గుణాల కంటే ఉత్తమమైనది జ్ఞానమని అందువల్ల రాముని నుండి ఉపదేశాన్ని పొందాడు. మన జీవితాలలోనూ

ధర్మమనే సంపదను సంపాదించాలి. జ్ఞాన సంపదను సంపాదించాలని ఇతని జీవితం, పాఠం చెప్పడం లేదా?

అన్నింటిలో అందరికీ గురుప్రాయుడైన అంజనేయుడు, స్వయంగా శిష్యుడై నిరంతరం అభ్యసిస్తూనే ఉన్నాడు. ఇది గుణపాఠం కాదా? గురువు, శిష్యుడై గురువు నుండి జ్ఞానాన్ని పొందిన ఆంజనేయుడు మన అందరికీ ఆదర్శప్రాయుడే.

అనువాదకుని పరిచయం

దేవరకొండ శేషగిరిరావు, గోకులం దగ్గర, అశోక్ నగర్,
వెంకటాద్రి రెసిడెన్సీ. కాకినాడ. సెల్ :- 9959288443

రచనలు

1. శివసంహిత 2. ఘేరండ సంహిత 3. అనేక రామాయణాలలో సుందరకాండ 4. విజ్ఞానభైరవ తంత్రం 5.యోగయాజ్ఞవల్క్య సంహిత

ప్రచురణ : విజ్ఞాన మంజూష, హైదరాబాద్

6. శాక్తానందతరంగిణి 7. అద్వైత సాధన 8. గురుసంప్రదాయం 9. అద్వైతం 10. నమో నమః 11. షట్పదీ స్తోత్రం 12. సనాతనధర్మంలో సంఘసేవ

ప్రచురణ : మహావిద్యాపీఠం, హైదరాబాద్

13. దశమహావిద్యలు 14. ఉత్పలదేవుని శివస్తోత్రావళి 15. అప్పయ్య దీక్షిత వరద రాజస్తవం 16. ఆత్మార్పణస్తుతి

ప్రతులకు: ఋషిపీఠం ప్రచురణలు, చిక్కడపల్లి, హైదరాబాద్

17. దినచర్య 18. యక్షప్రశ్నలు 19. ధర్మ సందేహాలు 20. గోరుముద్దలతో 21. వసుభాగుని పంచతంత్రకథలు 22. మంత్రయోగ సంహిత 23. పురాణాలలో రత్న పరీక్ష 24. పండుగలు – ఓషధులు – వైద్యం 25. సుభాషితరత్నాకరం 26. చాణక్య నీతిసూత్రాలు 27. తీర్థ యాత్ర 27. అభినవ గుప్తుని గీతార్థసంగ్రహం

ప్రతులకు: గొల్లపూడి వీరాస్వామి, కోటగుమ్మం, రాజమండ్రి

29. విగ్రహ పరమార్థం 30. శివస్వరోదయం

ప్రతులకు: రోహిణీ పబ్లికేషన్స్, కోటగుమ్మం, రాజమండ్రి

31. ఆనంద రామాయణం

ప్రతులకు: శివకామేశ్వరి గ్రంథమాల, కృష్ణలంక, విజయవాడ

32. మనదేవతలు – గణపతి 33. నటరాజు 34. శివుడు 35. విష్ణువు 36. కుమారస్వామి 37. సూర్యుడు 38. శక్తి 39. బ్రహ్మాది దేవతలు 40. రూపగోస్వామి – పద్యావళి 41. లలితా సహస్రనామాలు 42. కబీర్‌పాటలు పాండురంగవిఠల 43. పార్వతి + లక్ష్మి + సరస్వతి

ప్రతులకు: రామకృష్ణా మఠం, దోమలగూడ, హైదరాబాద్

44. తంత్రపరిచయం 45. కులార్ణవతంత్రం

ప్రతులకు: శ్రీ జె. జగన్నాథ శర్మ, మాధవరం, వయా అంబాజీపేట

46. తంత్రం – వైద్యం 47. పురాణాలు – పర్యావరణం

ప్రతులకు: సాహితీ ప్రచురణలు, సూర్యారావుపేట, విజయవాడ

48. భారతీయ సంస్కారములు 49. శివసహస్రనామములు

ప్రతులకు: తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి

50. భారత కథలు– అంతరార్థం 51. భావమయం జగత్ 52. భావాంబర విహారం (ఇవి నేడు లేవు)

వృత్తి: (విశ్రాంత) ఆంధ్రోపన్యాసక కత్వం

ప్రవృత్తి : భారతీయ సంస్కృతికి అర్చకత్వం

విజ్ఞాన మంజూష ప్రచురణలు

1.	శివ సంహిత	దేవరకొండ శేషగిరిరావు	రూ. 75
2.	ఘేరండ సంహిత	దేవరకొండ శేషగిరిరావు	రూ. 75
3.	అనేక రామాయణాలలో సుందరకాండ	దేవరకొండ శేషగిరిరావు	రూ. 100
4.	విజ్ఞాన భైరవ తంత్రం	దేవరకొండ శేషగిరిరావు	రూ. 100
5.	యోగయాజ్ఞవల్క్య సంహిత	దేవరకొండ శేషగిరిరావు	రూ. 75
6.	గోరక్ష సంహిత	ఎస్.సంపత్‌కుమార్ (శ్రీవత్స)	రూ. 100
7.	కేనోపనిషత్	తుమ్మపూడి కోటీశ్వరరావు	రూ. 100
8.	ఈశావాస్యము	తుమ్మపూడి కోటీశ్వరరావు	రూ. 100
9.	శివసూత్రాలు	తుమ్మపూడి కోటీశ్వరరావు	రూ. 100

ప్రతులకు:

అన్ని ముఖ్యమైన పుస్తక విక్రయ కేంద్రాలు

కంచి పరమాచార్య అమృతవాణి

అనువక్త: దేవరకొండ శేషగిరిరావు

ప్రచురణ
మహా విద్యాపీఠం
ఎయిర్‌ఫోర్స్ అకాడమీ రోడ్, దుండిగల్, హైదరాబాద్ - 500 043